ఈనాడు

విజయవాడ 20-1-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 160

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కిలో వెండి ₹3,00,000

3 నెలల్లోనే రెట్టింపైన ధర



ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరలు చుక్కలను తాకుతున్నాయి. ధరల పెరుగుదలలో బంగారాన్ని మించి, వెండి దూసుకుపోతోంది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎక్స్ఛేంజీలతో పాటు విక్రయశాలల్లోనూ ఈ లోహాల ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరుతున్నాయి. తొలిసారిగా దేశీయ విపణిలో కిలో వెండి ధర రూ.3 లక్షలను మించింది. ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ కాస్త బలహీనపడటం, గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దూకుడుగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో.. సురక్షితమని భావిస్తూ బంగారం, వెండిపైకి పెట్టుబడులు రావడమే వీటి ధరలు గణనీయంగా పెరగడానికి కారణమని బులియన్ వర్తకులు చెబుతున్నారు. కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల (మిగతా 3లో)

20 రోజుల్లోనే రూ.70,000 పెరుగుదల

ధరల పెరుగుదలలో వెండి దూకుడు కొనుగోలుదార్లకు ఆందోళన కలిగిస్తుండగా, పెట్టుబడిదార్లను మాత్రం ఆనందంలో ముంచెత్తుతోంది. ఈ నెలలోనే వెండి కిలో ధర రూ.2.40 లక్షల నుంచి రూ.3.09 లక్షలకు పైగా పెరిగింది. దీపావళి సమయంలో ధర బాగా పెరిగినా, పండగ తరవాత 2025 అక్టోబరు 27న కిలో వెండి ధర రూ.1.48 లక్షలకు దిగివచ్చింది. తదుపరి మళ్లీ పెరుగుతూ వస్తోంది. 3 నెలలు కూడా గడవకముందే రెట్టింపునకు మించడం గమనార్హం.

ఉద్యోగాలిచ్చే స్థాయికి తెలుగువారు ఎదగాలి



దంపతుల్లో ఒకరు ఉద్యోగం.. మరొకరు వ్యాపారం చేయాలి

- ఏపీలో పెట్టుబడులు పెడితే స్వాగతిస్తాం
- విదేశాల్లో వ్యాపారం చేస్తామన్నా సరే.. గైడ్ చేస్తాం
- జ్యూరిక్ తెలుగు డయాస్పొరా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

రూ.50 కోట్లతో ఏపీ ఎన్నార్టీ కార్పస్‌ఫండ్

ఈనాడు, అమరావతి: భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం చేస్తే మరొకరు వ్యాపారం చేయాలని విదేశాల్లో స్థిరపడిన తెలుగువారికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. తెలుగువారు ఉద్యోగాలు చేసేవారిగా కాకుండా.. ఉద్యోగాలిచ్చేవారిగా ఎదగాలని ఆకాంక్షించారు. 'వ్యాపార, వాణిజ్య రంగాల్లోకి ప్రవేశించాలని ఆశించే ఎన్నార్టీలకు సహకరిస్తాం. రూ.50 కోట్లతో ఏపీ ఎన్నార్టీ (నాన్ రెసిడెంట్ తెలుగు) కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో ఎన్నో అవకాశాలున్నాయి. వచ్చి పెట్టుబడులు పెడతామంటే స్వాగతిస్తాం. విదేశాల్లో వ్యాపారాలు చేస్తామంటే చేసుకోండి. ప్రభుత్వం తరఫున రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా గైడ్ చేస్తాం. కొంచెం కొత్తగా ఆలోచిస్తే పారిశ్రామికవేత్తలుగా రాణిస్తారు' అని ఉద్బోధించారు. దావోస్ పర్యటనలో భాగంగా తొలిరోజు జ్యూరిక్‌లో జరిగిన తెలుగు డయాస్పొరా సమావేశంలో చంద్రబాబు ప్రసంగించారు. విదేశాల్లో ఉన్న తెలుగు వారిని సమన్వయం చేసుకుంటూ.. వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యతల్ని లోకేశ్, రామ్మోహన్‌నాయుడు, టీజీ భరత్ తదితరులు తీసుకోవాలని చెప్పారు.

విజయవాడలో ఉన్నామా.. జ్యూరిక్‌లోనా?

'తొలిసారి దావోస్‌కు వచ్చినప్పుడు భారతీయులు తక్కువే. తెలుగువారు అసలు లేరు. ఇప్పుడు చూస్తే (మిగతా 3లో)

దావోస్ మ్యాన్ చంద్రబాబు

సీఎంను కొనియాడిన ఈరోస్ సంస్థ ఛైర్మన్ కిషోర్ ఉల్లా 3లో

ఏఐతో లిక్టన్‌స్టెన్ అభివృద్ధి

ఆ దేశ ప్రతినిధులతో భేటీ అవుతా

జ్యూరిక్ పర్యటనలో సీఎం చంద్రబాబు

స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో భేటీ 8లో

జ్యూరిక్ విమానాశ్రయంలో చంద్రబాబుకు ఘన స్వాగతం

మా పోర్టుల్లో హైడ్రోజన్ పైలట్ వాహనాలను తయారు చేయండి

ఎవల్యూషన్ సినర్జిటిక్ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి లోకేశ్ భేటీ 8లో

నిష్క్రమించిన ఈశాన్య రుతుపవనాలు

2లో

రెండు బస్సులు బోల్తా



విజయనగరం జిల్లాలో బోల్తా పడిన బస్సు నుంచి ప్రయాణికులను బయటకు తీసుకొస్తున్న స్థానికులు

35 మందికి గాయాలు

కాకినాడ జిల్లా ఘటనలో ప్రైవేట్ ట్రావెల్ డ్రైవర్‌కు నిద్రమత్తు!

విజయనగరం జిల్లా ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు ఫిట్స్

2లో

ఇంకో 4 రోజులే ఎల్ఆర్‘ఎస్’

- దరఖాస్తులకు 23 వరకే గడువు
- ఆ తరువాత క్రమబద్ధీకరణ రుసుములు తడిసి మోపెడు



ఈనాడు – అమరావతి

అనుమతులు తీసుకోని లేఔట్లలో ఇళ్ల స్థలాల (ప్లాట్ల) క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి నాలుగు రోజులే మిగిలింది. ప్రభుత్వం ప్రకటించిన గడువు ఈ నెల 23తో ముగియనుంది. దాదాపు 9 వేల ఎకరాల్లో అనధికార లేఔట్లు ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇప్పటి వరకు దాదాపు 6 వేల ఎకరాల విస్తీర్ణంలోని లేఔట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రజల నుంచి 52,470 దరఖాస్తులొచ్చాయి. మరో 25 వేల దరఖాస్తులు రావాలి. గడువు పెంచాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

వైకాపా ప్రభుత్వంలో అనుమతులు తీసుకోకుండా ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా లేఔట్లు వేశారు. వాటిలో స్థలాలు కొన్న ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) అమలుకు 2025 జులై 26న ఉత్తర్వులిచ్చింది. క్రమబద్ధీకరణతో 75 వేల మందికి పైగా ప్రయోజనం చేకూరడంతోపాటు ప్రభుత్వానికి రుసుముల కింద రూ.600 కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నారు.

ఓపెన్ స్పేస్ ఛార్జీల్లో 50% రాయితీ

■ ఈ నెల 23లోగా ప్లాట్లు క్రమబద్ధీకరించుకునే వారికి ఓపెన్ స్పేస్ ఛార్జీల్లో ప్రభుత్వం 50% రాయితీ ప్రకటించింది. (మిగతా 3లో)

కమల దళపతిగా నితిన్ నబీన్



ఎన్నిక ఏకగ్రీవం

45 ఏళ్లకే భాజపా పగ్గాలు

బిహార్‌లో పుట్టిన నేతకు తొలిసారి అవకాశం

దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడిగా 45 ఏళ్ల నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ చరిత్రలో ఇంత చిన్న వయసులో అగ్రస్థానానికి చేరిన ఘనత ఆయనకే దక్కుతుంది. కాయస్థ సామాజికవర్గానికి చెందిన ఆయన ఆరెస్సెస్ నేపథ్యంతో అంచెలంచెలుగా ఎదిగారు. ఇటీవల బిహార్ నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గతనెల 14న నియమితులైనప్పుడే పార్టీ పగ్గాలు జేపీ నడ్డా నుంచి ఆయనకు రావడం ఖాయమని స్పష్టమైంది. దానికి తగ్గట్టుగా సోమవారం నితిన్ నబీన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఆయన్ను ప్రతిపాదించినవారిలో ప్రధాని నరేంద్రమోదీ ఒకరు. నితిన్ తరఫున పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర మంత్రులు- రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజు, భూపేంద్ర యాదవ్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు తొలి సెట్ పత్రాలను జాతీయ రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్‌కు (మిగతా 3లో)



నితిన్ నబీన్ తరఫున నామినేషన్ పత్రాలను కె.లక్ష్మణ్‌కు అందజేస్తున్న రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, అమిత్ షా

స్పెయిన్‌లో ఘోర ప్రమాదం

పట్టాలు తప్పిన రైలును ఢీకొన్న మరో రైలు

నుజ్జునుజ్జయిన 2 బోగీలు

39 మంది దుర్మరణం

159 మందికి గాయాలు

11లో

ఇకపై ఉదయం ధాన్యం కొంటే.. సాయంత్రానికి నగదు జమ

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

షీప్ ఫుట్ రోలింగ్‌తో సత్ఫలితాలు

ప్రధాన డ్యాం పనుల్లో వినియోగించండి

పోలవరం అధికారులకు విదేశీ నిపుణుల సూచన


మధ్యవర్తిత్వ నిర్వహణలో న్యాయవాదులది కీలక పాత్ర


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

న్యాయవాదులకు శిక్షణ తరగతులు ప్రారంభం

12లో

ఇదీ సంగతి!





స్వతహాగా శాంత స్వభావి అయినా, ఒక్కోసారి పట్టలేనంత కోపం వచ్చేస్తుంది. ఆ బలహీన క్షణమే బంధాలను బీటలువారుస్తుంది. తర్వాత 'అరే ఇలా చేశానేమిటి?' అని పశ్చాత్తాపపడ్డా ఫలితం ఉండదు. నిజానికి కోపం అనేది మనిషిలో సహజంగా ఉన్న స్వీయ రక్షణ (సెల్ఫ్ ప్రొటెక్షన్)కు సంబంధించిన ఒక భావోద్వేగం. అయితే క్షణికావేశానికి వెనక మెదడులోని 'సహజ హెచ్చరిక వ్యవస్థ (అమిగ్డాలా)' పనితీరు ప్రధాన కారణం. లోపల పేరుకుపోయిన ఒత్తిడి, అణచివేసిన భావోద్వేగాల ఫలితంగా తీవ్రమైన కోపం వచ్చేస్తుంది. ఉదాహరణకు మన లోపల ఒత్తిడి, అలసట, ఆందోళనలను స్టవ్‌పై మరుగుతున్న నూనె పాత్రలా అనుకుంటే... అందులో ఒక్క చుక్క నీళ్లు పడినా భగ్గున (మిగతా 3లో)

రకరకాలు...

- **ఇంపల్సివ్ బిహేవియర్:** భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోవడం కచ్చితంగా ఒక రకమైన మానసిక స్థితే. మత్తుపదార్థాలు, ఆల్కహాల్ వినియోగిస్తున్న వారిలో ఇది తీవ్రంగా కనిపిస్తుంది.
- **టెంపోరల్ లోబ్ ఎపిలెప్సీ:** మెదడులో ఇలాంటి సమస్య ఉన్నవారికి ఉన్నట్టుండి కోపం, ఉద్రేకం వస్తుంది. దీనికి ఇప్పుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి.
- **ఎక్స్‌ప్లోజివ్ మూడ్ డిజార్డర్:** వీళ్లకు ఆయా సందర్భాల్లో తీవ్ర కోపం వస్తుంటుంది. ప్రధానంగా అభిప్రాయ భేదాలు దీనికి కారణం. భార్యాభర్తలు, తల్లిదండ్రులు- పిల్లలు, బాస్- ఉద్యోగుల మధ్య ఇది ఎక్కువ.
- **హైపర్ థెర్మిక్ పర్సనాలిటీ:** అంటే ముక్కోపి మనస్తత్వం. ఎందుకొచ్చిందిరా బాబూ అని వీళ్లకు అందరూ దూరంగా ఉంటారు.

అయ్యో.. గజరాజు!

వేటగాళ్లు పెట్టిన విద్యుత్ తీగలు తగిలి ఏనుగు మృతి



పెద్దపంజాణి, గంగవరం, న్యూస్‌టుడే: వేటగాళ్లు అమర్చిన విద్యుత్తు తీగలు తగిలి ఏనుగు మృతి చెందింది. ఈ ఘటన చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం కోగిలేరు రెవెన్యూ పరిధి కీలపట్ల ఫారెస్టు బీట్‌లో చోటు చేసుకుంది. కల్లుపల్లెకు చెందిన ఈశ్వరయ్య మామిడి తోటలో మగ ఏనుగు మృతి చెంది ఉండటాన్ని తొలుత పశువుల కాపరులు గుర్తించి, అటవీశాఖ సిబ్బందికి సోమవారం సమాచారం అందించారు. చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు, పలమనేరు ఎఫ్ఆర్‌వో నారాయణ అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి వన్యమృగాల కోసం కొందరు వేటగాళ్లు విద్యుత్తు తీగలు అమర్చారని, అవి తగిలే ఏనుగు మృతి చెందిందని, దీని వయసు 30 ఏళ్లు ఉంటుందని వారు పేర్కొన్నారు.

30, 31 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు ఈ నెల 30, 31 తేదీల్లో కుప్పంలో పర్యటిస్తారని, ఆ రెండ్రోజుల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టనున్నారని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సీఎం పర్యటన ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాల పంపిణీ, పలు పరిశ్రమలతో ఒప్పందాలు, బాలికల వసతిగృహం ప్రారంభోత్సవం, ఉపాధి నిధులు రూ.30 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై రైతులతోనూ మాట్లాడతారని చెప్పారు.

పొగమంచుతో విమానాల రాకపోకలకు ఆటంకం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పొగమంచు ప్రభావంతో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం విమానాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు విమానాశ్రయం ప్రాంగణాన్ని పొగమంచు కప్పేసింది. ఫలితంగా ఉదయం 7.10కి రావాల్సిన ఇండిగో చెన్నై, హైదరాబాద్ సర్వీసులు నాలుగు గంటల పాటు ఆలస్యంగా 11.20, 10.52 గంటలకు విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యాయి. దిల్లీ నుంచి విమానాశ్రయంలో ఎయిరిండియా దిల్లీ సర్వీస్ విమానం గాల్లో చక్కర్లు కొట్టి, పొగమంచు తగ్గుముఖం పట్టాక 10 గంటలకు ల్యాండ్ అయ్యింది. 9 గంటలకు చేరుకోవాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసు విమానం 11 గంటలకు వచ్చింది. వాతావరణ మార్పుల కారణంగా విశాఖపట్నం ఇండిగో సర్వీసును రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ అభియోగపత్రంలో విజయ్ పేరు?

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దాఖలు చేయనున్న అభియోగపత్రంలో తమిళగ వెట్రికళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పేరు చేర్చనున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే పలువురిని దిల్లీలోని సీబీఐ కార్యాలయానికి రప్పించి వివరాలు సేకరిస్తున్నారు. విజయ్‌ని ఈ నెల 12న ఆరు గంటలకు పైగా విచారించారు. సోమవారం మళ్లీ ఆయన్ను పిలిపించారు. ప్రచార వాహనంలో నిల్చుని మాట్లాడుతున్నప్పుడు రద్దీ చూడలేదా? అక్కడికి రావడానికి 7 గంటలు ఆలస్యం ఎందుకైంది, తొక్కిసలాట సమయంలో చేపట్టిన చర్యలు, అప్పుడు వాహనాన్ని ముందుకు ఎందుకు నడిపారన్న ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. పలు ప్రశ్నలకు జవాబిచ్చిన విజయ్ మరికొన్నింటికి సమయం కోరినట్లు తెలిసింది. విజయ్ ఇచ్చిన కొన్ని జవాబులకు ఆధారాలు సమర్పించాలని సీబీఐ కోరింది. ఫిబ్రవరి రెండో వారంలో ఈ కేసుకు సంబంధించిన అభియోగపత్రాన్ని సీబీఐ అధికారులు సుప్రీంకోర్టులో దాఖలు చేయనున్నారు.



అంత ఎక్కువగా మాత్రం పనిచేయొద్దు!

ఎక్కువ పని చేయడం మంచిదే! కానీ- నేడు చేసిన పని తాలూకు అలసట నుంచి కోలుకోలేనంతగా, రేపు తిరిగి పని చేయలేనంత ఎక్కువగా మాత్రం శ్రమించకండి. ఈ వారం చేసే శ్రమ నుంచి ఈ వారమే మీరు పూర్తిగా కోలుకోగలగాలి. మరుసటి వారం మళ్లీ ఉత్సాహంగా పని చేసేలా ఉండాలి. అంతవరకే పనిని పరిమితం చేసుకోండి. లేకపోతే మీ ఉత్పాదకత గణనీయంగా దెబ్బతింటుంది.

– గ్రెగ్ మెక్‌కియోన్, రచయిత

రెండు బస్సులు బోల్తా

- 35 మందికి గాయాలు



కాకినాడ జిల్లాలో...



విజయనగరం జిల్లాలో...

గొల్లప్రోలు, గరివిడి, న్యూస్‌టుడే: రెండు వేర్వేరు ఘటనల్లో... ప్రయాణికులతో వెళ్తున్న బస్సులు బోల్తా పడ్డాయి. కాకినాడ, విజయనగరం జిల్లాల్లో సంభవించిన ఈ ప్రమాదాల్లో 35 మందికి గాయాలయ్యాయి.

★ కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ శివారులో 216 జాతీయ రహదారిపై పక్కన సోమవారం వేకువజామున ట్రావెల్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 10 మందికి గాయాలయ్యాయి. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం నుంచి భీమవరం వెళ్తున్న బస్సు రహదారి పక్కన ఉన్న ఓ కటౌట్‌ను ఢీకొట్టింది. అప్రమత్తమైన డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేశారు. ఈక్రమంలో రోడ్డు అంచుకు వెళ్లిన బస్సు పక్కనే ఉన్న పొలంలో బోల్తా పడింది. వెనుక వచ్చిన మరో బస్సులోని వారు బోల్తాపడిన బస్సు అద్దాలను పగలగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ఉన్నారు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు బయలుదేరాక మార్గంమధ్యలో రెండు సార్లు అదుపు తప్పబోయినట్లు ప్రయాణికులు చెప్పారు. బస్సులో ఒక డ్రైవరే ఉన్నాడని, అతను నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం సంభవించినట్లు వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

★ విజయనగరం జిల్లా గరివిడి మండలం కాపుశంభాం కూడలి సమీపంలో సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఆ సమయంలో డ్రైవర్, కండక్టర్ సహా 87 మంది ఉన్నారు. ఏడుగురు తీవ్రంగా, 18 మంది స్వల్పంగా గాయపడ్డారు. విజయనగరం డిపో పల్లెవెలుగు బస్సు రాజాం నుంచి విజయనగరం వెళ్తోంది. డ్రైవర్ అప్పల గురువులకు ఫిట్స్ రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు స్థానికుల సాయంతో బస్సు అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. క్షతగాత్రులను చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ సాయంత్రం వరకు అపస్మారక స్థితి నుంచి బయట పడలేదు. ఆయనను మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారు.

అద్దె ఖాతాలతో మోసానికి..

క్లాస్‌మేట్స్‌తో జట్టుకట్టిన సూర్య

- మరో ఇద్దరు నిందితుల అరెస్టు, రిమాండ్
- 300 ఖాతాల వివరాలు ఫిలిప్పీన్స్‌కు చేరవేత

ఈనాడు, అమరావతి: వారంతా డిగ్రీ కళాశాలలో కలిసి చదువుకున్నారు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఆత్రుతతో అడ్డదారులు తొక్కారు. కొందరితో కలిసి ముఠాగా ఏర్పడి, సైబర్ నేరగాళ్లకు సహకరించారు. తెలిసిన వారి బ్యాంకు ఖాతాలను తీసుకొని, విదేశాల్లోని ముఠాలకు అద్దెకిచ్చారు. భారీగా కమీషన్లు దండుకున్నప్పటికీ, చివరకు పాపం పండి, పోలీసులకు దొరికి కటకటాలపాలయ్యారు. ఇటీవల విజయవాడలో వెలుగుచూసిన బ్యాంకు ఖాతాలను అద్దెకు ఇవ్వడం కేసులో తాజా కోణాలివి. ఈ కేసులో పోలీసులు మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన పేరవోలు దేవదాసు ఫిర్యాదు మేరకు ఐటీవల సైబర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుకాగా, ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రధాన నిందితుడు సూర్య స్నేహం వల్లాడు జిల్లా చాగల్లు. నరసరావుపేటలో డిగ్రీ చదివాడు. అతని సహాధ్యాయులు వెంకటేశ్వరరావు, వేణుగోపాల్, గోపీకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పది మంది జట్టు కట్టారు. ఈ ముఠాలో పార్వతితో పాటు ఫిలిప్పీన్స్‌లో ఉన్న మరో మహిళ కూడా ఉంది. మందిని గుర్తించి వారితో కరెంటు, సేవింగ్ ఖాతాలు తెరిపించారు. వాటి వివరాలను చట్ట విరుద్ధ కార్యకలాపాల నిమిత్తం విదేశాల్లో సైబర్ ముఠాల ఏజెంట్లకు అందజేశారు. కమీషన్ల రూపంలో వస్తున్న డబ్బుతో విలాస జీవితం గడిపారు. ఏపీతో పాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జమ్మూ, కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో వీరి లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

నిందితులకు రిమాండ్

ప్రకాశం జిల్లా సంతమాగులూరుకు చెందిన వెంకటేశ్వరరావు అలియాస్ బుజ్జి (ఏ9), గుంటూరు జిల్లా పెదకూరపాడు మండలానికి చెందిన శ్రీకాంత్ (ఏ10)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరిని విజయవాడలోని కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి వచ్చేనెల 2 వరకు రిమాండ్ విధించారు. సూర్యకు క్లాస్‌మేట్ అయిన వెంకటేశ్వరరావు విజయవాడలో సొంతంగా ఐదు ఖాతాలు తెరిచాడు. వీటిలో రెండు పొదుపు, మూడు కరెంటు ఖాతాలు. మరికొందరితోనూ ఖాతాలు తెరిపించాడు. సూర్య స్నేహితుడి సోదరుడైన శ్రీకాంత్ కూడా స్వయంగా ఖాతాలు తెరిచి సూర్యకు ఇచ్చాడు. వీరు ఈ ముఠా కార్యకలాపాల్లో కీలకంగా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటికే సూర్య, కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మి అరెస్టయ్యారు. బాలింత అయిన పార్వతిని పోలీసులు నోటీసులిచ్చి వదిలేశారు. ఫిలిప్పీన్స్‌లోని మహిళ సహా నలుగురు అరెస్టు కావాల్సి ఉంది. అద్దె ఖాతాల వ్యవహారంలో సూర్య గ్యాంగ్‌కు సహకరించిన ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగిని కూడా పోలీసులు నిందితుడిగా చేర్చారు.

గుంటూరు నుంచి తాడేపల్లికి అడ్డా

సూర్య (ఏ1) తొలుత గుంటూరులో ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని కార్యకలాపాలు ప్రారంభించాడు. అక్కడ పెద్దగా దందా సాగకపోవడంతో తాడేపల్లికి మకాం మార్చి, అక్కడ ఓ ఫ్లాట్ కిరాయికి తీసుకున్నాడు. క్లాస్‌మేట్స్‌తో కలిసి ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల్లోని అమాయకులను 300



నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ!

మనుబోలు, న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథుని ఆలయంలో సోమవారం నాగుపాము శివలింగాన్ని చుట్టుకుని దర్శనమిచ్చింది. ఆలయం వెనుక ఉన్న పుట్టలో నుంచి వచ్చిన నాగుపాము పడగ విప్పి కనిపించడంతో హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు స్మరించుకున్నారు. గతంలోనూ రెండుసార్లు ఇక్కడ ఇలాంటి ఘటనలే జరగడం గమనార్హం.

ఫిబ్రవరి 9న వైద్య మండలి ఎన్నికలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఎన్నికలు ఫిబ్రవరి 9న నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి, సెకండరీ హెల్త్ సంచాలకులు కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. 13 మంది సభ్యుల ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సోమవారం వెల్లడించారు.

నిష్క్రమించిన ఈశాన్య రుతుపవనాలు

ఈనాడు, విశాఖపట్నం: దేశంలో ఈశాన్య రుతుపవనాల సీజన్ ముగిసింది. గత రెండు రోజులుగా ఆగ్నేయ భారతంలో ఎక్కడా చెప్పుకోదగ్గ వర్షపాతం నమోదు కాలేదు. ఉత్తర భారతం నుంచి పొడి గాలులు వీస్తున్నాయి. దీంతో ఈశాన్య రుతుపవనాలు నిష్క్రమించినట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం ప్రకటించింది. రాబోయే రెండు రోజులు పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

★ ఈశాన్య రుతుపవనాలు గతేడాది అక్టోబరు 16న దక్షిణాదిలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈ సీజన్ కొనసాగుతుంది. ఈసారి అదనంగా 19 రోజులు రుతుపవనాలు కొనసాగాయి. అక్టోబరులో మొంథా, నవంబరులో దిత్వా తుపాన్ల ప్రభావంతో ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. తుపాన్ల సమయంలో మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు.

★ ఈ సీజన్‌లో బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో తొమ్మిది అల్పపీడనాలు ఏర్పడ్డాయి. అందులో రెండు తీవ్ర తుపాన్లు (మొంథా, శక్తి), మరో రెండు తుపాన్లు (సెన్యార్, దిత్వా)గా బలపడ్డాయి. వీటి ప్రభావంతో కోస్తాంధ్ర, యానాంలో 374. మి.మీ. (సాధారణం కంటే 16 శాతం ఎక్కువ), రాయలసీమలో 314 మి.మీ. (సాధారణం కంటే 33 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది.

అరకులో 5.4 డిగ్రీల ఉష్ణోగ్రత..

రాష్ట్రంలో కొద్దిరోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలిగాలుల ప్రభావానికి ప్రజలు గజగజలాడుతున్నారు. సోమవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 5.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రాబోయే ఐదు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పు ఉండదని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. మంగళవారం పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో. . బుధవారం పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరుగా పొగమంచు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

పట్టణ రోడ్లలోని గోతులు పూడ్చేందుకు రూ.16 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోని రోడ్లపై పడిన గుంతలను పూడ్చేందుకు రూ.16.83 కోట్లు విడుదలకు ప్రభుత్వం అనుమతించింది. అన్ని చోట్ల కలిపి దాదాపు 4 వేల గుంతలను పూడ్చేందుకు ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. పుర, నగరపాలక, నగర పంచాయతీల సాధారణ నిధులను ఇందుకు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

గ్రహం అనుగ్రహం

20–1–2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం

విదియ: రా. 2-28 తదుపరి తదియ; **శ్రవణ:** మ. 1-28 తదుపరి ధనిష్ఠ; **వర్జ్యం:** సా. 5-14 నుంచి 7-13 వరకు, **అమృత ఘడియలు:** తె. 3-26 నుంచి 5-05 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8-52 నుంచి 9-36 వరకు తిరిగి రా.10-53 నుంచి 11-45 వరకు; **రాహుకాలం:** సా.3-00 నుంచి 4-30 వరకు

సూర్యోదయం: ఉ.6.39; **సూర్యాస్తమయం:** సా.5.44; **చంద్రోదయం**

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
తిరుపతి	15.1	30.7
హైదరాబాద్	16.4	31.7
అనంతపురం	16.4	34.0
శ్రీకాకుళం	17.0	29.0
విశాఖపట్నం	17.0	29.2
తాడేపల్లిగూడెం	17.0	30.0
కడప	17.0	32.0
కర్నూలు	17.1	32.9
ఖమ్మం	17.4	31.0
విజయవాడ	17.9	29.8
గుంటూరు	19.0	31.0
రాజమహేంద్రవరం	19.0	34.0
నరసాపురం	20.0	29.4
ఒంగోలు	20.0	30.3
నెల్లూరు	20.4	30.4

భూ సమస్య పరిష్కరించడం లేదంటూ ఆత్మహత్యాయత్నం

- వైకాపా జడ్పీటీసీ సభ్యుడు ఆక్రమించారని బాధితుడి ఫిర్యాదు
- చిత్తూరు కలెక్టరేట్‌లో ఘటన



నాగరాజు ఒంటిపై నీరు పోస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తన భూ సమస్యను అధికారులు పరిష్కరించడం లేదన్న ఆవేదనతో చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ గరిగదొన గ్రామానికి చెందిన నాగరాజు సోమవారం కలెక్టరేట్ వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీన్ని గమనించిన కలెక్టరేట్ సిబ్బంది.. వెంటనే నీళ్లు పోసి ఆ యత్నాన్ని భగ్నం చేశారు. అనంతరం బాధితుడు విలేకరులతో మాట్లాడారు. గరిగదొనలో ఉన్న తమ భూమి 1.25 ఎకరాలను అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు, ప్రస్తుత జడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ గతంలో ఆక్రమించారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో కూడా భూ యజమానిగా సదరు నాయకుడి పేరే కనిపిస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించి, తనకు న్యాయం చేయాలని మండల అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. వారు పట్టించుకోలేదని వాపోయారు. కలెక్టరేట్‌లో గతంలోనూ ఫిర్యాదు చేశానని, అయినా పరిష్కారం దొరకలేదని తెలిపారు. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ఆక్రమణదారుడికే వత్తాసు పలుకుతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. తరువాత నాగరాజును పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.



మదిలో అలజడి... మహా కోపంగా బయటపడి..!

(మొదటి పేజీ తరువాయి) మంట వస్తుంది. కోపం ఏ కారణం లేకుండా వచ్చినట్టు అనిపించినా.. వాస్తవానికి లోపల ఉన్న సమస్యలే కారణం. లోపలి ఒత్తిడులను గుర్తించి, భావోద్వేగాలను సమయానికి వ్యక్తపరచడం ద్వారా.. తీవ్ర కోపాన్ని నియంత్రించడం సాధ్యమని చెబుతున్నారు నిపుణులు.

కోపమెందుకు?

- కోపం అనేది ఓ రక్షణాత్మక భావోద్వేగం. ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు శరీరానికి అదనపు శక్తిని అందిస్తూ.. 'అడ్రినలిన్' వంటి ఒత్తిడి హార్మోన్లను విడుదల చేస్తుంది.
- మెదడులోని సహజ హెచ్చరిక వ్యవస్థ అయిన 'అమిగ్డాలా'.. ఏదైనా ప్రమాదాన్ని (నిజమైనదైనా, ఊహాత్మకమైనదైనా) గుర్తించిన వెంటనే.. 'ఫైట్-ఆర్-ఫ్లైట్' ప్రతిచర్యను ప్రారంభిస్తుంది.
- ప్రమాదం, అన్యాయం అనిపించిన క్షణంలో మెదడులోని 'ఫోరాడ్' ప్రతిచర్యను అమిగ్డాలా ప్రేరేపిస్తుంది.
- ఈ ప్రక్రియలో తర్కబద్ధమైన ఆలోచనలకు, స్వీయ నియంత్రణకు బాధ్యత వహించే 'ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్' పనిచేయక ముందే ప్రతిచర్య వచ్చేస్తుంది. దీనినే శాస్త్రవేత్తలు 'ఎమోషనల్ హైజాకింగ్' అంటారు.
- బాధ, భయం, నిరాశ, బాధ్యత, తదితర ఒత్తిడులను లోపలే దాచి కోపం వల్ల అవి లోపల పేరుకుపోతుంటాయి. చిన్న సంఘటన జరిగినా.. అవి ఒక్కసారిగా 'ఉప్పెన'లా కోపంగా బయటపడతాయి.
- ఇక నిద్రలేమి, ఆకలి, హార్మోన్ల మార్పుల వంటి అంశాలు కూడా భావోద్వేగ నియంత్రణను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి.
- చిన్నప్పటి నుంచి కోపాన్ని దూకుడుగా వ్యక్తపరిచే వాతావరణంలో పెరగడం.. లేదా గతంలో ఎదురైన మానసిక గాయాలు(ట్రామా).. తదితర అంశాలన్నీ కోపాన్ని ఒక 'డిఫాల్ట్' ప్రతిచర్యగా మెదడులో స్థిరపరుస్తాయి.
- చిన్న అసౌకర్యాన్ని వ్యక్తిగత అవమానంగా లేదా ఉద్దేశపూర్వక దూషణగా భావిస్తే కూడా.. కోపం వచ్చే అవకాశం మరింత ఎక్కువ.

-ఈనాడు, హైదరాబాద్

ఎప్పుడు ఎక్కువ...

- పనుల ఆలస్యమవడం
- టెక్నాలజీ పనిచేయకపోవడం
- అలసటలో ఉన్నప్పుడు చిన్న ఇబ్బందులు
- అవమానించారనే భావన
- రోజువారీ అలవాట్లలో మార్పులు

అనర్థాలున్నాయ్...

- మానవ సంబంధాలు దెబ్బతినడం
- రక్తపోటు, తలనొప్పి, జీర్ణ సమస్యలు
- మానసిక అనారోగ్యం
- వర్క్‌ప్లేస్‌లో సమస్యలు
- ఆత్మవిశ్వాసం తగ్గడం

అధిగమించడం ఇలా..?

- కోపం వచ్చిన వెంటనే 1-50 వరకూ అంకెలు నెమ్మదిగా లెక్కించాలి.
- కొద్ది నిమిషాల పాటు గట్టిగా శ్వాస తీసుకోవాలి.
- ఒక గ్లాసు మంచినీళ్లు తాగాలి.
- ఈ సమయంలో కాసేపు మౌనంగా ఉండాలి.
- మనసును మరో అంశంపైకి మళ్లించాలి. నచ్చిన సంగీతం వినాలి.
- వీలైతే ఆ ప్రదేశం నుంచి కొద్దిసేపు పక్కకు వెళ్లాలి.
- ఇప్పుడు వెంటనే కోపాన్ని తగ్గించే ఔషధాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఒక మాత్రను నాలుక కింద పెట్టుకుంటే వెంటనే 5-10 నిమిషాల్లో శాంతిస్తారు.
- సైకోథెరపీ కూడా ఉపయోగపడుతుంది.
- కోపంలో ఉన్నప్పుడు.. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు.

సైకోథెరపీ, యోగ, ధ్యానం...



తీవ్రకోపానికి కారణాలను గుర్తించి.. ఆయా సందర్భాలకు తగ్గట్టుగా సైకోథెరపీ చేస్తే చక్కని ఉపయోగం ఉంటుంది. సాధారణంగా ఎక్కడో ఏదో సందర్భంలో ఎవరి మీదో వచ్చిన కోపాన్ని.. ఇంకెక్కడో మరో సందర్భంలో ఇంకెవరి మీదనో తీర్చుకుంటారు. ఉదాహరణకు ఆఫీసులో వచ్చిన కోపాన్ని.. బాస్ మీద, కొలీగ్ మీద ఏమీ అనలేక.. ఇంటికొచ్చి భార్యాపిల్లల మీద అరుస్తుంటారు. ఇప్పుడు కూడా మానసిక తెరపీలో నయం చేయొచ్చు. భార్యాభర్తల మధ్య శారీరక సఖ్యత లేకపోయినా కూడా.. ఆ విషయాన్ని పక్కన పెట్టి కోపం రూపంలో చూపిస్తుంటారు. దీనికి కూడా కౌన్సెలింగ్ అవసరం. రోజూ వజ్రాసనంలో ప్రాణాయామం, ధ్యానం చేస్తే ఫలితం ఉంటుంది. 20 నిమిషాల పాటు బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి.

-డాక్టర్ జి.ప్రసాద్‌రావు, సీనియర్ సైకియాట్రిస్ట్

ఇంకో 4 రోజులే ఎల్‌ఆర్‌ఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ స్పేస్ ఛార్జీ కింద ప్లాట్ మొత్తం విలువలో 14%కు బదులు 7% చెల్లిస్తే సరిపోతుంది.

■ గడువు ముగిశాక ప్లాట్ల క్రమబద్ధీకరించుకోవాలంటే ఓపెన్ స్పేస్ ఛార్జీలు 14% కట్టాల్సిందే. అదీ ఆ రోజు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విలువల ఆధారంగా చెల్లించాలి. బెటర్‌మెంట్ ఛార్జీలు, ఇతర రుసుములు మొత్తంపైనా మళ్లీ అదనపు రుసుములు విధిస్తారు.

■ ఇప్పటి చెల్లించడానికి సిద్ధమైనా ఆ లేఅవుట్‌లో ఇప్పటికే కొన్ని ప్లాట్లయినా ఎల్‌ఆర్‌ఎస్‌లో క్రమబద్ధీకరించుకుని ఉండాలి. లేదంటే దాన్ని అనుమతుల్లేని లేఅవుట్‌గా భావించి క్రమబద్ధీకరణ, ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు పుర, నగరపాలక సంస్థలు అనుమతులివ్వవు.

ప్లాట్ల యజమానులు ఎవరైనా?: అనుమతులు తీసుకుని లేఅవుట్‌లో ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను పెద్దఎత్తున చేపడుతున్నా అనేకచోట్ల ప్లాట్ల యజమానుల చిరునామా తెలుసుకోవడం అధికారులకు పెద్ద సమస్యగా తయారైంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన సెల్ నంబర్లు ప్రస్తుతం పని చేయడం లేదు. తాత్కాలిక చిరునామాల్లోనూ వారు దొరకడం లేదు. దీంతో ఆ లేఅవుట్లలోని అన్ని ప్లాట్ల క్రమబద్ధీకరణ సాధ్యం కావడం లేదు. విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, తిరుపతి, నెల్లూరు నగరాలకు దూరంగా ఉన్న లేఅవుట్లలో ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

అరకొర సమాచారంతో దరఖాస్తులు: మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తుల్లోనూ పూర్తి సమాచారం ఉండటం లేదు. 9,245 దరఖాస్తులకు సంబంధించి అవసరమైన దస్త్రాలు, వివరాలు లేవని అధికారులు వాటిని పక్కన పెట్టారు. ఆ సమాచారం ఇవ్వాలంటూ దరఖాస్తుదారులను సంప్రదిస్తున్నారు.

ఫిబ్రవరి 2 నుంచి ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

తిరుపతి (మహిళా యూనివర్సిటీ), న్యూస్‌టుడే: ఏపీఆర్‌సెట్ 2024-25లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించేలా ఉన్నత విద్యామండలి కార్యదర్శి తిరుపతిరావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 65 సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకుగాను గతేడాది నవంబరులో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏపీఆర్‌సెట్ నిర్వహించారు. మొత్తం 5,167 మంది అభ్యర్థులు హాజరుకాగా, 2,859 మంది అర్హత సాధించారు. వీరికి ఆంధ్ర, ఎస్వీ, ఆచార్య నాగార్జున, శ్రీపద్మావతి, కాకినాడ, అనంతపురం జేఎన్‌టీయూల పరిధిలో ఇంటర్వ్యూలు జరుగుతాయని మహిళా వర్సిటీ రిజిస్ట్రార్, ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ఆర్.ఉష సోమవారం తెలిపారు. మంగళవారం ఆర్‌సెట్ వెబ్‌సైట్‌లో సబ్జెక్టుల వారీగా తేదీల వివరాలు పొందుపరుస్తామన్నారు.

కియా అనుబంధ పరిశ్రమ.. జిన్‌మ్యూంగ్ టెక్ విస్తరణకు అనుమతి

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాలోని కియాకు సమీపంలోని దాని అనుబంధ పరిశ్రమ అయిన జిన్ మ్యూంగ్ టెక్ ఇండియా లిమిటెడ్ విస్తరణకు అనుమతిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఈ పరిశ్రమలో కార్లకు సంబంధించి ఫైయిన్ స్టీల్ షీట్ కటింగ్, షేపింగ్, బెండింగ్, మౌల్డింగ్ చేస్తారు. గతంలో ఏపీ-ఐఐసీ కేటాయించిన 3.99 ఎకరాల్లోని రెండు ప్లాట్లను పరిశ్రమకు కేటాయించాలని అక్కడ కోరుతుంది. కియా సమీపంలో వాయు కాలుష్యం కలిగించే ఇతర పరిశ్రమల విస్తరణకు అవకాశం లేకుండా 2017లో నిషేధం విధించారు. తమ పరిశ్రమ విస్తరణకు అవకాశం కల్పించాలని, నిషేధం నుంచి సడలింపు ఇవ్వాలని యాజమాన్యం తాజాగా అభ్యర్థించింది.

ఉద్యోగాలిచ్చే స్థాయికి తెలుగువారు ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలోనో, తిరుపతిలోనో ఉన్నామా.. లేక జ్యూరిక్‌లోనా? అన్నట్లుంది. డయాస్పోరాకు 20 దేశాల నుంచి తెలుగువారు రావడం సంతోషంగా ఉంది. విదేశాల్లో ఉన్నా తెలుగు సంప్రదాయాలు పాటిస్తూ సంక్రాంతి పండగ చేసుకున్నారు' అని చంద్రబాబు ప్రశంసించారు. '148 దేశాల్లో ఎన్నార్టీ వ్యవస్థ ఏర్పాటు చేశాం' అని చెప్పారు. '2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ 1 ఎకానమీగా అవతరిస్తుంది. దేశానికి అత్యంత బలమైన నాయకత్వం నరేంద్రమోదీ రూపంలో ఉంది. ఉన్నత విద్య అభ్యసించిన వారిని, యువకులను పార్టీలో, ప్రభుత్వంలో ప్రోత్సహిస్తున్నాం. అందుకే లోకేశ్, రామ్మోహన్‌నాయుడు, టీజీ భరత్‌లకు మంత్రి పదవులు దక్కాయి. కేంద్రంలో యువ కేబినెట్ మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఉన్నారు' అని పేర్కొన్నారు.



డెన్మార్క్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అమర్‌నాథ్ పొట్లూరిని సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో రాష్ట్ర విద్యా, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్‌కుమార్, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్

విదేశీ విద్యకు సహకారం

'ప్రపంచవ్యాప్తంగా మంచి విశ్వవిద్యాలయాలు ఎక్కడున్నా మన విద్యార్థులకు అవకాశాలు అందేలా చేస్తాం. 4 శాతం వడ్డీపై ప్రభుత్వ గ్యారంటీతో విదేశీ విద్యకు రుణాలిప్పిస్తాం. ఐబీఎం, ఐఐఎస్ఈఆర్ సంయుక్త సహకారంతో తిరుపతిలో ఏపీ ఫస్ట్ అనే అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. కొత్త ఆవిష్కరణలతో యువతకు ఉపాధి చూపేలా కృషి చేస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు.

గత ప్రభుత్వంలో ఎన్నార్టీలపైనా కేసులు

ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వ హయాంలో కొందరు ఎన్నార్టీలపైనా కేసులు పెట్టారని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నార్టీలు అద్భుతంగా పనిచేశారు. రాష్ట్రానికి పూర్వవైభవం తెచ్చేందుకు సహకరించమని కోరితే ఎంతోమంది తరలివచ్చారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కల్యాణ్ సహకరించారు. భాజపా కలసి వచ్చింది. ప్రజల ఆశీస్సులతో ఘనవిజయం సాధించాం. 18 నెలల్లో ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పనిచేస్తున్నాం' అని వివరించారు. 'రాష్ట్ర అభివృద్ధిలో మంత్రులు, నేను పోటీపడ్డాం. పెద్దఎత్తున పెట్టుబడులు సాధించాం. దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25% ఒక్క ఏపీకే వచ్చాయి. దేశానికి వచ్చిన అతిపెద్ద పెట్టుబడి గూగుల్ రూపంలో ఆంధ్రప్రదేశ్‌కే వచ్చింది' అని చెప్పారు. 'రూ.22 లక్షల పెట్టుబడుల సాధనపై కసరత్తు చేస్తున్నాం. అది సాకారమైతే 20 లక్షల ఉద్యోగాలు కల్పించగలుగుతాం. డ్రోన్ టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నాం' అని పేర్కొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రవాసాంధ్రులు

గోదావరి పుష్కరాలకు ఆహ్వానం

డయాస్పోరా కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. చంద్రబాబు వేదికపైకి రాగానే.. జై బాబు అనే నినాదాలు మిన్నంటాయి. వివిధ ప్రాంతాల నుంచి తెలుగు వారు వచ్చి స్థిరపడ్డారని చెబుతూ.. వివిధ నియోజకవర్గాల పేర్లను చంద్రబాబు ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజల నుంచి అధిక స్పందన వచ్చింది. వివిధ దేశాల ఎన్నార్టీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించగా.. వచ్చే ఏడాది తాను వచ్చినప్పుడు ఎన్నార్టీల అభివృద్ధిని వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించాలని చంద్రబాబు సూచించారు. స్విట్జర్లాండ్ తెలుగు సంఘం నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు సీఎం చంద్రబాబు బహుమతులు అందించారు. గోదావరి పుష్కరాలకు తరలి రావాలని అందరినీ ఆహ్వానించారు. అనంతరం తెలుగు కుటుంబాలతో ఆత్మీయంగా మాట్లాడారు.

చంద్రబాబు ప్రసంగంలోని ముఖ్యాంశాలు

ధాత్రిరెడ్డి మిమ్మల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తారు

దేశ విదేశాల్లో ఉన్నవారిని పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేశాం. ఐఐటీలో చదివి ఐఏఎస్ అయిన ధాత్రిరెడ్డిని సీఈఓగా నియమించాం. ఆమె సేవల్ని ఉపయోగించుకుని మీరంతా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి.

ఐఏఎస్ అంటే పెత్తనం అనుకుంటారు

ఐఏఎస్ అధికారుల్ని కూడా తీసుకొచ్చాం. ఐఏఎస్ అంటే పెత్తనం అనుకుంటారు.. చురుగ్గా ఉండరు. కానీ వారు అనుకుంటే ఏమైనా చేయగలరు. అందుకే వారిలో మార్పు తెచ్చేందుకు ఇక్కడకు తీసుకొచ్చాం.

ప్రపంచానికి టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ పాఠాలు చెబుతున్నా

చిన్నతనంలో ఆరు కిలోమీటర్లు నడిచి హైస్కూల్‌కు వెళ్లి వచ్చేవాడిని. అంటే రోజూ 12 కిలోమీటర్లు నడిచా. అలాంటి నేను ఇప్పుడు యువతకు మేనేజ్‌మెంట్, టెక్నాలజీ పాఠాలు చెబుతున్నా. నాకు ఒక అవకాశం వచ్చింది. అంచెలంచెలుగా సద్వినియోగం చేసుకున్నా.

12 మంది యువ బృందం.. ఆలోచనల్లో యువకుణ్ని నేనే

12 మంది బృందంతో వచ్చాం. అంతా యువకులే.. అనుభవం ఉన్నవాణ్ని నేనొక్కడినే. ఆలోచనల్లో వారందరికంటే యువకుడినే. వారు కాస్త తీరిగ్గా ఆలోచిస్తారు. నేను వేగంగా ఆలోచిస్తా.



అమ్మవారికి ఎత్తు బంగారాన్ని (బెల్లం) తన మనవడితో కలిసి సమర్పిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు

మేడారంలో గద్దెల ప్రారంభం

- సమ్మక్క, సారలమ్మలకు బంగారం సమర్పించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, వరంగల్: మేడారంలో వన దేవతల గద్దెల పునర్నిర్మాణ పనులను ప్రభుత్వ సంకల్పం, అమ్మవార్ల దయతో వంద రోజుల్లోనే పూర్తి చేశామని... ఇందులో అందరి కృషి ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగు జిల్లా మేడారంలో పునర్నిర్మించిన వన దేవతలు సమ్మక్క, సారలమ్మల గద్దెలను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం మేడారానికి చేరుకున్న ఆయన సోమవారం ఉదయం 6:40 గంటలకు గద్దెల పునర్నిర్మాణానికి సూచికగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం ఆవిష్కరించారు. తన సతీమణి, కుమార్తె, అల్లుడి సమక్షంలో మనవడితో కలిసి ఎత్తు బంగారాన్ని(బెల్లం) అమ్మవార్లకు మొక్కుగా సమర్పించారు. తర్వాత అంతా కలిసి గద్దెలను దర్శించుకున్నారు. వీరందరికీ పూజారులు బొట్టు పెట్టి ఆశీర్వదించారు. అంతకుముందు గద్దెల వద్ద అతిథులకు ఆదివాసీ సంప్రదాయ డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు.

కమల దళపతిగా నితిన్ నబీన్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం అందజేశారు. భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు- పెమా ఖండూ, యోగి ఆదిత్యనాథ్, పుష్కర్‌సింగ్ ధామీ, నాయబ్‌సింగ్ సైనీ, ప్రమోద్ సావంత్‌లు మరో సెట్ సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, అస్సాం, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన నేతలు కూడా నబీన్‌కు మద్దతుగా నామినేషన్లు అందజేశారు. మొత్తం 37 సెట్ల నామినేషన్లు ఆయన తరఫున దాఖలు కాగాఅవన్నీ సక్రమంగా ఉన్నట్లు లక్ష్మణ్ ప్రకటించారు. నితిన్ మంగళవారం బాధ్యతలు చేపడతారు.



నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న పార్టీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు

పార్టీ పుట్టినప్పుడు జన్మించిన నేత

నబీన్ 1980లో భాజపా పుట్టిన సంవత్సరంలో రాంచీలో జన్మించి, ఇప్పుడు అదే పార్టీకి సారథ్యం వహించబోతున్నారు. తండ్రి, భాజపా ఎమ్మెల్యే నబీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా మరణించాక 2006లో ఆయన రాజకీయాల్లో ప్రవేశించారు. ఆ ఏడాది ఉప ఎన్నికల్లో తొలి విజయం సాధించారు. ఆ తర్వాత 2010, 2015, 2020, 2025 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా నెగ్గారు. వివిధ శాఖలకు మంత్రిగా చేశారు. యువమోర్చా నుంచి వచ్చి, ఓటమి ఎరుగని నేతగా గుర్తింపు పొందిన ఆయన 2023లో ఛత్తీస్‌గఢ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కీలకపాత్ర పోషించారు. ఆ ఏడాది ఆ రాష్ట్రంలో భాజపా సాధించిన గెలుపుతో కేంద్ర నాయకత్వం వద్ద గుర్తింపు పొందారు. ఉమ్మడి బిహార్ నుంచి పార్టీ అధ్యక్ష స్థాయికి చేరిన తొలినేతగా ఇప్పుడాయన నిలుస్తారు. ఏప్రిల్‌లో తమిళనాడు, కేరళ, అస్సాంలలో జరగనున్న శాసనసభ ఎన్నికలు ఆయనకు తొలిపరీక్ష కానున్నాయి.

వైకాపా అవినీతిపై త్వరలో మరిన్ని సంచలనాలు: మాధవ్

రాష్ట్రంలో వైకాపా హయాంలో జరిగిన అవినీతికి మద్యం కుంభకోణం చిన్న ఉదాహరణ మాత్రమేనని, ఇలాంటి ఎన్నో అరాచకాలకు పాల్పడిన అప్పటి పాలకులకు, అక్రమార్కులకు శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. త్వరలో మరిన్ని సంచలనాలను రాష్ట్ర ప్రజలు చూడబోతున్నారని వ్యాఖ్యానించారు. 'పార్టీ నూతన జాతీయ అధ్యక్ష ఎన్నికలో నితిన్ నబీన్‌కు మద్దతుగా రాష్ట్ర పార్టీ తరఫున నామినేషన్ పత్రాలు సమర్పించడానికి రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యులందరం దిల్లీకొచ్చాం. ఏపీ నుంచి 40 మంది సంతకాలు చేసిన 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశామ'ని వివరించారు.

దావోస్ మ్యాన్ చంద్రబాబు

సీఎంను కొనియాడిన ఈరోస్ సంస్థ ఛైర్మన్ కిషోర్ లుల్లా

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు దావోస్ మ్యాన్ అని ఈరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిషోర్ లుల్లా ప్రశంసలు కురిపించారు. దావోస్ పర్యటనలో భాగంగా జ్యూరిక్‌లో కో ప్రెసిడెంట్ రిధిమా లుల్లా, స్వనీత్ సింగ్‌తో కలిసి చంద్రబాబుతో ఆయన భేటీ అయ్యారు. జెన్ ఏఐ, ఏరోస్ యూనివర్స్ సూపర్ యాప్, ఏఐ ఆధారిత ఫిల్మ్‌సిటీ, వర్చువల్ ప్రొడక్షన్ స్టూడియో తదితర అంశాల్ని సీఎంకు వివరించారు. 'డిస్కవరీ ఆంధ్రప్రదేశ్ 360' పేరుతో వర్చువల్ రియాలిటీ ప్రచార కార్యక్రమాలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఏపీని ఏఐ ఆధారిత సృజనాత్మక సంస్థలకు కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఈ సందర్భంగా చంద్రబాబు వారికి వివరించారు. ఏఐ క్రియేటివ్ టెక్ హబ్, డీప్‌టెక్, జనరేటివ్ ఏఐ, డిజిటల్ కంటెంట్ ఎకానమీ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే డిజిటల్ మీడియా, వర్చువల్ ప్రొడక్షన్, గేమింగ్, యానిమేషన్, రంగాల్లో పెట్టుబడుల్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.



జ్యూరిక్‌లో కిషోర్ లుల్లాతో సమావేశమైన సీఎం చంద్రబాబు. చిత్రంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్

మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న వైకాపా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ కోసం దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మూడు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్‌మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మద్యం కుంభకోణంలో పిటిషనర్ పాత్రకు సంబంధించిన అదనపు సమాచారాన్ని దాఖలు చేయడానికి తమకు కొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్‌రోహత్గీ కోరారు. ధర్మాసనం అందుకు అంగీకరిస్తూ రెండు నెలల సమయం ఇచ్చింది. తర్వాత దానిపై రీజాయిండర్ దాఖలు కోసం పిటిషనర్‌కు మరో నెల గడువిస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే దాకా పిటిషనర్‌కు అరెస్ట్ నుంచి ఇదివరకు ఇచ్చిన మధ్యంతర రక్షణ కొనసాగుతుందని స్పష్టంచేసింది.

కిలో వెండి ₹3,00,000

(మొదటి పేజీ తరువాయి)

తయారీ రంగాల నుంచి వెండికి గిరాకీ అంతకంతకూ పెరుగుతుండగా, సరఫరా ఆ మేర లేదనే వార్తలొస్తున్నాయి.

■ అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, హైదరాబాద్ బులియన్ విపణిలో సోమవారం రాత్రి 11.55 గంటలకు కిలో వెండి ధర రూ.3,09,700 వద్ద, 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,49,300 వద్ద స్థిరపడ్డాయి.

■ అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం ధర 82 డాలర్లు పెరిగి, 4678 డాలర్లకు, ఔన్సు వెండి ధర 4.5 డాలర్లు అధికమై 94.62 డాలర్లకు చేరడం వల్లే దేశీయంగానూ ధరలు ఇంతలా పెరిగాయి.

ఎంసీఎక్స్‌లో

కమొడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.3,10,000ను మించింది. 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,45,700 వద్ద ట్రేడ్ అవుతోంది.

సరఫరా అంతరం 2,500 టన్నులు?

ఇంతకుమించిన డిమాండ్ పెట్టుబడులు, పారిశ్రామిక రంగాల నుంచి వస్తోంది. కమొడిటీ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులు పెట్టినా, డెలివరీ తీసుకునే వారు తక్కువ కనుక, పెద్దగా ఇబ్బంది ఉండదు. అయితే వెండి ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లలోకి వచ్చే పెట్టుబడులకు సమానంగా వెండిని ఆయా సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

దేశాలవారీగా ఉత్పత్తి అంచనాలు ఇలా (టన్నుల్లో)

మెక్సికో	6,300	చిలీ	1200
చైనా	3300	రష్యా	1200
పెరు	3100	అమెరికా	1100
బొలీవియా	1300	ఆస్ట్రేలియా	1000
పోలెండ్	1300	కజకిస్థాన్	1000

గతేడాది అంతర్జాతీయంగా 25,000 టన్నుల వెండిని ఉత్పత్తి చేశారని అంచనా.

వెండి ధర పెరుగుదల నేపథ్యంలో, వెండి ఫండ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. అందుకు తగ్గట్టు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా పెట్టుబడులు - పారిశ్రామిక రంగాల నుంచి వస్తున్న గిరాకీ కంటే 2,500 టన్నులు తక్కువగా వెండి ఉత్పత్తి అవుతోందని.. ఈ అంతరం మరింత పెరగొచ్చనే అంచనాలున్నాయి.

బంగారం, వెండి తరవాతే అగ్రగామి కంపెనీలు

బంగారం, వెండి ధరల దూకుడు ఫలితంగా, అంతర్జాతీయంగా అత్యధిక మార్కెట్ విలువ పరంగా అగ్రగామి కంపెనీలు కూడా వెనుకబడ్డాయి. ప్రపంచ స్వర్ణ మండలి అంచనాల ప్రకారం అంతర్జాతీయంగా బంగారం నిల్వలు 2,16,225 టన్నులు, వెండి 17,51,000 టన్నులుగా పరిగణించి.. ప్రస్తుత ధరల ప్రకారం ఈ అంచనాలు ప్రకటిస్తున్నారు.

మార్కెట్ విలువ లక్షల కోట్ల డాలర్లు

బంగారం	32.54	గూగుల్	3.83
వెండి	5.28	మైక్రోసాఫ్ట్	3.5
ఎన్విడియా	4.5	అమెజాన్	2.4
యాపిల్	3.95		

25 నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు

పెదకాకాని, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఉన్న కాజా గ్రామంలో ఈ నెల 25 నుంచి బైబిల్ మిషన్ 88వ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'మూడు రోజుల పాటు మహోత్సవాలు నిర్వహించనున్నాం. దేశ, విదేశాల నుంచి విశ్వాసులు పాల్గొంటారు. పందిళ్లు, తాగునీరు, వసతి, భోజనం వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేశాం. 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు, తిరిగి సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి' అని పేర్కొన్నారు.

ఈనాడు

కరిగిపోతున్న సొంతింటి కలలు

తిండి, దుస్తుల తరవాత మనిషికి మరో ప్రాథమిక అవసరం ఇల్లు. తలదాచుకునేందుకు సొంతగూడు అంటూ ఒకటి ఉండాలన్నది ప్రతి ఒక్కరి కల. కానీ, అల్పాదాయ వర్గాలకు అది అందని వరమవుతోంది. ముఖ్యంగా వలసలతో కిటకిటలాడుతున్న నగరాల్లో సామాన్యులకు అందుబాటు ధరల్లో ఇళ్లు కరవవుతున్నాయి. గడచిన ఆరేళ్లలో పట్టణభారతంలో అలాంటివి 24శాతం మేర తగ్గిపోయాయి. పేద, దిగువ మధ్యాదాయ ప్రజల కోసం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 94 లక్షల చౌక గృహాల అవసరముంది. ప్రభుత్వాలు పట్టించుకోకపోతే 2030 నాటికి ఆ కొరత మూడుకోట్లకు చేరవచ్చని జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి హెచ్చరిస్తోంది. ఆర్థిక కార్యకలాపాల ఉద్ధృతితో నగరాల్లో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. అదే సమయంలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. పొట్టచేతపట్టుకుని నగరాలకు వస్తున్న వారిలో చాలామందికి మురికివాడలే ఆవాసాలవుతున్నాయి. ఈ దురవస్థ తప్పి సగటు జీవికి సొంతిల్లు దక్కాలంటే నీతి ఆయోగ్ ఇటీవల సూచించినట్లు, నగర ప్రణాళికల్లో చౌక ఇళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలి. దాంతోపాటు చిన్నపట్టణాలూ గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంచి మౌలిక వసతులను విస్తరిస్తే వలసల నియంత్రణ సాధ్యపడుతుంది. నానాటికీ నరక కూపాలుగా తయారవుతున్న మహానగరాలపై ఒత్తిడి తగ్గుతుంది!

నగరాల పేరెత్తగానే కిక్కిరిసిన రోడ్లు, జల, వాయు కాలుష్యాలు, ముంచెత్తే వరదలు, భరించలేని ఖర్చులు వంటివెన్నో గుర్తొస్తాయి. ఇన్ని సమస్యలున్నా అభివృద్ధి అంతా నగరాల్లోనే కేంద్రీకృతం అవుతుండటంతో అయస్కాంతంలా ఎంతోమంది అటువైపు తరలిపోతున్నారు. తీరా వెళ్లాక నానా అగచాట్లు పడుతున్నారు. జనజీవన ప్రమాణాలను పెంచాలంటే ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలను పారిశ్రామిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. అక్కడ వ్యాపారాలను ప్రోత్సహించాలి. అధునాతన రోడ్లు, ప్రజా రవాణా, విద్య, వైద్య సదుపాయాలను విరివిగా అందుబాటులోకి తీసుకురావాలి. స్థానిక యువతను నైపుణ్యవంతులుగా మలచాలి. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం కావాలంటే- ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు చిన్న పట్టణాలకు జవజీవాలు కల్పించడం తప్పనిసరి. అందులో భాగంగా స్మార్ట్ సిటీస్ మిషన్, అమృత్ వంటివి కేంద్రం తెచ్చింది. పట్టణాభివృద్ధి పథకాల అమలులో లోటుపాట్లకు తావులేకుండా చూస్తే, జనభారత ప్రగతికి అవి ఇతోధికంగా తోడ్పడతాయి!

దేశీయంగా అరవై శాతానికి పైగా జనాభా ఇప్పటికీ పల్లెల్లోనే జీవిస్తోంది. అవి ఎంత పచ్చగా ఉంటే, భారతావని అంత సుభిక్షమవుతుంది. దురదృష్టకొద్దీ రోడ్లు, తాగునీరు వంటి కనీస వసతుల లేమితో చాలా గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయి. పరిశీలనల ప్రకారం 2022 నాటికి దాదాపు 10శాతం పంచాయతీల్లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. వృత్తివిద్యా కేంద్రాలు నెలకొన్నవి కేవలం ఏడుశాతానికి పరిమితమయ్యాయి. గ్రామాల్లో పట్టణ తరహా సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన రూర్బన్ మిషన్ ఆశించిన మేరకు సఫలం కాలేదు. వీటన్నింటికీ తోడు వ్యవసాయం కష్టనష్టాల మయమవుతున్న కొద్దీ పల్లె ప్రజలు బతుకుదెరువు కోసం నగరాల బాట పట్టాల్సి వస్తోంది. మద్దతు ధరల కల్పనతో రైతాంగానికి అండగా ఉండటంతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై ప్రభుత్వాలు దృష్టిపెడితే గ్రామీణార్థిక వ్యవస్థ సరికొత్త జవసత్వాలద్దుకుంటుంది. పుట్టిన గడ్డకూ అయినవారికీ దూరంగా నగరాల్లో దుర్భర జీవితాలు గడిపే దుస్థితి జనసామాన్యానికి తప్పుతుంది!

భారత్ వైపు... జర్మనీ చూపు!



జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రీడ్‌రిక్ మెర్జ్ ఇటీవలి భారత పర్యటన విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు దేశాల మధ్య రక్షణ, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, వాతావరణ రంగాల్లోనూ... శాంతిభద్రతలు, ఇరుదేశాల మధ్య రాకపోకలపైనా కీలక ఒప్పందాలు కుదిరాయి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల మధ్య భారత్, జర్మనీల అజెండాలు వేరైనా, పలు విషయాల్లో సహకరించుకోవడం ఇరుపక్షాలకూ ఉపయుక్తం.

ఇవాళ భారతదేశం అన్ని విధాలుగా ఎదుగుతున్న శక్తి. వర్తమాన దేశాల్లో పలుకుబడి పెంచుకుంటున్న దిల్లీ వ్యూహపరంగా దక్షిణాసియాలో ప్రాబల్యం పెంచుకుంటోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారుతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తున్న ఇండియాకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రంప్ భారత్‌పై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు. వాటిలో 25 శాతాన్ని రష్యా చమురును దిగుమతి చేసుకుంటున్నందుకు వేసిన జరిమానాగా పరిగణించింది. ఈ సుంకాలను మరింత భారీగా పెంచేస్తానంటూ ట్రంప్‌తో వాణిజ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. అయితే దక్షిణాసియా, పశ్చిమాసియాలలో అమెరికా ఇటీవల పాకిస్థాన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ఇండియాకు ఏమాత్రం రుచించడం లేదు. ఈ క్రమంలోనే అమెరికా మీదనో, రష్యా మీదనో పూర్తిగా ఆధారపడకుండా బహుళ దేశాలతో ఆర్థిక, రాజకీయ, వ్యూహపరమైన సంబంధాలను విస్తరించుకోవాలని భారత్ నిశ్చయించింది.

అమెరికాను నమ్మడం మంచిది కాదని...


ట్రంప్ విధానాలు అమెరికాకు మిత్రులను కూడా దూరం చేస్తున్న సంగతి చూస్తున్నాం. నాటో దేశాలు తమ బడ్జెట్లో రక్షణ వ్యయాన్ని పెంచాలంటూ గతంలో ఒత్తిడి చేసిన ట్రంప్, రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాలోనూ మెలికపెట్టారు. తాజాగా గ్రీన్‌లాండ్‌ను కబ్జా చేస్తానంటున్నారు. నాటో సభ్యదేశమైన డెన్మార్క్ ఏలుబడిలో ఉన్న గ్రీన్‌లాండ్‌పై ఆయన కన్నుపడటం, ఆ కూటమిలో ప్రధాన భాగస్వాములైన జర్మనీ, ఫ్రాన్స్‌లకు నచ్చడం లేదు. డెన్మార్క్ బహిరంగంగానే నిరసన తెలిపింది. పశ్చిమార్ధ గోళమంతా తనదేనని అమెరికా హూంకరించడాన్ని ఐరోపా సహించలేకపోతోంది. అందుకే నాటో, ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల్లో అమెరికాను నమ్ముకోవడం మంచిది కాదేమోనన్న అంతర్మథనం మొదలైంది. ఈ క్రమంలోనే ఈయూ, నాటో కూటముల్లో ప్రధాన భాగస్వామి అయిన జర్మనీ ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తోంది. పాకిస్థాన్‌ను అమెరికా ముద్దు చేయడం చూసి భారత్ కూడా నమ్మకమైన ఇతర మిత్రులను దగ్గర చేసుకోవాలని నిశ్చయించింది. ఇలా ఒకరికొకరు అక్కరకొస్తున్న భారత్, జర్మనీలు సహజంగానే దగ్గరవుతున్నాయి. ఫ్రీడ్‌రిక్ పర్యటనను ఈ కోణం నుంచే చూడాలి. అమెరికా, రష్యాలతో నిమిత్తం లేకుండా భారత్, జర్మనీలు దగ్గరవుతున్నాయి.

ఉగ్రవాదంపై పోరుకు ఉమ్మడి బృందం

ఫ్రీడ్‌రిక్ పర్యటన సందర్భంగా కుదిరిన ఒప్పందాల్లో రక్షణ వైపు బలమైన ముద్ర కనిపించడం గమనించదగిన పరిణామం. భారత్, జర్మనీలు సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహించాలని, ఒకరి యుద్ధ నౌకలు మరొకరి రేవులకు వచ్చిపోయే సౌలభ్యం కల్పించాలని, విడిభాగాల, భద్రతా విధానాలపై పరస్పరం చర్చించుకుంటూ సాగాలని అంగీకారం కుదిరింది. జర్మన్ టెక్నాలజీ యావత్ ప్రపంచంలోనే ప్రసిద్ధి పొందింది. రక్షణ సాంకేతిక పరిజ్ఞానంలో జర్మనీ మేటి. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా దుందుడుకుతనం, ట్రంప్ చపలచిత్త ధోరణిని చూసి తన జాగ్రత్తలో తానుండాలని జర్మనీ తన ఆయుధ, సైనిక శక్తులను పెంచుకోవాలని నిశ్చయించింది. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ అవకాశాన్ని భారత్ అందిపుచ్చుకోవాలి. జర్మనీతో భారత్ సైనిక, సాంకేతిక సహకారం పెంపొందించుకుంటే అమెరికా, రష్యాలతో సహా ఎవరికీ అభ్యంతరం ఉండనక్కర్లేదు. నిరుడు భారత్‌పై జరిగిన ఉగ్రదాడిని జర్మనీ నిర్ద్వంద్వంగా ఖండించింది. ఉగ్రవాదంపై పోరుకు ఉమ్మడి కార్యబృందాన్ని నెలకొల్పాలని రెండు దేశాలు నిశ్చయించాయి. ఈయూతో భారత్ చేస్తున్న వ్యాపారంలో 25శాతం జర్మనీతోనే జరుగుతోంది. ఇండియాపై జర్మనీకి గణనీయమైన వాణిజ్య మిగులు ఉంది. జర్మనీకి ఎగుమతులు పెంచడం ద్వారా ఈ మిగులును తగ్గించుకోవాలని దిల్లీ కోరుతోంది. దీంతో పరస్పరం పెట్టుబడులు పెంచుకోవడానికి, వ్యాపార విస్తరణకు, రెండు దేశాల మధ్య సీఈవో వేదిక ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. అరుదైన లోహాలు, సెమీకండక్టర్లపై ఉమ్మడి పరిశోధనలకు, కొత్త రంగాల్లో పరిశోధన అభివృద్ధికి ఇరుదేశాలు అంగీకరించాయి.

సంయుక్తంగా అభివృద్ధి ప్రాజెక్టులు

జర్మనీ మొదటి నుంచీ శాస్త్రసాంకేతిక, ఇంజినీరింగ్ నైపుణ్యానికి పేరుపొందింది. ఇటీవలి దశాబ్దాల్లో చాలా పరిశ్రమలు చైనాకు, అమెరికాకూ తరలిపోయాయి. పూర్వవైభవాన్ని తిరిగి సాధించాలని ఆ దేశం లక్షిస్తోంది. ఈ దిశగా భారత్ సహకారాన్ని కోరుకుంటోంది. నేడు చైనా మినహా ప్రపంచమంతటికీ సరకుల సరఫరా చేయగల స్థాయిలో పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఒకప్పుడు భారత్, చైనాలు రెండూ అన్ని రంగాల్లో పాశ్చాత్య దేశాలకు దీటుగా ఎదగాలని తపించేవి. ఇప్పుడు పాశ్చాత్య దేశాలే చైనాకు దీటుగా ఎదగాలని తపిస్తున్నాయి. ఆ లక్ష్య సాధనకు భారతదేశ నిపుణ మానవ వనరులు ఉపకరిస్తాయి. జర్మనీ తదితర ఈయూ దేశాలు ఈ వాస్తవాన్ని గుర్తించాయి. అందుకే జర్మనీ ఇటీవలి కాలంలో ఇండియాతో శాస్త్రసాంకేతిక సహకారాన్ని పెంచుకుంది. హరిత ఇంధనాలలో రెండు దేశాలూ గణనీయ పురోగతి సాధిస్తున్నాయి. ఈ-బస్ సేవ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో స్థిరంగా ముందడుగు వేస్తున్నాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల అభివృద్ధికి రెండు దేశాలూ అండగా నిలుస్తున్నాయి. ఇలాంటి అభివృద్ధి ప్రాజెక్టులను భారత్, ఈయూలు సంయుక్తంగా చేపట్టాలని ఆలోచన బలం పుంజుకుంటోంది. ఇండియా నుంచి ఐరోపా వరకు నిర్మించాలని తలపెట్టిన ఐమెక్ ప్రాజెక్టును ముందుకుతీసుకెళ్లాలని భారత్, జర్మనీలు లక్షిస్తున్నాయి. భారత పౌరులు వీసా లేకుండానే జర్మనీకి పయనించే వెసులుబాటు ఇప్పుడు ఏర్పడింది. జర్మనీలో భారతీయ విద్యార్థులకు విద్యావకాశాలు విస్తరిస్తున్నాయి. మన నిపుణులకు ఉపాధి అవకాశాలూ పెరుగుతున్నాయి. భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలనే ప్రతిపాదనను జర్మనీ బలపరుస్తోంది. ఈ విధంగా భారత్ ఏకకాలంలో అమెరికా, రష్యా, చైనా, ఐరోపా దేశాలతో తనదైన రీతిలో ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక సహకారాన్ని వృద్ధి చేసుకుంటోంది.



ఆచార్య అనురాధా చెనాయ్
శాంతిభద్రతలపై ఐరాస దక్షిణాసియా నిపుణుల సంఘం మాజీ సభ్యురాలు

సిగ్నల్స్... గుర్తిస్తున్నారా?

'అబ్బా... ఈ సిగ్నల్ ఎప్పుడూ ఇంతే. సరిగ్గా గీత దగ్గరికి వచ్చేసరికి ఎర్రలైటు వెలుగుతుంది' ఏ వాహనం ఎక్కినా సిగ్నల్ పడగానే ఈ మాట అనుకోనివారుండరు. ఆ ఒక్క క్షణంలో దాటేసి వెళ్లి చేసే ఘనకార్యాలేంటో మరి! నిజానికి అప్పటివరకూ ఏ కబుర్లలోనో, ఫోనులోనో, ఆలోచనల్లోనో మునిగి ఉంటారు. హఠాత్తుగా వాహనం ఆగేసరికి ఈ లోకంలోకి వచ్చి టైమ్ వేస్ట్ అయిపోతోందని సిగ్నల్‌ను తెగ తిట్టుకుంటారు. ట్రాఫిక్ లైట్ యాంత్రికంగా దానికి కేటాయించిన సమయం ప్రకారం రంగులు మారుతుంది. అంతేకానీ అది మనల్ని చూసి కక్షతో రపీమని మారదు. ఎర్ర లైటును చూసి తిట్టుకున్నట్లు ఆకుపచ్చ లైట్ ఉన్నప్పుడు ఎప్పుడైనా మెచ్చుకున్నామా? లేదే.. రయ్యిన దూసుకుపోతాం. అదే మనిషి స్వభావం.


సిగ్నల్ దగ్గర ఒక్క నిమిషం ఆగడం వల్ల నిజానికి మనకే లాభం. ఊహాలోకాల్లో ఎక్కడో ఉన్నవాళ్లం ఈ లోకంలోకి వచ్చిపడతాం. స్వస్వరూప జ్ఞానం అంటారు కదా... అలాంటిదేదో కలుగుతుంది. టైమ్ ఎంతయింది, ఎక్కడికి వెళ్తున్నాం, ఎప్పటికి చేరుకుంటాం... అన్నీ ఆలోచించి ఒక అంచనాకు వస్తాం. పరాకుగా బండి నడిపేవారు వర్తమానంలోకి వస్తారు. స్పృహలో ఉండి నడుపుతారు. సిగ్నల్ అనేది ట్రాఫిక్‌లోనే కాదు జీవితానికీ మంచే చేస్తుంది. రాబోయే ప్రమాదాల గురించి మనల్ని హెచ్చరిస్తూ మనోవీధుల్లో ఎక్కడో ఎర్రలైటు వెలుగుతూనే ఉంటుంది. దాన్ని గుర్తించగలిగిన వారు జాగ్రత్తపడతారు. గమనించలేక



పోయినా, నిర్లక్ష్యం చేసినా... ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినప్పుడు జరిమానా కట్టినట్లు; జీవితంలోనూ ఊహించని నష్టాలను భరించాల్సివస్తుంది. కాలేజీలో చేరిన కొడుకు రాత్రుళ్లు ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడంటే ఎక్కడికి వెళ్తున్నాడోనని తల్లి మనసు శంకిస్తుంది. పెద్దవాడయ్యాడు, స్నేహితులుంటారులే... అంటూ తీసిపడేస్తాడు తండ్రి. తల్లి మాత్రం తన అంతరాత్మ సిగ్నల్స్‌ని గుర్తుపెట్టుకుని కొడుకుమీద ఒక కన్నేసి ఉంచింది. చెడుసావాసాలు అతణ్ని తప్పుదారి పట్టిస్తున్నాయని కనిపెట్టి భర్తను హెచ్చరించింది. ఇద్దరూ కలిసి కొడుకును సరైన మార్గంలోకి తెచ్చుకున్నారు.

రాజకీయాల్లో ఈ సిగ్నల్ అన్న మాటను ఎక్కువగానే వాడతారు. ప్రజల్లోకి రాంగ్ సిగ్నల్స్ వెళ్లకూడదంటూ నాయకులు తరచూ తమ స్టేట్‌మెంట్లను ఉపసంహరించుకోవడం చూస్తూనే ఉంటాం. అనుమతి లభించిందనడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చిందంటారు. అయితే వీటన్నిటినీ మించి మన మనసుకు సంబంధించి కూడా ఒక సిగ్నల్ ఉంటుంది. దాన్ని మనం ఇంట్యూషన్ అనీ సిక్త్‌సెన్స్ అనీ అంటుంటాం. ఎక్కడో ఏదో తేడా అనిపిస్తూ ఉంటుంది. కానీ పంచేంద్రియాలకు దొరకదు... అంటే దానికి సంబంధించిన ఆధారాలేవీ కనపడవూ వినపడవూ. మనసు మాత్రం కీడు శంకిస్తూ ఉంటుంది. ఉండుండీ హఠాత్తుగా ఒక నిర్ణయాన్ని మార్చుకుంటాం. అలా మార్చుకోవడం వల్ల పెద్ద ప్రమాదం నుంచి బయటపడినట్లు తర్వాత తెలిసి సిక్త్‌సెన్స్ కరెక్టే చెప్పింది అని నిట్టూరుస్తాం. అందుకే రోడ్డుమీద అయినా, జీవితంలో అయినా సిగ్నల్స్‌ని తిట్టుకోకూడదు. అంతర్దృష్టితో ఆలోచించి ఆగి, చూసి, వెళ్లండి... అంతా మంచే జరుగుతుంది.

- విస్సాప్రగడ భవానీశంకర్



ప్రపంచం హింస, వినాశనాల దిశగా ప్రయాణిస్తోంది. ప్రజల మధ్య వైషమ్యాల్నీ భయాందోళనల్నీ పెంచుతోంది. ఇది సరైన దిశ కాదు. అహింసా మార్గం ఒక్కటే ప్రపంచానికి శాంతినిస్తుంది.

- ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్

ఒక్కటే దారి

ఈ భూమి మీద పడ్డ ప్రతి ప్రాణికీ కలి బంధనాలు తప్పవు. ఆకలితో మొదలై, ఆశల దారుల్లో ప్రయాణించక తప్పదు. ప్రయాణంలో ఒక మజిలీ నుంచి మరో మజిలీకి చేరుకున్నట్లే ఒక సమస్యనుంచి మరో సమస్య వైపుగా సాగించే పయనమే జీవితం. అన్నీ తెలిసినా క్షణకాలం ఆనందం, అంతలోనే వైరాగ్యం కలుగుతాయి. మనసుపై మోహం పొరలు కమ్మేస్తాయి. విషయాసక్తుల వైపే మనసు మొగ్గు చూపుతుంది. పరిస్థితుల పెనుగాలి రాపిడికి వజ్రంలా మారిన వ్యక్తికి కూడా కొన్నిసార్లు మనశ్శాంతి కరవవుతుంది. తనకు తాను ఎన్ని బోధనలు చేసుకున్నా అలజడి తగ్గదు.

అలాంటి బాధతోనే స్వామీజీని ఆశ్రయించాడు ఒక వ్యక్తి. 'స్వామీ, అన్నిటికన్నా వేగంగా ప్రయాణించగల మనసు ఘోషను నియంత్రించడమెలా?! మనసుకు ఎన్ని బుద్ధులు చెప్పుకొన్నా ఉపశమనం తాత్కాలికం అవుతోంది. శాశ్వత పరిష్కారం తెలియజేయండి' అని వేడుకున్నాడు. స్వామి ఎదురుగా ఉన్న కిటికీ వైపు చూపించాడు. కిటికీ తెరపై వాలిన కందిరీగ బయటికి వెళ్లేందుకు శతవిధాల ప్రయత్నిస్తోంది. కానీ బయట పడలేకపోతోంది. అలసిపోయి కింద పడుతూ, మళ్లీ లేచి అదే తెర మీద వాలి, దాని లోంచి బయటికి వెళ్లే మార్గం కోసం వెతుకుతోంది. 'నాయనా! మన తీరు కూడా అంతే. ఆ కందిరీగ ఆ పక్కనే ఉన్న పెద్ద రంధ్రం గుండా లోపలికి వచ్చింది. తిరిగి వెళ్లే దారి మరచి ఫలితాన్ని అనుభవిస్తోంది' అన్నాడు. 'అంటే, దానిలాగా నాకు కూడా విముక్తి లేదా స్వామీ?' అన్నాడా వ్యక్తి. 'ఉంది. తల్లి గర్భంలోని శిశువు- ఈ గర్భనరకాన్ని వీడి బయటపడిన మరుక్షణం నుంచీ నీ నామస్మరణ చేస్తూ, విషయవాంఛలకు దూరంగా ఉంటానని ఆ దైవానికి వాగ్దానం చేస్తుంది. ఇప్పుడు పడుతున్న కష్టాన్ని గుర్తుపెట్టుకుని మరుజన్మ లేకుండా జ్ఞానదృష్టితో ప్రవర్తించి మోక్షాన్ని పొందుతానని ప్రార్థిస్తుంది. భూమ్మీద పడ్డాక అన్నీ మర్చిపోయి, ఇదే శాశ్వతమనుకుంటుంది. ప్రాపంచిక సంబంధ విషయజ్ఞానం ఇహానికి పనికొస్తుంది. ఆధ్యాత్మిక చైతన్యం తిరిగి వెళ్లే దారి చూపిస్తుంది. ఆ మార్గం తెలుసుకోవడమే అసలైన సంతృప్తి. ఈ దిశగా ఆలోచించి ఆత్మజ్ఞానాన్ని పొంది ఇహపర సుఖాల అర్థాన్ని తెలుసుకో. అంతరాత్మను ప్రశాంతపరచుకో' అని బోధించాడు స్వామీజీ.



అంతర్యామి

విశాలవిశ్వంలో చిన్న రేణువుగా ఉన్న భూమిపై అత్యంత స్వల్పమైనది మనిషి ఉనికి. అలాంటప్పుడు విషయాలను పెద్దవిగా ఊహించుకుని బాధపడటం అర్థరహితం. భగవద్భావనకు మనసును చల్లబరిచే మహత్తర శక్తి ఉంది. వచ్చిన దారిలో తిరిగి వెళ్లాలనే స్పృహ కలిగి ఉండటమే ఆత్మజ్ఞానం. ఆ జ్ఞానమార్గంలో పయనించి మనో నిశ్చలత్వంతో జీవించడం మనకు రుషులు, యోగులు చూపించిన సన్మార్గం. 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అనే భావనతో జీవిస్తే మనశ్శాంతి దానంతటదే కలుగుతుంది. ప్రశాంత తీరమైన దైవాన్ని చేరుకునే దారి తప్పక కనబడుతుంది. అప్పటివరకూ నలుగురికీ ఉపయోగపడుతూ జీవించాలి. అదే సుఖం, శుభం.

- గొర్తి వాణీ శ్రీనివాస్



వేల కోట్లు వృథాగా...

అరటి, ఉల్లి ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్ల విషయంలో మూడో స్థానాన్ని ఆక్రమిస్తోంది. అయితే, అత్యాధునిక పద్ధతుల్లో నిల్వకూ ఆహార శుద్ధికి తగిన అవకాశాలు లేకపోవడం, ప్యాకేజింగ్ సమస్యలు, సేకరణ, రవాణాలో లోటుపాట్లు వంటి వాటి వల్ల పెద్దమొత్తంలో అవి చెత్తబుట్టలపాలు అవుతున్నాయి. 2020-21లో ఇండియాలో అరటి, ఉల్లి, సిట్రస్ పండ్ల ఉత్పత్తి, నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ నివేదిక-2022 ప్రకారం వృథా, మొత్తం నష్టం...

(ఉత్పత్తి, వృథా... లక్షల టన్నుల్లో; నష్టం... కోట్ల రూపాయల్లో)

సరకు	ఉత్పత్తి	వృథా	నష్టం
అరటి	330	25	5,777
ఉల్లి	266	19.3	5,156
సిట్రస్ పళ్లు	142	11	4,347

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

సమస్యల ఒడిలో తొలి చదువులు!

మన దేశం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తోంది. విద్యారంగంలోనూ గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. అయితే, ప్రాథమిక విద్య పరిస్థితి మాత్రం మారాల్సి ఉంది. చిన్నప్పటి తరగతి గదులే రేపటి దేశ భవితకు పునాదులన్న సంగతిని ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకోవాలి.

భారతదేశంలో విద్యకు సంబంధించిన చర్చలు ఎక్కువగా ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ర్యాంకులు, ఐఐటీలు, ఐఐఎంల చుట్టూనే తిరుగుతుంటాయి. కానీ, మనం తరచూ మరిచిపోయే మౌలిక సత్యం ఒకటుంది. అదేమిటంటే, దేశ భవిష్యత్తు విశ్వవిద్యాలయాల్లో కాదు, ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం పేర్కొన్నట్లుగా 'భారత యువతలో ప్రతి ఒక్కరికీ ప్రపంచస్థాయి విద్య లేదా ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందాలి. ఆ లక్ష్యానికి మొదటి అడుగు ప్రాథమిక విద్యే.' ఇదే వాస్తవాన్ని జాతీయ విద్యా విధానం-2020 స్పష్టంగా గుర్తించింది. అందుకే అది ప్రాథమిక విద్యకు అత్యున్నత ప్రాధాన్యం కల్పించింది.

నిజంగా నేర్చుకుంటున్నారా?

దేశవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒక విచిత్ర పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజనం ఉంది. పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. ఉపాధ్యాయులు ఉన్నారు. అయినప్పటికీ, అనేక నివేదికలు ఒక చేదు నిజాన్ని చూపిస్తున్నాయి. అయిదో తరగతి చదువుతున్న పిల్లల్లో చాలామందికి రెండో తరగతి స్థాయి పఠన, లెక్కల నైపుణ్యాలు కూడా ఉండటం లేదు. దీనికి కారణం విద్యా వ్యవస్థ వైఫల్యమా? లేదా అమలులో లోపమా? అయితే, సమస్య విధానంలో కాదు, అమలులో ఉందన్న సంగతిని గుర్తించాలి. ఏళ్ల తరబడి మన విద్యా వ్యవస్థ కంఠస్థ పద్ధతిని ప్రోత్సహించింది. పరీక్షలే లక్ష్యంగా మారాయి. ప్రతిభకు మార్కులే కొలమానమయ్యాయి. ఫలితంగా చదువు ఆనందాన్ని కోల్పోయింది. ఈ క్రమంలో జాతీయ విద్యావిధానం దీనికి పూర్తిగా భిన్నమైన దృక్పథాన్ని ప్రతిపాదిస్తోంది. చదువు అంటే అర్థం చేసుకోవడం, అన్వయించడం, ఆలోచించడం అని వివరిస్తోంది. అందుకే ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో బోధన, ఆటల ద్వారా అభ్యాసం, కార్యకలాపాల ఆధారిత పాఠ్యక్రమం అత్యవసరమని చెబుతోంది. అందుకని, 1-2 తరగతుల్లో పుస్తకాలు



కాకుండా కథలు, పాటలు, ఆటలే గురువులుగా మారాలి. 3-5 తరగతుల్లో మాత్రమే పుస్తకాలు ప్రవేశపెట్టి, ఒత్తిడి లేకుండా నైపుణ్యాలను పెంపొందించాలి. దీన్ని చదువుల్ని తగ్గించడంగా కాకుండా, విద్యకు పునాది వేయడంగా గుర్తించాలి. పిల్లల అవసరాలకు అనుగుణంగా పాఠశాలలు మారాలి.

ఇప్పటి పాఠశాలల సమయ పట్టికలు పిల్లల శారీరక, మానసిక అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా అన్నదానికి నిజాయతీగా సమాధానం చెప్పుకోవాల్సి ఉంది. చిన్నపిల్లలను అయిదు గంటలకు పైగా నిరంతరంగా తరగతి గదుల్లో కూర్చోబెట్టడం సహజమైన ప్రక్రియ కాదు. ఈ విషయంలో జాతీయ విద్యావిధానం ఏం సూచిస్తోందంటే- చిన్న బోధన సెషన్లు, మధ్యలో విరామాలు, ఆటలు, విశ్రాంతి ఉండాలి. అలాగని, ఇదేమీ క్రమశిక్షణను దెబ్బతీయదు. పైగా ఏకాగ్రతను పెంచుతుంది. ఆటలు, కళలు, క్రీడలు... వాస్తవానికి ఇవే నిజమైన పాఠ్యపుస్తకాలు. 'ఆటే అత్యున్నత అభ్యాస రూపం' అన్న ఐన్‌స్టీన్ మాటలు ప్రస్తుత కాలానికి మరింత అనుగుణమైనవని చెప్పవచ్చు. కళలు, సంగీతం, నాటకం, ఆటలు, ప్రకృతి పరిశీలన, యోగా వంటివి పాఠ్యేతర కార్యక్రమాలనే అపోహ కూడదు. అవే అసలైన వ్యక్తిత్వ నిర్మాణ పాఠాలు. అవే పిల్లల్లో సృజనాత్మకత, సహకారం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యతను పెంపొందించే మార్గాలు.

ఉపాధ్యాయుడే కేంద్ర బిందువు

ఎంత మంచి విధానం ఉన్నా, దాన్ని తరగతి గదిలో అమలు చేసే వ్యక్తి ఉపాధ్యాయుడే. అందుకని, జాతీయ విద్యావిధానం ఉపాధ్యాయుణ్ని కేవలం బోధకుడిగా కాకుండా మార్గదర్శిగా పరిగణిస్తుంది. ఈ క్రమంలోనే టీచర్లపై పరిపాలనా భారం తగ్గింపు, నిరంతర వృత్తిపరమైన శిక్షణ, పాఠశాల సముదాయ సమావేశాల ద్వారా సహకార అభ్యాసం వంటి ప్రక్రియలు అత్యవసరమని స్పష్టం చేసింది. ఉపాధ్యాయుణ్ని శక్తిమంతుడిగా తీర్చిదిద్దకుండా విద్యా వ్యవస్థను ప్రభావశీలంగా మార్చలేం. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, పరీక్షలకన్నా, పరిశీలనే ముఖ్యమన్న సంగతి మరచిపోకూడదు. ప్రాథమిక స్థాయిలో పరీక్షలు పిల్లల్లో భయాన్ని పెంచుతాయి. అందుకని, నిరంతర, సమగ్ర మూల్యాంకనమే కీలకమని జాతీయ విద్యా విధానం స్పష్టం చేస్తోంది. పిల్లలు ఏమేం గుర్తుపెట్టుకున్నారు అన్నదానికంటే, బోధించిన దానిలో ఏమేం అర్థం చేసుకున్నారు, దానిని ఎలా ఉపయోగిస్తున్నారు అన్నదే ముఖ్యం. అందుకని, జాతీయ విద్యా విధానం-2020 అనేదానిని ఒక శాసనప్రతిగా కాకుండా ఓ దిశా సూచీగా పరిగణించాలి. దాని దిశానిర్దేశాలను తరగతి గదిలో అమలు చేయగలిగితే మన ప్రాథమిక విద్య దశ మారుతుంది. దేశ భవిష్యత్తు పటిష్ఠమవుతుంది. భారతదేశం నిజంగా అభివృద్ధి చెందాలంటే, ముందుగా ప్రాథమిక పాఠశాలలను ఆనందభరిత అభ్యాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. ఎందుకంటే- ప్రాథమిక విద్య మారితేనే భారత భవిష్యత్తు మారుతుంది కాబట్టి!

- దేవినేని మధుసూదన రావు

వలస ఎందుకంటే...

హాయ్ ఫ్రెండ్స్! సాధారణంగా పనుల కోసం మనుషులు వేరే ప్రాంతాలకు వలస వెళ్తూ ఉంటారు. ఆ విషయం మనకు తెలుసు! కానీ కొన్ని రకాల పక్షులు కూడా ఆహారం, ఆవాసం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాయి. అలా మన దేశానికీ వస్తాయి. ఆ విశేషాలేంటంటే..

సైబీరియాకు చెందిన కొన్ని పక్షులు శీతాకాలంలో వలస వెళ్తుంటాయి. వాటిలో ఫ్లెమింగోలు, క్రేన్స్ లాంటివి ఉంటాయి. సైబీరియాలో ఎక్కువగా చలి ఉండటమే వాటి వలసలకు ప్రధాన కారణం. అక్కడ ఒక్కోసారి మైనస్ డిగ్రీ సెంటీగ్రేడ్‌లలో ఉష్ణోగ్రత నమోదవుతుంది. క్రేన్స్, ఫ్లెమింగోలు ఎక్కువగా నీటి వనరుల దగ్గరే జీవిస్తాయి. కానీ శీతాకాలంలో అక్కడ చలి తీవ్రతకు నదులు, సరస్సులు గడ్డకట్టుకుపోతాయి. దాంతో వాటికి ఆహారం దొరకడం కష్టం అవుతుంది. చేపలు, కీటకాలు ఏమీ ఉండవు. అందుకే ఇండియాతో పాటు చైనా, నేపాల్, శ్రీలంక వంటి దేశాలకు వలస వెళ్తుంటాయి. ఈ ప్రాంతాల్లోనూ చలి ఉన్నా సైబీరియాతో పోల్చుకుంటే తక్కువే!

సాధారణంగా ఒక దేశం నుంచి ఇంకో దేశానికి



వెళ్లాలంటే కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణించాలి కదా! పక్షులు రోజుల తరబడి గుంపులు గుంపులుగా ఎగురుతూ, మధ్యమధ్యలో కొన్ని చోట్ల ఆగుతూ, విశ్రాంతి తీసుకుంటూ చివరికి గమ్యాన్ని చేరుకుంటాయి. అక్కడే వాటికి కావాల్సిన ఆహారాన్ని వెతుక్కుంటాయి. మరో విషయం ఏంటంటే.. శీతాకాలంలో ఉత్తరం నుంచి దక్షిణం వైపు వీచే గాలి కూడా వాటి ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. సూర్యుడు, నక్షత్రాల దిశలను బట్టి ఎటు వెళ్లాలో నిర్ణయించుకుంటాయి. అలాగే నదులు, పర్వతాలు, సముద్రతీరాలను ల్యాండ్‌మార్క్‌లుగా పెట్టుకుని ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. పక్షులు చిన్నతనంలో పెద్ద పక్షులతో కలిసి వస్తాయి. అలా రెండుమూడు సార్లు వచ్చేసరికి వాటికి ఆ దారి గుర్తుండిపోతుంది. మళ్లీ వాటి తరవాత వచ్చే పక్షులూ దాన్నే అనుసరిస్తాయి. శీతాకాలం పూర్తవ్వగానే మళ్లీ తిరిగి వాటి దేశానికి వెళ్లిపోతాయి.

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'మంట'లో ఉంటాను కానీ 'పంట'లో లేను. 'చిరు'లో ఉంటాను కానీ 'వేరు'లో లేను. 'తను'లో ఉంటాను కానీ 'చేను'లో లేను. 'వనం'లో ఉంటాను కానీ 'వల'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'కవి'లో ఉంటాను కానీ 'కళ'లో లేను. 'వనజ'లో ఉంటాను కానీ 'వనరు'లో లేను. 'గాయం'లో ఉంటాను కానీ 'గానం'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.మంచితనం 2.విజయం

కొంటే హాయి.. తింటే హాని


కలెక్టరేట్‌లో వివిధ పదార్థాల ప్రదర్శన

చిన్నారులు తినే చిరుతిండి పదార్థాల్లో హానికరమైన నిషేధించిన రంగులు కలిపిన ఆహారాలను ఏవిధంగా గుర్తించాలి, అలాంటి వాటిని గుర్తిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలో సామాన్యులకు సైతం అవగాహన కల్పించి చైతన్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహార పరిరక్షణలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఓ స్టాల్ ఏర్పాటు చేసింది. సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చే వారంతా ఈ స్టాల్‌లో వివరాలు ఆసక్తిగా తెలుసుకుని వెళుతున్నారు.

- ఈనాడు అమరావతి

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.60 కోట్లు


కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది


ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో సోమవారం లెక్కించారు. 16 రోజుల కానుకలను లెక్కించగా రూ.2,60,86,479 ఆదాయం వచ్చింది. కానుకలతోపాటు 135 గ్రాముల బంగారం, 2.858 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. 804 యూఎస్ఏ డాలర్లు, 235 యూరోలు, 185 యూఏఈ దిర్హామ్స్, 100 కెనడా డాలర్లు, 25 ఇంగ్లాండ్ పౌండ్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు హుండీల్లో సమర్పించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈవో శీనానాయక్ కానుకల లెక్కింపును పర్యవేక్షించారు.

నిర్లక్ష్యం మాటేసి.. నిర్దయగా కాటేసి

● 216 జాతీయ రహదారికి నిర్వహణలేమే శాపం
● అడుగడుగునా ప్రమాదాలతో నిత్య నరకం

ఈనాడు, అమరావతి - ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

“కత్తిపూడి-ఒంగోలు(216) జాతీయ రహదారి తరచూ నెత్తురోడుతోంది. ప్రయాణాలు మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా.. కనీస మౌలిక వసతులు సమకూర్చడంలో అధికారుల వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన తరుణమిది.”


పులిగడ్డ దగ్గర నలుగురిని బలిగొన్న ప్రమాదం

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2024–25	94	13	81
2025–26 (ఇప్పటికి)	100	22	78

★ 2025 ఆగస్టులో సీతనపల్లికి చెందిన బసవేశ్వరరావు... కుమారుడిని తేవడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చినగట్టు సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న గొయ్యిలోపడి మృతిచెందారు. అతడి భార్య, ఇద్దరు కుమారులు ఇంటి పెద్దదిక్కును కోల్పోయారు.

★ కృత్తివెన్ను ప్రధాన కూడలి వద్ద కారు.. ఆగి ఉన్న ఓ లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

★ నిరుడు తెనాలివాసి సందీప్.. మోపిదేవిలో తన కుమారుడి నామకరణానికి కారులో వస్తూ.. పులిగడ్డ వద్ద ఎదురుగా వచ్చిన లారీని బలంగా ఢీ కొట్టారు. సందీప్ తల్లిదండ్రులు అరుణ, రవీంద్ర మోహన్‌బాబు.. పిల్లలు సాత్విక(5), రెండు నెలల పసికందు అక్కడే చనిపోయారు. సందీప్, అతడి భార్య పల్లవికి తీవ్రగాయాలయ్యాయి.

ప్రధాన కారణాలివే..

సెంట్రల్ డివైడర్ లేక వాహనాలు నియంత్రణ లేకుండా వెళుతున్నాయి. ❖ చాలాచోట్ల వీధి దీపాలు ఉన్నా వెలగవు. కొన్నిచోట్ల అసలే లేవు. ❖ దారంతా కంచె లేక నిత్యం పశువులు రోడ్డుపైనే తిరుగుతూ వాహనాలకు అడ్డుపడుతున్నాయి. ❖ చిన్నపాటి మరమ్మతులతా లేక మలుపులో ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. ❖ దుకాణాలు దారి అంచు వరకూ ఉండటం, లారీలు దారి మీదే ఆపడం, హెచ్చరిక సూచిక బోర్డుల లేమి.

రెండేళ్లు.. 35 మరణాలు..

గత రెండేళ్లలో 194 ప్రమాదాలు జరగగా 35 మంది ప్రాణాలు వదిలారు. 159 మంది గాయాల పాలయ్యారు.


చల్లపల్లి మండలం కప్తానుపాలెం దగ్గర ప్రమాదకర బ్లాక్ స్పాట్. ఇక్కడ గత మూడేళ్లలో 6 ప్రమాదాలు జరిగితే ఒకరు చనిపోయారు.

కృత్తివెన్ను.. అంటే దడే..

నిరుడు ఒక్క కృత్తివెన్ను మండలంలోనే 11 మంది మృత్యువాతపడ్డారు. ఏడాది కిందట సీతనపల్లి సెంటర్లో రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొట్టడంతో ఐదుగురు బలయ్యారు.

ఇదండీ లెక్క ● రహదారి: 216 ● పరిధి: 58 కిమీ ● నిత్యం రద్దీ: 10 వేలపైగా వాహనాలు

ఎన్‌హెచ్ అధికారులు ఏమంటున్నారు..?

త్వరలో రహదారిని నాలుగు వరుసలకు విస్తరిస్తాం. అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు, డివైడర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

బ్లాక్ స్పాట్లు

బందరు పరిధి	పెడన	బంటుమిల్లి	ఘంటసాల	చల్లపల్లి
హుస్సేన్ పాలెం, హర్షా కళాశాల	నందమూరు, తోటమూల	పెందుర్రు, పెందుర్రు రైస్ మిల్	లంకపల్లి, జీలగలదిండి	కప్తాన్ పాలెం

జేఈఈ మెయిన్‌కు వేళాయె

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే: ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐటీలు, ఎన్ఐటీలలో ప్రవేశం నిమిత్తం నిర్వహించే జేఈఈ(జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) మెయిన్‌కు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ ప్రవేశ పరీక్ష తొలి సెషన్ ఈ నెల 21 నుంచి 29 వరకు జరుగనుంది. ప్రస్తుతం 21, 22, 23, 24 తేదీల్లో పరీక్షలు జరిగే అభ్యర్థులకు ప్రస్తుతం అడ్మిట్ కార్డులు విడుదల చేశారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా సమాచారం

పరీక్ష రాసే విద్యార్థులు: 37,200
పరీక్ష కేంద్రాలు: 9
పరీక్షల తేదీలు: 21, 22, 23, 24, 28 (పేపర్-1 రోజుకు రెండు షిఫ్టులు) ★ 29న బీఆర్క్, ప్లానింగ్ (పేపర్-2 పరీక్ష ఒకే సెషన్ ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు)
పరీక్ష విధానం: ఆన్‌లైన్
సమయం: ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు.

పరీక్ష కేంద్రాలకు ఇవి తప్పనిసరి.. ★ ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి తీసుకున్న అడ్మిట్ కార్డు ★ ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటో ★ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన గుర్తింపు కార్డు ఒరిజినల్ కాపీ ★ ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు ★ ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

2026లో చేసిన మార్పులివే


– జీవీ రావు, గణితశాస్త్ర నిపుణుడు, జీఎం, శారద విద్యాసంస్థలు

పరీక్షా కేంద్రం వద్ద ఫేషియల్ రికగ్నిషన్, ఫింగర్ ప్రింట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. సెక్షన్ బీలో గతంలో ఉన్న ఛాయిస్ విధానాన్ని తొలగించారు. అంటే మొత్తం 5 న్యూమరికల్ ప్రశ్నలకు తప్పనిసరిగా సమాధానాలు రాయాలి. పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు.

పరీక్ష కేంద్రాలను ముందురోజే చూసుకోవాలి


– మద్దినేని మురళీకృష్ణ, ఈజీఎం, శ్రీచైతన్య విద్యాసంస్థలు

పరీక్ష కేంద్రాలు మొత్తం 9 ఉన్నాయి. కొన్ని నగర పరిధిలో ఉన్నాయి. కొన్ని కొంత దూరంలో ఉన్నాయి. పరీక్ష రోజుకు ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. అయాన్ సెంటర్లు నాలుగు ఉన్నాయి. తికమకపడకుండా ముందుగా ఏ సెంటరో స్పష్టంగా తెలుసుకోవాలి. లేకుంటే పరీక్ష రోజు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

దొంగల ముఠా.. ఎక్కడ?

◆ విశాఖ నుంచి బొకారోలో పరారైనట్లు నిర్ధారణ
◆ నాలుగు బృందాలతో నిర్విరామంగా అన్వేషణ


సీసీ ఫుటేజీలో గుర్తించిన నిందితులు

ఈనాడు - అమరావతి: విజయవాడ నగరంలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో చోరీకి పాల్పడిన దొంగల ముఠా కోసం పోలీసులు ముమ్మరంగా అన్వేషిస్తున్నారు. చోరీకి తెగబడిన ఆరుగురు సభ్యుల బిహార్ ముఠాగా పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చి దర్యాప్తు చేస్తున్నారు. వీరు వెళ్లేందుకు అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు వాయు, రైలు మార్గాల్లో ప్రత్యేక బృందాలను పంపించారు.

అణువణువూ నిశిత పరిశీలన..: బెజవాడలో మొబైల్స్‌ను చోరీ చేసి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖలో దిగారు. అక్కడి నుంచి మరో రైలు ఎక్కినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు కోసం నాలుగు ప్రత్యేక బృందాలను సీపీ రాజశేఖర్‌బాబు ఏర్పాటు చేశారు. ఓ బృందం విశాఖపట్నం వెళ్లింది. అక్కడి రైల్వేస్టేషన్లో సీసీ కెమెరా దృశ్యాలు పరిశీలించగా.. దొంగలు రత్నాచల్ దిగిన తర్వాత, గంటపాటు మరో రైలు కోసం ఎదురుచూశారు. ఇంతలో బొకారో ఎక్స్‌ప్రెస్ రావడంతో అందులో ఎక్కినట్లు నిఘా కెమెరాల్లో నిక్షిప్తమైంది. దీంతో ఒక బృందాన్ని ఆగమేఘాలపై విమానం ద్వారా పట్నా పంపించారు. మరో మూడు బృందాలను దొంగల ముఠా దిగేందుకు ఆస్కారం ఉన్న కాన్పూర్, గోరఖ్‌పూర్, తదితర ప్రాంతాలకు రైలులో పంపారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందాలు.. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను ఆమూలాగ్రం పరిశీలిస్తున్నారు. వీటితోపాటు అక్కడి క్రైమ్ పోలీసులతోనూ సమన్వయంతో పనిచేస్తూ స్థానికంగా గాలిస్తున్నారు.

న్యాట్‌గ్రిడ్‌లో చిత్రాల వడపోత: చోరీకి పాల్పడిన ముఠాలోని ఆరుగురు సభ్యుల చిత్రాలను సీసీ కెమెరాల్లోని ఫుటేజీ ద్వారా పోలీసులు తీసుకున్నారు. వీరి ఫొటోలను న్యాట్‌గ్రిడ్‌లో అప్‌లోడ్ చేసి వడపోస్తున్నారు. గతంలో వీరిపై నమోదైన కేసులు ఉంటే.. వీరి వివరాలు వచ్చే అవకాశం ఉంది. ఈ కోణంలో నిర్విరామంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు.. దొంగల ముఠా చేసిన ఫోన్ కాల్ వివరాల కోసం వందలాది కాల్స్‌ను విశ్లేషిస్తున్నారు. ఇలా అన్ని మార్గాల్లో ముఠా ఆచూకీ రాబట్టేందుకు శ్రమిస్తున్నారు.

పారదర్శకంగా రబీ ఈ-పంట నమోదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రబీ (2025-26)లో ఈ-పంట నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ సంక్షిప్త సమాచార సేవ (ఎస్.ఎం.ఎస్.)ల ఆధారిత మూడు దశల రైతు సమాచార విధానాన్ని అమలు చేస్తున్నట్టు డీఏవో విజయకుమారి సోమవారం తెలిపారు. పంట నమోదు సంఖ్య, పంట రకం, విస్తీర్ణం, ధ్రువీకరణ లింక్ తదితరాలను సంక్షిప్త సమాచారం (ఎస్.ఎం.ఎస్.) ద్వారా తెలియజేస్తారు. దానిలో ఉన్న లింక్ ద్వారా లేదా స్థానిక రైతు సేవా కేంద్రాల్లో వివరాలు చూసుకుని పంట నమోదు సరిగా ఉందో లేదో నిర్ధారించుకోవచ్చు. ఏవైనా తప్పులు ఉంటే ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు నమోదు చేయవచ్చు. నమోదు సరిగా ఉంటే అంగీకరించవచ్చని వివరించారు.



ఆర్టీసీకి సంక్రాంతి బొనాంజా!

◆ పండగ ప్రయాణాలతో భారీగా పెరిగిన ఆదాయం
◆ ఉమ్మడి జిల్లాలో 12 రోజుల్లో రూ.18.19 కోట్ల రాబడి

ఈనాడు - అమరావతి: సంక్రాంతి ప్రయాణాలు ఆర్టీసీకి భారీ ఆదాయం తెచ్చిపెట్టాయి. ఉమ్మడి జిల్లాలో జనవరి 8 నుంచి 19 వరకు నడిపిన బస్సు సర్వీసులకు రూ.18.19 కోట్ల మేర ఆదాయం వచ్చింది. స్త్రీశక్తి నేపథ్యంలో గతేడాదితో పోలిస్తే రాబడి భారీగా పెరిగింది. సెలవులకు ముందు, తర్వాత వారాంతాలు రావడం కూడా ఆర్టీసీకి కలిసి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.



ఆదాయం (రూ.కోట్లలో)			
జిల్లా	నిరుడు	ఈ ఏడాది	పెరుగుదల
ఎన్టీఆర్	12.83	15.53	2.7
కృష్ణా	2.32	2.66	0.34

వారాంతాలు.. స్త్రీశక్తితో రాబడి

★ ఉమ్మడి జిల్లాలో పండగ ప్రయాణాలకు సగటున రోజుకు 735 ప్రత్యేక బస్సులు నడిపారు. ఇవికాక 1,012 వరకు సాధారణ సర్వీసులు తిప్పారు. బస్సులు సుమారు 40 లక్షల కిలోమీటర్లు ప్రయాణించాయి.

★ జనవరి 10 నుంచి 13 వరకు ఎక్కువ బస్సులు కేటాయించారు. ఈ రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రోజుకు వెయ్యి బస్సులు తిరిగాయి. రోజుకు రూ.1.5-2 కోట్ల ఆదాయం వచ్చింది. సెలవులకు అనుబంధంగా వారాంతాలు రావడంతో ఎక్కువ రోజులు ప్రత్యేక బస్సులు నడిపే అవకాశం వచ్చింది. దీంతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖ, రాయలసీమ తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపారు.

★ నిరుడు ఇదే స్థాయిలో బస్సులు నడపగా 12 రోజులకు రూ.15.15 కోట్లు ఆదాయం రాగా.. ఈసారి రూ.3.04 కోట్లు పెరిగి రూ.18.19 కోట్లకు చేరింది. ఎన్టీఆర్ జిల్లా నుంచి రూ.15.53 కోట్లు, కృష్ణా జిల్లా నుంచి రూ.2.66 కోట్లు రాబడి వచ్చింది.

★ ఆదాయం పెరగడానికి వారాంతాలు, ఆదివారం అమావాస్య కావడంతో కొందరు సోమవారమూ ప్రయాణాలు చేశారు.

★ స్త్రీ శక్తి పథకం నేపథ్యంలో మహిళా ప్రయాణికులు ఈసారి బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు చూపారు. పండగ ప్రయాణాల్లో స్త్రీశక్తి అనుమతి ఉన్న బస్సుల్లో 70 శాతంపైగా మహిళా ప్రయాణికులున్నారు.

రివార్డు పాయింట్ల పేరుతో వల

● గడువు ముగుస్తోందంటూ సైబర్ నేరగాళ్ల సందేశాలు
● ఏపీకే ఫైల్ పంపి నిలువు దోపిడీకి యత్నం

మధురానగర్, న్యూస్‌టుడే

‘మీ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.9999ల రివార్డు పాయింట్లు ఈ రోజుతో గడువు తీరుతోంది. బ్యాంక్ ఆఫ్ ఇండియా రివార్డ్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని క్లెయిమ్ చేసుకోండి. మీ ఖాతాలో నగదు జమ అవుతుంది...’ అంటూ సోమవారం కొందరికి ఇలాంటి సందేశాలు వచ్చాయి. దాని కిందనే ‘బీఓఐ మొబైల్.ఏపీకే’ ఫైల్‌ను కూడా పంపించారు. ఇది వైరస్ ఫైల్ అని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. బ్యాంక్ నుంచి వచ్చిన సందేశమే అనుకుని, దాన్ని క్లిక్ చేస్తే మీ ఖాతాలు ఖాళీ అవుతాయని సూచిస్తున్నారు. గతంలో ఎస్‌బీఐ పేరుతో ఏపీకే వైరస్ ఫైల్స్ పంపి సైబర్ నేరగాళ్ల మోసాలకు తెగబడగా.. తాజాగా బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో రావడం గమనార్హం.


‘బ్యాంక్ ఆఫ్ ఇండియా’ పేరుతో వచ్చిన సందేశం ఇదే..

హ్యాక్ అయితే...

ఎవరైనా ఈ ఏపీకే ఫైల్ క్లిక్ చేస్తే వెంటనే వారి ఫోన్ హ్యాక్ అవుతుంది. వారి చరవాణి నంబరు పేరు మారి ‘బీఓఐ’గా అవుతుంది. ఆ నంబరుకు ఉన్న కాంటాక్ట్స్ అన్నింటికీ ఆటోమేటిక్‌గా ఈ ఏపీకే ఫైల్, సందేశం వెళ్లిపోతుంది. హ్యాక్ అయిన చరవాణి నంబరు ఏదైనా వాట్సాప్ గ్రూపుల్లో ఉంటే.. వారందరికీ కూడా ఇవి వెళ్లిపోతాయి. సదరు వాట్సాప్ గ్రూప్ కూడా పేరు మారిపోతుంది.

ఏం చేయాలంటే....

బ్యాంక్, బీమా సంస్థలు ఏవైనా రివార్డు పాయింట్లను ఇలా వాట్సాప్‌లో పంపరు. ఏపీకే పేరుతో ఫైల్ వచ్చిందంటే.. అది సైబర్ నేరగాళ్ల పన్నాగమే అని గుర్తుంచుకోవాలని పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా పొరపాటున దాన్ని క్లిక్ చేస్తే.. సదరు చరవాణి నంబరుతో అనుసంధానమై ఉన్న బ్యాంక్ ఖాతాలను, సదరు బ్యాంక్ టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి మీ ఖాతాలను ఫ్రీజ్ చేయించుకోండి. ఫోన్‌ను ఫ్యాక్టరీ రీసెట్ చేయండి. 1930కు ఫోన్ చేయవచ్చు. లేదా సమీపంలోని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారి సలహాలు తీసుకోండి. ఒక వేళ మీ ఖాతాల నుంచి డబ్బులు పోతే 1930కి ఫిర్యాదు చేయండి. తర్వాత ఈ మెయిల్ పాస్‌వర్డ్‌లు, యూపీఐ పాస్‌వర్డ్‌లు మార్చుకుంటే మేలు.



కొండవాగు భూమిలో అక్రమ తవ్వకాలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : కొత్తూరు తాడేపల్లిలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పగలు, రాత్రి అని లేకుండా భారీ ఎత్తున తవ్వకాలు చేపడుతున్నారు. ప్రశ్నించిన రైతులపై బెదిరింపులకు దిగుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి...విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లిలో సర్వే నం.266/1ఏ సమీపంలో కొండ వాగు భూమి ఉంది. సర్వే నం.266/1లో మట్టి తవ్వకాలకు గతంలో తహసీల్దారు నిరభ్యంతర పత్రం ఇచ్చారు. అయితే.. దాన్ని చూపిస్తూ సమీపంలోని కొండ వాగు భూమిలో తవ్వకాలు చేస్తున్నారు. ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉండగా అనుమతులు లేకుండా ఏ విధమైన తవ్వకాలు చేయరాదు. అయినప్పటికీ లెక్క చేయకుండా తవ్వేస్తుండగా రైతులు గమనించి నిర్వాహకులను ప్రశ్నించారు. తమ ఇష్టం వచ్చినట్లుగా తవ్వుతామని, ప్రశ్నించడానికి మీరెవరంటూ? వారు ఎదురుతిరిగి మీ చేతనైంది చేసుకోండన్నారు. దీంతో రైతులు, గ్రామస్థులు రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వారు సోమవారం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అనుమతి పత్రాలు చూపాలని నిర్వాహకులను అడగ్గా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తవ్వకాలను నిలిపేశారు. ఆరు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేశారు.


కొత్తూరు తాడేపల్లిలో సీజ్ చేసిన వాహనాలు

ప్రజాసహకారంతో ప్రమాద మరణాల నియంత్రణ


ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియా, ఆర్డీవోలు మాధురి, బాలకృష్ణ, ఆర్టీవో వెంకటేశ్వరరావు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్య సాయం అందించడం ద్వారా మరణాలు తగ్గించవచ్చని, దీనికి ప్రజల సహకారం అవసరమని జేసీ ఎస్.ఇలక్కియా సూచించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళితే కేసుల్లో ఇరుక్కుంటామని చాలా మంది ఆందోళన చెందుతున్నారని, కేంద్రం రహవీర్ (గుడ్ సమరిటన్) చట్టాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. క్షతగాత్రులకు వైద్య సేవలు అందించడంలో మొదటి గంట (గోల్డెన్ అవర్) ఎంతో ముఖ్యమన్నారు. రోడ్డు ప్రమాద సమాచారాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు లేదా అత్యవసర సర్వీసులకు తెలియజేసిన వారు, క్షతగాత్రులను ఆస్పత్రుల్లో చేర్పించిన వారు తమ పేరు లేదా వ్యక్తిగత సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. దీని కోసం ఎవరూ ఒత్తిడి చేయరని చెప్పారు. రవాణా శాఖాధికారులు రూపొందించిన గుడ్ సమరిటన్ పోస్టర్‌ను నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కె.బాలకృష్ణ, కె.మాధురి, ఆర్టీవో కె.వెంకటేశ్వరరావు, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు ఎ.ఉదయ శివప్రసాద్, డి.వి.రమణ, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు



హెల్ప్ డెస్క్‌లో ప్రజలు అడిగిన సమాచారం తెలియజేస్తున్న ఉద్యోగి

ఈనాడు కథనానికి స్పందన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాలతో నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిర వరండాలో సహాయ కేంద్రాన్ని (హెల్ప్ డెస్క్) సోమవారం ఏర్పాటు చేశారు. వివిధ రకాల సేవల కోసం ఇక్కడికి వస్తున్న ప్రజలకు ఎవరిని సంప్రదించాలి.. ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈ నెల 15వ తేదీన ‘కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏదీ?’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సత్వరమే స్పందించారు. ప్రత్యేకంగా డెస్క్ ఏర్పాటు చేసి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయి ఉద్యోగిని అందుబాటులో ఉంచారు. రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్ వేర్వేరు వేదికలుగా జరగడంతో.. ఏ సమస్యకు ఎటు వెళ్లాలనే విషయాలను హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలు తెలుసుకున్నారు. కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లు ఎక్కడ ఉన్నాయి, అక్కడికి ఎలా వెళ్లాలనేది తెలుసుకోవడానికి ఇది మార్గదర్శిగా ఉపకరించింది. జి.కొండూరు మండలం కవులూరుకు చెందిన ఒక రైతు, విజయవాడ గ్రామీణ మండలం నున్న గ్రామానికి చెందిన ఒక మహిళ.. ఇలా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి, అర్జీలు ఎక్కడ ఇవ్వాలనే విషయాన్ని తెలుసుకున్నారు.

క్రీడలు జాతీయ సమైక్యతకు నిదర్శనం


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు రాము, వెంకట్రావు తదితరులు

గుడివాడ, న్యూస్‌టుడే : క్రీడలు జాతీయ సమైక్యతకు నిదర్శనమని, క్రీడలు ఆడితే క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గుడివాడ నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 69వ జాతీయ అండర్- 14 కబడ్డీ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలుత క్రీడల ర్యాలీను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హోమియో ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీలో పబ్జీ ఆడుకుంటుంటే.. గుడివాడలో కొడాలి నాని క్యాసినో నిర్వహించారన్నారు. కానీ నేడు గుడివాడలో దేశంలోని చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎస్జీఎఫ్ వారితో జాతీయ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇదీ.. గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం అన్నారు. పోటీల్లో కేవీఎస్, ఎన్‌వీఎస్, విద్యాభారతి, సీబీఎస్ఈ, సీఐఎస్‌సీఈ, 22 రాష్ట్రాల నుంచి మొత్తం 27 జట్లు, మొత్తం 400 మంది క్రీడాకారులు, 200 మంది జట్ల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. తొలిరోజు తెలంగాణ, ఎన్‌వీఎస్ జట్ల మధ్య, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్ మధ్య మ్యాచ్‌లు మొదలయ్యాయి. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, శాప్ ఛైర్మన్ ఎ. రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సంతృప్తే.. పనితీరుకు గీటురాయి


రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఇలక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన ప్రతి అర్జీలోని సమస్యలను పరిశీలించి నిబద్ధతతో, నాణ్యతతో పరిష్కరించాలని జేసీ ఎస్.ఇలక్కియా సూచించారు. అర్జీదారుల సంతృప్తే అధికారుల పని తీరుకు గీటురాయి అని ఆమె పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో ప్రజలు, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏపీస్ రెడ్డి వీసీ హాలులో నిర్వహించారు. మొత్తం 133 వినతులు అందినట్లు జేసీ తెలిపారు. వీటిలో రెవెన్యూ క్లినిక్‌కు 62, పీజీఆర్ఎస్‌కు 71 అర్జీలు అందాయి. ఇందులో పురపాలక శాఖకు 18, పోలీసు, పీఆర్ శాఖలకు 16 చొప్పున, మిగతావి వివిధ శాఖలకు వచ్చాయి. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, తిరువూరు, నందిగామ ఆర్డీవోలు కె.మాధురి, కె.బాలకృష్ణ, వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి


ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత లక్ష్యంలోపు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఈవో శీనా నాయక్ ఆదేశించారు. సోమవారం రూ. 65 కోట్లతో చేపట్టిన అన్నప్రసాద కేంద్రం, ప్రసాదాల పోటు, ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దసరా, భవానీ దీక్షల విరమణ సందర్భంగా తాత్కాలికంగా నిలిపి వేసిన పనులు వేగవంతం చేయాలని సూచించారు. 2028లో రానున్న కృష్ణా పుష్కరాలు దృష్టిలో పెట్టుకొని శాశ్వత ప్రాతిపదికన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, డీఈ రవీంద్ర, ఏఈ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పూజ మండపాలు తనిఖీ.. దుర్గగుడిలో పూజ మండపాలను ఈవో శీనానాయక్ తనిఖీ చేశారు. భక్తుల మనోభావాలను గౌరవించేలా ఆర్జిత సేవలు నిర్వహించాలని అర్చకులకు సూచించారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, నాణ్యమైన పూజ ద్రవ్యాల వినియోగం, భక్తుల సూచనలు, సలహాలను స్వీకరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. శ్రీచక్రన వావరణార్చన, కుంకుమ పూజలను ఈవో పరిశీలించారు.

సిక్సర్లు కొట్టిన ఉత్సాహం

'ఈనాడు' సెంట్రల్ ఆంధ్రా ప్రాంతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, వేదికపై 'ఈనాడు' గుంటూరు యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, ధనిక్ భారత్ ప్రతినిధి బండ్లమూడి శ్రీనివాసరావు, చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగశ్రీనివాసరావు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) సెంట్రల్ ఆంధ్రా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. సీనియర్స్ విభాగంలో గుంటూరు-పశ్చిమ గోదావరి, జూనియర్స్ విభాగంలో గుంటూరు-కృష్ణా జట్లు తలపడ్డాయి. తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రతినిధి బండ్లమూడి శ్రీనివాసరావు, 'ఈనాడు' గుంటూరు యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు క్రీడాకారుల్ని పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ఎన్నో ఏళ్లుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం పెంపొందడంతో పాటు క్రమశిక్షణ అలవడతాయన్నారు. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రతినిధి బండ్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం యువత చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతున్నారని, క్రీడల్లో రాణిస్తే వాటికి దూరంగా ఉంటారని తెలిపారు. క్రీడల్లో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు పోటీల నిర్వహణకు ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవడం అలవాటవుతుందన్నారు. 'ఈనాడు' గుంటూరు యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీసేందుకు 'ఈనాడు' నిర్వహిస్తున్న పోటీలకు ధనిక్ భారత్ ఎడ్యుకేషన్, చలపతి విద్యా సంస్థల యాజమాన్యాలు ఎంతగానో సహకరిస్తున్నాయని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.


సీనియర్స్‌లో విజేతగా నిలిచిన పశ్చిమ గోదావరి జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్


జయంత్ సాయి


సాయిరామ్


జూనియర్స్‌లో గెలుపొందిన కృష్ణా జిల్లా జట్టు

పశ్చిమ గోదావరి జట్టు జయకేతనం

మొదటి మ్యాచ్ సీనియర్ విభాగంలో పశ్చిమ గోదావరి-గుంటూరు జిల్లా జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన పశ్చిమ గోదావరి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 16 ఓవర్లలో 99 పరుగులకే ఆలౌటైంది. తర్వాత పశ్చిమ గోదావరి జట్టు 12.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. జయంత్ సాయి 22 బంతుల్లో 26 పరుగులు, 4 వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు. గుంటూరు బౌలర్లు శ్రీహరి మూడు, ఆదిత్య 2 వికెట్లు తీసినా పశ్చిమ గోదావరి జట్టు గెలుపును ఆపలేకపోయారు.

అదరగొట్టిన కృష్ణా జట్టు

రెండో మ్యాచ్ జూనియర్స్ విభాగంలో కృష్ణా-గుంటూరు జిల్లా జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన గుంటూరు జిల్లా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన కృష్ణా జిల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 190 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇచ్చింది. అనంతరం గుంటూరు జట్టు 16 ఓవర్లలో 90 పరుగులకే ఆలౌటైంది. భారీ తేడాతో కృష్ణా జట్టు ఘన విజయం సాధించింది. సాయిరామ్ 40 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లు బాది 56 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో 2 వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ ప్రతిభతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

నేడు జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్

వేదిక: చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియం, మోతడక

సీనియర్స్: మొదటి మ్యాచ్.. నెల్లూరు × పశ్చిమ గోదావరి
రెండో మ్యాచ్.. కృష్ణా × ప్రకాశం

జూనియర్స్: మొదటి మ్యాచ్.. ప్రకాశం × పశ్చిమ గోదావరి
రెండో మ్యాచ్.. నెల్లూరు × కృష్ణా

ధర వరలు



వంకాయలు-24/28, టమాటా-18, బెండ-24, పచ్చిమిర్చి-32, కాకర-40, బీర-28, క్యాబేజీ-22, క్యారెట్-35, దొండ-46, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుడు-32, దోస-30/40, సొర-12, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-66, ముల్లంగి-10/12, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-26, కీరదోస-30, బీన్స్-65, క్యాప్సికమ్-62, చింతకాయలు-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, మల్లంగి-8, పచ్చి మామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

'అభివృద్ధి చూసి ఓర్వలేకే విష ప్రచారం'

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైకాపా నాయకులు విష ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య మండిపడ్డారు. సోమవారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ... వైకాపా పునాదే శవ రాజకీయాలతో ప్రారంభమైందని అన్నారు. పాత పగలతో పల్నాడు జిల్లాలోని పిన్నెల్లి గ్రామంలో జరిగిన సంఘటనకు వైకాపా రాజకీయ రంగులు అద్ది సామాజిక మాధ్యమాల్లో కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు స్పందించి నిందితులను అరెస్టు చేశారని తెలిపారు. పిన్నెల్లి ఘటన గురించి మాట్లాడుతున్న వైకాపా నేతలు.. గత వైకాపా పాలనలో డాక్టర్ సుధాకర్ తదితరులపై జరిగిన దాడుల గురించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైకాపా పాలనలో దళితులపై జరిగిన హత్యలు, దాడులు, అత్యాచారాలను కప్పిపుచ్చి ఇప్పుడు దళితులకు అనుకూలంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం జరిగిన వ్యక్తిగత ఘటనలను కూటమి ప్రభుత్వంపై నెడుతున్నారని పేర్కొన్నారు. నాయకులు పేరం భుజంగరావు, అమరావతి ఉద్యమ నాయకుడు మామిడి సత్యం పాల్గొన్నారు.

మూడో రోజూ అదే రద్దీ

హనుమాన్‌జంక్షన్ నుంచి వాహనాల మళ్లింపు


రాకపోకలను నియంత్రిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సంక్రాంతి పండగ ముగిసినా జాతీయ రహదారులపై వాహనాల రద్దీ కొనసాగుతూనే ఉంది. మూడో రోజు సోమవారం కూడా హైదరాబాద్ మార్గంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ట్రాఫిక్ పోలీసులు.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వాహనాలను నియంత్రించారు. ట్రాఫిక్ నిమా... విజయవాడ నగరంలో రద్దీ ఎక్కువ కావడంతో విశాఖపట్నం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను దారి మళ్లించి హనుమాన్‌జంక్షన్, నూజివీడు, మైలవరం మీదుగా పంపించారు. ఆకలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి హాజరు మినహాయింపు కోరుతూ పిటిషన్ దాఖలు

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : మద్యం ముడుపుల కేసులో విచారణకు సిట్ ఎదుట హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడలోని అనిశా న్యాయస్థానంలో సోమవారం విచారణ జరిగింది. మిథున్‌రెడ్డి ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ ఎదుట హాజరు కావాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 23, 26 తేదీల్లో హాజరు కావాల్సి ఉండగా.. ఆ రోజుల్లో పార్లమెంటు సమావేశం, గణతంత్ర దినోత్సవం ఉన్నందున విచారణకు హాజరు కాకుండా మినహాయింపు ఇవ్వాలని ఎంపీ కోరారు. దీనిపై విచారణ చేపట్టిన అనిశా న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

రోణక్‌కుమార్, అనిల్ చోక్రా కస్టడీపై..

మద్యం ముడుపుల కేసులో నిందితులైన రోణక్‌కుమార్, అనిల్ చోక్రాలను కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై అనిశా న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. తీర్పును రిజర్వ్ చేసింది. మరోవైపు రోణక్‌కుమార్, అనిల్ చోక్రాలు తమకు బెయిల్ ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేయగా.. దాన్ని కూడా అనిశా న్యాయస్థానం విచారణ జరిపి, కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశించింది.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిటిషన్ నేటికి వాయిదా

మద్యం ముడుపుల కేసులో 38వ నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెన్నునొప్పికి మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో చికిత్స చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఉత్తర్వులు జారీ చేసేందుకు కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.

నకిలీ మద్యం కేసులో బెయిల్ పిటిషన్లు..

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. జనార్దనరావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2), బాలాజీ (ఏ3), తలారి రంగయ్య (ఏ14) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు సోమవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. వీటిని తదుపరి వాదనల నిమిత్తం ఈనెల 21కి వాయిదా వేశారు. ఈ కేసులో సయ్యద్ హాజి (ఏ5), కట్టా రాజు (ఏ6), మిథున్‌దాస్ (ఏ9), అంతదాస్ (ఏ10), షేక్ అల్లా బక్ష్ (ఏ16) వేసిన బెయిల్ పిటిషన్లపై ఎక్సైజ్ పోలీసులు కౌంటర్లు దాఖలు చేశారు. వాదనల నిమిత్తం 21కి కోర్టు వాయిదా వేసింది. జినేష్ (ఏ24), శిబు (ఏ25) కస్టడీకి ఇవ్వాలని పోలీసుల పిటిషన్లపై వాదనల కోసం 22కి వాయిదా వేశారు. మరో నిందితుడు సుదర్శన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనల నిమిత్తం వచ్చే నెల 9కి న్యాయాధికారి వాయిదా వేశారు. ప్రస్తుతం నిందితుడు మధ్యంతర బెయిల్‌పై ఉన్న సంగతి తెలిసిందే.

వంశీ అనుచరులకు బెయిల్

పటమట, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో వైకాపా నాయకుడు వల్లభనేని వంశీ అనుచరులకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది జులైలో తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని నూతక్కి సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు... గత ఏడాది డిసెంబర్ 17న వంశీతో పాటు అతని ఏడుగురి అనుచరులపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వంశీతో పాటు మరొకరికి గతంలోనే బెయిల్ మంజూరు చేయగా... సోమవారం మిగిలిన ఆరుగురికి 12వ ఏడీజే కోర్టు బెయిల్ ఇచ్చింది. తేలప్రోలు రాము, కొమ్మా కోట్లు ఇదే కేసులో నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉండి బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోగా.. అనగాని రవి, రంగా, శేషు, ప్రభుకాంత్ ముందస్తు బెయిల్ దాఖలు చేసుకున్నారు. సోమవారం విచారణ చేపట్టిన న్యాయాధికారి వారందరికీ బెయిల్ మంజూరు చేశారు.

దంత వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

విజయవాడ వైద్యం: విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డా. కె.శ్రీనివాసరావు సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థోడాంటిక్స్, ప్రోస్థోడాంటిక్స్, ఓరల్ అండ్ మాక్సిల్లోఫేషియల్ సర్జరీ, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడాంటిక్స్, ఓరల్ పాథాలజీ, ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ, పీరియోడాంటిక్స్, పీడోడాంటిక్స్ విభాగాలకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 29న కళాశాల ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు దంత వైద్య కళాశాల, విజయవాడ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తమిళనాడు క్రీడాకారిణులకు అత్యధిక పతకాలు


విజేతలతో రవినాయుడు, వివిధ రాష్ట్రాల సంఘ ప్రతినిధులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ సాఫ్ట్ టెన్నిస్ లీగ్ సోమవారం ముగిసింది. తమిళనాడు క్రీడాకారిణులు అత్యధిక పతకాలు కైవసం చేసుకున్నారు. ★ సోమవారం ముగిసిన సబ్ జూనియర్స్ డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన శ్రీమతి, అనిలా జోడీ ప్రథమ, శ్రుతిలయ, రిషిక జోడీ ద్వితీయ, సన్మాతి, రిత్యా జోడీ, కనిష్క, మధు జోడీ సంయుక్తంగా తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ★ జూనియర్స్‌లో తమిళనాడుకు చెందిన సాధన, నరుమూగయ్ జోడీ ప్రథమ, నిషాలిని, తమిళ్వజి జోడీ ద్వితీయ, తమిళనాడుకు చెందిన జానిని, అక్షిత జోడీ, కర్ణాటకకు చెందిన ధరణి, తహ జోడీ సంయుక్తంగా తృతీయ స్థానం సాధించారు. ★ సీనియర్స్‌లో తమిళనాడుకు చెందిన రాగశ్రీ, శ్వేత జోడీ ప్రథమ, శరణ్య, హమృత జోడీ ద్వితీయ, కర్ణాటకకు చెందిన సోనిక, నిధి జోడీ, తమిళనాడుకు చెందిన పూర్వ, శ్రీమతి జోడీ సంయుక్తంగా తృతీయ స్థానం సొంతం చేసుకున్నాయి. ★ ముగింపు కార్యక్రమానికి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు పతకాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి పోటీల ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరింత పెరుగుతాయని అన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. ★ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వివిధ రాష్ట్రాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. జాతీయ అమెచ్యూర్ సాఫ్ట్ టెన్నిస్ సమాఖ్య నుంచి నేరుగా విజేతల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని నిర్వాహకులు ప్రకటించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెస్‌కాక్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు


నీరజకు సపర్యలు చేస్తున్న స్థానికులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ సంక్రాంతికి ఇంటికొచ్చి సరదాగా తల్లిదండ్రులతో గడిపి, తిరిగి వారితో కలిసి రైల్వేస్టేషన్‌కు వెళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై తల్లి మృతి చెందగా, కుమార్తె పరిస్థితి విషమంగా మారిన సంఘటన ఇది. పోలీసుల సమాచారం మేరకు.. మైలవరం గ్రామానికి చెందిన మల్లెల జమలేశ్వరరావు, భార్య నాగలక్ష్మి(50), కుమార్తె నీరజతో కలిసి ద్విచక్ర వాహనంపై కొండపల్లి రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో చెవుటూరు బైపాస్ జాతీయ రహదారి-30పై శివసాయి హోటల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చే లారీ ముందున్న కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో లారీ అతివేగంతో అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురు తలో దిక్కుకు పడిపోగా జమలేశ్వరరావుకు కుడి చేతికి గాయమైంది. భార్య నాగలక్ష్మికి రెండు కాళ్లు విరిగిపోయి చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమార్తె నీరజ రెండు కాళ్లకు బలమైన గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

ఫెర్రీ వద్ద తాగునీటి పైపులైను పనులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం రక్షిత తాగునీటి పథకం నుంచి ఫెర్రీకి వెళ్లే మంచినీటి ప్రధాన పైపులైను మరమ్మతులకు గురైంది. దీనిపై స్పందించిన తాగునీటి సరఫరా, పురపాలక సిబ్బంది ఆ పైపులైన్‌కు మరమ్మతులను నిర్వహించారు. కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పనులు పర్యవేక్షించారు.

త్రీడీ ప్రింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

మైలవరం: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉష పథకంలో భాగంగా త్రీడీ ప్రింటింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ వి.రంగారావు సోమవారం ప్రారంభించారు. ఇన్ఫ్ ఎడ్యుకేషన్ సహకారంతో సెంట్రిఫ్యూజ్ పాటు కార్యశాలను నిర్వహించనున్నట్లు వివరించారు. త్రీడీ ప్రింటింగ్ విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. ఐక్యూఏసీ సమన్వయకర్త టి.సుబ్బారావు, రిసోర్స్ పర్సన్ అజయ్, ఐసీ సమన్వయకర్త ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎ.కొండూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే : జిల్లా ఎ.కొండూరు మండలం కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తమతో కలిసి చదువుకున్న మండలంలోని గొల్లమందల చెందిన వీరమల్ల దాసు కరోనాతో మృతి చెందినట్లు తెలుసుకుని నివాళులర్పించారు. అతని కుటుంబానికి తమ వంతు సాయం అందించాలని నిర్ణయించుకుని సహాధ్యాయుల నుంచి సేకరించిన రూ.26 వేల నగదును దాసు కుటుంబానికి అందజేశారు. పూర్వ విద్యార్థులు బంగారయ్య, సురేష్ బాబు, శ్రీను, గోవర్ధన్, సంగీత, నాగమణి, సూర్యహాస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: తిరువూరు పట్టణం 4వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికుడు సాయి శ్రీనివాస్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ తిరువూరు పట్టణం 6వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు మోహనకృష్ణ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

బాల్య వివాహాలు సమాజానికి శాపం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : బాల్య వివాహాలు సమాజానికి, కుటుంబ వ్యవస్థకు శాపమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం ఫెర్రీలో ఐసీడీఎస్ సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. అందులో భాగంగానే ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆ ప్రాంతానికి చెందిన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నవీన, రవిచర్ల, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, అచ్చమ్మ, శివలీల తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త మార్పులు.. రైతుల ఆశలు

ఆరుతడి పంటల సాగుకే కర్షకులు మొగ్గు

మైలవరం, న్యూస్‌టుడే



అంతర పంటగా సాగవుతున్న మినుము

ఆరుతడి పంటల సాగు దిశగా అన్నదాతలు అడుగులేస్తున్నారు. గత మూడేళ్లలో మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగి, ధాన్యం ప్రత్యామ్నాయంగా మారి రైతుల ఆశలకు జీవం పోస్తోంది. రబీలో ఆక్వుకుద్ద వరి, మినుము వంటివి సాగు చేస్తున్న ఆరుతడి సాగు విధానంలో సరికొత్త మార్పులను తెచ్చింది. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా రబీలో నాగార్జున సాగర్ కాలువలను ఆసరా చేసుకుని ధాన్యా వరి సాగు చేయడం నాలుగు దశాబ్దాలుగా పరిపాటిగా మారింది. అయితే దశాబ్దం నుంచి సాగర్ నుంచి నీటి సరఫరా ఒడిదుడుకుల పాలవ్వుతుండటంతో అడపాదడపా ధాన్యా సాగు చేసిన, తరువాత వైపు రైతులు దృష్టి సారించలేక పోయారు. అయితే మూడు, నాలుగేళ్లుగా మార్కెట్లో మొక్కజొన్న విత్తనాలకు గిరాకీ ఏర్పడటం, కేసీనం కరెంటు వస్తుండడంతో క్రమేపీ సాగు పెరిగింది. ఈ ఏడాది కూడా సాగర్ నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉండటంతో బోర్లపై ఆధారపడి ఎక్కువ మంది మొక్కజొన్న, మినుము తదితర పంటల సాగుకు మరలారు.

విత్తనాలకు గిరాకీ: మొక్కజొన్నలను ప్రధానంగా కోళ్ల, పశువుల దాణాగా వినియోగిస్తున్నారు. కోళ్ల పరిశ్రమ పల్లెల్లోనూ విస్తరించడంతో రైతులు పండించిన పంటను వ్యాపారులే నేరుగా వారి కళ్లాల నుంచి తరలించుకుపోతున్నారు. మరో వైపు విత్తన తయారీ కంపెనీలు గత నాలుగేళ్లుగా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. విత్తనాల మొదలు ఇతర పెట్టుబడి ఖర్చుల్లో సింహ భాగం ముందస్తుగానే రైతులకు చెల్లిస్తున్నాయి. దాంతో పెట్టుబడి ఖర్చులకు ఇబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం సాగవుతున్న మొక్కజొన్నలో సంస్థలతో ఒప్పందం ఉంటోంది. కేసీనం, మార్కెట్లు విత్తనాల కోసమే సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో క్వింటాకు రూ.2,400 వరకు కనీస ధర లభిస్తుండగా ఎకరానికి సరాసరి 40 క్వింటాళ్లకు పైగా పండిస్తున్న రైతులకు ధాన్యా మించిన ఆదాయం లభిస్తోంది. అయితే విత్తన సాగు చేపట్టిన వారు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

మినుము అంతంతే..: ఖరీఫ్‌లో పెసర, మినుము పంట తీవ్రంగా దెబ్బతింది. కనీసం కోత ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో రైతులు నష్టపోయారు. అయితే రబీలో మినుముకు ఆశాజనకంగా ఉందని భావించిన కొద్ది విస్తీర్ణంలో పంట వేశారు. ఎకరానికి అయిదారు బస్తాల దిగుబడి వచ్చే అన్ని పంటలను మించి ఆదాయం వస్తుందన్న ఆశతో కొన్ని గ్రామాల్లో సాగు చేపట్టారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

తిరువూరు, న్యూస్‌టుడే : సంక్రాంతి సందర్భంగా తిరువూరు మండలం టేకులపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. ఇందులో గెలిచిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.25,116 కీలం మల్లారెడ్డి(సొసైటీ ఛైర్మన్), ద్వితీయ బహుమతి రూ.15,116 తుమ్మలపల్లి శ్రీనివాసరావు(విట్టల సర్పంచి), తృతీయ బహుమతి రూ.10,116 గొల్లమండల కోటయ్య(సొసైటీ డైరెక్టర్) విరాళంతో నిర్వాహకులు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : సైబర్ నేరాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసు అధికారులు సూచించారు. సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్టీటీపీఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. మన్యూరూ చరవాణికి వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని వారికి తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సీఈ చంద్రశేఖర్, ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు కొండపల్లి బొమ్మలు పెద్దపీట



బొమ్మలు పరిశీలిస్తున్న శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారులు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి బొమ్మలకు విస్తృతమైన అంతర్జాతీయ మార్కెటింగ్ అవసరమని ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) 2025 శిక్షణ అధికారులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంపై అవగాహనలో భాగంగా వారు సోమవారం కొండపల్లి కోటను, బొమ్మలను సందర్శించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంలో గొప్ప చారిత్రక అంశాలున్నాయని చెప్పారు. కొండపల్లి కోటతో పాటు కొయ్య బొమ్మలు విశిష్టత కలిగి ఉన్నాయన్నారు. శతాబ్దాల కళను స్థానిక కళాకారులు కాపాడుకుంటూ రావడం హర్షణీయమన్నారు. అనంతరం బొమ్మల తయారీ విధానాన్ని పరిశీలించారు. చెట్టు కొమ్మ నుంచి బొమ్మ తయారీ, దానికి రంగులద్దే క్రమాన్ని తెలుసుకున్నారు. సంప్రదాయాలకు కొండపల్లి బొమ్మలు పెద్దపీట వేశాయన్నారు. పర్యాటక శాఖకు చెందిన అధికారులు కిల్లి కృష్ణచైతన్య, జిజ్ఞాస ఫౌండేషన్‌కు చెందిన జాహ్నవి, శిక్షణ ఐఎఫ్ఎస్‌లు ప్రజేష్ ఆనంద్, చిన్మయిసింగ్, హనుమకులార్, సాయితేజ్, శుభమ్, మురుగనన్ పాల్గొన్నారు.

అభిరుచికి తగ్గట్టు కళాకారులకు నైపుణ్యం అవసరం



శిక్షణ పొందిన వారితో అధికారులు

కొండపల్లి, న్యూస్‌టుడే : వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా చక్కటి నైపుణ్యాన్ని కళాకారులు సొంతం చేసుకోవాలని జౌళి మంత్రిత్వ శాఖ అధికారి రవీంద్ర గౌతమ్ అన్నారు. హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ ఆధ్వర్యంలో కొండపల్లి కొయ్య బొమ్మల కళాకారులకు నిర్వహించిన రెండు నెలల నైపుణ్య శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాకారులకు ఆయన ధ్రువపత్రాలు అందించి మాట్లాడారు. కొయ్య బొమ్మల్లో నూతన ఆవిష్కరణలు కావాలని హస్తకళల ప్రోత్సాహక సంస్థ వ్యయ ప్రయాసలకు ఓర్చి శిక్షణ ఇచ్చిందన్నారు. దీనికి ప్రతిగా కళాకారులు తమలోని నైపుణ్యాన్ని వెలికితీసి ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. లజ్వంతి, సీహెచ్.దివాకర్, ఏసు, మహంతి, కళాకారులు సాయి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో విశేష పూజలు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, గంపలగూడెంలోని శివాలయాల్లో సోమవారం అర్చకులు గంగా పార్వతీ సమేత పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. శివలింగాలకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు గంగా విజయదుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక అభిషేకాలు చేశారు.



కొత్తపల్లి: ప్రత్యేక అలంకరణలో శివలింగం



కంభంపాడులో..

కొండపర్వ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వ గ్రామంలో నెలకొన్న సమస్యలపై విజయవాడలోని జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో గ్రామస్థులు అర్జీ సమర్పించారు. సామాజిక కార్యకర్త బొట్ల శివ సత్యనారాయణ (శివ) తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షించండి



ఇబ్రహీంపట్నం రింగుకూడలి వద్ద పరిశీలిస్తున్న డీసీపీ బేగం, ఇతర అధికారులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : తెలంగాణకు తిరిగి వెళ్తున్న వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్ఠమైన ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా కొనసాగించాలని ట్రాఫిక్ డీసీపీ బేగం అన్నారు. ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో ట్రాఫిక్ పరిస్థితిని ఆమె సోమవారం రాత్రి పర్యవేక్షించారు. ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో పాల్గొని సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ మంగళవారం కూడా ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా రింగుకూడలి వద్ద పటిష్ఠమైన చర్యలు అవసరమన్నారు. ఏసీపీ దుర్గారావు, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు అవకాశం



విద్యార్థులకు ఎంపిక పత్రాలు ఇస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే : కేరళలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న యువజన మార్పిడి కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్బీఆర్‌సీఈ) విద్యార్థులు అయిదుగురికి అవకాశం వచ్చినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివహరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ కె.అప్పారావు పత్రాలు అందజేసి అభినందించారు. ★ జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలను ప్రిన్సిపల్ కె.అప్పారావు సోమవారం ప్రారంభించారు. విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే 50 మ్యాచులకుగానూ, 8 పోటీలను తమ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నాయకుడికి పరామర్శ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఇటీవల అనారోగ్యానికి గురై ప్రస్తుతం కోలుకుంటున్న తెదేపా సీనియర్ నాయకుడు డాబా శ్రీనివాసరావును విస్సన్నపేటలోని ఆయన స్వగృహంలో ప్రముఖ ఎన్నారై, తెదేపా యువనేత వల్లభనేని గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు సోమవారం పరామర్శించారు. తిరువూరు ఏఎంసీ ఛైర్మన్ కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, డైరెక్టర్ పల్లెపాం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి మురుగు అక్కడే..



స్థానిక టమాటా మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన తూర్పు వైపు కాలువ లేకపోవడంతో మురుగంతా రోడ్డుపై నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆ నీరంతా నిలవడంతో పందులు అక్కడికి చేరుతున్నాయి. దోమలు విపరీతంగా పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో కాలువ ఏర్పాటు చేసి మురుగు నీటి తొలగింపునకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

ట్యాంకు పగిలింది.. సరఫరా నిలిచింది



వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తెదేపా హయాంలో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం దాములూరులో బోరు వేసి అక్కడే నీటి నిల్వకు ట్యాంకు ఏర్పాటు చేశారు. దానిపైన సోలారు పలకలను బిగించి, బోరు సోలారు విద్యుత్తుతో పని చేసే విధంగా మోటారును ఏర్పాటు చేసి, ట్యాంకు చుట్టు కుళాయిలు బిగించారు. దీంతో గ్రామస్థులకు ఏ సమయంలోనైనా తాగునీరు లభించేది. వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణకు నిధులు కేటాయించలేదు. ఈ క్రమంలో ట్యాంకులో ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ లైవల్ స్విచ్‌లు మరమ్మతులకు గురై ట్యాంకు పగిలిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కూటమి సర్కారు గ్రామ పంచాయతీకి మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో దాన్ని బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

గుంత.. రాకపోకలకు చింత



వెలగలేరు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారి మధ్యలో గుంత ఏర్పడి రాకపోకలకు నరకయాతన పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నూజివీడుకు వెళ్లే కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతోంది. ఆ నీరంతా గుంతలో చేరి మరింత ఇబ్బందిగా మారుతుందని వాహన చోదకులు వాపోతున్నారు. విజయవాడ-విస్సన్నపేట రహదారిలో భాగంగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ మరమ్మతులు చేపట్టి గుంత పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

పొదలతో నీటి సరఫరా సాధ్యమైనా?



ఎన్నెస్పీ మేజర్ కాల్వల్లో పొదలు దట్టంగా పెరగడంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఎన్నెస్పీ మైలవరం బ్రాంచి కాల్వ రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామం దగ్గర రంగాపురం మేజర్ కాల్వ ప్రారంభం అవుతుంది. దీని ద్వారా కూనపరాజుపర్వ, రెడ్డిగూడెం, రంగాపురం, నరుకుళ్లపాడు రెవెన్యూ పరిధిలోని భూములకు సాగర్ జలాలు సరఫరా జరగాలి. ఈ కాల్వ ఆయకట్టులో కొందరు రైతులు మొక్కజొన్న, వరి, మామిడి తోటలు సాగు చేశారు. ఈ నేపథ్యంలో చివరి భూములకు నీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగాలంటే కాల్వల్లో దట్టంగా పెరిగిన పొదలు తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

సంఘ సంస్కర్త యోగి వేమనకు నివాళి



పెనుగొలనులో వేమన చిత్రపటానికి నివాళులరిస్తున్న గ్రామస్థులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో సోమవారం ప్రజాకవి యోగి వేమన జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రామస్థులు పూలమాల వేసి నివాళులర్పించారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం ఏ.రమాదేవి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, వాసు, నాగరాజు, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.



చెవుటూరులో రమాదేవి, ఆంజనేయులు ఆధ్వర్యంలో...

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి



కార్యక్రమంలో రామకృష్ణ నాయక్, నాగరాజు, అక్బర్ పాషా తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : పది చదువుతూ వెనుకబడిన విద్యార్థుల కోసం డెమోక్రటిక్ పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆ సంఘం ఉపాధ్యాయులు ఎంపీడీవో బీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా డీపీఆర్టీయూ నాయకుడు డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఈ మెటీరియల్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచుతామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం సంఘ మండల ప్రధాన కార్యదర్శిగా కంచర్ల శ్రీరామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

టీ మాస్టర్ కిడ్నాప్ కలకలం

క్రైమ్ కార్నర్

ఇబ్రహీంపట్నం వద్ద కారు పట్టివేత

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : విజయవాడ, అరండల్‌పేటలోని ఒక క్యాంటీన్‌లో టీ మాస్టర్‌గా పని చేస్తున్న కోటేశ్వరరావు అనే వ్యక్తిని హైదరాబాద్‌కు చెందిన నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి కారులో తీసుకుపోవడం కలకలం సృష్టించింది. కారులో బలవంతంగా తీసుకుపోతుండగా.. కోటేశ్వరరావు తన యజమానురాలికి ఫోన్ చేసి చెప్పారు. ఆమె కారు నంబరుతో సహా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు.. నగరవ్యాప్తంగా గాలింపు చేపట్టారు. చివరకు ఇబ్రహీంపట్నం వద్ద కారును గుర్తించి దాన్ని నిలిపివేశారు. కోటేశ్వరరావును, అతనిని కిడ్నాప్ చేసి తీసుకువెళుతున్న నలుగురిని సోమవారం మధ్యాహ్నం ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారణ నిమిత్తం సూర్యారావుపేట పోలీసులకు అప్పగించారు.

అప్పు తీసుకుని ముఖం చాటేసి...: కోటేశ్వరరావు గతంలో హైదరాబాద్‌లో పని చేసినప్పుడు అక్కడ శివ అనే అతని వద్ద రూ.1.5లక్షలు అప్పు చేశారు. ఆ నగదు వసూలు చేసుకునే క్రమంలో విజయవాడకు వచ్చిన శివ.. మరికొందరితో కలిసి కోటేశ్వరరావును బలవంతంగా కారులో ఎక్కించుకుని హైదరాబాద్ బయలుదేరినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో తాను పనిచేసే టీ స్టాల్ యజమానురాలు జ్యోత్స్నకు కోటేశ్వరరావు సమాచారం అందించడంతో.. వారి బారి నుంచి అతనిని కాపాడారు. దీనిపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జి.కొండూరులో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మతిస్థిమితం లేని సుమారు 35 ఏళ్ల వ్యక్తి జి.కొండూరు ఫర్జానా హోటల్ సమీపంలో ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో రోడ్డు పక్కన కుర్చొని ఉన్నాడు. ఈ క్రమంలో మైలవరం నుంచి విజయవాడ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు కుక్కను తప్పించబోయి ఇతడిని ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాసుపత్రిలోని శవాగారంలో భద్రపరిచారు. మృతుడి శరీరంపై చొక్కా కూడా లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విశ్రాంత ఉద్యోగి దుర్మరణం

భవానీపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి చనిపోయినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. గొల్లపూడిలో బేతపూడి జోజి(68) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన ఆంధ్రా లయోలా కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ప్రతి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్తుంటారు. ఈనెల 19వ తేదీ ఉదయం 5 గంటల సమయంలో జోజి వాకింగ్‌కు వెళ్లగా గొల్లపూడిలోని టింబర్ డిపో వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాపట్ల శివ ప్రసన్నకుమార్ ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా.. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కుమారుడు ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాములూరులో పశు ఆరోగ్య శిబిరం



గర్భనిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యురాలు శైలుమాధురి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దాములూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 51 మంది పాడి పోషకులు తమ పశువులు, జీవాలకు చికిత్స చేయించుకున్నారు. శిబిరాన్ని సర్పంచి చెకుమల్లి మధుసూదనరావు ప్రారంభించారు. పశు వైద్యురాలు సీహెచ్ శైలుమాధురి, ఆమె సిబ్బంది 43 గేదెలకు చికిత్స అందించారు. నందిగామ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టరు మోసెస్ వెస్లీ, ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకుడు తాళ్లూరి శ్రీనివాసరావు శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఎరువుల నిల్వలు తనిఖీ



రెడ్డిగూడెం పీఏసీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : నాగులూరు, బూరుగగూడెం, రెడ్డిగూడెం గ్రామాల్లోని ఎరువులు దుకాణాలు, పీఏసీఎస్‌లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేసినట్లు ఏవో డి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల్లో 101 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి..



సురేఖ (పాత చిత్రం)

జి.కొండూరు, న్యూస్‌టుడే : తల్లి మందలించిందని మనస్థాపంతో యువతి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జి.కొండూరు మండలం మునగపాడులో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మునగపాడుకు చెందిన ధరణికోట సురేఖ(18) డిగ్రీ చదువుకుంటోంది. తల్లి సులోచన స్వల్ప అనారోగ్యానికి గురై ఇంట్లో పనులు చేయమని కుమార్తెను గట్టిగా మందలించడంతో ఆమె మనస్తాపానికి గురై శనివారం పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి విజయవాడలోని ఆసుపత్రికి ఆమెను తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయ స్వామి గుడిలో కానుకల చోరీ

దుందిరాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని దుందిరాలపాడు శివారు మిట్టగూడెంలోని ఆంజనేయ స్వామి గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు అపహరణకు గురయ్యాయి. సోమవారం ఉదయం గుడికి వెళ్లిన భక్తులు తాళం తీసి ఉండడం గమనించి పెద్దలకు తెలిపారు. గ్రామస్థులు పరిశీలించి గంపలగూడెం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు మిట్టగూడెం గుడి వద్దకు చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పదవులకు ఎంపిక



నియామక పత్రాలు అందుకుంటున్న యుగంధర్, నాగరాజు

మైలవరం, న్యూస్‌టుడే : భాజపా అనుబంధ కిసాన్ మోర్చా జిల్లా కమిటీకి నియోజకవర్గం నుంచి ఇద్దరు నాయకులు ఎంపికయ్యారని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేగళ్ల రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూనల యుగంధర్, కార్యదర్శిగా ఆరేపల్లి నాగరాజులను ఎంపిక చేయగా, విజయవాడలో సోమవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నియామక పత్రాలు అందుకున్నట్లు ఆయన చెప్పారు.

21న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 21వ తేదీన ఇబ్రహీంపట్నంలోని నిమ్రా వైద్య కళాశాల మైదానంలో నిర్వహిస్తామని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునాని, బీఎన్‌వైఎస్, ఫిజియోథెరపీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాలల విద్యార్థులు ఎంపిక పోటీలో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు.



జ్యూరిక్‌లో సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నంతో భేటీ అయిన సీఎం చంద్రబాబు

జ్యూరిక్ విమానాశ్రయంలో చంద్రబాబుకు ఘన స్వాగతం

సీఎంను కలిసిన సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నం, ఇతర ప్రముఖులు

ఈనాడు, అమరావతి: జ్యూరిక్ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. యూరోప్‌లోని సుమారు 20కి పైగా దేశాల నుంచి ఎన్ఆర్ఐ, తెదేపా కార్యకర్తలు అక్కడకు తరలివచ్చారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ బయల్దేరిన చంద్రబాబు సోమవారం జ్యూరిక్ చేరుకున్నారు. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్‌కుమార్ సహా పలువురు సీఎంకు స్వాగతం పలికారు. వివిధ దేశాల నుంచి వచ్చిన తెలుగు వారితో చంద్రబాబు మాట్లాడారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. సింగపూర్ దేశాధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ప్రపంచ బ్యాంకు గ్రూప్ ప్రెసిడెంట్ అజయ్ బంగా తదితరులు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వెంట కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఉన్నారు.

అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉంది..

జ్యూరిక్‌లో తనకు స్వాగతం పలికిన తెలుగు వారు, ఎన్నారై తెదేపా శ్రేణులతో పాటు యూరప్‌లోని వివిధ దేశాల నుంచి తరలివచ్చిన వారికి చంద్రబాబు 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాష, సంస్కృతికి, వారసత్వానికి అచ్చమైన ప్రతీకలైన మీ అందరినీ కలుసుకోవడం తనకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



జ్యూరిక్‌లో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సమావేశమైన సీఎం చంద్రబాబు

దావోస్‌లో నేడు చంద్రబాబు కీలక భేటీలు

ఐబీఎం, గూగుల్ క్లౌడ్ సీఈవోలతో సమావేశాలు

ఈనాడు, అమరావతి: దావోస్ పర్యటనలో రెండో రోజైన మంగళవారం సీఎం చంద్రబాబు కీలక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం నిర్వహించే సీఐఐ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో 'ది ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్' అనే అంశంపై ప్రసంగిస్తారు. తర్వాత ఇండియా లాంజ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రపంచ పెట్టుబడిదారులతో చర్చలు జరుపుతారు. అనంతరం దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం ఛైర్మన్, సీఈవో అరవింద్‌కృష్ణతో సీఎం సమావేశమవుతారు. గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో భేటీ ఉంటుంది. సాయంత్రం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్, ఎండీ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్స్, పెయింట్స్ సంస్థల ఎండీ పార్థ్ జిందాల్‌లతో చంద్రబాబు సమావేశమవుతారు. అంతర్జాతీయ కంటెయినర్ లాజిస్టిక్స్ సంస్థ మోలర్ మెర్స్క్ సీఈవో విన్సెంట్ క్లెర్క్‌తో ముఖాముఖిలో పాల్గొంటారు.

మేం మిస్సైల్స్.. చంద్రబాబు మా జీపీఎస్

- మా మంత్రుల మధ్య పనిలో పోటీ
- ప్రజల ఆశయాలను నిలబెట్టుకోవడం మా బాధ్యత
- యూరప్ తెలుగు డయాస్పొరా సమావేశంలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'వైకాపా ప్రభుత్వంలో కోడిగుడ్డు మంత్రి దావోస్ ఎందుకు వెళ్లలేదంటే బాగా చలిగా ఉంటుందని, అందుకే వెళ్లలేదని చెప్పారు. కానీ ఎండా, వానా, చలి ఏదీ లెక్క చేయకుండా ప్రజల కోసం అహర్నిశలు కష్టపడే వ్యక్తి మన సీఎం చంద్రబాబు. ఆయన నాయకత్వంలో మా యంగ్ టీమ్ పని చేస్తోంది. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవంతో, ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన ఆయన మెంటరింగ్ మా అదృష్టం. మేం అందరం మిస్సైళ్లలాంటి వారం. చంద్రబాబు మాకు జీపీఎస్' అని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. చంద్రబాబు నాయకత్వంలో తామంతా ఎలాంటి ఈగోలు లేకుండా పని చేస్తున్నామన్నారు. నేను విశాఖ ఎకనామిక్ కారిడార్ అంటే టీజీ భరత్ తిరుపతి ఎకనామిక్ కారిడార్ అంటున్నారు, పెట్టుబడులకు మేం పోటీ పడుతున్నామని లోకేశ్ చెప్పారు. పని విషయంలో కేబినెట్‌లో సహచరుల మధ్య పోటీ వాతావరణం ఉందన్నారు. జ్యూరిక్‌లో యూరప్ తెలుగు డయాస్పొరా సమావేశంలో లోకేశ్ మాట్లాడారు.

ప్రభుత్వ నిర్ణయాల్లో తప్పులుంటే చెప్పండి

'గత ఎన్నికల్లో ఏ ఆశయాలతో ప్రజలు మమ్మల్ని గెలిపించారో వాటిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. ఇది మన ప్రభుత్వం. ఏవైనా నిర్ణయాల్లో తప్పులు ఉంటాయి. వాటిని తెలియజేయాల్సిన బాధ్యత మీపై, సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. పవనన్న చెప్పినట్లు ఈ ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు ఉండాలి.

తెలుగువారిని కలిశాకే ముందుకు

సముద్రాలు దాటినా మీరు సంప్రదాయాలు మర్చిపోలేదు. తెలుగును, తెలుగు సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకుంటున్నారు. జ్యూరిక్‌లో తెలుగు వారి జోష్ అదిరిపోయింది. యూరప్‌లో ఉన్న సుమారు 20 దేశాల నుంచి తెలుగువారు ఈ సమావేశానికి వచ్చారు. సీఎం చంద్రబాబు, నేను ఏ దేశం వెళ్లినా ముందు తెలుగువారిని కలిశాకే అధికారిక కార్యక్రమాలకు వెళ్తున్నాం. గతేడాది ఏపీ గ్రోత్ స్టోరీ ఇక్కడే ప్రారంభమైంది. మీతో సమావేశమైన తర్వాత దావోస్ సమావేశానికి హాజరయ్యాం. అక్కడి నుంచి తిరుగులేదు. 18 నెలల్లో రూ. 23.50 లక్షల కోట్ల పెట్టుబడులు, తద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి. భారతదేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3% ఒక్క ఏపీకే వచ్చాయి. చంద్రబాబు అప్పట్లో ఐటీ, ఇప్పుడు క్వాంటమ్ అని మనల్ని ముందుకు నడిపిస్తున్నారు. గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ఏపీలో పెడుతోందని, ఆరోజు పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రం వైపు చూస్తున్నారంటే అందుకు కారణం చంద్రబాబే. ఆయన చాలా రేర్, యూనిక్ పీస్. ఆయన్ను మనం అనుసరిస్తే చాలు. భోగాపురం విమానాశ్రయం, రాజధాని అమరావతి నిర్మాణం, క్వాంటమ్ టెక్నాలజీ అంటుంటే కొందరు విమర్శలు చేస్తున్నారు. ఎర్రబస్సు రాని ఊరికి ఎయిర్‌పోర్టు అవసరమా అని జగన్ ఎగతాళి చేశారు. అక్కడే భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మించి చూపించారు చంద్రబాబు' అని లోకేశ్ పేర్కొన్నారు.

మీరే మా అంబాసిడర్లు

'ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా తెలుగుజాతి గర్వపడేలా పని చేద్దాం. మీరంతా మా బ్రాండ్ అంబాసిడర్లు. ఏపీలో పెట్టుబడులు పెట్టండి. మీరు పని చేసే కంపెనీల పెద్దలను ఏపీలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించండి' అని ప్రవాసాంధ్రులకు లోకేశ్ పిలుపునిచ్చారు.

ఏడుపుగొట్టు టీమ్ 11

'ఏపీలో టీమ్ 11 ఉంది. అదో ఏడుపుగొట్టు టీమ్. పెట్టుబడులు తీసుకురావొద్దంటూ ఏడుస్తారు. పెట్టుబడుల కోసం మేం విదేశాలకు వెళ్తే ఏపీకి రావద్దని ఆ కంపెనీలకు ఈ-మెయిల్స్ పెడుతారు. సీఎం చంద్రబాబును చూసి ఆ కంపెనీలు వస్తే మాత్రం ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలనుకుంటున్నారు. వారికి కోడికత్తి, బాబాయిని లేపేయడం, తల్లిని, చెల్లిని గెంటేయడం వంటి క్రెడిట్‌లే ఇవ్వగలం' అని లోకేశ్ విమర్శించారు.

ఏపీలో బ్యూలర్ ఫుడ్స్, గ్రెయిన్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయండి : లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బ్యూలర్ ఫుడ్స్, గ్రెయిన్ టెక్నాలజీ అప్లికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. ఫుడ్ సెక్యూరిటీ టెక్నాలజీ, ఆహారశుద్ధి రంగాల్లో అంతర్జాతీయంగా 140 దేశాల్లో సప్లయ్ చైన్ ఇంటిగ్రేషన్ కలిగి ఉన్న బ్యూలర్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ బోర్డు సలహాదారు, బ్యూలర్ ఇండియా ఛైర్మన్ దీపక్ మానేతో జ్యూరిక్‌లో ఆయన భేటీ అయ్యారు.



బ్యూలర్ ఇండియా ఛైర్మన్ దీపక్ మానేతో మంత్రి లోకేశ్

మా పోర్టుల్లో హైడ్రోజన్ పైలట్ వాహనాలను తయారు చేయండి

- ఎవల్యూషన్ సినర్జిటిక్ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి లోకేశ్ భేటీ

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్ ట్రాక్టర్స్ పైలట్ వాహనాలను తయారు చేసి వినియోగించాలని కాంప్లెక్స్ వెహికల్స్, మొబిలిటీ సిస్టమ్స్ అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన ఏట సంస్థను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. స్పెయిన్‌కు చెందిన ఎవల్యూషన్ సినర్జిటిక్ ఆటోమోటివ్ ఎస్ఎల్ సంస్థ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏపీ ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్, జీరో-ఎమిషన్ వెహికల్స్ (జడ్ఈవీ) రంగాల్లో అంతర్జాతీయ స్థాయి భాగస్వాములను బలోపేతం చేసేందుకు ఆసక్తిగా ఉంది. రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కులు, పోర్టులు, ఇంజినీరింగ్ శాండ్ బాక్స్‌లను అందిస్తూ ఏపీ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను సాకారం చేయబోతోంది. ఏపీ పారిశ్రామిక పార్కుల్లో ఎలక్ట్రిక్/హైడ్రోజన్ ఆఫ్ రోడ్ వాహనాల కోసం కో-పైలట్‌ను అభివృద్ధి చేసి, రీడిజైన్, ఆప్టిమైజేషన్‌కు నేతృత్వం వహించండి. ఇందుకు అవసరమైన టెస్ట్ బెడ్‌లు, అనుమతులను ఏపీ ప్రభుత్వం అందిస్తుంది. ఏపీ ప్రారంభ దశ ఆవిష్కరణలను ప్రోత్సహించాలని భావిస్తోంది. ప్రొటో టైప్ అభివృద్ధికి, ఇంజినీర్ల శిక్షణకు ఏపీ ప్రభుత్వం సహకరిస్తుంది. ఇండస్ట్రియల్ లేదా అడమిక్ క్యాంపస్‌లో చిన్న ఇంజినీరింగ్ శాండ్ బాక్స్‌లను అందిస్తుంది' అని తెలిపారు.



జోస్ మెల్లాడోతో భేటీ అయిన మంత్రి నారా లోకేశ్

మద్యం కుంభకోణం కేసులో... 23న విచారణకు రండి

ఎంపీ మిథున్‌రెడ్డికి ఈడీ నోటీసులు



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 23న విచారణకు హాజరు కావాలంది. కేసుకు సంబంధించి గతేడాది మేలో మనీలాండరింగ్ చట్టం కింద అభియోగాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్)ను ఈడీ నమోదు చేసింది. అందులో 33 మందిని నిందితులుగా చేర్చింది. గతేడాది సెప్టెంబరులో 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో సోదాలు చేసి, కీలక ఆధారాలు సేకరించింది. ఈడీ పెట్టిన కేసులో.. వైకాపా తరఫున కీలకంగా పని చేసిన రాజ్ కెసిరెడ్డితో పాటు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మద్యం కుంభకోణంపై సిట్ నమోదు చేసిన కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి ఏ4. ఆయన గతేడాది జులైలో అరెస్టయ్యారు. ఈ కేసులో అరెస్టైన తొలి ప్రజాప్రతినిధి ఈయనే. ప్రస్తుతం మిథున్‌రెడ్డి బెయిలుపై ఉన్నారు. జగన్ ప్రభుత్వం హయాంలో నూతన మద్యం విధానం ముసుగులో వైకాపా ముఠా సాగించిన దోపిడీకి కుట్ర, అమలుకు ఏర్పాట్లు, ముఠా సభ్యులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయడంలో మిథున్‌రెడ్డే 'మాస్టర్ మైండ్' అని సిట్ దర్యాప్తులో గుర్తించింది. డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ముడుపుల వసూళ్ల కోసం రాజ్ కెసిరెడ్డితో కలిసి హవాలా నెట్‌వర్క్ రూపొందించడం, వారు వసూలు చేసిన మొత్తాల్ని 'బిగ్‌బాస్'కు చేర్చడంలో మిథున్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని తేల్చింది. పలు డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని సొంత బ్రాండ్ల మద్యం తయారు చేయించి లబ్ధి పొందడమే కాకుండా, ముడుపుల సొత్తులో ప్రతి నెలా రూ.5 కోట్ల చొప్పున వాటాగా పొందారని సిట్ దర్యాప్తుల్లో వెల్లడైంది.

విద్యార్థినిపై అత్యాచారం.. ఎస్సైకి పదేళ్ల జైలు

- గుంటూరు జిల్లా ప్రత్యేక కోర్టు తీర్పు
- నిందితుడికి అనుకూలంగా వాంగ్మూలమిచ్చిన మహిళా ఎస్సైపైనా చర్యలకు ఆదేశం

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో ఓ విద్యార్థినిని పరిచయం చేసుకుని.. వివాహం చేసుకుంటానని నమ్మించి, ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన బాపట్ల జిల్లా అమృతలూరు ఎస్సై కుంచాల రవితేజ (30)కు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు సోమవారం తీర్పు వెలువరించారు. నిందితుడికి అనుకూలంగా వాంగ్మూలమిచ్చిన మహిళా ఎస్సై రోజాలతపై శాఖాపరమైన విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించారు. కేసు పూర్వాపరాలివీ..

పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన ఓ విద్యార్థిని బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ఎయిమ్స్‌లో ఉద్యోగ పరీక్ష కోసం సన్నద్ధమవడానికి గుంటూరు నగరంలోని ఓ మహిళా వసతిగృహంలో ఉండేది. అప్పట్లో గుంటూరు నగరంలోని నగరంపాలెంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కుంచాల రవితేజ ఆమెను సామాజిక మాధ్యమంలో పరిచయం చేసుకున్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి నగరంపాలెం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ గదికి తీసుకెళ్లాడు. అనంతరం విజయవాడలోని హోటల్ గదికి తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత ఆమె గర్భవతి కావడంతో అబార్షన్ చేయించాడు. కొన్నాళ్ల తర్వాత మరో మహిళను వివాహం చేసుకోవడానికి సిద్ధం కావడంతో ఆమె అతణ్ని నిలదీసింది. తన స్థాయి, సామాజికవర్గం వేరని రవితేజ తనను బెదిరించారంటూ 2023 మే 7న బాధితురాలు నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అత్యాచారం, మోసం, కులదూషణ తదితర నేరాల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి కేసు దర్యాప్తు చేసి, ఛార్జిషీట్ వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోబినా బేగం ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నేరం రుజువు కావడంతో ఎస్సై రవితేజకు పదేళ్ల జైలు శిక్ష రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి శరత్‌బాబు సోమవారం తీర్పు చెప్పారు.

మహిళా ఎస్సైపైనా చర్యలకు ఆదేశం

గుంటూరు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై కె.రోజాలతపై శాఖాపరమైన దర్యాప్తు జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశిస్తూ న్యాయమూర్తి తీర్పులో ఆదేశించారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న రోజాలతను సాక్షిగా కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో ఆమె ప్రాసిక్యూషన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడంతో పాటు, నిందితుడికి అనుకూలంగా వాంగ్మూలం ఇచ్చారని కోర్టు అభిప్రాయపడింది.

ఏఐతో లిక్టన్‌స్టైన్ అభివృద్ధి

ఆ దేశ ప్రతినిధులతో భేటీ అవుతా.. సీఎం చంద్రబాబు



స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: యూరప్‌లోని లిక్టన్‌స్టైన్ అనే చిన్న దేశం కృత్రిమమేధ (ఏఐ)ను ఉపయోగించుకుని అభివృద్ధి చెందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వచ్చే నెలలో దిల్లీలో జరిగే ఏఐ సదస్సులో ఆ దేశ ప్రతినిధుల్ని కలుస్తానని చెప్పారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు నాలుగు రోజుల పర్యటనలో భాగంగా చంద్రబాబు సోమవారం జ్యూరిక్ చేరుకున్నారు. తొలుత స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో సమావేశమై ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఐలో లిక్టన్‌స్టైన్ పురోగతిని మృదుల్‌కుమార్ వివరించారు. ఆ దేశ ఏఐ పురోగతి ఎంతో ఆసక్తికరంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ఏఐ, క్వాంటమ్ తదితర ఆధునిక టెక్నాలజీ రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి 25 పాలసీలు తెచ్చాం. పెట్టుబడులకు అనుకూల విధానాలు రూపొందించాం. స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సహకరించండి. స్విట్జర్లాండ్‌లో భారతీయులు, ముఖ్యంగా తెలుగువారు అధిక సంఖ్యలో ఉన్నారు. వారి అభివృద్ధికి సహకరించండి' అని చంద్రబాబు పేర్కొన్నారు. ఫార్మా, వైద్య, యంత్ర పరికరాలు, భారీ మెషినరీ తయారీ, హార్డ్‌వేర్ ఎలక్ట్రానిక్స్, రైల్ కాంపోనెంట్స్, టెక్స్‌టైల్స్, పరిశోధనా కేంద్రాల వంటి అంశాల్లో స్విట్జర్లాండ్ ముందంజలో ఉందని మృదుల్‌కుమార్ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అధికారుల బృందానికి వివరించారు. గతేడాది చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతమైందని.. 2025లో చర్చలు, సంప్రదింపుల కారణంగా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని ఏపీ బృందం తెలిపింది.

యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం.. లోకేశ్



స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్‌కుమార్‌తో మంత్రి లోకేశ్

ఏపీలో నైపుణ్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్ని మృదుల్‌కుమార్‌కు మంత్రి నారా లోకేశ్ వివరించారు. 'స్విట్జర్లాండ్‌లో ఫార్మా కంపెనీలు, విశ్వవిద్యాలయాలు ఏపీకి రావడానికి సహకరించాలి. వివిధ రంగాల కంపెనీలకు అవసరమైన మానవవనరుల్ని సిద్ధం చేస్తున్నాం. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. 100 కిలోల బరువు మోసే డ్రోన్లు తయారుచేసే సంస్థలు ఉన్నాయి. ఈ రంగంలో బిజినెస్ టు బిజినెస్ పెట్టుబడుల్ని సాకారం చేసేలా సహకరించాలి' అని కోరారు.

పోలీసు ఉన్నతాధికారి రాసలీలల వీడియోల కలకలం

- కర్ణాటకలో దుమారం
- క్రమశిక్షణ చర్యలకు సీఎం సిద్ధరామయ్య ఆదేశం



రామచంద్రరావు

ఈనాడు, బెంగళూరు : కొన్ని నెలల్లో పదవీ విరమణ పొందాల్సిన కర్ణాటక రాష్ట్ర డీజీపీ స్థాయి అధికారి డాక్టర్ రామచంద్రరావు మహిళలతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వీడియోలు కలకలం రేపుతున్నాయి. సుమారు 40 సెకన్ల నిడివితో ఉన్న ఈ వీడియోలు సోమవారం వైరల్ అయ్యాయి. తన అధికారిక కార్యాలయంలో పోలీసు దుస్తుల్లోనే పలువురు మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్ఈ) అధిపతిగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరావు. ప్రచారంలో ఉన్న వీడియోలపై వివరణ ఇచ్చేందుకు హుటాహుటిన హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ నివాసానికి వెళ్లారు. మంత్రిని కలిసేందుకు అవకాశం దక్కలేదని సమాచారం. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ 'ఈ వీడియోలలో ఉన్నది నేను కాదు. ఎవరో కుట్రపన్ని ఏఐతో తయారు చేసి బయటపెట్టారు. ఎనిమిదేళ్ల కిందట రికార్డు చేసినవిగా కనిపిస్తున్నాయి. వీటిని విడుదల చేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు న్యాయవాదులతో చర్చిస్తున్నా. ఈ వీడియోల గురించి నాకు ఏమీ తెలియదు. దీనిపై విచారణ చేపట్టాలని హోంమంత్రికి మనవి చేసేందుకు వెళ్లా' అని తెలిపారు. ఈ వీడియోల గురించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ.. ఆ అధికారిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచిస్తానన్నారు. దోషిగా రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మరికొన్ని ఆరోపణలు..

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రామచంద్రరావు వివాదాల్లో చిక్కుకోవటం ఇదే తొలిసారి కాదు. గతేడాది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బంగారు బిస్కెట్ల స్మగ్లింగ్ కేసులో దోషి, సినీనటి రన్యారావు సవతి తండ్రి ఈయన. రామచంద్రరావు సహకారంతోనే రన్యారావు స్మగ్లింగ్ చేసేవారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనను సెలవుపై ఉండాలని సర్కారు ఆదేశించింది. ఈ కేసులో క్లీన్‌చిట్ రావడంతో గత ఏడాది ఆగస్టులో ఆయన సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. రామచంద్రరావు సదరన్ రేంజ్ ఐజీపీగా ఉన్న సమయంలో మైసూరు దక్షిణ పోలీసులు ఓ ప్రైవేటు బస్సును సోదా చేసి రూ.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ సందర్భంగా నిందితులు తాము తరలించిన మొత్తం రూ.2.27 కోట్లు కాగా పోలీసులే మిగతా సొమ్మును దాచేసినట్లు వెల్లడించారు. ఈ విషయంలో రామచంద్రరావు పాత్రపై నేటికీ ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి.



వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి సవిత. చిత్రంలో అమిలినేని సురేంద్ర బాబు, తెదేపా అనంతపురం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కలెక్టర్ శ్యాంప్రసాద్, కందికుంట వెంకటప్రసాద్, పార్థసారథి, గుమ్మడి గోపాలకృష్ణ, కాలవ శ్రీనివాసులు, తిప్పేస్వామి తదితరులు

మంచిమాటలు చెప్ప.. మళ్లీ వచ్చిన వేమన

- ఏఐ సాంకేతికతతో పిల్లలతో మాట్లాడిన ప్రజాకవి
- శ్రీసత్యసాయి జిల్లాలో జయంతి వేడుక

కదిరి, గాండ్లపెంట, న్యూస్‌టుడే: శతాబ్దాల క్రితమే సమాజంలోని అజ్ఞానం, అవివేకంపై తిరుగుబాటు చేసి, జనాన్ని హేతుబద్ధ ఆలోచనలకు పురికొల్పిన ప్రజాకవి వేమన.. ఇన్నేళ్ల తర్వాత మరోసారి తన బాణి వినిపించారు. బడిలో స్నేహితుల ప్రవర్తనతో బాధపడిన ఓ విద్యార్థి ఎదుట ప్రత్యక్షమై భరోసానిచ్చారు. దిగులు వీడి, చదువుపై దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. తాను సమాధి అయిన శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామాన్ని ఇందుకు వేదికగా ఎంచుకున్నారు. యోగి వేమన జయంత్యుత్సవాన్ని సోమవారం ప్రభుత్వం కటారుపల్లిలో రాష్ట్ర పండుగగా నిర్వహించింది. రాష్ట్ర మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, కాలవ శ్రీనివాసులు, సురేంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.పార్థసారథి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణతో పాటు కవులు, సాహితీవేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ర్యాలీగా వచ్చి వేమన సమాధిని దర్శించి, పుష్పాంజలి ఘటించారు. వేల మంది ఏకకాలంలో వేమన పద్యాలు ఆలపించారు. ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి భువనేశ్వర్ మాధుర్య ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ఎమ్మెల్యే కందికుంటకు ధ్రువపత్రాన్ని అందించారు. అనంతరం కృత్రిమ మేధ (ఏఐ) వారధిగా వేమనతో విద్యార్థులను అనుసంధానించారు. తెరపై ప్రత్యక్షమైన ప్రజాకవి.. పిల్లల సందేహాలను పద్యరూపంలో నివృత్తి చేశారు. ఈ సందర్భంగా 'యోగివేమన ఏఐ' పేరిట ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించారు. అమెరికాలో ఉంటున్న గాండ్లపెంటవాసి విశ్వనాథరెడ్డి ఈ యాప్ రూపకల్పనకు సాంకేతిక సాయమందించారు. అలాగే, వేమన చిత్రపటాలు, పద్యాలు చిత్రీకరించిన ప్రత్యేక బస్సును ప్రారంభించారు. ఆడియో, వీడియో సౌకర్యం ఉన్న ఈ వాహనం నిత్యం కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెల్లో తిరుగుతూ వేమన పద్యాలను నేటితరానికి చేరువ చేయనుందని ఎమ్మెల్యే కందికుంట తెలిపారు. గాండ్లపెంట మండలానికి యోగివేమన పేరు పెట్టేలా కృషి చేస్తామని మాటిచ్చారు.



'ఏఐ వేమన' పేరిట ఏర్పాటు చేసిన బస్సు

వైకాపా హయాంలో మెప్మా నిధుల మేత

- నేతలు, అధికారులు కుమ్మక్కై రూ.1.22 కోట్లు స్వాహా
- రుజువులు చూపించిన వైకాపా ఎంపీ బోస్



వివరాలను మీడియాకు చూపిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పురపాలక సంఘానికి చెందిన మెప్మా నిధులు రూ.1.22 కోట్లను వైకాపా పాలనలో నాటి అధికార పార్టీ నేతలు, అప్పటి పురపాలక కమిషనర్, గుత్తేదార్లు దోచేశారని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సంచలన ఆరోపణలు చేశారు. స్థానిక వైకాపా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మరీ.. అప్పటి నిధుల స్వాహాపై ఆధారాలను చూపించారు. పేదరిక నిర్మూలనకు ఉపయోగించాల్సిన మెప్మా నిధులను నిబంధనలకు విరుద్ధంగా దారి మళ్లించారని, దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించి, బాధ్యులను శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'వైకాపా ప్రభుత్వం అప్పట్లో కొందరు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చింది. అందులో భాగంగా రామచంద్రపురం పట్టణానికి చెందిన లబ్ధిదారులకు వెల్ల, వెల్లసావరం, ఉండూరు, హసనబాద గ్రామాల్లో స్థలాలు కేటాయించింది. ఈ నాలుగు చోట్లా మున్సిపాలిటీ మెప్మా నిధులను అప్పటి మున్సిపల్ కమిషనర్ ఇళ్ల నిర్మాణానికి మళ్లించారు. చివరకు ఇళ్లు కూడా కట్టించకుండా నిర్మాణ సామగ్రిని నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్లతో కలిసి స్వాహా చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలన్నీ వెలుగులోకి వచ్చాయి' అని ఎంపీ బోస్ వివరించారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని, సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. ఈ అవినీతి కారణంగా బదిలీపై వెళ్లిన ఓ ఉద్యోగి తన సొంత డబ్బులు రూ.40 లక్షలు చెల్లించాల్సి వచ్చిందన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in


చిత్ర

ఒక వైపు ఉన్నత ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే... మరోపక్క దేశంలోని వివిధ అటవీ ప్రాంతాలను అన్వేషిస్తూ అరుదైన జీవరాశులపై అధ్యయనం చేస్తున్నారు. విద్యార్థులు, యువ పర్యావరణవేత్తలను ముందుండి నడిపిస్తూ అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు సైంటిస్ట్ డాక్టర్ చిత్ర శంకర్. తన గురించి వసుంధరతో పంచుకున్నారిలా...

కీటకాలు కనిపిస్తే... క్లిక్‌మనిపిస్తా!

నేను పుట్టి పెరిగింది తమిళనాడులో. స్కూలు, కాలేజీ విద్య కూడా ఇక్కడే సాగింది. తర్వాత కోయంబత్తూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి కీటక శాస్త్రంలో డాక్టరేట్ పొందాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ విభాగంలో రీసర్చ్ ప్రొఫెసర్‌గా చేస్తున్నా. ఇక్కడ వరి పంటకు సంబంధించిన కీటకాలపై పరిశోధనలు చేస్తుంటా. దీనిలో భాగంగానే సీతాకోక చిలుకలు, వివిధ రకాల పక్షుల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. చిన్నతనం నుంచి ప్రకృతిని పరిశీలించడమంటే ఇష్టం. అందుకే 35ఏళ్ల నుంచి లద్దాఖ్, మణిపుర్, నాగాలాండ్ మినహా అన్ని ప్రాంతాలను పర్యటించా. ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రకృతి అందాలను ఫొటోలు, వీడియోల రూపంలో కెమెరాలో బంధించడం అలవాటు. ఇప్పటి వరకూ దేశం అంతా తిరిగి 800 రకాల పక్షి జాతులు, 250 సీతాకోక చిలుకలను సొంతంగా గుర్తించా. తెలంగాణలో ప్రయోగాత్మకంగా బటర్‌ఫ్లై, మాత్(చిమ్మట)లను సర్వే చేయడానికి ములుగు జిల్లాకు వెళ్లా. ఏటూరునాగారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఎంతో విశాలమైనది. తాడ్వాయి, మేడారం, లక్నవరం మూడు ప్రాంతాల్లో పరిశీలించి 91 రకాల సీతాకోక చిలుకలను గుర్తించాం. ఉద్యోగ విరమణ అనంతరం దేశం మొత్తమ్మీద ఉన్న జాతీయ పార్కులు సందర్శించాలి. విదేశాల్లో ఉండే జీవజాతుల మీద కూడా పరిశోధనలు చేయాలి. జీవ వైవిధ్యం కాపాడటం కోసం దేశవ్యాప్తంగా పర్యటించి అవగాహన కార్యక్రమాలను చేపట్టాలి. ఒక మహిళ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. అందుకే మహిళలందరూ కెరియర్‌పై దృష్టిపెడుతూనే ఆసక్తి ఉన్న రంగం వైపు అడుగులు వేయాలి. అప్పుడే మంచి ఫలితాలు సాధించొచ్చు.

- ఇల్లందుల వెంకటేశ్వర్లు, ములుగు


ఊనా



మాటల్లేని చిత్ర ప్రపంచంలో హాస్యాన్ని భావోద్వేగాలతో సమ్మిళితం చేసిన గొప్ప నటుడు చార్లీచాప్లిన్. ఓ కంట కన్నీటినీ మరో కంట నవ్వునీ తెప్పించగలిగిన తాత వారసత్వాన్నే పుణికిపుచ్చుకున్నట్లుంది ఆయన మనవరాలు ఊనా చాప్లిన్. అవతార్ ఫైర్ అండ్ యాష్‌లో భయానక విలన్‌గా నటించి విమర్శకుల ప్రశంసలు అందుకుందీమె.

చాప్లిన్... ఓ భయానక విలన్!

జేమ్స్ కామెరూన్ అవతార్ దాని సీక్వెల్స్... ఓ కాల్పనిక ప్రపంచం. ఈ ఎపిక్ సైన్స్ ఫిక్షన్‌లోని పండోరా గ్రహంకోసం చేసిన గ్రాఫిక్స్, విజువల్స్ అన్నీ ఒకెత్తయితే, నీలిరంగు చర్మంతో ఉన్న నవీ పాత్రల సృష్టి మరోకెత్తు. తొమ్మిదీ పదీ అడుగుల ఎత్తుతో పిల్లి జాతి లక్షణాల్ని పోలిన ఈ నవీ అవతారాల్లో నటించేది మనుషులేననీ వాళ్ల కదలికలు, భావోద్వేగాలు, డైలాగుల్ని పెర్ఫార్మెన్స్ క్యాప్చర్ టెక్నాలజీ ద్వారా అవతార్ పాత్రల్లోకి మార్చారనీ తెలిసిందే. తాజా చిత్రంలో బూడిద రంగు తెగ (మాంగ్‌క్వాన్)నీ సృష్టించారు. ఆ తెగ నాయకురాలి పాత్రే 'వరంగ్'... ఏమాత్రం కనికరం లేని రక్తపిపాసి. అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి. మాట వినని వాళ్లను నాశనం చేయాలనే తత్వం... అదేసమయంలో మంచి వ్యూహకర్త, పోరాట యోధురాలు, తెగను కాపాడుకోవడంలోనూ యుద్ధ రచనలోనూ మహా దిట్ట... భిన్న లక్షణాలతో ఉన్న వరంగ్ పాత్రకి పూర్తి న్యాయం చేశారు ఊనా చాప్లిన్. ఆమె స్వరంలోని ఆధిపత్య ధోరణి, కోపం, ఉద్రేకంతో కూడిన నటన చూసి ప్రేక్షకులే కాదు, కామెరూన్ సహా తోటినటులూ చకితులయ్యారట.



ఎలా ఇలా?

ఊనా కాస్టిల్లా చాప్లిన్... గేమ్ ఆఫ్ థ్రోన్స్, ద క్రిమ్సన్ ఫీల్డ్, టాబూ... వంటి ప్రముఖ హాలీవుడ్ సిరీస్‌ల్లోనూ మరెన్నో చిత్రాల్లోనూ నటించింది. ఇప్పటివరకూ నటిగా మంచి పేరున్నప్పటికీ ఆమె ఖాతాలోని బ్లాక్‌బస్టర్ తాజా అవతార్-3 అనే చెప్పాలి. చార్లీ చాప్లిన్ చివరి, నాలుగో భార్య అయిన ఊనా-ఓ-నీల్ ఈమెకి అమ్మమ్మ. ఆమె పేరునే ఈమెకి పెట్టారు. ఊనా తల్లి జెరాల్డిన్ చాప్లిన్... ఈమె కూడా నటి కావడంతో ఊనా బాల్యం స్పెయిన్, లండన్, స్విట్జర్లాండ్, క్యూబాల్లో గడిచింది. చిన్నవయసులోనే బాలే, సల్సా, ఫ్లెమెంకో నృత్యాలు చేసేదట. నటనే వారసత్వంగా పుణికిపుచ్చుకున్న ఊనా స్కూల్లో ఉన్నప్పుడే నాటకాల్లో నటించేది. 'రాయల్ అకాడమీ ఆఫ్ డ్రామాటిక్ ఆర్ట్'లో డిగ్రీ చేసింది. తల్లితో కలిసి అనేక సినిమాలు, సిరీస్‌ల్లోనూ నటించింది. 'ఇప్పటివరకూ నేను నటించిన పాత్రలకీ అవతార్‌కీ పోలికలేదు. ఇందులో నటించడంకోసం హవాయ్ దీవుల్లో శిక్షణ ఇచ్చారు కామెరూన్. అగ్నిపర్వత ప్రాంతాల చుట్టూ గడిపాను. యుద్ధ విద్యల్నీ నేర్చుకున్నా. అంతేకాదు, ఈ సినిమాలో నాది విలన్ పాత్రే. కానీ బాధను అనుభవించే వ్యక్తులు బాధను ఎలా కలిగిస్తారో చెప్పడానికి వరంగ్ సరైన ఉదాహరణ. అందుకే ఈ పాత్ర నుంచి ఎంతో నేర్చుకున్నా' అంటోందీమె.

'ఆడిషన్స్‌లో ఊనా కోపాన్ని ప్రదర్శించే విధానం చూశాక ఈ పాత్రకు ఆమెనే సరిపోతుంది అనుకున్నా. నా నమ్మకం తప్పు కాలేదు. ఏడెనిమిది పేజీల సీన్ ఉన్నా ఎలాంటి జంకూ లేకుండా నటించింది' అంటూ ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు కామెరూన్.

పేరు మార్చుకుందామని...

'మొదట్లో చాప్లిన్ మనవరాలిగా పుట్టడం నాకు మైనస్‌గా భావించా. ఆ పేరు వల్లే అవకాశాలు వస్తున్నాయేమో నాకు నిజంగా అర్హత లేదేమో అనుకునే దాన్ని. ఓ దశలో పేరూ మార్చుకోవాలనుకున్నా. తరవాత ఆలోచించా. నేను కష్టపడుతున్నప్పుడు అవకాశం ఎలా వచ్చిందనేదాని గురించి ఆలోచించడం అనవసరం అనిపించింది. నా పేరు విన్నాక చాలామంది గూగుల్‌లోకి వెళ్లి ఆయన సినిమాలు మళ్లీ మళ్లీ చూస్తున్నారు. ఆ మేధావి, ప్రతిభాశీలికి మనవరాలిగా ఆ పేరులోని గొప్పతనాన్ని ఆనందించడం అలవాటు చేసుకున్నా' అంటోన్న ఊనా నటన... ఆస్కార్ అవార్డు స్థాయిలోనే ఉందని సినీ విమర్శకులూ విశ్లేషిస్తున్నారట. ఎంతైనా ఆ మహానటుడి మనవరాలే కదా!

స్వీడన్ మహిళల అందం రహస్యమిది...

అందంపై ఆడవాళ్లు పెట్టే శ్రద్ధ ఎప్పుడూ ప్రత్యేకమే. ఏ దేశ మహిళలైనా ఇందుకు మినహాయింపు కాదు. ఈ విషయంలో స్వీడన్ స్త్రీల సౌందర్య సంరక్షణ విధానాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అవేంటంటే...



సౌనా స్నానాలు: స్వీడన్‌లో శరీర శుద్ధికి సౌనా స్నానాలు చేస్తారు. చెక్కగదిలో వేడి ఆవిరితో చేసే ఈ స్నానం వల్ల ఒంట్లోని ఒత్తిడి మాయమవుతుంది. చర్మరంధ్రాలు తెరుచుకుని టాక్సిన్లు బయటకు వెళ్తాయి. రక్త ప్రసరణ మెరుగుపడి చర్మం తేటగా కనిపిస్తుంది.

కోల్డ్ ప్లంజెస్, ఐస్ ఫేషియల్స్: శీతల సరస్సుల్లో ఈత కొట్టడం, చల్లటి నీటితో ముఖం కడగడం వీరి బ్యూటీ రొటీన్‌లో భాగం. ఇలా చేయడం వల్ల రక్తప్రసరణ సరిగా జరిగి వాపు తగ్గుతుంది. చర్మం సహజ కాంతితో మెరిసిపోతుంది.

నార్డిక్ బెర్రీలు: స్వీడన్‌లో సహజంగా లభించే క్లౌడ్‌బెర్రీ, లింగన్‌బెర్రీ, సీ బక్‌థార్న్ పండ్లలో విటమిన్ సితో పాటు ఇతర పోషకాలూ పుష్కలంగా ఉంటాయి. దీంతో వీటిని తినడం, ఇన్‌ఫ్యూజ్‌డ్ వాటర్‌గా తాగడం, నూనెల్ని ఒంటికి రాయడం వల్ల చర్మం యవ్వనంగా, దృఢంగా మారుతుంది.

హెర్బల్ టీలు: బిర్చ్ చెట్టు(భోజపత్ర వృక్ష) సారాన్ని ఈ దేశ మహిళలు చర్మాన్ని క్లెన్సింగ్ చేయడానికి వాడతారు. హెర్బల్ టీ రూపంలోనూ తీసుకుంటారు. ఇందులోని పోషకాలు శరీరం లోపలి నుంచి హైడ్రేట్ చేసి చర్మాన్ని మెరిపిస్తాయని నమ్ముతారు.

అప్పట్లో... నేను!

వైరల్



ఇన్‌స్టాగ్రామ్ చూశారా? హీరోయిన్ల దగ్గర్నుంచి ఇన్‌ఫ్లుయెన్సర్ల వరకూ ఒకటే ట్రెండ్! '2016లో నేను'. అప్పటి ఫొటోలను షేర్ చేస్తూ '2026 ఈజ్ ద న్యూ 2016' అని క్యాప్షన్ ఇచ్చేస్తున్నారు. స్నాప్‌చాట్‌లో కుక్కపిల్ల చెవులు ముక్కుతో షేర్ చేసిన ఫిల్టర్లు, ప్రిన్సెస్‌లా పూల కిరీటాన్ని పెట్టడం... అప్పట్లో ఎన్నెన్ని ప్రయోగాలనీ! ఇప్పుడు చూస్తే చిన్న పిల్ల చేష్టల్లా తోయొచ్చేమో... అప్పుడు మాత్రం అదో ఆనందమే. పైగా 'అరె ఇది భలే చేశావే ఎలా'గంటూ ఫ్రెండ్స్ అడుగుతోంటే ఉబ్బితబ్బిబ్బవ్వడం వాళ్లకీ నేర్పడం ఆ రోజులే వేరులే. మీరూ అలా అనుకుంటూ ఆ రోజుల్లోకి వెళ్లిపోయారా? అవును మరి... 2016... సరిగ్గా దశాబ్దం క్రితం. అప్పుడు మనమెలా ఉండుంటాం? చిన్న వయసు... స్కూలు లేదా కాలేజీ, కొత్తగా ఆఫీసు జీవితాల్లో ఉండుంటాం. ప్రస్తుతం వయసైనా ఇప్పటికంటే చిన్నేగా. అంతేకాదు, ఇంటర్నెట్‌లో పాప్ కల్చర్ పరిచయమైన, డబ్‌స్మాష్, స్నాప్‌చాట్... 'వైరల్' కంటెంట్ ప్రారంభమైన రోజులవి. తలచుకోవాలే గానీ ఎన్నెన్నో గుర్తొస్తాయి. అప్పటి మనకీ ఇప్పటి మనకీ ఎంత తేడా అని ఆశ్చర్యపోతాం. ఎంత సింపుల్‌గా జీవించేశాం అనిపిస్తుంది. మళ్లీ ఆరోజులు వస్తే బాగుండు అనీ అనుకుంటాం. చాలామందిదీ ఇదే భావన కాబట్టే... ప్రపంచవ్యాప్తంగా ఈ '2016' ట్రెండ్‌లో భాగమవుతున్నారు. నాటి ఫొటోలు, వీడియోలకు ఆనాటి పాటల్నే జత చేస్తూ మురిసిపోతున్నారు. మీ సంగతేంటి? ఓసారి వెనక్కి వెళ్లొస్తారా? ట్రెండ్‌లో భాగం కానక్కర్లేదు. కానీ ఓసారి నాటి జ్ఞాపకాల్లోకి వెళ్లిరండి. బాగుంటుంది... మనలో తేడా, నాటి లక్ష్యాలు, చేసుకోవాల్సిన మార్పులు... ఇలా ఇంకెన్నో తెలుస్తాయి. ఆనందానికి తోడు మిస్ అయినవీ సరి చూసుకోవచ్చు. ప్రయత్నించి చూడండి.



వ్యర్థాలకు అర్థం చెబుతున్నారు!

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ఎన్ని సమస్యలో. దాన్ని పరిష్కరించాలనుకున్నారు సాక్షి ఝా. 150 టన్నుల ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ చోటు దక్కించుకున్నారు. తాజాగా వివేకానంద యువ అవార్డును అందుకున్నారు. ఆమె గురించి తెలియాలంటే...


సాక్షి

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమస్యలు పెరుగుతున్నప్పటికీ కొంతమంది మాత్రమే ప్రకృతికి మేలు చేయాలనుకునే వారుంటారు. అలాంటి వారిలో ముందుంటారు సాక్షి ఝా. బిహార్‌లో పుట్టి పెరిగినప్పటికీ చదువుకోసం ఉత్తర్ ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు మకాం మార్చారీమె. ప్లాస్టిక్, ఇనుము, వస్త్ర వ్యర్థాలను ఉపయోగించి అలంకరణ వస్తువులను తయారుచేస్తున్నారు. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని 1,650 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి నోయిడాలో ప్రపంచంలోనే అతిపెద్ద రాట్నం ఏర్పాటు చేశారు. ఇందుకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంతోపాటు, ముఖ్యమంత్రి నుంచి వివేకానంద యువ అవార్డునూ అందుకున్నారు.

వేస్ట్ టు వండర్ వరకు...

అర్థశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తిచేసిన సాక్షి మొదట్లో వెడ్డింగ్ ప్లానర్‌గా చేసేవారు. ఆ సమయంలో ఈవెంట్లు, పార్టీలు అయ్యాక పెద్దమొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం ఆమెను ఆలోచనలో పడేసిందట. 'పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడానికి ఈ వ్యర్థాలతో ఏదైనా చేయగలనా? అనుకున్నా. దాంతో రూ.యాభైవేలు పెట్టుబడితో 'సర్ఫాజ్ సాక్షి ఇన్నొవేషన్స్'ని మొదలుపెట్టా. పార్ట్ టైమ్ జాబ్‌లా దీన్ని చేసేదాన్ని. కృషి, పట్టుదలతో చేయడంతో ఇప్పుడు ఇది రూ.కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. ప్రస్తుతం ఉత్తర్ ప్రదేశ్‌లో అనేక జిల్లాల్లో పర్యావరణ పరిరక్షణకై మా ప్రాజెక్టు పని చేస్తోంది. 2018లో దీన్ని మొదలుపెట్టా. అప్పటి నుంచి ఇప్పటి వరకు 150 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేశాం. 2026 నుంచి ఏటా వెయ్యిటన్నులు వ్యర్థాలను రీసైకిల్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్థానిక పట్టణ సంస్థలతో కలిసి ఈ వ్యర్థాలను సేకరిస్తాం. వాటితో పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఫర్నిచర్ తయారుచేసి ఇస్తాం. ప్రధాన కూడళ్లు, పార్కుల్లో వ్యర్థాలతో తయారుచేసిన వస్తువులతోనే అలంకరిస్తాం. 2020లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ స్థానం సంపాదించుకున్నా. మా దగ్గర ఇవన్నీ చేసేది గృహిణులే. వ్యర్థాన్ని కూడా ఉపయోగపడే వస్తువుగా మార్చే సామర్థ్యం మహిళలకు ఉంటుంది. అందుకే 50మందికి ఉపాధిని ఇవ్వగలుగుతున్నా' అంటారు సాక్షి.

పంచుకున్న ఆస్తిని రద్దు చేసుకోవచ్చా?

మా అమ్మానాన్నలకు... మేం నలుగురు సంతానం. ఈ మధ్య మేమంతా పరస్పర అంగీకారంతో ఆస్తిని సమంగా పంచుకుని రిజిస్టర్ చేయించుకున్నాం. అయితే, భవిష్యత్తులో ఎవరైనా తమకి అన్యాయం జరిగిందని భావిస్తే ఆ దస్తావేజులను రద్దు చేసుకోవచ్చా? – ఓ సోదరి

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి
న్యాయవాది

మీరు పార్టిషన్ చేసుకున్నారా? లేక సెటిల్‌మెంట్ డీడ్ రాసుకున్నారా? ఏ రకంగా పంచుకున్నప్పటికీ దాన్ని రద్దు చేసుకోవాలంటే మళ్లీ అందరూ కలిసి కూర్చుని ఓ ఒప్పందానికి వస్తే మాత్రమే మార్చుకునే వీలుంటుంది. అప్పుడు కూడా ఈ పాత సెటిల్‌మెంట్ డీడ్‌ని ప్రస్తావిస్తూ కొత్తది రాసుకోవాలి. ఆపై దాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆ క్షణం నుంచి మాత్రమే అది వ్యాలిడేట్ అవుతుంది. అయితే, ఇందుకు అందరూ సమ్మతించాలి. మీ తోడబుట్టిన వాళ్లలో ఏ ఒక్కరు సంతకం పెట్టకపోయినా కూడా అది చెల్లదు. పాతదే అమలులో ఉంటుంది. ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

జిమ్ చేస్తున్నారా?!

కొత్త ఏడాది... వ్యాయామం చేయాలన్న నిర్ణయం తీసుకుని జిమ్‌కి వెళ్లడం మొదలుపెట్టారా? అయితే ఈ జాగ్రత్తలు తీసుకోండి...



- బూట్లూ, దుస్తులూ : అసలెన్ని రోజులు వ్యాయామం చేస్తామో తెలియదు. కాస్త అలవాటు పడేదాకా ఏవో ఒకటి కొనేద్దాం అనుకునేవారు చాలామంది. కానీ, బూట్లూ, దుస్తుల విషయంలో ఇలా ఆలోచించడం తప్పు. నాసిరకం బూట్ల వల్ల వారంలోనే కాలి మడమలూ, మోకాళ్ల నొప్పి పుడతాయి. కొన్నిసార్లు అంతర్గత గాయాలూ కావొచ్చు. అంతేకాదు, ఒంటికి గాలి తగలనివ్వని, సౌకర్యంగా లేని దుస్తులు వేసుకుంటే శరీరం తొందరగానే చెమటపట్టి వేడెక్కుతుంది. డీహైడ్రేషన్ ఆవరించి.. నిస్సత్తువగానూ అనిపిస్తుంది. కాబట్టి సౌకర్యవంతమైన దుస్తుల విషయంలో రాజీ వద్దు.
- మంచి నీళ్లు: వ్యాయామానికి అలవాటు పడేదాకా రోజూ మీ వెంట ఓ మంచినీళ్ల సీసా తీసుకెళ్లండి. అవసరమైనప్పుడు ఒక్కో గుటక వేసినా చాలు. గుండె వేగం పెంచే వ్యాయామాలప్పుడు కళ్లు తిరగడం, నీరసించడం వంటి సమస్యలుండవు.
- వార్మ్‌అప్ : కాస్త కష్టమైన వ్యాయామాలకే కాదు.. సులభంగా చేసేవాటికైనా సరే 'వార్మ్-అప్' తప్పనిసరి. వేగంగా నడవడమే మీ వ్యాయామం అనుకున్నా.. దానికి ముందు కాస్త మెల్లగా నడక మొదలుపెట్టడమే వార్మ్-అప్! మొత్తం వ్యాయామం సమయంలో 25 శాతం ఇందుకోసం కేటాయించాలి. ఇక స్ట్రెచ్‌ల విషయానికొస్తే వీటిని వ్యాయామం చివర్లో చేస్తేనే మంచిది.

మీకు తెలుసా..!

శిశువు పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకు వాళ్ల మెదడు వేగంగా వృద్ధి చెందుతుంది. ఈ పెరుగుదల మూడేళ్లకి 80శాతం, ఐదేళ్లకి 90 శాతంగా ఉంటుంది. ప్రతి సెకనుకి పది లక్షలకి పైగా నాడులు అనుసంధానం అవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే ఈ సమయంలో శిశువు ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అంటున్నారు శాస్త్రవేత్తలు.




బంగారం - వెండి



19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,46,130	1,33,950	3,18,000
విజయవాడ	1,43,900	1,33,550	3,00,000
ప్రొద్దుటూరు	1,45,500	1,33,860	2,96,000
రాజమహేంద్రవరం	1,46,240	1,34,050	3,18,000
విశాఖపట్నం	1,46,240	1,34,050	3,01,000
తమిళనాడు	-----	1,34,500	3,18,000



మ్యాటీలు మెరిపించంగా!

నగా నట్రా



ఆధునికంగా కనిపించే అమ్మాయిలు సైతం సంప్రదాయంగా కనిపించాలనుకున్నప్పుడు తప్పక ఎంచుకునే నగల్లో మ్యాటీలు ఒకటి. పురాతన కాలంలో చెవులకు బరువైన జుంకాలు ధరించేవారట. వాటి బరువుని తగ్గించడానికీ, చెవి తమ్మెలు తెగిపోకుండా సపోర్ట్ ఇవ్వడానికీ వీటిని ఆభరణంగా మలిచారట. కాలక్రమంలో ఇవి సౌందర్యానికీ, సంప్రదాయానికీ చిహ్నంగా మారాయి. తర్వాత వీటి స్థానాన్ని చెంపసరాలు ఆక్రమించడంతో కొన్నాళ్లు వీటి ప్రాభవం తగ్గిందనుకున్నా... ఇప్పుడు మళ్లీ ఈతరం ఆడపిల్లల మనసు దోచుకుంటున్నాయి. పాతవాటికే కాస్త కొత్త హంగులద్దుకుని సందడి చేస్తున్నాయి. అదెలాగంటారా? జుంకాలు, మ్యాటీలు విడివిడిగా కాదు... కలిపి డిజైన్ చేయడంతో మ్యాచింగ్‌గా కూడా మురిపిస్తున్నాయి. వీటిల్లోనూ లైట్ వెయిట్‌లోనూ, మోడర్న్ వైబ్స్ వచ్చేలా రంగు రంగుల ఎనామిల్ వర్క్, కుందన్-పోల్కీలతో తయారు చేసినవి రిచ్ లుక్‌తోనూ ఆకట్టుకుంటున్నాయి. ఈ మ్యాటీ జుంకాలను మీ దుస్తులకు మ్యాచింగ్‌గా ఎంచుకోవడమే తరువాయి. వాటినోసారి చూసేయండి మరి.



చాంపియన్స్



ఈ బంతికి ఏమైంది?

న్యూజిలాండ్‌తో సిరీస్ టీమ్‌ఇండియా బౌలింగ్‌లో డొల్లతనాన్ని బయటపెట్టింది. అసలు మనోళ్లు సొంతగడ్డపైనే ఆడుతున్నారా అన్న భావన కలిగేలా ఉంది ప్రదర్శన. ఇటు పేస్‌లోనూ అటు స్పిన్‌లోనూ ప్రభావం శూన్యం. వచ్చే ఏడాదే వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో నాణ్యత లేని భారత బౌలింగ్ ఆందోళన కలిగిస్తోంది.

ఈనాడు క్రీడావిభాగం

సొంతగడ్డపై ఆడుతుంటే టీమ్‌ఇండియా ఒకప్పుడు తిరుగులేని ఫేవరేట్. అందుకే ఏనాడూ ఈ నేలపై వన్డే క్రికెట్లో కివీస్ పైచేయి సాధించలేకపోయింది. ఈసారి కూడా టీమ్‌ఇండియానే గెలుస్తుందని అనుకున్నారంతా! కానీ ఆ ఊహే లేదు. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన కివీస్.. భారత్‌లో తొలిసారి వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. మన బ్యాటర్లు విఫలమయ్యారన్నది నిజం. కానీ పరాభవానికి ప్రధాన కారణంగా బౌలింగే కనిపిస్తోంది. భారత్ బంతితో ప్రత్యర్థిని కాస్తయినా భయపెట్టలేకపోయింది. మన బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. సిరీస్‌లో సగటున ఓవర్‌కు 6.2 పరుగులిచ్చారంటే వాళ్ల దుస్థితి అర్థం చేసుకోవచ్చు. మ్యాచ్ వేదికలు బౌలింగ్‌కు అనుకూలమైనవేమీ కావు. కానీ భారత బౌలర్లు విఫలమైన అదే పిచ్‌పై.. కివీస్ బౌలింగ్ దళం ప్రభావం చూపగలిగింది.


కుల్‌దీప్


ప్రసిద్ధ్

పసలేని పేస్

అసలు ఈ వన్డే సిరీస్‌కు బుమ్రాను ఎందుకు ఎంపిక చేయలేదో తెలియదు. బహుశా.. టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో అతడికి విశ్రాంతి అవసరమని భావించి ఉండొచ్చు. ఈ సిరీస్ అంత ముఖ్యమైనదిగా అనిపించకపోవచ్చు. కారణమేదైనా.. బుమ్రా లేని పేస్ ఎటాక్ పదును కోల్పోయింది. వికెట్ల వేటలో భారత పేసర్లంతా కివీస్ ఫాస్ట్‌బౌలర్ల (క్రిస్టియన్ క్లార్క్, జేమీసన్) వెనక నిలిచారు. నిలకడగా 140 కి.మీ వేగంతో బౌలింగ్ చేసిన హర్షిత్ రాణా ఆరు వికెట్లు పడగొట్టడం తప్పితే భారత పేసర్ల ప్రదర్శన సాధారణమే. కానీ అతడు పరుగుల ప్రవాహానికి అడ్డుకట్టవేయలేకపోయాడు. ధారాళంగా పరుగులిచ్చాడు. భారత పేసర్లలో అత్యధిక ఎకానమీ రేట్ (6.81) అతడిదే కావడం గమనార్హం. మహ్మద్ సిరాజ్ (3 వికెట్లు, ఎకానమీ 4.59) కట్టుదిట్టంగానే బౌలింగ్ చేసి, బ్యాటర్లకు కళ్లెం వేసినా.. జట్టుకు అవసరమైన వికెట్లను అందించలేకపోయాడు. మరోవైపు ప్రసిద్ధ్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. ఇప్పుడు టీమ్‌ఇండియా బౌలింగ్ కూర్పుపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆఖరి ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేసే బుమ్రా గైర్హాజరీలో అర్ష్‌దీప్‌ను ఆఖరి మ్యాచ్‌లో గానీ జట్టులోకి తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించేదే. డెత్ ఓవర్లలో అతడు చాలా మెరుగ్గా బౌలింగ్ చేయగలడు. ప్రసిద్ధ్ స్థానంలో అతణ్ని తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడిస్తే సిరీస్ ఫలితం భిన్నంగా ఉండేదన్నది చాలా మంది అభిప్రాయం. ఇక నితీశ్ ఆల్‌రౌండర్ కోటాలో జట్టులోకి వచ్చినా.. బంతితో ప్రభావం చూపలేకపోయాడు. వికెట్ల వేటలో విఫలం కావడం జట్టును దెబ్బతీసింది. ఆరంభంలో నిలకడగా వికెట్లు తీసి, మధ్య ఓవర్లలో పరుగుల వేగానికి కళ్లెం వేసి, ముగింపులో గొప్పగా బౌలింగ్ చేసే బౌలర్ భారత్‌కు లేడు. ఏ దశలో బంతి ఇచ్చినా ఫలితం రాబట్టే బౌలర్ ఎంతో అవసరం. 2027 ప్రపంచకప్ ఆరంభమయ్యే లోపు ఈ సమస్యను పరిష్కరించకపోతే ఇబ్బందులు తప్పవు. బుమ్రా, హార్దిక్ పాండ్య తిరిగి జట్టులోకి వస్తే పేస్ బౌలింగ్ పదునెక్కుతుందనడంలో సందేహం లేదు. కానీ సరైన ప్రత్యామ్నాయాలు లేకపోవడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే.


తిప్పలేక తిప్పలు

కివీస్‌కు భారత్ వన్డే సిరీస్ కోల్పోవడానికి బౌలింగ్ వైఫల్యం పెద్ద కారణమైతే.. ఆ వైఫల్యంలో మరింత పెద్ద బాధ్యత స్పిన్నర్లది. ఎడమచేతి వాటం స్పిన్నర్లు జడేజా, కుల్‌దీప్ యాదవ్ పూర్తిగా తేలిపోయారు. గతంలో అద్భుతంగా బౌలింగ్ చేసిన కుల్‌దీప్, ఈ సిరీస్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. అతడి ప్రభావం శూన్యం. మూడు మ్యాచ్‌ల్లో 25 ఓవర్లు వేసిన అతడు.. ఏకంగా 7.28 ఎకానమీ రేట్‌తో 182 పరుగులిచ్చాడు. కేవలం మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక జడేజా ఒక్కటంటే ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. ఎకానమీ ఆరుకుపైనే. అసలు అతడు ఉన్నట్లే తెలియట్లేదు. మధ్య ఓవర్లలో ఈ స్పిన్నర్ల వైఫల్యం భారత్‌ను దారుణంగా దెబ్బతీసింది. ఈ ద్వయం వికెట్లూ తీయలేకపోయింది. పరుగుల వేగానికి అడ్డుకట్టావేయలేకపోయింది. ఇద్దరూ కలిసి 48 ఓవర్లలో 323 పరుగులిచ్చి కేవలం మూడు వికెట్లు పడగొట్టారంటే.. మధ్య ఓవర్లలో వైఫల్యం ఎలా ఉందో అర్థం చేసుకోచ్చు. తొలి వన్డేలో మాత్రమే ఆడిన సుందర్ కూడా ఏమాత్రం రాణించలేదు. ఈ ఒక్క సిరీస్‌లోనే కాదు.. ఇటీవల కాలంలో సొంత గడ్డపై భారత స్పిన్నర్ల ప్రదర్శన బాగా క్షీణించడం ఆందోళన కలిగించే విషయమే. పేలవ ప్రదర్శనల నేపథ్యంలో జడేజా వన్డే భవిష్యత్తుపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్షర్ పటేల్‌ను కాదని బంతితో, బ్యాటుతో వరుసగా విఫలమవుతున్నా జడేజాను కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి. జడేజా కన్నా అక్షర్ చాలా మెరుగని మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. "ఇద్దరిలో ఒకరిని ఎంచుకోవాల్సివస్తే అక్షర్‌నే ఎంచుకోవాలి. అతడు చాలా ముందున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటిలోనూ జడేజా కన్నా అక్షర్ చాలా మెరుగు. అక్షర్‌ను కనీసం జట్టులోకి కూడా ఎందుకు తీసుకోలేదన్నది అర్థం కావట్లేదు" అని అన్నాడు.


జడేజా

ఆటకు సైనా వీడ్కోలు

దిల్లీ: భారత మహిళల బ్యాడ్మింటన్‌కు మార్గదర్శిగా నిలిచి ఎన్నో అత్యుత్తమ విజయాలు అందుకున్న సైనా నెహ్వాల్ ఆటకు వీడ్కోలు పలికింది. చైనా ఆధిపత్యానికి గండి కొట్టి అత్యున్నత శిఖరాలకు చేరిన సైనా.. రాకెట్ వదిలేస్తున్నట్లు చెప్పింది. గత కొన్నేళ్లుగా సైనా ఆటకు దూరంగానే ఉన్నా.. సోమవారం వీడ్కోలు విషయాన్ని ఖరారు చేసింది. ఆమె చివరగా 2023లో సింగపూర్ ఓపెన్‌లో ఆడింది. "రెండేళ్ల కిందటే నేను ఆడటం మానేశా. నా అంతట నేను ఆటలోకి వచ్చా.. నా అంతట నేను నిష్క్రమిస్తున్నా. అందుకే ప్రకటించడం అవసరం లేదనుకున్నా. ఇంకెంతమాత్రం ఆడగలిగే సామర్థ్యం లేనప్పుడు కథ ముగిసినట్లే. మరేం పర్వాలేదు" అని సైనా ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పింది. మోకాళ్ల సమస్యే తన వీడ్కోలు నిర్ణయానికి కారణమని ఆమె తెలిపింది. రిటైరవుతున్నట్లు లాంఛనంగా ప్రకటించడం అవసరమని తాను భావించలేదని సైనా పేర్కొంది.



అమ్మాయిల్లో స్ఫూర్తినింపి...

ఈనాడు క్రీడావిభాగం

భారత బ్యాడ్మింటన్ పేరు చెప్పగానే ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ టైటిళ్లు గెలిచిన ప్రకాశ్ పదుకొనె, పుల్లెల గోపీచంద్ మాత్రమే కనిపించేవాళ్లు. వాళ్ల తర్వాత అంతర్జాతీయ స్థాయిలో ఎవరూ అనే ప్రశ్నకు సమాధానంగా దూసుకొచ్చింది సైనా నెహ్వాల్. గొప్ప ఆట, అత్యున్నత ఫిట్‌నెస్‌తో ఆమె అద్భుతాలే చేసింది. అంతకుముందు వరకు భారత మహిళల బ్యాడ్మింటన్‌లో ఎవరూ సాధించలేని ఘనతలను, అందుకోలేని రికార్డులను సొంతం చేసుకుంది. దేశంలో ఎంతో మంది అమ్మాయిలు రాకెట్ పట్టడానికి ప్రేరణగా నిలిచింది.

చైనా షట్లర్లు అంటే భయపడే పరిస్థితి నుంచి డ్రాగన్ ప్లేయర్లపై కూడా మనోళ్లు విజయం సాధించగలరనే ధీమాను ఇచ్చింది సైనా. సాంకేతికంగా బలమైన ఆటతో వాంగ్ గ్జిన్, వాంగ్ గ్జియాన్ లాంటి స్టార్ ప్లేయర్ల ఆధిపత్యానికి గండికొట్టడమే కాక.. స్థిరమైన విజయాలతో ప్రపంచ బ్యాడ్మింటన్‌లో తన ముద్ర వేసింది. పుల్లెల గోపీచంద్ శిక్షణలో రాటుదేలిన సైనా.. అత్యుత్తమ విజయాలను అందుకుంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్, సూపర్ సిరీస్‌లలో అంతకుముందెప్పుడూ చూడని విజయాలు భారత్ సొంతమయ్యాయంటే సైనానే కారణం. 2008లో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి తన సత్తాను ప్రపంచానికి చాటిన సైనా.. అంతకంతకు స్థాయిని పెంచుకుంటూ పోయింది. 2009లో బీడబ్ల్యూఎఫ్ సూపర్ సిరీస్ గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా నిలిచింది. ఇండోనేసియా ఓపెన్, సింగపూర్, స్విస్ ఓపెన్లలో విజయాలు ఆమెను మరో స్థాయికి తీసుకెళ్లాయి. సైనా కెరీర్‌లో 10 సూపర్ సిరీస్, 10 గ్రాండ్‌ప్రి టైటిళ్లు ఉన్నాయి. 2014లో ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచిన ఆమె.. 2015లో ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఆల్ ఇంగ్లాండ్ టోర్నీలో ఫైనల్‌కు వెళ్లినా రన్నరప్‌గా నిలిచింది. అదే ఏడాది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌ను దక్కించుకుని, బ్యాడ్మింటన్‌లో ఈ ఘనత సాధించిన భారత తొలి మహిళా ప్లేయర్‌గా చరిత్రలో నిలిచింది. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం దక్కించుకుంది. 2018 ఆసియా క్రీడల్లో మరో కంచు సాధించింది. కామన్వెల్త్‌లో మూడు స్వర్ణాలు సహా అయిదు పతకాలు ఖాతాలో వేసుకుంది. 2009లో అర్జున అవార్డు పొందిన సైనా.. 2010లో అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్న సొంతం చేసుకుంది. 2023లో చివరగా సైనా కోర్టులో కనిపించింది. భారత బ్యాడ్మింటన్‌కు చిరునామాగా మారిన సైనా బాటలోనే నడిచి.. ఆమె స్ఫూర్తితోనే పి.వి.సింధు కూడా ప్రపంచ స్థాయి షట్లర్‌గా ఎదిగింది.

● ఒలింపిక్స్‌తో పాటు బీడబ్ల్యూఎఫ్ మేజర్ టోర్నీలైన ప్రపంచ ఛాంపియన్‌షిప్, ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో కనీసం ఒక పతకం సాధించిన తొలి భారత ప్లేయర్ సైనానే.

బంగ్లా స్థానంలో స్కాట్లాండ్?

రేపటిలోగా తేల్చుకోవాలని బీసీబీకి ఐసీసీ అల్టిమేటం

దిల్లీ: భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే విషయంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు ఐసీసీ గడువు విధించింది. ఈనెల 21 (బుధవారం)లోపు తమ నిర్ణయాన్ని వెల్లడించాలని.. లేదంటే టోర్నీ నుంచి తప్పించి మరో జట్టుకు అవకాశం కల్పిస్తామని హెచ్చరించింది. బీసీబీతో చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. భారత్‌లో పర్యటించేందుకు బంగ్లా నిరాకరిస్తే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించాలని ఐసీసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. "పొట్టి కప్పులో పాల్గొనే విషయంలో బుధవారంలోపు నిర్ణయం తీసుకోవాలని బీసీబీకి స్పష్టం చేశాం. భారత్‌కు వెళ్లడానికి బంగ్లా నిరాకరిస్తే.. ప్రస్తుత ర్యాంకింగ్స్ ఆధారంగా ఆ స్థానాన్ని మరో జట్టుతో భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉండాలి" అని బీసీబీకి అల్టిమేటం జారీ చేసినట్లు ఐసీసీ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ రెహమాన్ తొలగింపుతో ఈ సంక్షోభం మొదలైంది. భద్రత కారణాలు, జాతీయ గౌరవాన్ని సాకుగా చూపుతూ కోల్‌కతా, ముంబయిలలో జరగాల్సిన తమ గ్రూపు మ్యాచ్‌ల కోసం భారత్‌కు వచ్చేందుకు బంగ్లా నిరాకరిస్తోంది. అయితే ఐసీసీ భద్రత అంచనా నివేదిక ప్రకారం బంగ్లా జట్టుకు ఎలాంటి ప్రత్యక్ష ముప్పు లేదని స్పష్టమైంది. అయినా.. బంగ్లా బెట్టు చేస్తుండటంతో కఠినంగా వ్యవహరించాలని ఐసీసీ నిర్ణయించుకుంది.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
దిల్లీ × ముంబయి
వేదిక: వడోదర, రా॥ 7.30

ఆర్సీబీది అదే జోరు

డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీకి ఎదురులేకుండాపోయింది. అజేయ రికార్డును కొనసాగిస్తూ ఆ జట్టు వరుసగా అయిదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. గౌతమి నాయక్ మెరుపులకు సయాలి, డిక్లెర్క్‌ల సూపర్ బౌలింగ్ తోడవడంతో గుజరాత్‌ను బెంగళూరు చిత్తుగా ఓడించింది. ఆర్సీబీ ప్లేఆఫ్స్‌లో స్థానాన్ని ఖాయం చేసుకుంది.

● ఖాతాలో వరుసగా అయిదో విజయం
● గుజరాత్ పరాజయం


గౌతమి

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. సోమవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 61 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఘనవిజయం సాధించింది. గౌతమి నాయక్ (73; 55 బంతుల్లో 7×4, 1×6) చెలరేగడంతో మొదట ఆర్సీబీ 6 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. ఛేదనలో గుజరాత్ చేతులెత్తేసింది. 8 వికెట్లకు 117 పరుగులే చేయగలిగింది. సయాలి (3/21), డిక్లెర్క్ (2/17) ఆ జట్టును దెబ్బతీశారు. లారెన్ బెల్ (1/23), శ్రేయాంక పాటిల్ (1/19) కూడా బంతితో రాణించారు. కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ (54; 43 బంతుల్లో 5×4, 1×6) మినహా టైటాన్స్ బ్యాటర్లంతా విఫలమయ్యారు. టోర్నీలో గుజరాత్‌కు ఇది వరుసగా మూడో ఓటమి. లీగ్ దశలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టేబుల్ టాపర్ నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది. రెండు, మూడో స్థానాల్లో నిలిచిన జట్లు.. ఫైనల్లో చోటు కోసం ఎలిమినేటర్ ఆడతాయి.

తేలిపోయిన టైటాన్స్: ఛేదనలో టైటాన్స్ తేలిపోయింది. ఏ దశలోనూ గెలిచేలా కనపడలేదు. ఆరంభమే ఆ జట్టుకు పెద్ద షాక్. 5 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. సయాలి ఇన్నింగ్స్ రెండో ఓవర్లో మూనీ (3), సోఫీ డివైన్ (0)ను ఔట్ చేయగా... కనిక (0)ను లారెన్ బెల్ వెనక్కి పంపింది. ఆ దశలో కెప్టెన్ గార్డ్‌నర్ పట్టుదలగా నిలిచింది. కానీ మరోవైపు నుంచి ఆమెకు సహకారం కరవైంది. కాసేపు నిలిచిన అనుష్క శర్మ (18) జట్టు స్కోరు 34 వద్ద ఔటైంది. కష్వీ గౌతమ్ (4)ను రాధ, వేర్‌హామ్ (2)ను డిక్లెర్క్ త్వరగానే వెనక్కి పంపారు. 13వ ఓవర్లో వేర్‌హామ్ నిష్క్రమించేటప్పటికి గుజరాత్ స్కోరు 56 మాత్రమే. 6 వికెట్లు పడిపోవడం, సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోవడంతో టైటాన్స్ ఓటమి ఖాయమైపోయింది. పోరాటాన్ని కొనసాగించిన గార్డ్‌నర్.. కొన్ని చక్కని షాట్లతో అలరించింది. కానీ ఆమె పోరాటం ఏమాత్రం సరిపోలేదు. 17వ ఓవర్లో ఆమె నిష్క్రమణ తర్వాత మ్యాచ్‌లో మిగిలిన ఆసక్తి ఏమీ లేదు.

గౌతమి ధనాధన్: గౌతమి నాయక్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో మొదట బెంగళూరు గట్టి లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. ఇన్నింగ్స్‌ను పేలవంగా ఆరంభించింది. రెండు ఓవర్లలో 9 పరుగులకే రెండు వికెట్లు చేజార్చుకుంది. గ్రేస్ హారిస్ (1)ను రేణుక సింగ్ ఔట్ చేసి వికెట్ల పతనాన్ని ఆరంభిస్తే.. జార్జియా వోల్ (1)ను కష్వీ గౌతమ్ పెవిలియన్ బాట పట్టించింది. ఆ దశలో స్మృతి మంధాన (26; 23 బంతుల్లో 4×4), గౌతమి జట్టును ఆదుకున్నారు. అయితే పదో ఓవర్లో స్మృతిని గార్డ్‌నర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో 60 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కానీ దూకుడు పెంచిన గౌతమి.. రిచా ఘోష్ (27; 20 బంతుల్లో 3×6)తో కలిసి మరో విలువైన భాగస్వామ్యాన్ని (69) నెలకొల్పింది. రిచా రెండు సిక్స్‌లు బాదడంతో ఇన్నింగ్స్ 16వ ఓవర్లో తనూజ 17 పరుగులు సమర్పించుకుంది. అయితే తర్వాతి ఓవర్లోనే ఆమె వెనుదిరిగింది. విలువైన ఇన్నింగ్స్ ఆడిన గౌతమి.. 18వ ఓవర్లో నిష్క్రమించింది. రాధ యాదవ్ (17; 8 బంతుల్లో 2×4, 1×6), శ్రేయాంక పాటిల్ (8 నాటౌట్; 2×4) బ్యాట్లు ఝుళిపించడంతో ఆఖరి రెండు ఓవర్లలో ఆర్సీబీకి 27 పరుగులు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు... బెంగళూరు ఇన్నింగ్స్: 178/6 (గౌతమి నాయక్ 73, రిచా 27, స్మృతి 26; కష్వీ గౌతమ్ 2/38, గార్డ్‌నర్ 2/43); **గుజరాత్ ఇన్నింగ్స్:** 117/8 (గార్డ్‌నర్ 54, అనుష్క శర్మ 18; సయాలి 3/21, నదైన్ డిక్లెర్క్ 2/17, లారెన్ బెల్ 1/23, రాధ యాదవ్ 1/34)



సూర్య బృందం సఫారీ

సియోని (మధ్యప్రదేశ్): న్యూజిలాండ్‌తో అయిదు టీ20ల సిరీస్‌కు ముందు భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, మరికొందరు సభ్యులు జంగిల్ సఫారీకి వెళ్లారు. సోమవారం పెంచ్ టైగర్ రిజర్వ్‌లో సూర్య బృందం విహరించింది. సఫారీలో సూర్యతో పాటు సంజు శాంసన్, ఇషాన్ కిషన్, రింకు సింగ్, రవి బిష్ణోయ్ ఉన్నారు. చిరుత పులులు, ఇతర వన్య మృగాలను భారత ప్లేయర్లు తిలకించారు. ఈ సందర్భంగా అభిమానులతో టీమ్‌ఇండియా ప్లేయర్లు ఫొటోలు దిగారు. పెంచ్ టైగర్ రిజర్వ్‌కు వెళ్లినట్లు క్రికెటర్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పంచుకున్నారు.

అగ్రస్థానంలో అర్జున్

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో అర్జున్ ఇరిగేశి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మొదటి రౌండ్లో ప్రజ్ఞానందపై గెలిచిన అర్జున్ (1.5 పాయింట్లు) రెండో రౌండ్లో వాన్ నుయెన్ (చెక్)తో డ్రా చేసుకున్నాడు. రెండో రౌండ్ ముగిసేసరికి నీమన్, అబ్దుసతోరోవ్‌తో కలిసి ఉమ్మడిగా మొదటి స్థానంలో నిలిచాడు. మరో ఆటగాడు గుకేశ్.. జోర్డెన్ వాన్ (నెదర్లాండ్స్)తో గేమ్‌ను డ్రాతో సరిపెట్టుకున్నాడు. అరవింద్ చిదంబరం, యాగిజ్ కాన్ (టర్కీ) మధ్య గేమ్ కూడా డ్రా అయింది. గుకేశ్ (1 పాయింట్), చిదంబరం (1 పాయింట్) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. ప్రజ్ఞానంద వరుసగా రెండో గేమ్‌లోనూ ఓడిపోయాడు. అబ్దుసతోరోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. పాయింట్ల ఖాతా తెరవని ప్రజ్ఞానంద అట్టడుగు స్థానంలో ఉన్నాడు.

స్వైటెక్ కాస్త కష్టపడి..

రెండో రౌండ్లోకి ప్రవేశం ● జకోవిచ్, గాఫ్ కూడా

ఆస్ట్రేలియన్ ఓపెన్


స్వైటెక్

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్లో టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ శుభారంభం చేసింది. ఈ పోలెండ్ తార రెండో రౌండ్లోకి ప్రవేశించింది. సోమవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో రెండో సీడ్ స్వైటెక్ 7-6 (7-5), 6-3తో యువాన్ (చైనా)పై కాస్త కష్టపడి గెలిచింది. ఈ మ్యాచ్‌లో ప్రపంచ 130వ ర్యాంకర్ యువాన్ నుంచి స్వైటెక్‌కు గట్టి పోటీ ఎదురైంది. బలమైన సర్వీసులతో విజృంభించిన యువాన్.. స్వైటెక్‌కు పరీక్ష పెట్టింది. తొలి సెట్లో ఒక దశలో స్వైటెక్ 1-3తో వెనుకబడింది. కానీ ఆరో గేమ్‌లో యువాన్ సర్వీస్ బ్రేక్ చేసిన పోలెండ్ స్టార్.. పుంజుకుంది. అదే జోరుతో సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించింది. టైబ్రేకర్‌లో సర్వీసుల్లో అదరగొట్టిన స్వైటెక్ సెట్ గెలిచింది. రెండో సెట్లో స్వైటెక్ మరింత దూకుడుగా ఆడింది. క్రాస్‌కోర్టు విన్నర్లతో పాయింట్లు సాధించింది. తొలి గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన స్వైటెక్.. అదే జోరుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్‌లో స్వైటెక్ 3 ఏస్‌లు, 24 విన్నర్లు కొట్టింది. మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) కూడా తొలి రౌండ్ దాటింది. ఆమె 6-2, 6-3తో రకిమోవా (ఉజ్బెకిస్థాన్)పై పెద్దగా కష్టపడకుండానే గెలిచింది. ఈ క్రమంలో ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన గాఫ్.. 20 విన్నర్లు కొట్టింది.

అనిసిమోవా, పెగులా ముందంజ: నాలుగో సీడ్ అనిసిమోవా (అమెరికా), ఆరో సీడ్ పెగులా (అమెరికా), ఎనిమిదో సీడ్ ఆండ్రీవా (రష్యా) కూడా తొలి రౌండ్లో గెలిచారు. అనిసిమోవా 6-3, 6-2తో వాల్టెర్ట్ (స్విట్జర్లాండ్)పై, ఆండ్రీవా 4-6, 6-3, 6-0తో వికిచ్ (క్రొయేషియా)ను ఓడించగా.. పెగులా 6-2, 6-1తో జకరోవా (రష్యా)పై గెలిచింది. చెక్ స్టార్ క్రెజికోవా ఇంటిముఖం పట్టింది. ఆమె 6-2, 3-6, 3-6తో 23వ సీడ్ ష్నైడెర్ (రష్యా) చేతిలో కంగుతింది. 15వ సీడ్ నవారో (అమెరికా) 6-3 3-6, 3-6తో లినెట్ (పోలెండ్) చేతిలో, కెనిన్ (అమెరికా) 3-6, 2-6తో స్టెర్న్స్ (అమెరికా) చేతిలో ఓడారు. బదోసా (స్పెయిన్), మెర్టిన్స్ (బెల్జియం), టాంజనోవిచ్ (ఆస్ట్రేలియా) తొలి రౌండ్‌ను అధిగమించారు.

నొవాక్ ముందుకు: సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్ టోర్నీలో తొలి అడుగు వేశాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి అత్యధిక సింగిల్స్ టైటిళ్ల రికార్డును అందుకోవాలనే లక్ష్యంతో ఉన్న జకో.. ఆస్ట్రేలియన్ ఓపెన్లో తేలిగ్గా తొలి రౌండ్ దాటాడు. పురుషుల సింగిల్స్‌లో ఈ మూడో సీడ్ ఆటగాడు 6-3, 6-2, 6-2తో మార్టినెజ్ (స్పెయిన్)ను ఓడించాడు. సరిగ్గా 2 గంటల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో నొవాక్ జోరు ముందు మార్టినెజ్ నిలవలేకపోయాడు. మ్యాచ్‌లో 14 ఏస్‌లు కొట్టిన జకో.. అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి తేలిగ్గా విజయాన్ని అందుకున్నాడు. ఆరో సీడ్ డిమినార్ (ఆస్ట్రేలియా), 11వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా), 12వ సీడ్ రూడ్ (నార్వే), 13వ సీడ్ రుబ్లెవ్ (రష్యా), వావ్రింకా (స్విట్జర్లాండ్) ముందంజ వేశారు. డిమినార్ 6-2, 6-2, 6-3తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)ను ఓడించగా.. మెద్వెదెవ్ కాస్త కష్టపడ్డాడు. అతడు 7-5, 6-2, 7-6 (7-2)తో అన్‌సీడెడ్ డి జాంగ్ (నెదర్లాండ్స్) పోరాటానికి తెరదించాడు. రూడ్ 6-1, 6-2, 6-4తో బెలూచి (ఇటలీ)పై తేలిగ్గా విజయం సాధించాడు. రుబ్లెవ్ 6-4, 6-2, 6-3తో ఆర్నాల్డి (ఇటలీ)పై గెలవగా.. వావ్రింకా 5-7, 6-3, 6-4, 7-6 (7-4)తో లాస్లో జేర్ (సెర్బియా)పై నెగ్గాడు. బోర్జెస్ (పోర్చుగల్)తో మ్యాచ్‌లో 6-3, 4-6, 4-6తో ఉన్న దశలో ఏడో సీడ్ అగర్ అలియాసిమ్ (కెనడా) గాయంతో తప్పుకున్నాడు. లెహెకా (చెక్), షపొవలోవ్ (కెనడా), సిలిచ్ (క్రొయేషియా), డేవిడోవిచ్ (స్పెయిన్), ఒపెల్కా (అమెరికా), టామీ పాల్ (అమెరికా) తొలి రౌండ్లో విజయాలు అందుకున్నారు.



నొవాక్ సెంచరీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్లో విజయం సాధించిన 38 ఏళ్ల నొవాక్ జకోవిచ్ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. ఈ టోర్నీలో అతడికిది వందో గెలుపు. మెల్‌బోర్న్ పార్క్ అతడికి ఎంతో కలిసొచ్చిన వేదిక. ఇక్కడ అతడు 10 టైటిళ్లు గెలిచాడు. మూడు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో వందేసి విజయాలు సాధించిన తొలి ప్లేయర్‌గా నొవాక్ మరో ఘనత సాధించాడు. వింబుల్డన్‌లో 102, ఫ్రెంచ్ ఓపెన్లో 101 విజయాలు జకోవిచ్ ఖాతాలో ఉన్నాయి. అత్యధిక ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలు ఆడిన రోజర్ ఫెదరర్ (21) రికార్డును నొవాక్ సమం చేశాడు.

మానవ వ్యర్థాలతో 'బంగారు ఎరువు'!



ఝార్ఖండ్‌లోని చిర్కుండ మున్సిపల్ కౌన్సిల్ సెప్టిక్ ట్యాంకుల్లోని మలంతో సహజ ఎరువును తయారు చేస్తోంది. త్వరలో మార్కెట్లోకి ఇది అందుబాటులోకి రానుంది. ఈ సహజ ఎరువు తయారీని ప్రోత్సహించడానికి చిర్కుండ మున్సిపల్ కౌన్సిల్ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను నియమించుకుంది. ఈ ఎరువు భూమి సారాన్ని మెరుగుపరుస్తుందని, పంటల దిగుబడి పెంచుతుందని అధికారులు చెబుతున్నారు. పట్టణంలోని సుందర్ నగర్‌లో రూ.3 కోట్ల ఖర్చుతో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ను మున్సిపల్ కౌన్సిల్ నిర్మించింది. ప్లాంట్ ప్రాసెసింగ్‌ను యూర్బండ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ పర్యవేక్షిస్తోంది. పట్టణంలోని అన్ని సెప్టిక్ ట్యాంకుల్లోని మలాన్ని ఈ ప్లాంట్‌కు తీసుకొస్తారు. ప్లాంట్‌లో మొత్తం 12 గదులున్నాయి. వాటిలో అంచెలో ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రతి గదికి 50 ట్రక్కుల వ్యర్థాలు అవసరం. ఒక గదిలో కంపోస్టును ఉత్పత్తి చేయడానికి దాదాపు 6 నెలల సమయం పడుతుందని అధికారులు వెల్లడించారు. దీన్ని బంగారు ఎరువు అని పిలుస్తున్నారు.

హరియాణా డ్రైవరుకు లాటరీలో రూ.10 కోట్లు

రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబంలో లాటరీ టికెట్ అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. దీంతో ఆ కుటుంబంలో, గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. 35 ఏళ్ల పృథ్వీ సింగ్ డ్రైవరుగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు, తండ్రి, సోదరుడు ఉన్నారు. భార్య సుమన్ రాణి పాఠశాలలో అటెండరుగా పని చేస్తున్నారు. తండ్రి దేవీలాల్ కూడా డ్రైవరు. ఇటీవల పృథ్వీ రూ.500తో టికెట్ కొనుగోలు చేస్తే 'పంజాబ్ లోహ్రీ మకర సంక్రాంతి 2026 బంపర్ లాటరీ'లో మొదటి బహుమతిగా రూ.10 కోట్లు వచ్చాయి. మూడో ప్రయత్నంలో ఈ అదృష్టం దక్కడంపై పృథ్వీ సంతోషం వ్యక్తం చేశారు. లాటరీ రూపంలో వచ్చిన నగదును పిల్లల భవిష్యత్తు కోసం వినియోగిస్తానని చెప్పారు.



చైనాలో మళ్లీ తగ్గిన జనాభా

బీజింగ్: వరుసగా నాలుగో సంవత్సరం లోనూ చైనాలో జనాభా తగ్గింది. దశాబ్దం క్రితం నాటి పరిస్థితితో పోలిస్తే 2025లో దాదాపు కోటి మేర ఈ తగ్గుదల ఉంది. దంపతులకు ఒకే బిడ్డ అనే విధానాన్ని చాలాకాలం పాటు అమలుచేయడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని విశ్లేషకులు చెబుతున్నారు. జాతీయ గణాంకాల మండలి (ఎన్‌బీఎస్) సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం చైనాలో 2025లో 79.2 లక్షలమంది శిశువులు జన్మించారు. 2024లో ఇది 95.4 లక్షలుగా ఉంది. గత ఏడాది 1.13 కోట్లమంది చనిపోయారు. ఆయుర్దాయం దశాబ్దాల్లో ఇదే అత్యధికం.

నైజీరియాలో 166 మంది అపహరణ

అబూజా: వాయవ్య నైజీరియాలోని కదూనా రాష్ట్రంలో మూడు చర్చిలపై దాడిచేసిన సాయుధ ముఠాలు 166 మందిని అపహరించాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ప్రార్థనలు జరుగుతున్న సమయంలో ఈ ఘటనలు జరిగాయి. మొత్తం 177 మంది కనిపించకుండా పోగా వారిలో 11 మంది తిరిగి వచ్చారని స్థానిక అధికారులు తెలిపారు.



పిల్లల సమాధానం బలంగా తాకుతుంది

మీరు ఫోన్ వినియోగాన్ని నిజంగా తగ్గించుకోవాలని అనుకుంటున్నారా..? అయితే స్క్రీన్‌టైం రిపోర్టుల మీద ఆధారపడకండి. "నేను ఫోన్ ఎక్కువగా చూస్తున్నట్టు మీకనిపిస్తోందా?" అని నేరుగా మీ పిల్లల్ని అడగండి. వారిచ్చే సమాధానం- స్క్రీన్‌టైం రిపోర్టుల కంటే చాలా బలంగా మీ మనసును తాకుతుంది. యాప్ బ్లాకర్ల కంటే వేగంగా మీ తీరును మార్చేస్తుంది.
– లింకన్, ఫ్యామిలీ కోచ్





స్పెయిన్‌లోని అడమజ్‌లో ప్రమాదానికి గురైన రైళ్లు

స్పెయిన్‌లో ఘోర ప్రమాదం

- 2 రైళ్లు ఢీ.. 39 మంది మృతి

అడముజ్: స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టాలు తప్పిన హైస్పీడ్ రైలును మరో హైస్పీడ్ రైలు ఢీకొనడంతో 39 మంది మరణించారు. 159 మంది గాయపడ్డారు. రెండు బోగీలు నుజ్జు నుజ్జు కావడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. స్పెయిన్ దక్షిణ ప్రాంతంలోని మలాగా నుంచి రాజధాని మాడ్రిడ్‌కు 300 మంది ప్రయాణికులతో ఆదివారం సాయంత్రం హైస్పీడ్ రైలు బయలు దేరింది. మరో హైస్పీడ్ రైలు మాడ్రిడ్ నుంచి హువెల్వాకు వస్తోంది. ఇందులో 200 మంది ప్రయాణికులున్నారు. మాడ్రిడ్‌కు 370 కిలోమీటర్ల దూరంలోని కార్డోబా ప్రావిన్స్‌లో అడామజ్ పట్టణ సమీపంలో రాత్రి 7.45 గంటల సమయంలో మొదటి రైలు పట్టాలు తప్పింది. పక్క ట్రాక్‌పైకి దాని చివరి బోగీలు దూసుకెళ్లాయి. అదే సమయంలో వేగంగా వచ్చిన రెండో రైలు ముందు భాగం వాటిని ఢీకొంది. దీంతో ముందు భాగంలోని రెండు బోగీలు నుజ్జునుజ్జయి 13 అడుగుల లోతైన లోయలో పడిపోయాయి. ఈ బోగీల్లోని వారే ఎక్కువ మంది మరణించారు. ఈ బోగీల్లో ఉన్నవారు కిటికీల్లోంచి బయటకు వచ్చి సాయం కోసం హాహాకారాలు చేశారు. మరికొంత మంది సుత్తులతో అద్దాలను పగులగొట్టి బయటకు వచ్చారు. బోగీలను వెలికితీస్తే మరిన్ని మృతదేహాలు లభించవచ్చని అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో 29 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు వెల్లడించారు. 80 కిలోమీటర్ల వేగ పరిమితి ఉన్న ప్రాంతంలో రైలు 179 కిలోమీటర్ల వేగంతో వెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు ఆ తర్వాత దర్యాప్తులో తేల్చారు. పట్టాలు తప్పిన రైలు ప్రైవేటు సంస్థ ఇరియోది. ప్రమాదానికి గురైన రెండో రైలు ప్రభుత్వరంగ సంస్థ అయిన రెన్‌ఫేకి చెందినది.

ఈ పీడనపై జోక్యం చేసుకుంటాం

- పండగల్లో విమాన ఛార్జీలపై సుప్రీం

దిల్లీ: విమాన ఛార్జీల్లో అనూహ్య మార్పులపై జోక్యం చేసుకోక తప్పదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టంచేసింది. పండగల సమయంలో ఛార్జీల పెంపు మరీ ఎక్కువగా ఉంటోందని కోర్టు పేర్కొంది. దీనిని ఒక పీడనగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం అభివర్ణించింది. దేశంలోని ప్రైవేటు విమానయాన సంస్థలు ఛార్జీల్లో అనూహ్యమైన మార్పులు చేయడంతో పాటు, అనుబంధ ఛార్జీల పేరుతో ప్రయాణికులపై భారం మోపుతున్నాయని, ఈ తీరును నియంత్రించేందుకు మార్గదర్శకాలు వెలువరించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సమాధానం ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ను ఆదేశించింది. కుంభమేళా తదితర పండగల సమయాల్లో ప్రయాణికులను ఎలా పీడించారో ఒకసారి చూడండని అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్‌కు ధర్మాసనం సూచించింది. అహ్మదాబాద్‌కు ఛార్జీలు పెరగలేదేమో కానీ మిగిలిన అన్ని ప్రదేశాలకూ భారీగా పెరిగాయని గుర్తుచేసింది. తదుపరి విచారణను వచ్చేనెల 23కు వాయిదా వేసింది.

భారత్, యూఏఈ మెగా రక్షణ బంధం

2 గంటల్లోపు పర్యటన కోసం వచ్చివెళ్లిన ఎమిరేట్స్ అధ్యక్షుడు

దిల్లీ: మెగా వ్యూహాత్మక రక్షణ బంధం దిశగా భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అడుగులు వేశాయి. దీంతోపాటు ఎల్ఎన్‌జీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2032 నాటికి రెండు దేశాల మధ్య 200 బిలియన్ డాలర్ల వాణిజ్యం లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించాయి. ప్రధాని మోదీతో సోమవారం దిల్లీలో యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య కీలక అంశాలపై చర్చలు జరిగాయి.

కేవలం 2 గంటల్లోపు పర్యటన కోసం నహ్యాన్.. 4 గంటలు ప్రయాణించి దిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంవద్ద ఆయనకు ప్రధాని మోదీ స్వాగతం పలికారు. ఇద్దరూ



యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్‌తో కారులో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

ఆలింగనం చేసుకున్నారు. ఒకే వాహనంలో ప్రధాని ఇంటికి చేరుకున్నారు. ఏకాంతంగా, అధికారుల సమక్షంలో చర్చలు జరిపారు.

■ పాక్, సౌదీల మధ్య రక్షణ బంధం కుదిరిన నేపథ్యంలో యూఏఈతో భారత్ రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం.

■ ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణ వాతావరణం, యెమెన్ విషయంలో సౌదీ, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో యూఏఈ అధ్యక్షుడి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అంశాలపై అధినేతల మధ్య చర్చలు జరిగినట్లు విదేశీ వ్యవహారాలశాఖ కార్యదర్శి మిస్రీ తెలిపారు.

'నోబెల్' ఇవ్వలేదు..

ఇక శాంతి గురించి ఆలోచించను

- 8కి పైగా యుద్ధాలు ఆపా.. అయినా తిరస్కరించారు
- నార్వే ప్రధానికి ట్రంప్ సందేశం

వాషింగ్టన్/లండన్: గ్రీన్‌లాండ్ అంశాన్ని నోబెల్ శాంతి బహుమతితో ముడిపెట్టారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. తాను 8కి పైగా యుద్ధాలు ఆపానని.. అయినా తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకూడదని నార్వే నిర్ణయించిందని అన్నారు. కాబట్టి ఇక శాంతి గురించి తాను ఆలోచించనని, అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తానని పేర్కొన్నారు. ఈ మేరకు నార్వే ప్రధాని జోనస్ గా స్టోర్‌కు ఫోన్ ద్వారా సందేశం పంపారు. గ్రీన్‌లాండ్ ద్వీపంపై డెన్మార్క్ యాజమాన్య హక్కులను లేఖలో ట్రంప్ ప్రశ్నించారు. ఆ దీవి తమదేనని చెప్పడానికి ఆ దేశం దగ్గర ఎలాంటి రాతపూర్వక పత్రాలు లేవని అన్నారు. వందల సంవత్సరాల క్రితం తమ దేశ పడవ ఒక్కటి ఆ ద్వీపానికి వెళ్లిందని మాత్రమే డెన్మార్క్ చెబుతోందని, అలాగైతే తమ పడవలు చాలానే ఆ ద్వీపానికి వెళ్లాయని అన్నారు. గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించాలని చైనా, రష్యా తీవ్రంగా



ప్రయత్నిస్తున్నాయని, వాటి నుంచి ఆ ద్వీపాన్ని రక్షించే సత్తా డెన్మార్క్‌కు లేదని పేర్కొన్నారు. నాటో కోసం తాను ఎంతో చేశానని.. ఇప్పుడు అమెరికా కోసం నాటో ఏదో ఒకటి చేయాలని అన్నారు. ప్రపంచం సురక్షితంగా ఉండాలంటే గ్రీన్‌లాండ్‌పై పూర్తి నియంత్రణ అమెరికాకు ఉండాల్సిందేనంటూ సందేశాన్ని ముగించారు. దీనిపై నార్వే ప్రధాని స్పందించారు. నోబెల్ శాంతి బహుమతితో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని, విజేతలను స్వతంత్ర నోబెల్ కమిటీ ఎంపిక చేస్తుందని చెప్పారు.

పుతిన్, నెతన్యాహులకు ఆహ్వానం

- ఐరోపా యూనియన్‌కూ పిలుపు
- గాజా శాంతి మండలిలో చేరాలంటూ పలు దేశాధినేతలకు ట్రంప్ ఆహ్వానాలు

మాస్కో: గాజా శాంతి మండలిలో సభ్యులుగా చేరాలని వివిధ దేశాధినేతలను కోరుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కూ ఆహ్వానం పంపారు. "మా అధ్యక్షుడికీ దౌత్య మార్గాల్లో ఆహ్వానం అందింది. పరిశీలిస్తున్నాం" అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహుకు, ఐరోపా యూనియన్ (ఈయూ) అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లియెన్‌కు ఆహ్వానాలు అందాయి. థాయ్‌లాండ్‌కూ ట్రంప్ సందేశం వెళ్లింది. భారత ప్రధాని మోదీని ఆదివారం ట్రంప్ ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఇది గాజాకు పరిమితమైన శాంతి మండలిగా పేర్కొంటున్నా, ఐక్యరాజ్యసమితికి పోటీగా దీన్ని తీర్చిదిద్దాలని ట్రంప్ యోచిస్తున్నారని వార్తలు వస్తున్నాయి.

అంగీకరిస్తే రూ.9 వేల కోట్లు కట్టాలి

గాజా శాంతి మండలిలో చేరాలని చాలా దేశాలకు ట్రంప్ ఆహ్వానం పంపుతున్నారు. ఇందులో భారత ప్రధాని మోదీ సహా పలు దేశాధినేతలు ఉన్నారు. అయితే గాజా పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించే ఈ మండలిలో చోటు లభించడం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని వార్తలు వెలువడుతున్నాయి. ఇందులో చేరే దేశం దాదాపు రూ.9 వేల కోట్లు కట్టాలని, అప్పుడే శాశ్వత సభ్యత్వం దొరుకుతుందని అమెరికా అధికారులు అంటున్నారు. ఈ మండలి ఎలా పనిచేస్తుందన్నదానిపైనా ఇంకా స్పష్టత రాలేదు. దీంతో ఆహ్వానం అందుకున్న దేశాల్లో ఎన్ని చేరుతాయన్న విషయంపై సందిగ్ధం నెలకొంది.

అడవులు తగ్గితే.. మనిషి రక్తమే దోమల లక్ష్యం

- తాజా అధ్యయనం హెచ్చరిక



దిల్లీ: బ్రెజిల్‌లోని అట్లాంటిక్ ఫారెస్ట్‌లో నిర్వహించిన తాజా అధ్యయనం ఆందోళనకరమైన అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. అడవులు తగ్గిపోవడం, జీవవైవిధ్యం నశించడం వల్ల దోమల ఆహారపు అలవాట్లు మారుతున్నాయని తేల్చింది. ఇదివరకు జంతువులు, పక్షులు వంటి వివిధ జీవుల రక్తాన్ని పీల్చిన దోమలు.. ఇప్పుడు ఎక్కువగా మనుషుల రక్తానికే మొగ్గు చూపుతున్నాయని పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన జీవ వైవిధ్య కేంద్రాల్లో అట్లాంటిక్ ఫారెస్ట్ ఒకటి. ఇది బ్రెజిల్ అట్లాంటిక్ తీరప్రాంతాల వెంట విస్తరించి ఉంది. అయితే మానవ విస్తరణ, పట్టణీకరణ, వ్యవసాయం, పరిశ్రమల కారణంగా.. ఈ అడవి వాస్తవ విస్తీర్ణంలో ఇప్పుడు కేవలం 30శాతమే మిగిలి ఉంది. ఈ విషయాన్ని ఫెడరల్ యూనివర్సిటీ ఆఫ్ రియో డి జెనీరో, ఓస్వాల్డో క్రూజ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు వెల్లడించారు. ఈక్రమంలో దోమల వల్ల కలిగే వ్యాధులు మరింత వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరించారు.

పేదలకు పథకాలు చేరేవరకు జీతం తీసుకోను

- రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ

ఇంటర్నెట్ డెస్క్: తాను విధులు నిర్వహిస్తున్న జిల్లాలోని పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందేవరకు జీతం తీసుకోనని రాజస్థాన్‌లోని రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ హసిజా ప్రతిజ్ఞ చేశారు. పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కలెక్టర్ ఈ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తనతో పాటు అధికారులు అందరూ ఈ విషయంపై పూర్తి శ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో స్థానికంగా ఆయన గురించి చర్చ మొదలయ్యింది. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.."మా జీతం 10 రోజులు ఆలస్యమైనా చాలా ఇబ్బందులు పడతాము. అదే పేదరికంలో మగ్గేవారు, వారి పిల్లల చదువులు, పనులు చేసుకోలేని వికలాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత బాధాకరంగా ఉంటుంది. పథకాల కోసం నమోదు చేసుకోవడానికి కూడా వాళ్లు అనేక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు వారికి ఎలాగైనా చేర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను" అని తెలిపారు. కలెక్టర్ నిర్ణయంతో వెంటనే కదిలిన జిల్లా యంత్రాంగం పింఛన్ల పథకం కింద జిల్లాలోని 1,90,440 మంది లబ్ధిదారుల పేర్లు నమోదు చేసింది. పెండింగ్‌లో ఉన్న వారి ధ్రువీకరణలు కూడా త్వరలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరుకు మూడు పథకాలకు సంబంధించిన పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అరుణ్‌కుమార్ ఇలా ప్రజా సమస్యల పరిష్కారాల కోసం వినూత్న మార్గాలను ఎన్నుకోవడం ఇది మొదటిసారి కాదని.. గతంలోనూ రైతులు, ప్రజలకు సంబంధించిన పథకాల కోసం అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు.



కలెక్టర్ అరుణ్ కుమార్ హసిజా

చికిత్సల తప్పుడు ప్రచార ప్రకటనలపై ఎల్జీలకే చర్యల అధికారం

- క్యాన్సర్, డయాబెటిస్ విషయంలో సోదాలకు ఆదేశించవచ్చు
- 5 కేంద్ర పాలిత ప్రాంతాలపై కేంద్రం నిర్ణయం

దిల్లీ: క్యాన్సర్, డయాబెటిస్ వంటి వ్యాధుల చికిత్సలకు సంబంధించి తప్పుడు ప్రచారం చేసే సంస్థలపై నేరుగా చర్యలు తీసుకునే అధికారాన్ని 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో లెఫ్టినెంట్ గవర్నర్లకు (ఎల్జీలకు) అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. కేంద్ర హోంశాఖ ఇటీవల జారీ చేసిన ఈ గెజిట్‌లోని ఉత్తర్వుల ప్రకారం.. సోదాలు జరపాలని అధికారులకు ఎల్జీలు, అడ్మినిస్ట్రేటర్లు ఆదేశాలు జారీ చేయవచ్చు. కార్యాలయాలను సీజ్ చేయడానికి, రికార్డులను స్వాధీనం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వవచ్చు. జమ్మూకశ్మీర్, లక్షద్వీప్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, దమణ్ దీవ్, పుదుచ్చేరిలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. 'డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరక ప్రకటనలు) చట్టం-1954 (1954లోని 21) ప్రకారం.. ఎల్జీలు ఈ అధికారాలను వినియోగించుకోవాలని రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేశారు' అని గెజిట్ నోటిఫికేషన్ వివరించింది. చట్టం ప్రకారం.. ఔషధాలు, వైద్య చికిత్సలు, ఆయుష్ ఔషధాలకు సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం చేయకూడదు. ఇప్పటికే రాష్ట్రాల్లో సోదాలు, సీజ్ చేయడానికి, రికార్డులను స్వాధీనం చేసుకోవడానికి గెజిటెడ్ స్థాయి అధికారులకు అధికారం ఉంది.

వీబీ-జీ రామ్‌జీతో పని ఇక హక్కుగా ఉండబోదు: కాంగ్రెస్

దిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం(ఎంజీనరేగా) స్థానంలో కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ రామ్ జీ బిల్లు ప్రవేశపెట్టడంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ చట్టంతో గ్రామీణ ప్రజలకు పని ఇక హక్కుగా ఉండదని కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు ఆరోపించారు. పని.. ప్రభుత్వం ఇష్టమొచ్చినప్పుడు ఇచ్చే 'ఉచిత' పథకంలా మారుతుందని వివరించారు. గ్రామీణ ప్రజలకు రాసిన లేఖలో కాంగ్రెస్ నేతలు ఈ విమర్శలు చేశారు. ఎంజీనరేగాను పునరుద్ధరించాలంటూ దేశ వ్యాప్తంగా చేపట్టిన 'ఎంజీనరేగా బచావో సంగ్రామ్' కార్యక్రమంలో భాగంగా ఈ లేఖ రాశారు. జనవరి 10న ప్రారంభమైన ఈ కార్యక్రమం.. ఫిబ్రవరి 25 వరకు కొనసాగనుంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఎంజీనరేగా ద్వారా 180కోట్ల పని దినాల్లో ప్రజలకు ఉపాధి లభించిందన్నారు. గ్రామాల్లో నీటి ట్యాంకులు, రోడ్లు, పంచాయతీల వంటి దాదాపు 10 కోట్ల ఆస్తులను ఈ పథకం సృష్టించిందని వివరించారు. 'అప్పుడు భారత్‌లో ప్రతీ కుటుంబానికి పని పొందడం హక్కుగా ఉండేది, ఇప్పుడు ఇది ప్రభుత్వం ఇష్టం వచ్చినప్పుడిచ్చే పథకం. అప్పుడు ఏడాది పొడవునా ఉపాధి అందుబాటులో ఉండేది, ఇప్పుడు ఆ గ్యారెంటీ లేదు. గతంలో కేంద్రమే 100శాతం నిధులు సమకూర్చేది. ఇప్పుడు రాష్ట్రాలు 40శాతం చెల్లించాలి. దీంతో పని దినాలు తగ్గిపోవచ్చు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఎంజీనరేగాను పునరుద్ధరించాల్సిందే' అని కాంగ్రెస్ నేతలు లేఖలో పేర్కొన్నారు.



మత సామరస్యానికి మచ్చుతునక ఈ ఆలయం

ఈటీవీ భారత్: కేరళ కోజికోడ్‌లోని ఓ ఆలయం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడి 'ద మావూర్ కిడప్పిల్ ముత్తప్పన్ కురిక్కల్ భగవతి ఆలయం' ఇందుకు వేదికగా ఉంది. ఈ ఆలయంలో హిందువుల ఆరాధ్యుడైన ముత్తప్పన్, ముస్లింల ఆరాధ్యుడైన కురిక్కల్‌ను కొలుస్తారు. ముత్తప్పన్, కురిక్కల్‌లు సమాజంలో అన్యాయానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాటం చేశారని స్థానికులు చెబుతున్నారు. ఏటా ఈ ఆలయంలో ముత్తప్పన్, కురిక్కల్ వెల్లాట్టు ఉత్సవాలను నిర్వహిస్తారు. హిందూ ముస్లింలు కలిసి ఈ వేడుకల్లో పాల్గొంటారు. మాధ్యమ కర్మ ద్వారా ముత్తప్పన్‌ను, ఉత్తమ కర్మ ద్వారా కురిక్కల్‌ను గౌరవిస్తారు.

దేశాన్ని మౌనంగా ఉంచడమే ఆరెస్సెస్ లక్ష్యం: రాహుల్

కొచ్చిన్: దేశాన్ని మౌనంగా ఉంచడమే ఆరెస్సెస్, భాజపా లక్ష్యమని, అందుకు అనుగుణంగానే వారు సైద్ధాంతిక దాడి జరుపుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం వారికిష్టం ఉండదని అన్నారు. కేరళలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ స్థానిక ప్రతినిధుల సమావేశంలో ఆయన సోమవారం మాట్లాడారు. అధికారాన్ని కేంద్రీకృతం చేయడం భాజపా లక్ష్యమైతే, వికేంద్రీకరణను తమ పార్టీ విశ్వసిస్తుందని అన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణలతో మూడు దశల పంచాయతీ రాజ్ వ్యవస్థను తెచ్చిన ఘనత తమ పార్టీదేనని తెలిపారు. అంతకుముందు కేరళ కాంగ్రెస్ ప్రకటించిన ప్రియదర్శిని సాహిత్య అవార్డును ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఎం.లీలావతికి రాహుల్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రజలకు ఏదో ఒక అభిప్రాయం ఉంటుందని.. కానీ దాన్ని ధైర్యంగా చెప్పలేక పోతున్నారని అన్నారు. మౌనంతో గొప్ప దేశాలు నిర్మితం కావని పేర్కొన్నారు.



మలయాళ రచయిత్రి ఎం.లీలావతికి సోమవారం కొచ్చిన్‌లో ప్రియదర్శిని సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్న రాహుల్

రాహుల్ కేసు ఫిబ్రవరి 20కి వాయిదా

సుల్తాన్‌పూర్: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు గైర్హాజరయ్యారు. కేరళ పర్యటనలో ఉన్నందున ఆయన హాజరు కాలేకపోయారని రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా కోర్టుకు తెలియజేశారు. వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు రాహుల్‌కు ఇదే చివరి అవకాశమని స్పష్టంచేస్తూ న్యాయమూర్తి శుభమ్ వర్మ తదుపరి విచారణను వచ్చేనెల 20కి వాయిదావేశారు.

రాజకీయ అసమానతల తొలగింపులో భారత రిజర్వేషన్ విధానం భేష్

ఆక్స్‌ఫాం నివేదిక

దావోస్: సాధారణ ప్రజానీకానికి రాజకీయ సాధికారత అందించడం ద్వారా ప్రగతి సాధించవచ్చనడానికి అద్భుత ఉదాహరణగా భారతదేశ రిజర్వేషన్ విధానం నిలిచిందని "ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్" సంస్థ పేర్కొంది. ప్రపంచ అసమానతలపై 'ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 56వ వార్షిక సమావేశాల మొదటి రోజైన సోమవారం విడుదల చేసిన నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. సామాన్యులతో పోలిస్తే ధనికులు రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అవకాశాలు 4 వేల రెట్లు ఎక్కువని నివేదిక తెలిపింది. అసమానతలు ఎన్ని ఉన్నా ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు ప్రభావం చూపగల వ్యవస్థాగత, రాజకీయ, సామాజిక పరిస్థితులు ఉన్నప్పుడే సామాన్యులు రాజకీయంగా బలపడగలరని స్పష్టం చేసింది. "భారత్‌లో ఎస్సీ, ఎస్టీ తదితర అట్టడుగు వర్గాలకున్న రాజకీయ రిజర్వేషన్లు.. ఆర్థికంగా, సామాజికంగా నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తున్నాయి. పేదల అనుకూల విధానాల కల్పనకు దోహదపడుతున్నాయి" అని ఆక్స్‌ఫాం తెలిపింది.

రూ.1,660 లక్షల కోట్లు పెరిగిన ధనికుల సంపద

సామాన్యులతో పోలిస్తే రాజకీయ అధికారం పొందేందుకు, దాన్ని నిలబెట్టుకునేందుకు 4 వేల రెట్లు ఎక్కువ అవకాశాలున్న ధనికుల సంపద 2025లో అంతకు ముందుకన్నా మూడు రెట్లు ఎక్కువ వేగంగా వృద్ధి చెందిందని ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడించింది. ధనిక వర్గాల సంపద గత సంవత్సరంలో 18.3 లక్షల కోట్ల డాలర్ల మేరకు, అంటే రూ.1,660 లక్షల కోట్లు వృద్ధి చెందిందని పేర్కొంది.

దక్షిణాఫ్రికాలో 13 మంది విద్యార్థుల దుర్మరణం

జొహెన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని గౌటెంగ్ ప్రావిన్స్‌లో ఓ స్కూల్ మినీబస్ ట్రక్‌ను ఢీకొన్న ప్రమాదంలో 13 మంది పిల్లలు మృత్యువాత పడ్డారు. ప్రాథమిక సమాచారం మేరకు.. 11 మంది పిల్లలు ప్రమాద స్థలంలోనే చనిపోగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. జొహెన్నెస్‌బర్గ్ నైరుతి ప్రాంతంలో ఉన్న వివిధ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులను తీసుకెళ్తున్న ప్రైవేటు వాహనం సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైనట్లు అధికారులు తెలిపారు. పిల్లలు ప్రయాణిస్తున్న మినీ బస్ ఇతర వాహనాలను ఓవర్‌టేక్ చేస్తుండగా, ఎదురుగా వచ్చిన ట్రక్‌ను ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఏడుగురిని సమీప ఆసుపత్రులకు తరలించారు. బస్సు డ్రైవర్ కూడా గాయపడ్డాడు. ప్రమాద స్థలంలో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

సెంగర్ శిక్ష నిలిపివేతకు దిల్లీ హైకోర్టు నిరాకరణ

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార ఘటన బాధితురాలి తండ్రి లాకప్‌లో మరణించిన కేసులో భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు దిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపివేయాలంటూ దాఖలు చేసిన అప్పీలును కోర్టు తోసిపుచ్చింది. విచారణ ఆలస్యంగా సాగుతోందన్న కారణంగా శిక్షను నిలిపివేయడం సాధ్యం కాదని జస్టిస్ రవీందర్ జడేజా స్పష్టంచేశారు. దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. "సెంగర్ ఏడున్నరేళ్లు జైలులో గడిపారు. కేవలం విచారణ ఆలస్యమైందన్న కారణంగా ఉపశమనం అందించలేం. శిక్ష మధ్యంతర నిలుపుదల కోరుతూ నిందితుడు పదేపదే దరఖాస్తులు చేయడం, బెయిలు పొడిగింపు అభ్యర్థనలు చేయడం ఆలస్యానికి కారణాలు" అని న్యాయమూర్తి పేర్కొన్నారు. తదుపరి విచారణను వచ్చేనెల 3కి వాయిదా వేశారు. కోర్టు తీర్పుపై బాధితురాలు సంతృప్తి వ్యక్తంచేశారు. తన తండ్రిని హత మార్చినవారికి మరణశిక్ష పడేవరకు ఆయన ఆత్మకు శాంతి కలగదని, అందుకే 13వరోజు దిన కార్యాలూ నిర్వహించలేదని చెప్పారు. 2017లో సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను అపహరించి, అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. 2018 ఏప్రిల్‌లో బాలిక తండ్రి పోలీసు కస్టడీలో మృతి చెందారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ రెండు కేసులను ఉత్తరప్రదేశ్ నుంచి దిల్లీకి బదిలీ చేశారు.

విమానం ల్యాండ్ అవుతుండగా ఊడిన టైరు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆదివారం ఓర్లాండో అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న సమయంలో దాని టైరు ఊడిపడింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం తప్పింది. షికాగోలోని ఓహేర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఓర్లాండోకు సిబ్బందితో సహా 206 మంది ప్రయాణికులతో ఈ విమానం బయల్దేరింది. కాగా, ప్రయాణికులను సురక్షితంగా దించేశామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు దీనికి కారణం కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.



మార్చి నెలాఖరు నుంచి..
తితిదే ఆలయాల్లో భక్తులకు రెండుపూటలా అన్నప్రసాదాలు

ఈవో అనిల్ కుమార్ సింఘాల్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తితిదే పరిధిలోని ఆలయాల్లో ఈ ఏడాది మార్చి నెలాఖరు నుంచి భక్తులకు రెండుపూటలా అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు తితిదే కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. సంబంధిత ఏర్పాట్లపై తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తితిదే పరిధిలోని 56 ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దేశవ్యాప్తంగా తితిదే ఆలయాల నిర్మాణం వేగవంతం చేయాలని, ఇంజినీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న ఏఈ పోస్టుల భర్తీకి ఏప్రిల్‌లో పరీక్షల నిర్వహణకు తేదీలు ఖరారు చేయాలని, వేద పారాయణదారులుగా ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. తితిదే సేవలు, సమాచారంపై భక్తుల నుంచి వస్తున్న ఈ-మెయిళ్లను విశ్లేషించి, పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు పంపాలని సూచించారు. భక్తులు కోరుతున్న తాజా సమాచారాన్ని తితిదే వెబ్‌సైట్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలన్నారు. సమీక్షలో జేఈవో వి.వీరబ్రహ్మం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు అమరావతి ముస్తాబు


పోలీసుల గౌరవ వందనం రిహార్సల్

ప్రజా రాజధాని అమరావతిలో ఈ నెల 26న తొలిసారిగా నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకల్ని ఏటా విజయవాడలో నిర్వహిస్తోంది. ఇకపై వీటిని అమరావతిలో నిర్వహించాలని నిర్ణయించింది. రాయపూడి సమీపంలో ఎమ్మెల్యే భవన సముదాయాల నుంచి హైకోర్టు భవన సముదాయాలకు వెళ్లే మార్గంలో సుమారు 22 ఎకరాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రస్తుతం గ్యాలరీలు, వేదిక నిర్మాణం, శకటాల రూపకల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. పరేడ్ నిర్వహణకు సన్నద్ధతలో భాగంగా సోమవారం పోలీసులు నమూనా కవాతు చేశారు.

– ఈనాడు, అమరావతి

షీప్ ఫుట్ రోలింగ్‌తో సత్ఫలితాలు

- ప్రధాన డ్యాం పనుల్లో వినియోగించండి
- పోలవరం అధికారులకు విదేశీ నిపుణుల సూచన

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో గ్యాప్-1, గ్యాప్-2 ప్రధాన డ్యాం పనుల్లో రోలింగ్‌కు షీప్ ఫుట్ రోలర్లు వాడాలని విదేశీ నిపుణులు సూచించారు. అంతర్జాతీయంగా వాటి వినియోగంతో సత్ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. విదేశీ నిపుణులు హించ్‌బెర్గర్, డేవిడ్ బి పాల్, ఫ్రాంక్ డి సిస్కోలు సోమవారం పోలవరం వచ్చారు. ప్రధాన డ్యాంతో పాటు డయాఫ్రం వాల్ పనుల తీరును పరిశీలించారు. గ్యాప్-1, 2 ప్రధాన డ్యాం పనుల్లో రోలింగ్ ఎలా చేస్తున్నారని అడిగారు. ప్లాట్ రోలర్లు, వైబ్రెట్ రోలర్లు వినియోగిస్తున్నట్లు అధికారులు చెప్పారు. షీప్ ఫుట్ రోలర్లు వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు పేర్కొన్నారు. ట్రయల్ ఎంబ్యాక్‌మెంట్ పనుల్లో షీప్ ఫుట్ రోలర్లు వాడితే సరైన ఫలితాలు రాలేదని, అందువల్ల వీటిని వినియోగిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం గ్యాప్ -1, 2 డ్యాంలలో రోలింగ్ పనులు తాము దగ్గరుండి పరిశీలిస్తామని, అందుకు ఏర్పాట్లు చేయాలని నిపుణులు అధికారులకు సూచించారు. డయాఫ్రం వాల్‌ను అనుసంధానం చేసే ప్లాస్టిక్ క్లేఫర్ ఉన్న ప్రాంతాల్లో షీప్ ఫుట్ రోలర్లు వాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అధికారులను ఆక్షేపాలు, డ్రాయింగ్‌లకు సంబంధించి అనేక ప్రశ్నలు వేశారు. పనులు ఎలా జరుగుతున్నాయి, ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగారు. డి వాల్ గ్రౌటింగ్ పనులు సైతం దగ్గరుండి చూశారు.


గ్యాప్-2 నిర్మాణ ప్రాంతంలో పనుల వివరాలను విదేశీ నిపుణులకు వివరిస్తున్న ప్రాజెక్టు ఎస్ఈ రామచంద్రరావు

ఫిబ్రవరికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి

డయాఫ్రం వాల్ పనుల్లో గతంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించారా లేదా అని విదేశీ నిపుణులు ఆరా తీశారు. దీని నిర్మాణంలో గతంలో తలెత్తిన బ్లీడింగ్, రాయిలోకి ఎంత లోతు వరకు ప్లాస్టిక్ కాంక్రీటు నింపాలి తదితర అంశాల్లో వచ్చిన సమస్యలు పరిష్కారమయ్యాయని అధికారులు సమాధానమిచ్చారు. ఫిబ్రవరి ఐబటీ నిపుణులతో కలిసి సిద్ధం చేసిన మెరుగైన ప్రక్రియ ద్వారా డయాఫ్రం వాల్ పనులు చేయడంతో బ్లీడింగ్ సమస్య పరిష్కారమైందని వివరించారు. ఫిబ్రవరికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ పనులకు సంబంధించిన నాణ్యత నియంత్రణ పరీక్షల ఫలితాలను విదేశీ నిపుణులు పరిశీలించారు. పనుల డాక్యుమెంటేషన్ మరింత పక్కాగా ఉండాలని సూచించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ప్రాజెక్టు, జలవనరులశాఖ అధికారులతో సమావేశమై పనుల తీరుతెన్నులపై సమీక్షించారు. సమావేశంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యదర్శి రఘురామ్, జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ రామచంద్రరావు, కేంద్ర జలసంఘం డిజైన్ల సీఈ సరబ్‌జిత్‌సింగ్ భక్షి, డైరెక్టర్ మనీష్ రాథోడ్, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ నుంచి మనీష్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి రామారావు, పోలవరం అథారిటీ డైరెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రం

- రాజధాని సమీపంలో రూ.20 కోట్ల విలువైన పొలం కొట్టేసిన వైనం
- వైకాపా నాయకుల సహకారం

తాడికొండ, న్యూస్‌టుడే: రాజధాని సమీపంలో భూముల ధరలు చుక్కల్ని అంటుతున్నాయి. దీంతో వీలైనవాటిని అక్రమంగా కాజేయడానికి కొందరు ఎంతకైనా తెగిస్తున్నారు. ఒక భూమికి సంబంధించి యజమాని బతికుండగానే అతని మరణ ధ్రువీకరణ పత్రంతో సుమారు 20 కోట్ల విలువైన 9.47 ఎకరాల భూమిని కాజేసేందుకు చేసిన ప్రయత్నం తాడికొండలో వెలుగులోకి వచ్చింది. గతంలో తాడికొండలో పనిచేసిన ఓ వీఆర్వో ఈ వ్యవహారానికి మధ్యవర్తిగా వ్యవహరించగా, నిందితులకు స్థానిక వైకాపా నాయకుల సహకారం తోడైనట్లు తెలుస్తోంది. వంగర హనుమంత సుబ్రహ్మణ్యం అనే రైతుకు తాడికొండ గ్రామంలో 9.47 ఎకరాల భూమి ఉంది. దానిని కౌలుకు ఇచ్చారు. సుబ్రహ్మణ్యం కొడుకు, కుమార్తె అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన కూడా కొద్దికాలం క్రితం కొడుకు వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన కొందరు ఆ భూమిపై కన్నేశారు. సుబ్రహ్మణ్యం 2019లో మరణించినట్లుగా రాజమహేంద్రవరంలోని ఓ తహసీల్దార్ కార్యాలయం నుంచి ధ్రువపత్రం తీసుకున్నారు. వరలక్ష్మి అనే మహిళను దత్తత తీసుకున్నట్లు, తన తదనంతరం ఆస్తి మొత్తం ఆమెకే చెందాలని వీలునామా రాసినట్లు పత్రాలు సృష్టించారు. తుళ్లూరుకు చెందిన ఓ వీఆర్వో, తాడికొండ వైకాపా నాయకుల సహకారంతో తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో వరలక్ష్మి పేరిట గత ఏడాది డిసెంబరులో పాస్‌బుక్‌కు దరఖాస్తు చేశారు. రెవెన్యూ సిబ్బంది జనవరి 13న సదరు మహిళ పేరిట ఆ భూమిని అడంగల్‌లో ఎక్కించేశారు. ఈ విషయం తెలిసి గ్రామంలోని సుబ్రహ్మణ్యం సన్నిహితులు ఆయనతో వీడియో కాల్‌లో మాట్లాడడంతో జరిగిన మోసం బయటపడింది. దీనిపై తాడికొండ తహసీల్దార్ మెహర్ కుమార్‌ను సంప్రదించగా, పాస్ పుస్తకం కోసం దరఖాస్తుదారులు పొందుపరిచిన ధ్రువపత్రాలన్నీ సక్రమంగానే ఉన్నాయని, అందుకే ఆమోదించామని చెప్పారు.

ఇకపై ఉదయం ధాన్యం కొంటే..
సాయంత్రానికి నగదు జమ

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



ఈనాడు, అమరావతి: ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 6,83,623 మంది రైతుల నుంచి రూ.9,890 కోట్ల విలువైన 41.69 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని.. అందులో రూ.9,800 కోట్లు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇకపై ఉదయం ధాన్యం కొంటే.. అదే రోజు సాయంత్రానికి నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రబీ ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని.. రైతు సేవా కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేలా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం ఆయన విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కొనసాగుతుందని ఆయన వివరించారు. 'రైతులు ఇబ్బంది పడకుండా తొలిసారిగా ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ధాన్యం తరలిస్తున్నాం. తేమ శాతం, జీపీఎస్, రవాణా సమస్యలు సమర్థంగా అధిగమించాం' అని మనోహర్ పేర్కొన్నారు. రబీలోనూ గోతాలు, రవాణా, నిల్వ సౌకర్యాల్లోనూ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ ఢిల్లీరావు, అధికారులు పాల్గొన్నారు.

పాత విద్యార్థి కిట్లకూ బిల్లుల చెల్లింపు

- రూ.944 కోట్ల విడుదలకు ప్రభుత్వ అనుమతి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో సర్కారు బడుల్లోని పిల్లల కోసం కొనుగోలు చేసిన విద్యార్థుల కిట్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు పరిపాలన అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం బిల్లులు రూ.944.53 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.291.88 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.652.65 కోట్లు. రాష్ట్ర వాటా చెల్లింపులకు వీలుగా బడ్జెట్ నుంచి నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతించింది. వైకాపా ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థి కిట్ల సరఫరాకు టెండర్లు పిలవకుండానే పాత గుత్తేదార్లకే రిపీట్ ఆర్డర్లు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ కిట్లను విద్యార్థులకు అందించింది. ఈ బిల్లులకు ఇన్నాళ్లుగా ఆర్థిక శాఖ అనుమతి లేకపోగా, ఇటీవలి క్యాబినెట్ భేటీలో ఆమోదం లభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్. చిత్రంలో ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి హిమబిందు, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, న్యాయాధికారులు సత్యానంద్, కేవీ రామకృష్ణయ్య

మధ్యవర్తిత్వ నిర్వహణలో
న్యాయవాదులది కీలక పాత్ర

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్
- న్యాయవాదులకు శిక్షణ తరగతులు ప్రారంభం

ఈనాడు, అమరావతి: మధ్యవర్తిత్వం నిర్వహించి కేసులను సత్వరం పరిష్కరించడంలో న్యాయవాదులది కీలక పాత్ర అని హైకోర్టు న్యాయమూర్తి, ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు(ఈసీ) జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు. మధ్యవర్తిత్వంపై రెండో దశలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 35 మంది న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విజయవాడ కోర్టు ప్రాంగణంలో ఈ నెల 19 నుంచి 23 వరకు శిక్షణ తరగతులు జరగనున్నాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి(పీడీజే) జి.గోపి, ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి హిమబిందు తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలో 400 మంది న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు సత్యానంద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, న్యాయ సేవాధికార సంస్థ డిప్యూటీ కార్యదర్శి అమరరంగేశ్వర రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.


ఎలక్ట్రిక్ లారీలను ప్రారంభిస్తున్న మహాసిమెంట్ కర్మాగారం యూనిట్ హెడ్ బి.రామస్వామి, మార్కెటింగ్ సీనియర్ జీఎం టి.వీరారెడ్డి తదితరులు

మహా సిమెంట్ పరిశ్రమలో..
ఎలక్ట్రిక్ లారీల వినియోగం

- దేశంలో ఇక్కడే తొలిసారి..
- ఒకసారి ఛార్జింగ్‌తో 190 కి.మీ. ప్రయాణం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: దేశంలో తొలిసారిగా పరిశ్రమలో ఎలక్ట్రిక్ బల్క్ ట్యాంక్ లారీల వినియోగానికి అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ములకలాపల్లిలో ఉన్న మై హోం ఇండస్ట్రీస్ మహాసిమెంట్ కర్మాగారం శ్రీకారం చుట్టింది. ఈ పరిశ్రమకు ముడిసరకును తీసుకురావడానికి, తయారైన సిమెంట్‌ను ఇతర ప్రాంతాలకు తరలించడానికి ఎనిమిది ఎలక్ట్రిక్ బల్క్ ట్యాంక్ లారీలను సోమవారం యాజమాన్యం ప్రారంభించింది. ఒక్కో లారీ ఖరీదు రూ.1.20 కోట్లు కాగా, రూ.10 కోట్లు వెచ్చించి తొలి విడతలో 8 వాహనాలు కొనుగోలు చేశారు. వీటికి 30 నుంచి 35 టన్నుల వరకు బరువు మోయగల సామర్థ్యం ఉంది. గంటలోనే పూర్తిస్థాయి ఛార్జింగ్ అయ్యే ఈ ఎలక్ట్రిక్ లారీలు.. ఒకసారి పూర్తిస్థాయి ఛార్జింగ్‌తో 190 కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తాయి. వీటి కోసం ఈ కర్మాగారం ప్రాంగణంలోనే రెండు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నుంచి బూడిదను మహాసిమెంట్ కర్మాగారానికి తీసుకురావడానికి, ఇక్కడి నుంచి సిమెంట్‌ను భారీ భవనాల నిర్మాణానికి బల్క్‌గా తరలించడానికి వీటిని ఉపయోగిస్తామని మైహోం ఇండస్ట్రీ మార్కెటింగ్ సీనియర్ జీఎం టి.వీరారెడ్డి చెప్పారు. వీటి వినియోగం ద్వారా కేవలం తమ పరిశ్రమ ప్రాంగణంలోనే ఏటా 400 టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గించవచ్చని, పర్యావరణానికి ఇది ఎంతో మేలని ఫ్యాక్టరీ ప్రతినిధులు తెలిపారు. దేశంలో తొలిసారిగా పరిశ్రమల్లో వీటిని మైహోం ఇండస్ట్రీ వినియోగించడం గర్వంగా ఉందన్నారు. తమ ఫ్యాక్టరీ విద్యుత్ అవసరాల కోసం ఇక్కడ సొంతంగా నాలుగు మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్ నెలకొల్పినట్లు కర్మాగారం యూనిట్ హెడ్ బి.రామస్వామి తెలిపారు.

31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

- నిడమానూరులో ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు
- నేటి నుంచి అందుబాటులోకి గ్రామ సందర్శన వాహనాలు


పశువుకు టీకా వేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


గ్రామ సందర్శన వాహనాన్ని ప్రారంభిస్తున్న అచ్చెన్నాయుడు. చిత్రంలో వెంకట్రావు తదితరులు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 31 వరకు నిర్వహించే ఉచిత పశు ఆరోగ్య శిబిరాల కార్యక్రమం ప్రారంభమైందని, రైతులందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. విజయవాడ గ్రామీణ మండలం నిడమానూరులో విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. "గత ప్రభుత్వం పాడి రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారంలోకి రాగానే పశు సంవర్ధక శాఖపై దృష్టి సారించి ఆగిన పథకాలను పునరుద్ధరించింది. రూ.150 కోట్ల పశువుల ఇన్సూరెన్స్ బకాయిలను వైకాపా నిలిపేస్తే.. కూటమి ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. ప్రస్తుతం పశువులకు మూడేళ్ల ఇన్సూరెన్స్‌తో పాటు 50 శాతం సబ్సిడీపై దాణా అందిస్తున్నాం. ఖాళీగా ఉన్న వెటర్నరీ వైద్యులు, సిబ్బంది నియామకంపై సీఎం చంద్రబాబుతో చర్చించి త్వరలోనే ప్రకటన చేస్తాం" అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సందర్శన వాహనాల(పశువుల అంబులెన్సులు)ను అచ్చెన్నాయుడు ప్రారంభించారు. గతంలో రైతు ఫోన్ చేస్తేనే పశువుల అంబులెన్స్ వచ్చే విధానం ఉండేదని, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సీఎం చంద్రబాబు కొత్త నిర్ణయం తీసుకున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 300 పశువుల అంబులెన్సుల్లో 175 వాహనాలను '104' తరహాలో ప్రభుత్వం మార్పులు చేసిందని, ఇవి రోజూ ఒక గ్రామానికెళ్లి ఉదయం నుంచి రాత్రి వరకు సేవలు అందిస్తాయని చెప్పారు. పశు వైద్యశాలలు లేని గ్రామాలను గుర్తించి 20 రోజులకు ఒకసారి అక్కడికి ఈ అంబులెన్స్‌లు వెళ్లేలా షెడ్యూల్ రూపొందించామని, మంగళవారం నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందని వెల్లడించారు.

జీవ విజ్ఞానశాస్త్రంలో పరిశోధనల విస్తృతికి
గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ

- అమరావతి క్వాంటమ్ వ్యాలీ పరిధిలోకి తేవాలని నిర్ణయించిన ప్రభుత్వం
- భారీగా పెట్టుబడులు, పరిశోధన ఆధారిత సంస్థల రాకకు అవకాశం

ఈనాడు, అమరావతి: జీవ విజ్ఞాన శాస్త్ర రంగంలో పరిశోధనల విస్తృతి పెంచేలా.. 'గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ'ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీ పరిధిలోకి దీన్ని తెచ్చింది. క్వాంటమ్ టెక్నాలజీ-బయాలజీ కలయికతో సరికొత్త విప్లవానికి రాజధాని అమరావతి కేంద్రం కానుందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. సంప్రదాయ కంప్యూటర్ల ద్వారా సాధ్యం కాని, ఆవిష్కరించలేని అంశాల్ని కనుగొనేందుకు క్వాంటమ్ బయో ఫౌండ్రీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. 'మొండి వ్యాధుల్ని నయం చేసేలా సరికొత్త ఔషధాలు, ఎంజైమ్ ఇంజినీరింగ్, అత్యాధునిక చికిత్సా విధానాలు, ఆధునిక వైద్య పరికరాల తయారీ రంగాల్లో క్వాంటమ్ బయోఫౌండ్రీ ఆవిష్కరణలు చేయనుంది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ బయోఫౌండ్రీలో టీసీఎస్, ఐబీఎం, సీఎస్ఐఆర్, ఐఐటీ దిల్లీ, సీసీజే సెంటర్, సెంటెల్లా ఏఐ తదితర అగ్రస్థాయి టెక్ పరిశోధనా సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయి. గ్లోబల్ క్వాంటమ్ బయో ఫౌండ్రీ ద్వారా భారీగా విదేశీ పెట్టుబడులతోపాటు హైవాల్యూ ఉద్యోగాలు, పరిశోధన ఆధారిత సంస్థలు రానున్నాయి' అని వివరించింది.

సెప్టెంబరులో క్వాంటమ్ కంప్యూటర్.. యువతకు శిక్షణ

క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక సౌకర్యాల కల్పనతో స్టార్టప్‌లకు విస్తృత అవకాశాలు లభిస్తాయని.. హెల్త్‌కేర్, బయోటెక్, డీప్‌టెక్ స్టార్టప్‌లకు అమరావతి ప్రధాన కేంద్రంగా మారనుందని ప్రభుత్వం తెలిపింది. 'సీఎం చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా 2025 మే నెలలో ప్రారంభమైన క్వాంటమ్ వ్యాలీ.. కేవలం 9 నెలల్లో కార్యరూపం దాల్చింది. భారత్‌లోనే అత్యాధునిక ఐబీఎం 133 (ఐబీఎం 133-క్యూబిట్ క్వాంటమ్ సిస్టమ్) ఈ ఏడాది సెప్టెంబరులో అమరావతిలో ఏర్పాటు కానుంది. దేశంలోనే మొదటిగా క్వాంటమ్ పాలసీ అమలు చేసిన రాష్ట్రంగా ఏపీ నిలిచింది. 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇందులో భాగస్వాములయ్యాయి' అని వివరించింది. 'భారతదేశపు తొలి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ కార్యకలాపాలు ఏప్రిల్ 26వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ప్రపంచస్థాయి సంస్థలతో వ్యూహాత్మక ఒప్పందాలు జరిగాయి. లక్ష మందికి పైగా యువత క్వాంటమ్‌లో శిక్షణ పొందుతున్నారు. క్వాంటమ్ హ్యాకథాన్లకు 137 కళాశాలల నుంచి 20 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రత్యేక శిక్షణ పొందిన 1,056 మంది ఫ్యాకల్టీ కూడా సిద్ధంగా ఉన్నారు' అని తెలిపింది.

అనిశా వలలో విద్యాశాఖాధికారులు

రూ. 45 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన ఏడీ, సీనియర్ అసిస్టెంట్


ఏడీ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా

మదనపల్లె నేరవార్తలు, పట్టణం, న్యూస్‌టుడే: కార్యాలయంలోనే లంచం తీసుకుంటూ ఇద్దరు విద్యాశాఖ అధికారులు పట్టుబడ్డారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రూ.45 వేలు లంచం తీసుకుంటుండగా విద్యాశాఖ ఏడీ రాజశేఖర్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా (అలియాస్ మున్నా)లను సోమవారం అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సీతారామారావు కథనం మేరకు.. గుర్రంకొండ మండలం ఏబీసీ పాఠశాల కరస్పాండెంట్, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ ఫెడరేషన్ (యూపీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు శేషాద్రినాయుడికి అప్పర్ ప్రైమరీ స్కూల్ ఉంది. ఈ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ గతేడాది సెప్టెంబరులో దరఖాస్తు చేశారు. అందు కోసం రూ.20 వేల చలానా కట్టారు. ఆ దస్త్రం డీవైఈఓ కార్యాలయం నుంచి డీఈఓ కార్యాలయానికి చేరింది. దాన్ని ఆర్జేడీ కార్యాలయానికి పంపాలంటే రూ. 60 వేలు ఇవ్వాలంటూ శేషాద్రినాయుడిని పిలిచి జిల్లా విద్యాశాఖ ఏడీ రాజశేఖర్ డిమాండ్ చేశారు. శేషాద్రినాయుడు వారితో మాట్లాడి రూ.45 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. నగదు ఇవ్వడం ఆలస్యం కావడంతో దరఖాస్తును తిరిగి డీవైఈవో కార్యాలయానికి తిప్పి పంపారు. నగదు ఈ నెల 19వ తేదీ లోపు ఇస్తేనే దస్త్రం ముందుకు కదులుతుందని చెప్పారు. నగదు ఇవ్వడం ఇష్టం లేని శేషాద్రినాయుడు కడప అనిశా అధికారులను సంప్రదించారు. వారి ప్రణాళిక ప్రకారం ఆయన రూ.45 వేలు తీసుకుని ఏడీ వద్దకు వెళ్లగా.. నగదు సీనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా ఎలియాస్ మున్నాకు ఇవ్వాలని చెప్పడంతో అప్పగించారు. ఆ తర్వాత ఇద్దరూ నగదు లెక్కిస్తుండగా అనిశా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ కోర్టుకు అప్పగిస్తామని డీఎస్పీ తెలిపారు. డీఈవోతో పాటు అధికారులందరికీ నగదు ఇవ్వాలంటూ ఏడీ రాజశేఖర్ డిమాండ్ చేశారని బాధితుడు శేషాద్రినాయుడు ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారిస్తామని అనిశా అధికారులు తెలిపారు. కర్నూలులోని అతని ఇంట్లోనూ అధికారులు సోదాలు చేశారు.



చూపులేని వారికి చుక్కాని

రైలు ప్రయాణాల్లో అంధులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా రైల్వేస్టేషన్లలో బ్రెయిలీ లిపితో ఉన్న స్టేషన్ మ్యాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో మొత్తం ఎనిమిది ప్లాట్‌ఫామ్‌లు ఉండగా ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై మ్యాప్‌ను అందుబాటులో ఉంచారు. దీని సాయంతో అంధులు స్టేషన్‌లో ఏ ప్లాట్‌ఫామ్ ఎక్కడుందో సులువుగా గుర్తిస్తున్నారు. ఎవరి సాయం లేకుండానే నేరుగా అక్కడికి చేరుకుంటున్నారు.

– ఈనాడు, విశాఖపట్నం

బాలసాయిబాబా ట్రస్ట్ భూములపై..
తెలంగాణకు అధికారం లేదు

- వాటి నిర్వహణ మా పరిధిలోనే
- తెలంగాణ హైకోర్టులో కౌంటరు దాఖలు చేసిన ఏపీ

ఈనాడు, హైదరాబాద్: కర్నూలు జిల్లాలోని భగవాన్ బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్ట్‌కు కొండాపూర్‌లో ఉన్న సుమారు రూ.4 వేల కోట్లకుపైగా విలువైన 42.03 ఎకరాలపై తెలంగాణకు ఎలాంటి అధికారమూ లేదని తెలంగాణ హైకోర్టుకు ఏపీ ప్రభుత్వం నివేదించింది. దేవాదాయ చట్టం పరిధిలో కర్నూలులో రిజిస్టర్ అయిన ట్రస్ట్ భూముల నిర్వహణ బాధ్యతలన్నీ ఏపీ ప్రభుత్వానికే చెందుతాయని తేల్చిచెప్పింది. భూగరిష్ఠ నియంత్రణ చట్టం కింద 2005లో ఇచ్చిన జీవోను పునః సమీక్షించి ఆ భూమిని ప్రైవేటు సంస్థ, వ్యక్తులైన భూపతి ఎస్టేట్స్‌కు కట్టబెట్టే అధికారం తెలంగాణకు లేదని పేర్కొంది.

ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి వీల్లేదు

బాలసాయిబాబా ట్రస్ట్‌కు చెందిన 42.03 ఎకరాలను భూపతి ఎస్టేట్స్‌కు అప్పగించడాన్ని సవాలు చేస్తూ 2024లో తమ్మనబోయిన సంతోష్‌కుమార్ మరో నలుగురు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతివాదిగా ఉన్న ఏపీ దేవాదాయ శాఖ తరఫున కమిషనర్ కె.రామచంద్రమోహన్ కౌంటరు దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోల ప్రకారం కొండాపూర్‌లోని 42.03 ఎకరాల భూములు ట్రస్ట్‌వేనని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ట్రస్ట్ తెలంగాణ దేవాదాయ చట్టం కింద రిజిస్టర్ కాలేదని, ఏపీ చట్టం కింద అక్కడ రిజిస్టర్ అయినందున భూముల నిర్వహణ ఏపీ దేవాదాయశాఖదే అన్నారు. దేవాదాయశాఖకు చెందిన భూములను హైకోర్టు అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని, మధ్యంతర ఉత్తర్వులున్నప్పటికీ వాటికి విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు వారికి అప్పగించిందన్నారు. ట్రస్ట్ భూముల నిర్వహణ, రక్షణ వ్యవహారాలను ఏపీ దేవాదాయశాఖ పర్యవేక్షిస్తోందని తెలిపారు. దీనిపై ఇటీవల విచారించిన హైకోర్టు.. కౌంటరు దాఖలు చేయని తెలంగాణ ప్రభుత్వానికి రూ.5 వేల జరిమానా విధించింది. ఇప్పటివరకు కౌంటరు దాఖలు చేయలేదు.

తిరుమలకు నిర్మాత బండ్ల గణేశ్ పాదయాత్ర

గతంలో చంద్రబాబు విడుదలను కాంక్షిస్తూ మొక్కు


గణేశ్‌ను సత్కరిస్తున్న ఎంపీ అప్పలనాయుడు. చిత్రంలో శివాజీ

షాద్‌నగర్, న్యూస్‌టుడే: గతంలో చంద్రబాబు అరెస్టయినప్పుడు పెట్టుకున్న మొక్కును చెల్లించుకుంటూ నిర్మాత బండ్ల గణేశ్ సోమవారం షాద్‌నగర్ నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. 'చంద్రబాబు 43 రోజులైనా జైలు నుంచి బయటకు రాకపోవడంతో ఎంతో భయపడ్డాను. ఆయన్ను ఎలాగైనా బయటకు తీసుకురావాలని ఏడుకొండల స్వామికి మొక్కుకున్నాను. దాన్ని తీర్చుకునేందుకే ప్రస్తుతం బయలుదేరుతున్నానే తప్ప ఇందులో ఎటువంటి రాజకీయం లేదు' అని పేర్కొన్నారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, నటుడు శివాజీ పాల్గొన్నారు.



మీ మెదడుకు ఆ అవకాశమివ్వకండి

ఏ పనీ చేయకుండా స్తబ్దుగా ఉండటం, ఎవరితోనూ మాట్లాడకపోవడం, మానసికంగా కుంగిపోవడం, మార్పు కోసం ప్రయత్నించకపోవడం.. మీరు నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు వీటన్నింటినీ మీ మెదడు అప్రయత్నంగానే అలవరచుకుంటుంది. దానికి ఆ అవకాశం ఇవ్వకండి. ఎంతటి నిస్సహాయ స్థితిలో ఉన్నా.. పని చేస్తూనే ఉండండి. ముందడుగు వేస్తూనే ఉండండి. అప్పుడే అద్భుతాలు చేయడం సాధ్యమవుతుంది. – అన్షుల్ సథాలే, హెల్త్ కోచ్

EENADU Vol: 52, Issue: 160 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao



మనం నిల్చోవటం, కూర్చోవటం, నడవటం, పరుగెత్తటం, గెంతటం, పక్కలకు తిరగటం వంటివి తేలికగా చేస్తున్నామంటే అంతా మోకీళ్ల చలవే. ఆయా పనులకు అనుగుణంగా ఇవి కదలటం మూలంగానే అన్ని పనులు సాధ్యమవుతున్నాయి. అయితే ఇందుకు మోకీళ్లు కుదురుగా, స్థిరంగా ఉండటం చాలా ముఖ్యం. దీని కోసమే వీటికి కొన్ని కండర బంధనాలు/స్నాయువులు (లిగమెంట్లు) దన్నుగా నిలుస్తుంటాయి. మరి ఇంతటి కీలకమైన ఈ బంధనాలు తెగితే? మోకీళ్ల పట్టు తప్పుతుంది. నడవటం, వేగంగా పనులు చేయటం కష్టమవుతుంది. ఇక్కడే పునర్నిర్మాణ శస్త్రచికిత్స ఆదుకుంటోంది. ఇప్పుడు కృత్రిమ (సింథటిక్) లిగమెంట్ల రాకతో దీన్ని మరింత సులభంగా చేయటం సాధ్యమవుతోంది.

మోకాలికి కృత్రిమ బంధనం!

మోకీళ్లకు కండర బంధనాలే పెద్ద దన్ను. వీటిని ఒకరకంగా సాగే గుణం గల కణజాలాలు అనుకోవచ్చు. ఇవి తొడ, కాలి ఎముకలను అనుసంధానం చేస్తూ.. మోకీళ్లు స్థిరంగా, బలంగా ఉండటానికి తోడ్పడతాయి. మోకీళ్లలో ఏసీఎల్ (యాంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్), పీసీఎల్ (పోస్టీరియర్ క్రూసియేట్ లిగమెంట్), మీడియల్ కొలాటెరల్ లిగమెంట్ (ఎంసీఎల్), లాటెరల్ కొలాటెరల్ లిగమెంట్ (ఎల్‌సీఎల్) అనే కండర బంధనాలుంటాయి. మోకీలు మధ్యలో ఉండే ఏసీఎల్ కాలి ఎముక తిరగటాన్ని, ముందుకు కదలటాన్ని.. మోకీలు వెనకాల ఉండే పీసీఎల్ తొడ ఎముక వెనక కదలికలను నియంత్రిస్తాయి. ఎంసీఎల్ మధ్య మోకీలుకు స్థిరత్వాన్ని, ఎల్‌సీఎల్ వెలుపలి మోకీలుకు స్థిరత్వాన్ని ఇస్తాయి. మన కదలికలకు ఇవెంత కీలకమో వీటిని బట్టే అర్థమవుతుంది. అందుకే ఇవి ఏమాత్రం దెబ్బతిన్నా ఇబ్బంది తప్పదు.



డా॥ కొల్లా సాకేత్,
ఆర్థోపెడిక్ & స్పోర్ట్స్ సర్జన్, గ్లెనీగల్స్ హాస్పిటల్, లక్డీకాపూల్, హైదరాబాద్

ఏసీఎల్ చీలికే ఎక్కువ

ఆటలు ఆడటమో, వేగంగా పక్కలకు తిరగటమో.. కారణమేదైనా ఇటీవల లిగమెంట్లు దెబ్బతినటం, చీలటం, తెగటం ఎక్కువైపోయింది. ముఖ్యంగా ఏసీఎల్ ఎక్కువగా తెగటం గమనిస్తుంటాం. హఠాత్తుగా సాగటం లేదా ఉన్నట్టుండి పక్కలకు తిరగటం దీనికి మూలం. మోకాలికి దెబ్బ తగిలినప్పుడో, బాగా మెలి తిరిగినప్పుడో దాని మీద ఒత్తిడి పెరిపోయి, ఉన్నట్టుండి కండర బంధనం తెగొచ్చు. అప్పుడు బయటికి ఫట్‌మని చప్పుడు వినిపిస్తుంటుంది కూడా. తరచూ క్రీడాకారుల్లో.. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, స్కీయింగ్ వంటి ఆటలు ఆడేవారిలో ఏసీఎల్ తెగటం చూస్తుంటాం. పీసీఎల్ దెబ్బతినటమూ ఎక్కువే. కాకపోతే ఇది హఠాత్తుగా, నేరుగా మోకీలుకు గాయం కావటం వల్ల సంభవిస్తుంటుంది. వాహన ప్రమాదాలు లేదా ఫుట్‌బాల్ ఆడేవారు ఢీకొనటం వంటివి దీనికి దారితీస్తుంటాయి. అరుదే అయినా మోకీలు వెలుపలి భాగానికి దెబ్బలు తగలటం వల్ల కొందరికి ఎంసీఎల్, ఎల్‌సీఎల్ కూడా తెగొచ్చు.

లక్షణాలు ఇవీ

ఒక్క లిగమెంట్ మాత్రమే కాదు, దీంతో పాటు మెనిస్కస్ అనే వాషర్‌లూ దెబ్బతింటుంటాయి. కండర బంధనం పూర్తిగా తెగితే మోకాలు స్థిరంగా ఉండదు. నడవటానికి పెద్దగా ఇబ్బంది లేకపోయినా మెట్లు ఎక్కుతున్నప్పుడు, దిగుతున్నప్పుడు, పరుగెత్తుతున్నప్పుడు మోకాలు వదులైనట్టు అనిపించటం, పట్టు లేకపోవటం.. లేవటానికి ప్రయత్నించినప్పుడు కాలు ముందుకు వంగిపోవటం, నొప్పి, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. పట్టు లేకపోవటం వల్ల పక్కలకు తిరిగినప్పుడు కింద పడే ప్రమాదముంది. కాబట్టి చాలా జాగ్రత్తగా, నిశితంగా గమనిస్తూ నడవాల్సి ఉంటుంది.

ఎంఆర్‌ఐతో నిర్ధారణ

కండర బంధనం తెగినట్టు అనుమానిస్తే యాంటీరియర్ డ్రాయిడ్, లాచ్‌మన్ పరీక్షలతో పరిశీలిస్తారు. వీటిల్లో మోకాలును వంచి, ముందుకు లాగి చూస్తారు. కండర బంధనం వదులుగా ఉంటే కాలి ఎముక ముందుకు వస్తుంది. వీరికి ముందుగా మోకాలి పట్టీలు ధరించాలని సూచిస్తారు. ఐదు రోజులు వరకూ వాపు తగ్గటానికి మందులిస్తారు. వాపు తగ్గిన తర్వాత ఎంఆర్‌ఐ పరీక్ష చేస్తారు. ఇందులో కండర బంధనం ఎంత శాతం తెగిందో తెలుస్తుంది. ఎక్స్‌రేలో మార్పులు అంత స్పష్టంగా తెలియవు. అందువల్ల ఎంఆర్‌ఐతోనే నిర్ధారించాల్సి ఉంటుంది.

మూడు గ్రేడులు

లిగమెంట్ తెగిన తీరును బట్టి మూడు గ్రేడులుగా విభజిస్తారు.

ఒకటో గ్రేడ్ - 30% వరకూ తెగినట్టు
రెండో గ్రేడ్ - 50% వరకూ తెగినట్టు
మూడో గ్రేడ్ - పూర్తిగా తెగినట్టు

శస్త్రచికిత్స ఇలా

మధ్యలో తెగినా, అంచుల్లో పూర్తిగా తెగినా పునర్నిర్మాణ శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. తెగిన కండర బంధనం స్థానంలో కొత్తది అమర్చటం ఇందులో కీలకాంశం. శరీరంలోని ఇతర భాగాల నుంచి టెండాన్‌ను తీసుకొచ్చి, అమరుస్తారు. పై, కింది ఎముకలకు సొరంగంలాంటి రంధ్రం చేసి, దాన్నుంచి టెండాన్‌ను జొప్పిస్తారు. కింది భాగంలో స్క్రూ, పై భాగంలో బటన్‌తో బిగిస్తారు. ఇవి అక్కడ కుదురుకొని, క్రమంగా లిగమెంట్‌గా మారతాయి. తిరిగి పట్టు లభిస్తుంది. సాధారణంగా మోకాలి చుట్టూరా ఉండే హామ్‌స్ట్రింగ్స్‌ను తీసుకొచ్చి, అమరుస్తారు. మోకాలి ముందు భాగంలోని బోన్ టెండాన్ గ్రాఫ్ట్, మోకాలికి కొద్దిగా పైన ఉండే క్వాడ్రిసెప్స్ టెండన్, చీలమండ వద్ద ఉండే పెరోనియస్ టెండాన్ కూడా వాడుకోవచ్చు.

అందరికీ శస్త్రచికిత్స అవసరం లేదు

ఒకటో గ్రేడ్‌కు శస్త్రచికిత్స అవసరం లేదు. ఆరువారాల పాటు జాగ్రత్తగా ఉండటం అవసరం. మూడు వారాల పాటు పట్టీలు ధరించి నడవాలి. ఆ తర్వాత ఫిజియోథెరపీ చేయించుకోవాలి. ఈ సమయంలో మెట్లు ఎక్కటం, దిగటం, కింద కూర్చోవటం, బాసింపట్టు వేసుకోవటం మానెయ్యాలి. వీటితోనే చాలావరకూ సమస్య కుదురుకుంటుంది. రెండో గ్రేడ్ కూడా ఇలాంటి జాగ్రత్తలతో 80% వరకూ దాదాపుగా నయమవుతుంది. కానీ కొందరికి చీలిక కుదురుకోకపోవచ్చు. పూర్తిగా తెగిపోవచ్చు. అప్పుడు శస్త్రచికిత్స అవసరమవుతుంది.

- కొన్నిసార్లు చీలిక మానిందో లేదో సరిగా తెలుసుకోలేకపోవచ్చు. అలాంటప్పుడు ఆర్థ్రోస్కోపీతో మోకాలి లోపల ఎలా ఉందో చూడాల్సి ఉంటుంది. ఒక్కోసారి పాక్షికంగా తెగినా కూడా పని చేయకపోవచ్చు. వేలాడుతూ ఉండటం వల్ల పట్టు ఇవ్వదు. అందువల్ల కండర బంధనాన్ని పట్టుకొని, లాగితే పనిచేస్తుందో లేదో తెలుస్తుంది. పనిచేయటం లేదని గమనిస్తే అప్పుడే శస్త్రచికిత్స చేసి, కొత్త లిగమెంట్ అమర్చాల్సి ఉంటుంది.
- మూడో గ్రేడ్ లిగమెంట్ చీలికకు శస్త్రచికిత్స తప్పనిసరి.

సింథటిక్ లిగమెంట్ భరోసా

కండర బంధనాలు తెగినవారికి ఇప్పుడు కృత్రిమ లిగమెంట్లు చక్కటి అవకాశంగా కనిపిస్తున్నాయి. సహజ కణజాలం మాదిరిగానే ఇవి బలంగా.. ఆ మాటకొస్తే ఇంకాస్త మన్నికగానూ ఉండటం విశేషం. అందుకే వీటికి ప్రాధాన్యం పెరుగుతోంది. సాధారణంగా హామ్‌స్ట్రింగ్స్‌లో లోపల, వెలుపల రెండు జతలుంటాయి. లోపలివి తీసినా బయటివి దన్నుగా నిలుస్తాయి. కాకపోతే తీసిన భాగం కాస్త బలహీనంగా ఉంటుంది. శస్త్రచికిత్స అనంతరం నొప్పి, వాపు ఎక్కువగా ఉంటాయి. కొద్దిగా రక్తస్రావం కూడా కావొచ్చు. తీసినచోట టెండాన్ పూర్తిస్థాయిలో వృద్ధి చెందకపోవచ్చు కూడా. దీంతో మునుపటి నైపుణ్యాన్ని కనబరచలేకపోవచ్చు. మరోవైపు ఫిజియోథెరపీ కూడా నెమ్మదిగా మొదలెట్టాల్సి ఉంటుంది. అమర్చిన టెండాన్ ఎప్పుడైనా సాగిపోయి, మళ్లీ తెగిపోయే ప్రమాదముంది. అప్పుడు అవతలి వైపు నుంచి కండరాన్ని తెచ్చి అమర్చాల్సి రావొచ్చు. అదే కృత్రిమ కండర బంధనమైతే ఇలాంటి ఇబ్బందులేవీ ఉండవు. పాలిస్టర్‌తో తయారైన ఇది వస్త్రంలా, లిగమెంట్ మాదిరిగానే ఉంటుంది. దీన్ని మోకాలుకు పై, కింది ఎముకల్లో నిర్దిష్టమైన కోణాల్లో సొరంగంలా సన్నటి (6 మి.మీ.) రంధ్రాలు చేసి బిగిస్తారు. దీంతో అది గట్టిగా పట్టుకొని, బలంగా పనిచేస్తుంది. శస్త్రచికిత్స చేసిన మర్నాడే నడవొచ్చు. నొప్పి, వాపు తక్కువ. నాలుగున్నర నెలల్లోనే తిరిగి ఆటలు ఆడటం వంటి పనులు యథావిధిగా చేసుకోవచ్చు. అదే సహజ కండరాన్ని బిగిస్తే ఏడాది వరకూ ఆటలు ఆడటం కుదరదు. కృత్రిమ లిగమెంట్‌ను అమర్చే పద్ధతి కాస్త భిన్నమైంది. అది సాగకుండా, తిరిగి తెగకుండా ఉండాలంటే సరైన స్థానంలో ఎముకకు రంధ్రాలు చేసి, బిగించాల్సి ఉంటుంది. దీనికి మంచి నైపుణ్యం అవసరం. విదేశాల్లో పదేళ్లుగా దీన్ని అమరుస్తున్నారు. మనదగ్గర ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతోంది.



- కృత్రిమ లిగమెంట్ పొరలతో కూడుకొని ఉంటుంది. వీటిల్లో నెమ్మదిగా కొన్ని మూలకణాలు జతచేరి, క్రమంగా సహజ లిగమెంట్‌గానూ మారుతుంది.
- పీసీఎల్, ఎంసీఎల్, ఎల్‌సీఎల్ తెగినా కూడా కృత్రిమ కండర బంధనాన్ని బిగించొచ్చు. తరచూ మోకాలి చిప్ప జారేవారికి ఎంపీఎఫ్ఎల్ అనే కండరం తెగుతుంటుంది. దీని పునర్నిర్మాణానికీ కృత్రిమ కండర బంధనం ఉపయోగపడుతుంది.

ఫిజియోథెరపీ ముఖ్యం

లిగమెంట్ పునర్నిర్మాణ చికిత్సలో ఫిజియోథెరపీ పాత్ర చాలా కీలకం. లేకపోతే మోకాలు బిగుసుకుపోయే ప్రమాదముంది. ఫిజియోథెరపీలో ఐదు దశలుంటాయి. ఒక దశను సాధిస్తేనే మరో దశకు వెళ్లాల్సి ఉంటుంది. తొలి మూడువారాల పాటు మరింత జాగ్రత్త అవసరం. అయితే సహజ టెండాన్‌ను అమర్చితే కనీసం ఆరు వారాల పాటు జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంటుంది. లేకపోతే అది సాగి, తెగిపోవచ్చు. కాబట్టి ఫిజియోథెరపీ నెమ్మదిగా చేయాల్సి ఉంటుంది. కృత్రిమ లిగమెంట్‌తో ఇలాంటి ఇబ్బంది ఉండదు. సత్వరం, మరింత వేగంగా ఫిజియోథెరపీ చేసే అవకాశముంటుంది. మోకాలు బిగుసుకుపోయే ప్రమాదమూ తగ్గుతుంది.

తల తిరిగి కింద పడిపోతున్నా


సమస్య
సలహా

సమస్య: నాకు 35 ఏళ్లు. నేను ఉన్నట్టుండి తల తిరిగినట్టయి, కళ్లు బైర్లు కమ్మి కింద పడిపోతున్నాను. ఇలా జరిగిన కొన్ని సెకండ్ల వ్యవధిలో మెలకువ వచ్చేస్తుంది. దీనికి కారణమేంటి? పరిష్కారమేంటి?

– టి. గుణశేఖర్



సలహా: ఉన్నట్టుండి తల తిరిగి, పడిపోవటానికి రెండు, మూడు సమస్యలు దోహదం చేయొచ్చు. కొన్నిరకాల ఫిట్స్‌లో కాళ్లూ చేతులు కొట్టుకోవటం వంటివేవీ ఉండకపోవచ్చు. మెదడులో విద్యుత్ ప్రచోదనాలు ఉత్తేజితమై కేవలం స్పృహ కోల్పోయి, కింద పడిపోవచ్చు. మరో సమస్య గుండె లయ తప్పటం. ఇందులో ఉన్నట్టుండి గుండె వేగంగా గానీ నెమ్మదిగా గానీ కొట్టుకుంటుంది. దీంతో మెదడుకు రక్తం అందటం తగ్గిపోయి, స్పృహ తప్పి పడిపోయే ప్రమాదముంది. కొందరికి పడుకొని, లేచినప్పుడు హఠాత్తుగా బీపీ పడిపోతుంటుంది. ఇలాంటప్పుడూ మెదడుకు తగినంత రక్తం అందక కళ్లు తిరిగి, కింద పడిపోవచ్చు. అయితే ఇతరత్రా లక్షణాలనూ గమనించటం ముఖ్యం. ఫిట్స్‌లోనైతే మూర్ఛ రావటానికి ముందు కళ్లు చీకట్లు కమ్మినట్టు అనిపించి, స్పృహ కోల్పోవచ్చు. చుట్టుపక్కల జరుగుతున్నదేంటో గుర్తించలేకపోవచ్చు. కొద్ది సెకండ్ల పాటు వారికేమీ తెలియదు. ఆ తర్వాత తామంతట తామే తేరుకోవచ్చు. గుండె లయ తప్పే సమస్యలోనూ కొన్నిసార్లు స్పృహ కోల్పోయే ముందు వారికేమీ తెలియకపోవచ్చు. ఇందులో గుండె దడ, తల తిరగటంతో పాటు ఒళ్లంతా చెమటలు పట్టటం వంటి ఇతరత్రా లక్షణాలూ కనిపిస్తుంటాయి. మీ వయసు 35 అంటున్నారు. అందువల్ల నిర్లక్ష్యం తగదు. కింద పడిపోవటానికి ఇలాంటి సమస్యలేవైనా కారణమవుతున్నాయేమో చూసుకోవటం తప్పనిసరి. మెదడు సమస్య అయినట్టయితే ఈఈజీ, ఎంఆర్ఐ పరీక్షలతో ఫిట్స్‌ను నిర్ధారించొచ్చు. గుండె లయ తప్పేవారిలో కొన్నిసార్లు సమస్య ఎప్పుడు మొదలవుతుందో కచ్చితంగా తెలియకపోవచ్చు. ఇలాంటివారికి శరీరానికి అమర్చే హోల్టర్ పరికరంతో రోజంతా గుండె ఎలా కొట్టుకుంటుందో, రక్తపోటు ఎప్పుడెలా మారుతుందో గుర్తించాల్సి ఉంటుంది. ఆయా కారణాలను బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. తగు చికిత్స తీసుకుంటే సమస్య నయమవుతుంది. మీరు ముందు న్యూరాలజిస్టును సంప్రదించండి. అవసరమైన పరీక్షలు చేసి, సమస్యను నిర్ధారిస్తారు. ఫిట్స్ కాదని తేలితే గుండె నిపుణులకు చూపించుకోవాలి.




- డా॥ సీతా జయలక్ష్మి, న్యూరాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

ఆ కొవ్వుతో రక్తపోటు అదుపు

కొవ్వు కేవలం కేలరీల నిల్వ మాత్రమే కాదు. పూర్తిగా హాని చేసేదీ కాదు. మన ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. రకాన్ని బట్టి ప్రయోజనాలనూ కల్పిస్తుంది. అమెరికాలోని రాక్‌ఫెల్లర్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనమే దీనికి నిదర్శనం.

మన శరీరంలోని కొవ్వంతా ఒకటే కాదు. రకరకాల రూపాల్లో ఉంటుంది. ఎక్కువగా ఉండేది తెల్ల కొవ్వు. ఇది ఆయా భాగాల్లో శక్తిని నిల్వ చేసుకుంటుంది. అవయవాలు ఒకదానికి మరొకటి అతుక్కోకుండా చూస్తుంది. మరీ మితిమీరితే ఊబకాయానికి దారితీస్తుంది. ఇక గోధుమ రంగు కొవ్వేమో వేడిని ఉత్పత్తి చేయటం ద్వారా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. గ్లూకోజు నియంత్రణ, కొవ్వు జీవక్రియలకూ తోడ్పడుతుంది. వీటికి మధ్యస్థంగా మరో రకం కొవ్వూ ఉంటుంది. దీన్ని తెలుపు, గోధుమ కొవ్వుల మిశ్రమం అని చెప్పుకోవచ్చు. ఇది తెల్ల కొవ్వు కణాలను గోధుమ కొవ్వు కణాలుగా మార్చటం ద్వారా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. ఇలా శరీర ఉష్ణోగ్రత స్థిరంగా ఉండేలా చూస్తుంది. ఈ తెలుపు-గోధుమ కొవ్వు గురించే ఇప్పుడు కొత్త విషయం బయటపడింది. ఇది రక్తపోటు నియంత్రణలో పాలు పంచుకుంటున్నట్టు తేలటం ఆసక్తి కలిగిస్తోంది.



ఎలుకల మీద ప్రయోగంతో

రక్తనాళాల చుట్టూరా తెలుపు-గోధుమ కొవ్వు కణాలు దండిగా ఉంటాయి. అందుకే పరిశోధకులు దీనిపై దృష్టి కేంద్రీకరించారు. కొన్ని ఎలుకలను జన్యుపరంగా మార్చి, తెలుపు-గోధుమ కొవ్వును తయారుచేసుకోలేని విధంగా తీర్చిదిద్దారు. అప్పుడు వాటిల్లో తెల్లకొవ్వు సూచికలు వ్యక్తం కావటం మొదలైంది. వీటిల్లో ఒకటి యాంజియోటెన్సినోజెన్. ప్రధానంగా కాలేయం నుంచి విడుదలయ్యే ఇది రక్తపోటును పెంచే హార్మోన్ ఉత్పత్తి కావటానికి దారితీస్తుంది. ఈ ఎలుకల్లో రక్తపోటు పెరగటంతో పాటు రక్తనాళాలు బిగుతుగా అవుతున్నట్టూ పరిశోధకులు గుర్తించారు. రక్తనాళాల చుట్టూ గట్టి కణజాలం పోగుపడటమూ మొదలైనట్టు గమనించారు. అంటే తెలుపు-గోధుమ కొవ్వు అనేది రక్తనాళాలు ఆరోగ్యంగా ఉండేలా చూడటం ద్వారా రక్తపోటు అదుపులో ఉండటానికి తోడ్పడుతోందన్నమాట.

- తెలుపు-గోధుమ కొవ్వు లోపిస్తే ఏం జరుగుతుందో, రక్తనాళాలు ఎందుకు దెబ్బతింటున్నాయో కూడా పరిశోధకులు గుర్తించారు. అస్తవ్యస్త కొవ్వు కణాల నుంచి వెలువడే క్యూఎస్‌ఓఎక్స్1 అనే ఎంజైమ్ రక్తనాళాలు బిగుతుగా అవటానికి దోహదం చేస్తున్నట్టు తేలింది. ఈ ఎంజైమ్‌ను అడ్డుకుంటే రక్తనాళాలు దెబ్బతినే ప్రక్రియ తగ్గటం, రక్తపోటు అదుపులోకి రావటం గమనార్హం. ఎలుకల బరువుతో సంబంధం లేకుండా ఈ ప్రభావం కనిపించటం మరింత విశేషం. అధిక రక్తపోటు, రక్తపోటు నియంత్రణ వంటి సంక్లిష్ట అంశాలను అర్థం చేసుకోవటానికి శరీరంలో వేర్వేరు అవయవ వ్యవస్థల మధ్య సమాచార వ్యవస్థలు చాలా కీలకమని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

కణితి కణాలతోనే క్యాన్సర్ భస్మం

కణితుల్లోనూ క్యాన్సర్‌తో పోరాడే రోగనిరోధక కణాలు (మ్యాక్రోఫేజెస్) ఉంటాయి. కానీ కణితి వాటిని అణచి వేస్తుండటం వల్ల తమ పని చేయలేవు. వీటిని క్యాన్సర్‌ను ఎదుర్కొనే కణాలుగా తిరిగి మార్చగలిగితే? ఎంత బాగుంటుందో కదా. కొరియా అడ్వాన్స్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కేఏఐఎస్‌టీ) పరిశోధకులు అలాంటి ఘనతే సాధించారు. కణితుల్లోని రోగనిరోధక కణాలను క్యాన్సర్‌ను నిర్మూలించే కణాలుగా మార్చగల కొత్త మందును రూపొందించారు. దీన్ని సూది ద్వారా నేరుగా కణితుల్లోకి ఇస్తే, కణితిలో అప్పటికే ఉన్న మ్యాక్రోఫేజెస్ దాన్ని శోషించుకొని, క్యాన్సర్‌ను గుర్తించే కార్ (కిమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్) ప్రొటీన్లను ఉత్పత్తి చేస్తాయి. అదే సమయంలో రోగనిరోధక సంకేతాలనూ ప్రేరేపిస్తాయి. అంటే అవి కార్-మ్యాక్రోఫేజెస్‌గా మారతాయన్నమాట. వీటిల్లో క్యాన్సర్ కణాలను చంపే సామర్థ్యం పెరిగినట్టు, చుట్టుపక్కల రోగనిరోధక కణాలను ప్రేరేపిస్తున్నట్టు తేలింది. ఇలా ఇవి శక్తిమంతమైన యాంటీక్యాన్సర్ ప్రభావాలను కలగజేస్తున్నాయి.

కృత్రిమ దంతమైనా..

కృత్రిమ దంతాలు (డెంటల్ ఇంప్లాంట్స్) సహజ దంతాల మాదిరిగానే పనిచేస్తాయి. ఇష్టమైన ఆహారం తినటానికి, ముఖం అందంగా కనిపించటానికి, స్పష్టంగా మాట్లాడటానికి ఎంతగానో తోడ్పడతాయి. వీటిని అమర్చుకున్నాక ఇరవై ఏళ్ల తర్వాత కూడా సుమారు 85 నుంచి 92% వరకూ బలంగా ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇంకాస్త జాగ్రత్తగా చూసుకుంటే చాలామందిలో జీవితాంతమూ పనిచేస్తాయి. ఇందుకోసం ఏం చేయాలంటే?

- రోజుకు రెండుసార్లు.. ఉదయం నిద్ర లేచాక, రాత్రి పడుకునే ముందు మెత్తటి బ్రష్‌తో పళ్లు తోముకోవాలి. కృత్రిమ దంతాల పైభాగం వెడల్పుగా ఉండటం వల్ల ఆహార తునకలు తేలికగా చిక్కుకుంటాయి. కాబట్టి సన్నటి దారంతో (ఫ్లాస్) పళ్ల మధ్యలో శుభ్రం చేసుకుంటే, గార పట్టే అవకాశం తగ్గుతుంది.
- పళ్లు జివ్వుమనేవారు, తరచూ చిరుతిళ్లు తినేవారు డాక్టర్ సలహా మేరకు మౌత్‌వాష్‌లు లేదా జెల్స్ వాడుకోవాలి.
- ప్రతి ఆరు నెలలకోసారి దంత వైద్యుడిని సంప్రదించి చెకప్, క్లీనింగ్ చేయించుకోవాలి. ఏవైనా సమస్యలు మొదలవుతుంటే ముందే పట్టుకోవచ్చు.
- గట్టిగా ఉండే చెరకు గడలు, ఐస్, బాదంలాంటి గింజపప్పుల వంటి వాటిని ఇంప్లాంట్స్‌తో కొరకొద్దు.
- పళ్లకు అంటుకునే చూయింగ్ గమ్, చాక్లెట్ల వంటి వాటికి దూరంగా ఉండాలి.
- చిగుళ్లు, ఎముకలకు పొగ తాగటం హాని కలిగిస్తుంది. కృత్రిమ దంతాల జీవనకాలాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. కాబట్టి సిగరెట్లు, చుట్టల వంటివి కాల్చొద్దు. అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.


కిటికీ పక్కన కూర్చుంటే..

మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఇంట్లో కిటికీ పక్కన ఎక్కువగా గడపటానికి ప్రయత్నించండి. ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమేనని తాజాగా బయటపడింది. మన శరీరంలోని కణాలు, కణజాలాలు జీవగడియారాన్ని అనుసరిస్తుంటాయి. ఈ జీవగడియారం రోజంతా చీకటి, వెలుగుల చక్రాన్ని బట్టి నడుస్తుంటుంది. రాత్రిపూట కృత్రిమ కాంతి ప్రభావంతో జీవగడియారం అస్తవ్యస్తమవుతున్నట్టు, రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. అదే పగటిపూట ఎండలో ఎక్కువసేపు గడిపితే శరీరం ఇన్సులిన్‌కు స్పందించే గుణం పెరుగుతుందనీ వివరిస్తున్నాయి. ఇన్సులిన్ సామర్థ్యం పెరిగితే రక్తంలో గ్లూకోజు మోతాదులూ తగ్గుముఖం పడతాయి. అయితే ఇంట్లో కిటికీ గుండా పడే సహజ కాంతితో ఒనగూరే ప్రయోజనాల గురించి మాత్రం పెద్దగా తెలియదు. ఈ నేపథ్యంలో నెదర్లాండ్స్‌లోని మాస్ట్రిక్ట్ యూనివర్సిటీ పరిశోధకులు వినూత్న ప్రయోగం చేపట్టారు. కొందరు మధుమేహులను పెద్ద కిటికీలతో కూడిన గదిలో గడిపేలా చేసి, పరిశీలించారు. మధుమేహం మందులు, ఆహారం యథావిధిగా తీసుకుంటూనే ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు కేవలం సహజ కాంతి మాత్రమే పడేలా చూశారు. రాత్రిపూట కృత్రిమ కాంతి తక్కువగా ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. ఇలా ఐదు రోజులు గడిపిన తర్వాత వారిని కిటికీలు లేని గదిలో ఉంచి పరిశీలించారు కూడా. సహజ కాంతి ప్రభావానికి గురైన రోజుల్లో 50% వరకూ రక్తంలో గ్లూకోజు మోతాదులు ఆరోగ్యకర స్థాయిలో ఉండగా.. కృత్రిమ కాంతి గదిలో ఉన్నప్పుడు 43% మాత్రమే స్థిరంగా ఉన్నట్టు తేలింది. ఈ తేడా అంత ఎక్కువగా అనిపించకపోయినా గుండెజబ్బుల వంటి మధుమేహ దుష్ప్రభావాల ముప్పు ఎక్కువగా ఉన్నవారికి ఎంతో ప్రయోజనం చేకూర్చగలదని పరిశోధకులు చెబుతున్నారు.



గుండెపోటు హఠాత్ పరిణామం కాదా?

'రాత్రంతా నాతోనే ఉన్నాడే, అంతలోనే ఇలా ఎలా?' హఠాత్తుగా ఎవరైనా గుండెపోటుతో చనిపోతే ఇలాగే విస్తుపోతుంటాం. అప్పటివరకూ ఆడుతూ, పాడుతూ తిరిగిన మనిషి ఉన్నట్టుండి మరణిస్తే ఎవరికీ నమ్మబుద్ధి కాదు. కానీ గుండెపోటు తీరే వేరు. చెట్టంత మనిషిని ఉన్నట్టుండి కుప్ప కూలుస్తుంది. అయితే ఇది హఠాత్ పరిణామం కాదా? పైకేమీ తెలియకుండా చాలాకాలంగా దీనికి బీజం పడుతూ వస్తుందా?



గుండెపోటు హెచ్చరికలేవీ లేకుండా దాడిచేస్తుండొచ్చు. కానీ ఏదో ఒక కారణం లేకుండా సంభవించటం అరుదు. ఓ భారీ తాజా అధ్యయనం ఇదే చెబుతోంది. ఇందులో సుదీర్ఘంగా 20 ఏళ్ల పాటు 90 లక్షలకు పైగా మందిని పరిశీలించారు. తొలిసారి గుండెపోటు, పక్షవాతం, గుండె వైఫల్యం బారినపడ్డవారిలో సుమారు 99% మందిలో ప్రధానంగా నాలుగు ముప్పు కారకాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నట్టు గుర్తించారు. అన్నీ కాకపోయినా చాలామందిలో ఏదో ఒకటి ఉండటం గమనార్హం. అవి ఇవీ..

1 అధిక రక్తపోటు: గుండెపోటు బారినపడ్డ ప్రతి 10 మందిలో తొమ్మిది కన్నా ఎక్కువమంది అధిక రక్తపోటు గలవారే కావటం గమనార్హం. రక్తపోటు చాలా ఏళ్లుగా ఎక్కువగా ఉంటూ వస్తున్నట్టయితే రక్తనాళాలు దెబ్బతింటూ వస్తుంటాయి. గట్టిపడి, సాగేగుణం తగ్గుతుంది. రక్తనాళాల లోపల చిన్న చిన్న చీలికల వంటివి ఏర్పడితే అక్కడ కొవ్వు, కొలెస్ట్రాల్ తేలికగా అంటుకుంటాయి. దీంతో లోపలి మార్గం సన్నబడుతుంది. ఫలితంగా రక్తాన్ని పంప్ చేయటానికి గుండె మరింత బలంగా పనిచేస్తుంది. క్రమంగా ఇది గుండె వైఫల్యం, హఠాత్ గుండెపోటుకు దారితీస్తుంది.

- రక్తపోటు పెరిగితే తలనొప్పి, తల తిప్పటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయని చాలామంది భావిస్తుంటారు. ఇది నిజం కాదు. ఇలాంటి లక్షణాలేవీ లేకపోయినా రక్తపోటు అధికంగా ఉండొచ్చు. కాబట్టి ఏటా ఒకసారైనా బీపీ పరీక్ష చేయించుకోవాలి. ఎక్కువుంటే తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఆహార, వ్యాయామ నియమాలతో అదుపులోకి రాకపోతే విధిగా మందులేసుకోవాలి.

2 అధిక కొలెస్ట్రాల్: కొలెస్ట్రాల్.. ముఖ్యంగా చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) పెరిగితే అది రక్తనాళాల గోడల్లో పేరుకోవటం మొదలవుతుంది. క్రమంగా అక్కడ పూడికలు ఏర్పడతాయి. ఇది రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. పూడిక చిట్లిపోతే, రక్తం గడ్డకట్టి ఉన్నట్టుండి రక్తనాళం మొత్తం మూసుకుపోవచ్చు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో రక్తం గడ్డకడితే గుండెపోటు సంభవిస్తుంది. మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకడితే పక్షవాతానికి దారితీస్తుంది.

- పూడికలు ఏర్పడటమనేది చాలా నెమ్మదిగా సాగుతూ వస్తుంటుంది. చాలాసార్లు నొప్పి, హెచ్చరిక లక్షణాల వంటివేవీ ఉండకపోవచ్చు. పైకి అంతా బాగున్నట్టే అనిపించినా లోలోపల అనర్థం జరుగుతూనే ఉంటుంది. కాబట్టి అప్పుడప్పుడూ కొలెస్ట్రాల్ పరీక్ష చేయించుకొని, మోతాదులు ఎలా ఉన్నాయో చూసుకోవాలి. ఎక్కువుంటే ఆహార, వ్యాయామ నియమాలతో తగ్గించుకోవాలి. కొందరికి జన్యుపరంగా కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండొచ్చు. ఇలాంటివారు ఇంకా ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి.

3 అధిక గ్లూకోజు: గ్లూకోజు మోతాదులు ఒకింత ఎక్కువగా ఉన్నా.. అంటే మధుమేహంగా నిర్ధారించే స్థాయిలో ఎక్కువగా లేకపోయినా కూడా చేటే. గుండె, మెదడు, రక్తనాళాలకు కీడు చేస్తుంది. రక్తనాళాల లోపలి పైపొరను గ్లూకోజు దెబ్బతీస్తుంది, వాపు ప్రక్రియను ప్రేరేపిస్తుంది. పూడికలు ఏర్పడటాన్ని ప్రోత్సహించి, రక్తనాళాలు గట్టిపడేలా చేస్తుంది. అంతేకాదు, చెడ్డ కొలెస్ట్రాల్, రక్తపోటు పెరిగేలా చేస్తుంది కూడా. ఇవన్నీ గుండెకు చేటు చేసేవే.

- చాలామంది గ్లూకోజు మోతాదులను పెద్దగా పట్టించుకోరు. లక్షణాలేవీ లేవు కదా అని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది పెద్ద తప్పు. గ్లూకోజు మోతాదులు పెరిగినా పైకి ఎలాంటి లక్షణాలూ ఉండవు. కాబట్టి తరచూ గ్లూకోజు మోతాదులను పరీక్షించుకోవటం మంచిది.

4 పొగాకు వాడకం: పొగాకు గుండెకు పెద్ద శత్రువు. సిగరెట్లు, చుట్టలు, బీడీల వంటివి కాల్చినా.. ఇతరులు కాల్చినప్పుడు వెలువడే పొగను పీల్చినా ప్రమాదమే. ఇది రక్తనాళాల లోపలి మార్గం సన్నబడేలా చేస్తుంది. రక్తంలో ఆక్సిజన్ స్థాయులను తగ్గిస్తుంది. రక్తం గడ్డలు ఏర్పడే ముప్పును పెంచుతుంది. కొలెస్ట్రాల్ మోతాదులూ ఎక్కువవుతాయి. ఇవన్నీ గుండె, మెదడుకు చేటు కలిగించేవే. అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందనప్పుడు గుండె మరింత బలంగా కొట్టుకోవటం మొదలెడుతుంది. ఇది గుండెపోటు, పక్షవాతానికి దారితీస్తుంది.

- సిగరెట్లు, చుట్టలు, బీడీలు, హుక్కా వంటి వాటికి దూరంగా ఉండాలి. అలవాటుంటే వెంటనే మానెయ్యాలి. ఇంట్లోనూ ఎవరినీ పొగ తాగనీయొద్దు. ఎప్పుడో అప్పుడు ఒకటీ అరా సిగరెట్లు కాలిస్తే ఏమీ కాదని అనుకోవద్దు.


ఈనాడు సినిమా

కూతురు సెంటిమెంట్ కథలో...!


చిరంజీవి

ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రం సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్టు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురు సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉండబోతుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

2500 మందితో కలిసి వందేమాతరం గీతాలాపన


ఎమ్.ఎమ్.కీరవాణి

స్వాతంత్రోద్యమం రోజుల నుంచి...దేశమంతా ఏకతాటిపై నడిచేలా స్ఫూర్తిని నింపుతున్న వందేమాతరం గేయాన్ని, తన స్వరకల్పనలో సరికొత్తగా వినిపించబోతున్నారు ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ పురస్కార గ్రహీత ఎం.ఎం.కీరవాణి. అందుకు ఈ నెల 26న జరగనున్న భారత గణతంత్ర దినోత్సవ కవాతు వేదిక కానుంది. వందేమాతరం గేయం గతేడాదితో 150 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి ఈ గేయాన్ని సరికొత్తగా స్వరపరిచి, దేశం నలుమూలలకు చెందిన 2500 మంది కళాకారులతో కలిసి ఆలపించనున్నారు. ఈ విషయాన్ని కీరవాణి ఎక్స్ వేదికగా తెలియజేశారు. గణతంత్ర దినోత్సవ కవాతుకు సంగీతం సమకూర్చడం తనకు దక్కిన గౌరవంగానూ, అదృష్టంగానూ భావిస్తున్నాననీ, మన దేశం స్ఫూర్తిని చాటి చెప్పే ఓ గొప్ప వేడుక ఇదని కీరవాణి ఎక్స్‌లో పంచుకున్న ఓ పోస్టులో పేర్కొన్నారు.

ఓ టీ టీ లో ఈ వారం

వినోదాలు పంచడానికి కొత్త వారం రానే వచ్చింది. ఎప్పటిలాగే ఓటీటీలు కూడా అదిరిపోయే కంటెంట్‌తో సిద్ధంగా ఉన్నాయి. ఈ వారాంతం ప్రేక్షకుల్ని నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేయడానికి సస్పెన్స్ సినిమాలు, సీటు అంచున కూర్చోబెట్టే సిరీస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాయి.

సర్వైవల్ (చిత్రం)	మంగళవారం	ఆహా
ఏ బిగ్ బోల్డ్ బ్యూటిఫుల్ జర్నీ (సినిమా)	మంగళవారం	నెట్‌ఫ్లిక్స్
స్టీల్ (సిరీస్)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ఫైండింగ్ హర్ ఎడ్జ్ (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
చీకటిలో (సినిమా)	శుక్రవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
మార్క్ (సినిమా)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
తేరే ఇష్క్ మే (సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్

'శంబాల' ప్రపంచం



"విధి నిన్నిక్కడికి రప్పించింది. అంటే నువ్వే ఈ సమస్యకి కొత్త పరిష్కారం కనిపెడతావేమో" అంటూ 'శంబాల' ప్రపంచం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. అర్చన అయ్యర్ కథానాయిక. భయపెట్టే అంశాలు, ఉత్కంఠ రేకెత్తించే రహస్య కోణం, పురాణ నేపథ్యం లాంటి అంశాలతో రూపొందిన ఈ సినిమా ఇటీవలే థియేటర్లలోకి వచ్చి అలరించింది. ఇప్పుడీ చిత్రం గురువారం నుంచి ఆహా వేదికగా మీ ఇళ్లలో సందడి చేయనుంది. 1980వ దశకం నేపథ్యంలో సాగే ఈ మిస్టిక్ థ్రిల్లర్‌లో ఆది.. విక్రమ్ అనే యువ శాస్త్రవేత్తగా కనిపించి ఆకట్టుకున్నారు.

ప్రతి భారతీయుడి కోసం



ఇస్రో చేపట్టిన చంద్రయాన్ మిషన్ ఆధారంగా రూపొందిన సిరీస్ 'స్పేస్ జెన్: చంద్రయాన్'. అనంత్ సింగ్ దర్శకత్వం వహించారు. టీవీఎఫ్ సంస్థ నిర్మించింది. శ్రియా శరణ్, నకుల్ మెహతా, డానిశ్, గోపాల్ దత్ తదితరులు ప్రధాన పాత్రధారులుగా నటించారు. 'జాబిల్లి వైపు చూసే ప్రతి భారతీయుడి కోసం" అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని, మిషన్ల వెనుక ఉన్న అలుపెరుగని పోరాటాన్ని ఇందులో చూపించనున్నారు. ఇప్పుడీ సిరీస్ శుక్రవారం నుంచి ప్రముఖ ఓటీటీ జియోహాట్‌స్టార్ వేదికగా అలరించడానికి సిద్ధమైంది.

వెంకీ దృశ్యం 3 అక్టోబరు లక్ష్యంగా


వెంకటేశ్

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్ బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.

ఇళయరాజాకు పద్మపాణి పురస్కారం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను పద్మపాణి పురస్కారం వరించింది. ఈ విషయాన్ని అజంతా ఎల్లోరా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్(ఏఐఎఫ్ఎఫ్) నిర్వాహకులు ఇన్‌స్టా వేదికగా వెల్లడించారు. ఈ అవార్డుని ఉత్సవ ప్రారంభోత్సవంలో జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సినీ ప్రియుల సమక్షంలో ఆయనకు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. ఈ చలనచిత్రోత్సవం జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జరగనుంది. పద్మపాణి జ్ఞాపికతోపాటు ఆయనకు గౌరవ పత్రం, రూ.2లక్షల నగదుని ప్రదానం చేస్తారు. గతంలో ఈ అవార్డును అందుకున్న వారిలో గీత రచయిత జావేద్ అక్తర్, ప్రముఖ దర్శక-రచయిత సాయి పరంజ్‌పే, నటుడు ఓం పురి తదితరులు ఉన్నారు.

రూ.400కోట్లకు పైగా బడ్జెట్‌తో 'మా వందే'


ఉన్ని ముకుందన్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవిత కథతో సీహెచ్ క్రాంతి కుమార్ తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రం 'మా వందే'. మలయాళ స్టార్ ఉన్ని ముకుందన్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఎం.వీర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. రవీనా టాండన్, జగపతిబాబు, శరత్ కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ఈ నెల 22నుంచి కశ్మీర్‌లో రెండో షెడ్యూల్‌ని ప్రారంభించుకోనుంది. "ఈ సినిమాని దాదాపు రూ.400కోట్లకు పైగా బడ్జెట్‌తో నిర్మిస్తున్నాం. దీన్ని ప్రపంచంలో తొలిసారిగా ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్‌తో చిత్రీకరిస్తుండటం విశేషం. హాలీవుడ్ హిట్ సినిమా 'ఆక్వామాన్'లో హీరోగా నటించిన జేసన్ మోమోవాను ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం సంప్రదిస్తున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

కనకరాజు రాక


వరుణ్ తేజ్

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా... ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థతో కలిసి యు.వి.క్రియేషన్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా - కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. వరుణ్‌తేజ్ పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం ఈ సినిమా పేరు 'కొరియన్ కనకరాజు' అని ప్రకటిస్తూ, ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం. కొరియన్ కనకరాజు పాత్రలో వరుణ్‌తేజ్ 'నేను తిరిగొచ్చా' అంటూ కొరియా భాషలో మాట్లాడుతూ సందడి చేయడం ప్రచార చిత్రానికి ఆకర్షణగా నిలిచింది.

విజయ్ చిత్రంతో మేం ఎలా పోటీపడతాం?


సుధా కొంగర

"గతంలో విజయ్‌తో సినిమా తీయాలని చాలా ప్రయత్నించా. కానీ కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేద'ని అన్నారు దర్శకురాలు సుధా కొంగర. ఇటీవలే ఆమె తెరకెక్కించిన 'పరాశక్తి' థియేటర్లలోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుధా కొంగర.. 'జన నాయగన్' సినిమా గురించి మాట్లాడారు. "నేను విజయ్ అభిమానుల్లో మొదటి వరుసలో ఉంటాను. ఈ విషయం ఆయనకు కూడా తెలుసు. విజయ్ నటించిన 'జన నాయగన్' మా 'పరాశక్తి'తో పాటు విడుదల కావాల్సి ఉంది. మా సినిమా ఆడియో విడుదల వేడుకలోనూ నేను దీని గురించి మాట్లాడాను. కావాలంటే 'పరాశక్తి'ని 200 సార్లు చూస్తాను కానీ విజయ్ నటించిన 'జననాయగన్'కు మాత్రం మొదటి రోజు మొదటి షోకే వెళ్తానని స్టేజ్ మీదనే చెప్పా. దాని విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. రిలీజ్‌కు కొన్ని గంటల ముందు సెన్సార్ కారణంగా వాయిదా పడింది. అలా ఏ సినిమాకీ జరగకూడదు. ఆయన చిత్రంతో పోటీపడాలని మేం ఎప్పుడూ అనుకోలేదు. దేశంలోనే అతి పెద్ద స్టార్‌తో మేం ఎలా పోటీ పడతాం..? అలా ఎవరూ చేయరు. మా 'పరాశక్తి'కి పండగ తేదీ అవసరం అంతే" అని చెప్పారు.

వినోదాల చీన్ టపాక్ డుం డుం


సమంత, గవి రెడ్డి, బ్రిగిడా సాగా

గవిరెడ్డి శ్రీను హీరోగా వై.ఎన్.లోహిత్ దర్శకత్వంలో 'చీన్ టపాక్ డుం డుం' అనే చిత్రం శ్రీకారం చుట్టుకుంది. దీన్ని శ్రీను నాగులపల్లి నిర్మిస్తున్నారు. బ్రిగిడా సాగా కథానాయిక. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సమంత క్లాప్ కొట్టారు. వశిష్ఠ కెమెరా స్విచ్చాన్ చేశారు. గోపీచంద్ మలినేని గౌరవ దర్శకత్వం వహించారు. నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. "టైటిల్‌కు తగ్గట్లుగానే ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: పీఆర్, ఆర్ట్ డైరెక్టర్: ఏఎస్ ప్రకాశ్, ఛాయాగ్రహణం: సెంథిల్ కుమార్.

వాళ్లంతా లాభాల్లోకి రావడం తృప్తినిచ్చింది!


సుధాకర్ చెరుకూరి

మంచి సినిమాలొస్తే కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని మరోసారి రుజువైందన్నారు నిర్మాత సుధాకర్ చెరుకూరి. హాస్య ప్రధానమైన కథలతో తెరకెక్కడం, సంక్రాంతి పండగ సీజన్ కావడంతోనే ఐదు సినిమాలొచ్చినా అన్నింటికీ మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఆయన ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై, రవితేజ కథానాయకుడిగా నిర్మించిన చిత్రమే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల దర్శకత్వం వహించారు. ఈ నెల 13న విడుదలై, విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా సుధాకర్ చెరుకూరి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"ఈసారి తన సినిమాలకు భిన్నంగా, కుటుంబ వినోదంతో ఓ సినిమా చేద్దామన్న కథానాయకుడు రవితేజ నిర్ణయం మేరకే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'ని మొదలు పెట్టాం. అనుకున్నట్టుగానే ఈ సినిమా కుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించడం తృప్తినిచ్చింది. తక్కువ రోజుల్లో, పక్కా ప్రణాళికతో చేసిన సినిమా కావడంతో మేం పంపిణీదారులకు కూడా తక్కువ ధరలకే అమ్మాం. వాళ్లందరూ లాభాల్లోకి రావడం ఎంతో తృప్తినిచ్చింది. పండగ ప్రయాణాలు పూర్తవుతున్నాయి కదా... రెండు, మూడు వారాల్లోనూ మరిన్ని వసూళ్లు వస్తాయి".

● "ఈసారి పండగకు ప్రేక్షకులకు కావల్సినంత వినోదాన్ని అందించాం. అయితే పంపిణీదారులపై ఎక్కువ సినిమాల్ని రుద్దేసి తప్పు చేశామేమో అనిపిస్తోంది. మేం ప్రస్తుతం నిర్మిస్తున్న 'ది ప్యారడైజ్' విషయంలో అది పునరావృతం కానివ్వం. మార్చిలో విడుదల అనుకున్నాం కానీ, 'పెద్ది', 'ది ప్యారడైజ్' సినిమాలు ఒకేసారైతే విడుదల కావు. మేమంతా స్నేహితులమే కాబట్టి, ఒకరికొకరు మాట్లాడుకుని సినిమాని విడుదల చేస్తాం. అది పూర్తయ్యాక, రెండు నెలల్లోపే చిరంజీవి - శ్రీకాంత్ ఓదెల కలయికలో సినిమా మొదలవుతుంది. 1970 నేపథ్యంలో సాగే ఓ పీరియాడిక్ కథతో ఆ సినిమా రూపొందుతుంది. కిశోర్ తిరుమల దర్శకత్వంలో తదుపరి ఓ ప్రేమ కథని నిర్మించబోతున్నా. 'అరుంధతి' తరహా సినిమా చేయాలని ఉంది. దుల్కర్ సల్మాన్ - పూజా హెగ్డే కలయికలో మేం ప్రస్తుతం నిర్మిస్తున్న సినిమా కూడా చాలా బాగుంటుంది. 'కె.జె.క్యూ' సినిమానీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం".

విజయం సాధించే అర్హతలున్న శుభకృత్...


పవిత్ర లోకేశ్, నరేశ్, శ్రీవిష్ణు


"మంచి డ్రామా, సస్పెన్స్, ట్రావెల్ అన్నీ మిళితమై ఉన్న చిత్రం 'శుభకృత్ నామ సంవత్సరం'" అన్నారు నరేశ్ వీకే. ఇప్పుడాయన ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని ఎస్ఎస్ సజ్జన్ తెరకెక్కించారు. డీఆర్ విశ్వనాథ్ నాయక్ నిర్మించారు. ఇది త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. హీరో శ్రీవిష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు అతిథులుగా విచ్చేశారు. నరేశ్ మాట్లాడుతూ.. "విజయం సాధించే అర్హతలన్నీ ఉన్న చిత్రమిది" అన్నారు. ఈ కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నటి పవిత్ర లోకేశ్, నిర్మాతలు రాజేశ్ దండా, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి... బంగారం ఒకటే బ్రదర్!



"ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన ఆయుధం చిరునవ్వు" అంటూ ఇటీవలే 'మాయసభ: ది హాల్ ఆఫ్ ఇల్యూజన్' ప్రపంచాన్ని పరిచయం చేశారు దర్శకుడు రాహి అనిల్ బార్వే. 'తుంబాడ్'తో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడీయన. ఆయన దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో జావేద్ జాఫేరి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 30న థియేటర్లలోకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో కొత్త పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఫాంటసీ, థ్రిల్ లాంటి అంశాలతో దీన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'మట్టి, బంగారం.. ఈ రెండూ నాకు ఒకటే బ్రదర్' అంటూ ఇటీవలే విడుదలైన టీజర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంది.

స్నేహగీతం


నయనతార, త్రిష

నువ్వా నేనా అన్నట్టుగా ఒకప్పుడు పోటాపోటీగా అవకాశాల్ని అందుకుంటూ సినిమాలు చేసిన కథానాయికలు నయనతార, త్రిష. 2000 దశకంలో ఈ ఇద్దరూ స్టార్ కథానాయికలుగా ఎదిగారు. అప్పట్లో ఇద్దరి మధ్య అభిప్రాయ బేధాలు కూడా ఉన్నట్టు ప్రచారం సాగింది. అలాంటి తారలు తమ మధ్య పోటీని, అభిప్రాయ బేధాల్ని పక్కనపెట్టి... స్నేహగీతాన్ని ఆలపిస్తూ ఇటీవల విదేశాల్లో హాయిగా విహరించారు. ఆ సందర్భంలో తీసుకున్న ఫొటోల్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. వెంటనే అవి వైరల్‌గా మారాయి. ఇంచుమించు ఒకే సమయంలో కెరీర్‌ని మొదలుపెట్టిన ఈ ఇద్దరు కథానాయికలు కొత్తతరానికి దీటుగా నేటికీ వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు.

వ్యతిరేకించండి.. కానీ అవమానించొద్దు!

ఏఆర్ రెహమాన్‌కు మద్దతుగా నిలిచిన ఆయన కుమార్తెలు


ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఇటీవలే బాలీవుడ్‌పై చేసిన వ్యాఖ్యలు చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయన కుమార్తెలు ఖతీజా, రహీమా తనకు మద్దతుగా నిలిచారు. ఏఆర్ రెహమాన్‌ను ఉద్దేశిస్తూ.. 'వ్యతిరేకించండి.. కానీ అవమానించకండి' అంటూ మలయాళ స్వరకర్త కైలాస్ మేనన్ పెట్టిన ఓ పోస్టు పెట్టారు. తాజాగా దీన్ని సామాజిక మాధ్యమాల్లో రీపోస్టు చేశారు ఖతీజా, రహీమా. "ఏఆర్ రెహమాన్ తన మనసులోని మాటలను చెప్పారని నిందించే వ్యక్తులు ఒక ప్రాథమిక విషయాన్ని మరిచిపోతున్నారు. ఆయన తన భావాల గురించి మాట్లాడారు. అది అతని హక్కు. మీరు అతనితో విభేదించవచ్చు.. కానీ తన అనుభవాన్ని వ్యక్తీకరించే స్వేచ్ఛను తిరస్కరించలేరు. ప్రపంచ వ్యాప్తంగా గౌరవించే ఒక కళాకారుడిని అవమానమని పిలవడం, అతన్ని ప్రశ్నించడం.. ఎగతాళి చేయడం.. ఇవన్నీ కావాలనే చేస్తున్న ద్వేషపూరిత వ్యాఖ్యలు" అని మేనన్ తన పోస్టులో పేర్కొన్నారు.

ఏఐ జనరేటివ్... బాల్ తానాజీ



బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్.. తన మేనల్లుడు డానిష్ దేవగణ్‌తో కలిసి జనరేటివ్ ఏఐతో ఒక సరికొత్త ప్రాజెక్ట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లెన్స్ వాల్ట్ స్టూడియోస్ సంస్థ నుంచి ఆయన సమర్పణలో 'బాల్ తానాజీ' అనే తొలి ఏఐ జనరేటివ్ ప్రాజెక్ట్‌ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాలో ఫస్ట్ లుక్ యానిమేటెడ్ వీడియోతో అధికారికంగా పంచుకున్నారు. "లెజెండ్స్ కీర్తిలో పుట్టరు.. నిశ్శబ్దంలోనే రూపుదిద్దుకుంటారు. ఎన్నో ఏళ్ల తరబడి ఒక యోధుడిని తీర్చిదిద్దిన.. 'బాల్ తానాజీ' ఏఐ అద్భుతంలో త్వరలో రాబోతుంది"అనే క్యాప్షన్‌ని జోడించారు.

ప్రతి ప్రేమ.. పర్‌ఫెక్ట్ కాదు!


మృణాల్, సిద్ధాంత్

ఈ ప్రేమికుల దినోత్సవం నాడు మీరు ప్రేమతో.. ప్రేమలో పడతారంటోంది నటి మృణాల్ ఠాకూర్. ఆమె సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటించిన చిత్రం 'దో దీవానే సెహెర్ మే'. రవి ఉద్యవార్ దర్శకత్వం వహించారు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రాన్ని సంజయ్ లీలా భన్సాలీ తదితరులు సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం అధికారిక టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. "ప్రతి ప్రేమ పర్‌ఫెక్ట్ కాదు.. ఈ నగరం నుంచి ఒక అసంపూర్ణమైన పర్‌ఫెక్ట్ లవ్‌స్టోరీ చూడండి"అనే క్యాప్షన్‌ని జోడించింది. "నగరంలో ఇద్దరు పిచ్చివాళ్లు.. జ్ఞాపకాలలోకి జారుకుంటున్నామ"ంటూ ప్రేమలో పడుతూ నగరమంతా చుట్టేస్తున్న హీరోహీరోయిన్ల కెమిస్ట్రీతో ఈ టీజర్ ఆకట్టుకునేలా ఉంది.


ఆకాశంలోని తారల్ని అందుకుందా?


సాత్విక

సరైన రోడ్డు మార్గమే లేని ఓ పల్లెటూరి అమ్మాయి ఆకాశంలోని తారల్ని అందుకోవాలని కలలు కంటుంది. మరి ఆమె కల సాకారమైందా? తన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురైన సవాళ్లేంటి? అన్నది తెలియాలంటే 'ఆకాశంలో ఒక తార' చూడాల్సిందే. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని తెరకెక్కిస్తున్న చిత్రమిది. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సంస్థలు సమర్పిస్తున్నాయి. ఈ సినిమాతో సాత్విక వీరవల్లి అనే తెలుగమ్మాయి నాయికగా తెరకు పరిచయం కానుంది. ఈ విషయాన్ని సోమవారం అధికారికంగా ప్రకటిస్తూ.. తన పాత్ర గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'నేను ఆకాశంలోకి ఎలా వెళ్లాలి?" అంటూ ఓ పాప నింగివైపు చూస్తూ ప్రశ్నించడం.. "రోడ్డు కూడా సరిగ్గా లేని ఈ ఊరు నుంచి ఆకాశానికి నిచ్చెనేసేశావా? ముందు ఈ ఊరి పొలిమేర దాటి చూపించు.. చూద్దాం" అని ఓ పెద్దాయన ఆమె కలను చిన్నబుచ్చినట్లు మాట్లాడటం గ్లింప్స్‌లో వినిపించింది. ఈ వేసవికి రానున్న ఈ చిత్రాన్ని సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు.

2030కి ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!

- రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరణ
- చైనా 2007 నాటి ఆర్థిక స్థితిలో ఇప్పుడు మనమున్నాం
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకెళ్తోంది. ప్రస్తుత వృద్ధి రేటు వేగం ఇలాగే కొనసాగితే, తలసరి ఆదాయమూ గణనీయంగా పెరిగి.. 2030 నాటికి భారత్ ఎగువ మధ్య ఆదాయ (అప్పర్ మిడిల్ ఇన్‌కమ్) దేశాల జాబితాలో చేరుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రిసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. 2028 నాటికి జర్మనీని వెనక్కి నెట్టి.. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని స్పష్టం చేసింది. 1990 నుంచి ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల ఆదాయ స్థాయిల్లో వచ్చిన మార్పులు, భారత తలసరి ఆదాయంలో వస్తున్న పెరుగుదలను విశ్లేషిస్తూ ఈ నివేదికను రూపొందించారు.

తలసరి ఆదాయం పెరుగుతోంది

దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)తో పాటే, ప్రజల తలసరి ఆదాయమూ గణనీయంగా పెరుగుతోంది. 1962లో 90 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2007కు 910 డాలర్లకు చేరింది. స్వాతంత్ర్యం సమయంలో అల్పాదాయ దేశంగా ఉండగా, దిగువ మధ్య ఆదాయ దేశంగా మారేందుకు మనదేశానికి 60 ఏళ్లు పట్టింది. 2009లో 1,000 డాలర్లుగా ఉన్న తలసరి ఆదాయం, 2019 కల్లా 2,000 డాలర్లకు చేరింది. తాజా అంచనాల ప్రకారం 2026 నాటికి ఇది 3,000 డాలర్లకు, 2030 నాటికి 4000 డాలర్ల స్థాయికి చేరుకుంటుంది. ప్రపంచ బ్యాంక్ ప్రమాణాల ప్రకారం, తలసరి ఆదాయం 4,500 డాలర్లు దాటితే ఆ దేశాన్ని ఎగువ మధ్య ఆదాయ దేశంగా పరిగణిస్తారు. భారత్ రాబోయే కొన్నేళ్లలోనే ఈ మైలురాయిని కచ్చితంగా చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది.

'వికసిత్ భారత్' లక్ష్యంగా..

స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్లకు.. అంటే 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అంటే, అధిక ఆదాయ దేశంగా మారాల్సి ఉంటుంది. ప్రపంచ బ్యాంక్ ప్రస్తుత ప్రమాణాల ప్రకారం అధిక ఆదాయ దేశంగా మారాలంటే తలసరి ఆదాయం 13,936 డాలర్లుగా ఉండాలి. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ తలసరి ఆదాయం ఏటా 7.5% సగటు వార్షిక వృద్ధి రేటును నమోదు చేయాలి. గత 23 ఏళ్లలో (2001-2024) భారత్ ఇప్పటికే 8.3% వార్షిక వృద్ధిని సాధించింది. కాబట్టి, ఈ లక్ష్యం చేరుకోవడం సాధ్యమేనని ఎస్‌బీఐ పేర్కొంది. ఒకవేళ 2047 నాటికి అధిక ఆదాయ పరిమితి 18,000 డాలర్లకు పెరిగితే, భారత్ 8.9% వృద్ధి రేటును సాధించాల్సి ఉంటుంది. ఇందుకోసం నామినల్ జీడీపీ వృద్ధి రేటు డాలర్ల రూపంలో ఏటా సుమారు 11.5% ఉండాలని నివేదిక సూచించింది. గతంలో (2004-2020 ఆర్థిక సంవత్సరాలు) భారత్ 11% వృద్ధిని నమోదు చేసిన చరిత్ర ఉండటం ఇక్కడ సానుకూల అంశం.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి

స్వాతంత్ర్యం వచ్చాక.. మన జీడీపీ 1 ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్లకు చేరుకోవడానికి 60 ఏళ్ళ పట్టింది. ఆ తర్వాత 7 ఏళ్లలోనే (2014 నాటికి) 2 ట్రిలియన్ డాలర్లు, మరో 7 ఏళ్ల (2021)లో 3 ట్రిలియన్ డాలర్ల స్థాయిని మించింది. 2025లో 4 ట్రిలియన్ డాలర్ల (రూ.360 లక్షల కోట్ల) స్థాయిని అధిగమించామని, 2027 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఈ జోరు ఇలాగే కొనసాగితే 2035 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.900 లక్షల కోట్లు) భారీ స్థాయికి చేరుకుంటుందని నివేదిక అంచనా వేసింది. ప్రపంచ వృద్ధి పంపిణీలో భారత్ స్థానం గత 25 ఏళ్లలో 92వ పర్సంటైల్ వద్ద ఉండగా, 2024తో ముగిసిన దశాబ్దంలో అది 95వ పర్సంటైల్‌కు చేరింది. అంటే, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో భారత్ తన స్థానాన్ని పదిలం చేసుకుంది.

భారీ వృద్ధికి సిద్ధంగా

2007లో చైనా తలసరి ఆదాయం 2,555 డాలర్లుగా ఉండేది. 2023లో భారత్ తలసరి ఆదాయం 2,580 డాలర్ల వద్ద ఉంది. అంటే, ఆర్థిక పరిణామ క్రమంలో 2007లో చైనా పరిస్థితులు, ఇప్పుడు మనదేశంలో కనిపిస్తున్నాయి. ఆ తర్వాత చైనా ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెంది, 2010కి అది ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారింది. అదే తరహాలో మన దేశమూ వృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని ఎస్‌బీఐ నివేదిక విశ్లేషించింది.

సంస్కరణలే కీలకం..

భారత్ ఎగువ మధ్య ఆదాయ స్థాయి నుంచి అధిక ఆదాయ స్థాయికి చేరుకోవాలంటే ఆర్థిక సంస్కరణలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉంది. జనాభా పెరుగుదల రేటు 0.6 శాతంగా, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుకుంటూ ముందుకు సాగితే, 2047 నాటికి భారత్ కచ్చితంగా అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. ముఖ్యంగా తయారీ రంగంపై దృష్టి సారించాలని ఎస్‌బీఐ నివేదిక వివరించింది.

- ఈనాడు, హైదరాబాద్



అరుదైన భూఅయస్కాంత లోహాల మైనింగ్‌లోకి నాల్కో!

భువనేశ్వర్: అరుదైన భూఅయస్కాంత లోహాల తవ్వకం (మైనింగ్) కార్యకలాపాల్లోకి అడుగుపెట్టేందుకు ప్రభుత్వ రంగ సంస్థ నాల్కో ఆసక్తి చూపుతోంది. ఇందుకోసం అరుదైన భూఅయస్కాంత లోహాలు, మెగ్నీషియం, క్రోమైట్ నిక్షేపాల కోసం దేశీయంగా జరిగే వేలంపై తమ బిడ్ అడ్వయిజర్ ద్వారా పరిశీలన చేయిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు (సీఎండీ) బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. బాక్సైట్, అల్యూమినాతో పాటు ఇతర లోహాల మైనింగ్‌లోకి అడుగుపెట్టాలన్నదే దీని వెనక సంస్థ వ్యూహంగా కనిపిస్తోంది. ఎలక్ట్రానిక్స్, రక్షణ, పునరుత్పాదక విద్యుత్, విద్యుత్ వాహనాల తయారీ రంగాలకు కీలకమైన అరుదైన భూఅయస్కాంత లోహాలను వెలికి తీయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం మనదేశం ఈ లోహాల కోసం దిగుమతులపై భారీగా ఆధారపడుతోంది. 'గనుల లభ్యత, కొనుగోలుతో ప్రయోజనం ఎంత? రాబోయే వేలంలో పాల్గొనాలా? వద్దా? లాంటి అంశాలపై ప్రస్తుతం మా బిడ్ అడ్వయిజర్ మదింపు చేస్తున్నార'ని సింగ్ వెల్లడించారు.

ఆస్ట్రేలియాలో లిథియం గనిలో వాటాపై దృష్టి: ఆస్ట్రేలియాలోని లిథియం గనిలో వాటాను ఖనిజ్ విదేశ్ ఇండియా లిమిటెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సింగ్ తెలిపారు. నాల్కో, హిందుస్థాన్ కాపర్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్‌ల సంయుక్త సంస్థే ఖనిజ్ విదేశ్ ఇండియా. లిథియం గనిలో వాటా కొనుగోలు ద్వారా భారత్‌కు లిథియం దిగుమతులు కొంతైనా తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు.

సాయి సిల్క్స్ ఆదాయం రూ.411 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: సాయి సిల్క్స్ (కళామందిర్), డిసెంబరు త్రైమాసికంలో రూ.411.25 కోట్ల ఆదాయంపై రూ.38.14 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.448.25 కోట్లు, నికర లాభం రూ.46.02 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 8.3%, లాభం 17.1% తగ్గాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో ఆదాయం రూ.1,234.61 కోట్లు, నికర లాభం రూ.108.80 కోట్లుగా నమోదయ్యింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1,063.17 కోట్లు, లాభం రూ.71.88 కోట్లుగా ఉన్నాయి. సమీక్షా త్రైమాసికంలో సంస్థ కొత్తగా 5 స్టోర్లు ప్రారంభించింది.



నాచారంలో 8 ఎకరాలు.. రూ.80.8 కోట్లు

విక్రయించిన యునైటెడ్ బ్రూవరీస్

హైదరాబాద్: హైదరాబాద్ నాచారం పారిశ్రామిక వాడలోని 8 ఎకరాల భూమిని రూ.80.8 కోట్లకు విక్రయించినట్లు యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. టాప్సన్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ భూమిని సోమవారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వివరించింది. ఈ స్థలంలో తమ వ్యాపార కార్యకలాపాలు ఏమీ నడవడం లేదని, అందువల్ల కంపెనీపై ప్రభావం ఏమీ లేదని యునైటెడ్ బ్రూవరీస్ పేర్కొంది. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించని ఆస్తులను విక్రయించాలన్న సంస్థ ప్రణాళికలో భాగంగానే ఈ అమ్మకం జరిపినట్లు తెలిపింది. ఈ స్థలంలో సౌర విద్యుత్తు ప్లాంటును ఏర్పాటు చేయాలన్నది టాప్సన్ సోలార్ ప్రణాళిక.

వృద్ధిరేటు అంచనాలు పెంచిన ఐఎంఎఫ్

2025-26లో 7.3%

2026-27, 2027-28ల్లో 6.4%



మనదేశ వృద్ధిరేటు అంచనాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత స్థూల దేశీయోత్పత్తి 7.3 శాతంగా నమోదవ్వొచ్చని తాజాగా పేర్కొంది. గత అక్టోబరు అంచనాల్లో మన వృద్ధిరేటు 6.6 శాతంగా ఉండొచ్చని అంచనా వేసిన సంస్థ, 0.7% మేర పెంచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి, 2027-28కి వృద్ధిరేటు అంచనాను 6.2% నుంచి 6.4 శాతానికి పెంచింది.

✦ 2025-26 జులై-సెప్టెంబరులో వృద్ధిరేటు 8.2% కావడంతో, ఏప్రిల్-సెప్టెంబరులో జీడీపీ వృద్ధి 8 శాతంగా నమోదైందని గుర్తు చేసింది.

✦ 2025-26లో భారత్ ఆర్థిక వ్యవస్థ 7.4% వృద్ధిని నమోదు చేయొచ్చని గణాంకాల శాఖ ముందస్తు అంచనాల్లో పేర్కొంది. 2024-25లో వృద్ధిరేటు 6.5%గా ఉంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 3.3%: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాదిలో 3.3% వృద్ధి చెందొచ్చని ఐఎంఎఫ్ పేర్కొంది. 2025లో ఇంతే వృద్ధిరేటు నమోదైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వివిధ దేశాల ఉత్పత్తులపై విధించిన సుంకాల నేపథ్యంలో, అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి నెలకొంది. అయినా కూడా ఉత్తర అమెరికా, ఆసియా దేశాల్లో కృత్రిమ మేధ మీద పెట్టుబడులు భారీగా పెరగడంతో.. ప్రస్తుత ఏడాది (2026)లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 3.3%, 2027లో 3.2 శాతంగా నమోదు కావొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత అక్టోబరు అంచనాల ప్రకారం 2026లో ప్రపంచ వృద్ధి 3.1 శాతంగా ఉండొచ్చని ఐఎంఎఫ్ పేర్కొంది. 2026, 2027 సంవత్సరాల్లో వర్ధమాన దేశాలు 4% కంటే అధిక వృద్ధిని నమోదు చేయొచ్చని అంచనా వేసింది.

250 మంది ఫ్రెషర్ల నియామకాల్లో జాప్యం

విప్రోపై కేంద్రానికి ఫిర్యాదు చేసిన నిట్స్

దిల్లీ: ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో 250 మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను ఉద్యోగంలోకి తీసుకోవడంలో జాప్యం చేస్తోందని, దీనిపై జోక్యం చేసుకోవాలంటూ నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (నిట్స్) కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. విప్రో నిర్వహించిన 'టర్బో', 'నెక్స్ట్ జెన్ టాలెంట్ హైరింగ్' వంటి క్యాంపస్, ఆఫ్-క్యాంపస్ నియామక ప్రక్రియలో ఈ అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి 2025 మే నెలలోనే లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేశారు. కానీ, చెప్పిన తేదీలకు వారిని విధుల్లోకి తీసుకోలేదని నిట్స్ పేర్కొంది. కొన్ని నెలలుగా ఉద్యోగం లేక, ఆదాయం రాక అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. బాధితులకు స్పష్టమైన నియామక తేదీలు ఇచ్చేలా విప్రోను ఆదేశించాలని కేంద్రాన్ని కోరింది.

హైదరాబాద్‌లో కోనె ప్రాంతీయ కార్యాలయం

ఈనాడు, హైదరాబాద్: ఎలివేటర్లు, ఎస్కలేటర్ల సంస్థ కోనె, హైదరాబాద్‌లో తన ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. దేశంలో ఇప్పటికే 4 కార్యాలయాలున్నాయని, దక్షిణ భారత్‌లో సేవలను విస్తరించేందుకు ఈ కొత్త కార్యాలయం దోహదం చేస్తుందని కోనె ప్రెసిడెంట్, సీఈఓ ఫిలిప్ డెల్మోర్, కోనె ఇండియా ఎండీ అమిత్ గోసైన్ పేర్కొన్నారు. హై-రైజ్ అపార్ట్‌మెంట్లు, ఐటీపార్కులు, ఆరోగ్య సంస్థలు, రిటెయిల్ మాల్స్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్ల అవసరాలు పెరుగుతున్నాయని తెలిపారు. కొత్త కార్యాలయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణలో వేగం, స్థానిక అవసరాలకు తగ్గట్టుగా సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు.

కోడి గుడ్లు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	500
వరంగల్	502
విజయవాడ	500
తూ/ప గోదావరి	495
విశాఖపట్నం	500
చిత్తూరు	543

హిందుస్థాన్ జింక్ లాభంలో 46% వృద్ధి



దిల్లీ: వేదాంతా గ్రూపు సంస్థ హిందుస్థాన్ జింక్, డిసెంబరు త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.3,916 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.2,678 కోట్లతో పోలిస్తే ఇది 46.2% అధికం. ఇదే సమయంలో మొత్తం ఆదాయం రూ.8,832 కోట్ల నుంచి రూ.11,273 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు కూడా రూ.5,305 కోట్ల నుంచి రూ.6,068 కోట్లకు చేరాయి. 'అక్టోబరు-డిసెంబరులో సంస్థ రికార్డు స్థాయి పనితీరును కనబర్చింది. ఒక త్రైమాసికంలోనే అత్యధిక లోహ ఉత్పత్తిని సాధించడంతో పాటు, జింక్ ఉత్పత్తి వ్యయాలు అయిదేళ్ల కనిష్ఠమైన టన్నుకు 940 డాలర్లుగా నమోదైనట్లు' హిందుస్థాన్ జింక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి అరుణ్ మిశ్రా తెలిపారు. 2025 డిసెంబరు 31 నాటికి కంపెనీ స్థూల పెట్టుబడులు, నగదు, నగదు సమాన నిల్వలు రూ.9,342 కోట్లుగా ఉండగా.. మొత్తం రుణాలు రూ.9,013 కోట్లుగా నమోదయ్యాయి.

2025లో చైనా వృద్ధి 5%

చైనా ఆర్థిక వ్యవస్థ 2025లో 5% వృద్ధి నమోదు చేసింది. జాతీయ గణాంకాల బ్యూరో (ఎన్‌బీఎస్) విడుదల చేసిన గణాంకాల ప్రకారం చైనా జీడీపీ రికార్డు స్థాయిలో తొలిసారిగా 20.01 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.1,820 లక్షల కోట్ల)కు చేరింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధిక టారిఫ్‌ల ప్రభావం ఉన్నా.. దేశీయ వినియోగంతో పాటు, బలమైన ఎగుమతుల వల్ల వృద్ధిరేటు సానుకూలంగా ఉంది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో వృద్ధిరేటు 4.5 శాతానికి పరిమితమైంది. 2022 తర్వాత ఇంత తక్కువ వృద్ధి నమోదవ్వడం మళ్లీ ఇదే. ప్రపంచంలో అతి పెద్ద రెండో ఆర్థిక వ్యవస్థ అయిన చైనా జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 4.8% వృద్ధి నమోదు చేసింది.

రూ.10,000 కోట్లతో స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టు

దావోస్: భారత్‌కు చెందిన ముగ్గురు వ్యాపారవేత్తలు కలిసి, అనుసంధానిత స్వచ్ఛ ఇంధన ప్లాట్‌ఫామ్ ఎల్ఎన్‌కే ఎనర్జీని ఇక్కడ ఆవిష్కరించారు. రాబోయే అయిదేళ్లలో ఈ ప్లాట్‌ఫామ్ కోసం తొలి విడత కింద రూ.10,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోక-కోలాకు భారత్‌లో అతిపెద్ద బాట్లర్‌గా ఉన్న ఎస్ఎల్ఎంజీ బేవరేజెస్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టరు పరితోష్ లాధాని, ఆర్ఎనర్జీ డైనమిక్స్ ఛైర్మన్, ఎండీ కుశాగ్ర నందన్, ఆర్ఎనర్జీ డైనమిక్స్ సీఈఓ, బయోఎనర్జీ ఎంట్రప్రెన్యూర్ వరుణ్ కరాద్‌లు ఈ ఎల్ఎన్‌కే ప్లాట్‌ఫామ్‌కు సహవ్యవస్థాపకులుగా ఉన్నారు. 'మహారాష్ట్రలోని ఇన్‌గాట్, వేఫర్ ప్లాంటుకు అనుసంధానమై 6 గిగావాట్ల సౌర ఫలకాలు, మాడ్యుల్‌తో ఈ ప్లాట్‌ఫామ్ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయ'ని వెల్లడించారు. పర్యావరణహితానికి దోహదం చేయడమే కాకుండా దీర్ఘకాలంలో భారత్‌లో ఇంధన భద్రతపైనా ఈ కంపెనీ దృష్టిపెడుతుందన్నారు. అధునాతన తయారీ, హరిత ఇంధనం, పునరుత్పాదక విద్యుదుత్పత్తి విభాగాల్లో ఎల్ఎన్‌కే ఎనర్జీ కార్యకలాపాలు ఉండనున్నాయి. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్ వద్ద 60 ఎకరాల విస్తీర్ణంలో తమ తొలి ప్రాజెక్టు ఉంటుందని.. అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాలను ఉపయోగించి అధిక సామర్థ్యంతో కూడిన సౌర ఫలకాలు, మాడ్యూళ్లు ఇక్కడ తయారవుతాయని కంపెనీ తెలిపింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
భెల్	390.40	134.70	8,691.85	7,385
ఒబెరాయ్ రియాల్టీ	622.64	618.38	1,561.74	1,460.27
టాటా కేపిటల్	1,285	922	3,594	2,711
హావెల్స్	300.05	277.96	5,587.89	4,888.98
ఎల్‌టీఐ మైండ్‌ట్రీ	970.60	1,085	10,781	9,661
ఐఆర్ఎఫ్‌సీ	1,802	1,631	6,719	6,766.39
హట్సన్ ఆగ్రో	60.58	40.94	2,366.68	2,012

బీమా విస్తరణకు వృద్ధి రేటు దోహదం

మూడీస్ అంచనా



ఈనాడు, హైదరాబాద్: భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటం దేశీయ బీమా రంగానికి కలిసొస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధి రేటు 7.3 శాతానికి చేరొచ్చని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ అంచనా వేసింది. బలమైన ఆర్థిక వృద్ధితో, ప్రజల సగటు ఆదాయాలు పెరుగుతాయని, ఇందువల్ల బీమా పాలసీలకు గిరాకీ అధికమవుతుందని తాజా నివేదికలో మూడీస్ తెలిపింది.

దేశీయంగా నెలకొన్న సానుకూల పరిస్థితుల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో మొత్తం బీమా ప్రీమియం ఆదాయం 17% పెరిగి, రూ.10.9 లక్షల కోట్లకు చేరింది. ఆరోగ్య బీమా ప్రీమియం 14%, జీవిత బీమా నూతన వ్యాపార ప్రీమియం 20% వృద్ధి చెందాయని మూడీస్ పేర్కొంది.

2024-25లో ప్రీమియం వసూళ్లలో వృద్ధి 7 శాతంగా (రూ.11.9 లక్షల కోట్లు) నమోదైంది. వినియోగదారుల్లో బీమా పాలసీలపై పెరిగిన అవగాహన, ఆర్థిక వ్యవస్థలో వేగవంతమైన డిజిటలీకరణ వల్ల, ఈ ఆర్థిక సంవత్సరంలో వేగవంత వృద్ధి కనిపిస్తోందని విశ్లేషించింది.

ప్రభుత్వ రంగ బీమా సంస్థల లాభదాయకత పెంచేందుకు కేంద్రం పలు చర్యలు చేపట్టింది. ఎల్ఐసీలో వాటా విక్రయం, అండర్‌రైటింగ్ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకునే షరతుతో కొన్ని సంస్థలకు మూలధన సాయం, మరి కొన్నింటి విలీనం లేదా ప్రైవేటీకరణ వంటి ప్రతిపాదనలు పరిశ్రమపై ప్రభావం చూపిస్తున్నాయని మూడీస్ వివరించింది. బీమా కంపెనీల్లో ఎఫ్‌డీఐ పరిమితిని 74% నుంచి 100 శాతానికి పెంచడం వల్ల సంస్థలకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుందని మూడీస్ అభిప్రాయపడింది.

అత్యుత్తమ పాలనా ప్రమాణాలు పాటించాలి

పట్టణ సహకార బ్యాంకులకు ఆర్‌బీఐ గవర్నరు సూచన

ముంబయి: పాలనా వ్యవహారాల్లో అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని, ఆస్తుల నాణ్యత పైనా నిశిత పరిశీలన ముఖ్యమని పట్టణ సహకార బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. కొన్ని ఎంపిక చేసిన పట్టణ సహకార బ్యాంకుల ఛైర్‌పర్సన్లు, ఎండీలు, సీఈఓలతో సోమవారం మల్హోత్రా సమావేశమయ్యారు. మారుమూల ప్రాంతాలకు రుణ సదుపాయాలను, ఆర్థిక సేవలను చేర్చడంలో పట్టణ సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన ప్రశంసించారు. గత సమావేశం తర్వాత సహకార బ్యాంకింగ్ రంగానికి సంబంధించి, ఆర్‌బీఐ చేపట్టిన పలు విధానపరమైన చర్యలపైనా ఇందులో చర్చించారు. సహకార బ్యాంకింగ్ రంగం బలోపేతానికి, ఆరోగ్యవంత వృద్ధికి ఈ చర్యలు దోహదం చేస్తాయనే ఆశాభావాన్ని మల్హోత్రా వ్యక్తం చేశారు. పట్టణ సహకార బ్యాంకులకు సంబంధించి విధానపరమైన అంశాలు, కార్యకలాపాల వ్యవహారాలపై తమ సూచనలు, అభిప్రాయాలను సమావేశంలో బ్యాంకుల ఉన్నతాధికార్లు తెలియజేశారు. నేషనల్ అర్బన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎన్‌బీ లాభం రూ.5,100 కోట్లు



దిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 2025-26 అక్టోబరు-డిసెంబరులో రూ.5,100 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభాన్ని ఆర్జించడం ఇదే తొలిసారి. 2024-25 ఇదే కాల లాభం రూ.4,508 కోట్లతో పోలిస్తే ఇది 13% అధికం. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,752 కోట్ల నుంచి రూ.37,253 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.31,340 కోట్ల నుంచి రూ.32,231 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం రూ.11,032 కోట్ల నుంచి 4.5% తగ్గి రూ.10,533 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ లాభం రూ.6,621 కోట్ల నుంచి రూ.7,481 కోట్లకు పెరిగింది.

✦ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.09% నుంచి 3.19 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.41% నుంచి 0.32 శాతానికి మెరుగయ్యాయి. అయినా కేటాయింపులు రూ.318 కోట్ల నుంచి రూ.1,341 కోట్లకు పెరిగాయి. 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈసీఎల్ (ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్) నిబంధనలను చేరుకోవడానికి రూ.955 కోట్ల అదనపు కేటాయింపులు చేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర వెల్లడించారు. ఇకపై ప్రతి త్రైమాసికంలో రూ.5,000 కోట్ల నికర లాభం లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.

✦ సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసిన ఒక పెద్ద ఖాతా నుంచి భారీ మొత్తం వసూలు కావడంతో రికవరీ రూ.823 కోట్ల నుంచి రూ.1,956 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.8-2.9 శాతంగా ఉంటుందని అంచనా వేశారు.

✦ 2025 డిసెంబరు 31 నాటికి బ్యాంక్ కేటాయింపుల కవరేజీ నిష్పత్తి (సాంకేతిక రైటాఫ్‌లతో కలిపి) 96.77% నుంచి 96.99 శాతానికి మెరుగైంది. బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.26,39,991 కోట్ల నుంచి 9.5% పెరిగి రూ.28,91,528 కోట్లకు చేరింది. ఆస్తులపై ప్రతిఫలం (ఆర్ఓఏ) 1.03% నుంచి 1.06 శాతానికి మెరుగైంది. కనీస మూలధన నిష్పత్తి (సీఏఆర్) 15.41% నుంచి 16.77 శాతానికి పెరిగింది.


అధిక వెయిటేజీ షేర్లలో విక్రయాలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3,262.82 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.4,234.30 కోట్లు

సెన్సెక్స్ ▼ 324 83246

నిఫ్టీ ▼ 109 25586



రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి అధిక వెయిటేజీ ఉన్న షేర్లలో అమ్మకాలతో సూచీలు సోమవారం నష్టపోయాయి. పెరుగుతున్న రాజకీయ - భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ టారిఫ్ ఆందోళనలు ప్రభావం చూపాయి. కొన్ని కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు అంచనాలు అందుకోలేకపోవడం, బలహీన రూపాయి కూడా మదుపర్లను అమ్మకాల వైపు నడిపించాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు నష్టపోయి 90.90 వద్ద ముగిసింది. ఒకదశలో 91ని మించింది కూడా. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 1.22% తగ్గి 63.35 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, షాంఘై సూచీలు సానుకూలంగా, జపాన్, హాంకాంగ్ సూచీలు ప్రతికూలంగా ముగిశాయి. ఐరోపా మార్కెట్లు ప్రతికూలంగా కదలాడాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.16 లక్షల కోట్లు తగ్గి, రూ.465.68 లక్షల కోట్ల (5.12 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 83,494.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,570.35 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. 83,539.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, తర్వాత విక్రయాల ఒత్తిడితో ఒక దశలో 82,898.31 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 324.17 పాయింట్ల నష్టంతో 83,246.18 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సైతం 108.85 పాయింట్లు కోల్పోయి 25,585.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,653.30-25,494.35 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 14 నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.04%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.26%, ఎటర్నల్ 2.19%, టీసీఎస్ 1.36%, అదానీ పోర్ట్స్ 1.34%, టైటన్ 1.31% తగ్గాయి. ఇండిగో 4.30%, టెక్ మహీంద్రా 2.85%, హెచ్‌యూఎల్ 2.27%, బజాజ్ ఫైనాన్స్ 2.18%, మారుతీ సుజుకీ 2.04%, కోటక్ బ్యాంక్ 2.02%, ట్రెంట్ 1.16%, ఐటీసీ 1.11%, హెచ్‌సీఎల్ టెక్ 1.02%, యాక్సిస్ బ్యాంక్ 1% చొప్పున లాభపడ్డాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే స్థిరాస్తి, ఇంధన, చమురు-గ్యాస్, టెలికాం, యుటిలిటీస్, మన్నికైన వినియమయ వస్తువుల సూచీలు డీలాపడ్డాయి. ఎఫ్ఎంసీజీ, వాహన, భారీ యంత్ర పరికరాలు, సేవల రంగ సూచీలు రాణించాయి. బీఎస్ఈలో 1,186 షేర్లు సానుకూలంగా, 3,116 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 181 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ అగ్రి-ప్రాసెసింగ్, రైస్ మిల్లర్ **హల్దెర్ వెంచర్ లిమిటెడ్** ఎన్ఎస్ఈలో నమోదైంది. శుక్రవారం బీఎస్ఈలో రూ.259.60 వద్ద ముగిసిన షేరు, ఎన్ఎస్ఈలో 5 శాతం అప్పర్ సర్క్యూట్‌తో నమోదై రూ.272.35 వద్ద ముగిసింది.

ఫలితాల నేపథ్యంలో..

✦ **ఐసీఐసీఐ బ్యాంక్** త్రైమాసిక ఫలితాలు మదుపర్లను మెప్పించకపోవడంతో, బీఎస్ఈలో షేరు 2.26% నష్టపోయి రూ.1,379.80 వద్ద ముగిసింది. ఒక దశలో 3.65% తగ్గి రూ.1,360 స్థాయినీ తాకింది. మార్కెట్ విలువ రూ.22,566.78 కోట్లు తగ్గి, రూ.9,86,857.93 కోట్లకు పరిమితమైంది.

✦ **రిలయన్స్ ఇండస్ట్రీస్** షేరు బీఎస్ఈలో 3.04% తగ్గి రూ.1,413.25 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 3.72% క్షీణించి రూ.1,403.30 స్థాయిని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.60,016.51 కోట్లు తగ్గి రూ.19,12,476.70 కోట్లకు పరిమితమైంది.

✦ **విప్రో** షేరు బీఎస్ఈలో 7.95% తగ్గి రూ.246 వద్ద ముగిసింది. ఒక దశలో 9.54% తగ్గి రూ.241.75 స్థాయినీ తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.22,282.64 కోట్లు తగ్గి, రూ.2,57,977.45 కోట్లకు పరిమితమైంది.

✦ **టెక్ మహీంద్రా** షేరు బీఎస్ఈలో 2.85% పెరిగి రూ.1,718.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 3.95% పెరిగి రూ.1,736.55 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయినీ తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,685.14 కోట్లు పెరిగి రూ.1,68,325.92 కోట్లుగా నమోదైంది.

భారత్ కోకింగ్ కోల్ షేరు అదుర్స్

కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ స్టాక్ మార్కెట్‌లో శుభారంభం చేసింది. ఇష్యూ ధర రూ.23తో పోలిస్తే, 96.56% ప్రీమియంతో బీఎస్ఈలో రూ.45.21 వద్ద ఈ షేరు నమోదైంది. చివరకు 76.78% లాభంతో రూ.40.66 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.18,935.36 కోట్లుగా నమోదైంది.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ 2024 సంవత్సరానికి ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి బహుమతిని 2025, నవంబరులో ఎవరికి ప్రదానం చేశారు? (ఈమె చిలీ అధ్యక్షురాలిగా రెండుసార్లు (2006–10, 2014–18) సేవలు అందించారు. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా 2018–22 కాలంలో వ్యవహరించారు.) **జ:** మిచెల్ బాచ్‌లెట్

◆ 'జన్ జాతీయ గౌరవ్ దివస్'ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన వీరుడు బిర్సా ముండా పాత్రను స్మరించుకునేందుకు భారత ప్రభుత్వం ఈ దివస్‌ను నిర్వహిస్తోంది. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్రం 2024–25ను 'జన్ జాతీయ గౌరవ్ వర్ష్' గా ప్రకటించింది.) **జ:** నవంబరు 15

◆ థాయ్‌లాండ్‌లో జరిగిన 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో టైటిల్ విజేతగా ఎవరు నిలిచారు? (ఈ పోటీల్లో పాల్గొన్న మిస్ ఇండియా మణిక విశ్వకర్మ టాప్ 12లో ఒకరిగా నిలిచింది. ఈ పోటీల న్యాయనిర్ణేతల్లో ఒకరిగా భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ వ్యవహరించారు.) **జ:** ఫాతిమా బాష్ (మెక్సికో)

◆ 2025 కాంటార్ బ్రాండ్జ్ మోస్ట్ వ్యాల్యూబుల్ ఇండియన్ బ్రాండ్స్ రిపోర్ట్ నివేదిక ప్రకారం భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా ఏది అగ్రస్థానంలో నిలిచింది? **జ:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు

మరింత సమాచారం

పులులు భద్రం.. ఆపదలు దూరం!

జనరల్ స్టడీస్
డిజాస్టర్ మేనేజ్‌మెంట్



జీవవైవిధ్య సంరక్షణలో భాగంగా దేశంలో టైగర్ రిజర్వులను ప్రభుత్వం విస్తరిస్తోంది. కుంభమేళా తొక్కిసలాట మొదలు విమాన ప్రమాదాల వరకు సంభవించిన ప్రమాదాలు పౌరభద్రత లోపాలను, ముందస్తు హెచ్చరిక వ్యవస్థల అవసరాన్ని తెలియజేస్తున్నాయి. ఈ విధమైన సవాళ్లను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన విపత్తు నిర్వహణ సవరణ బిల్లు, ఇతర చట్టపరమైన మార్పులు.. పాలనా యంత్రాంగంలో రాబోయే కీలక సంస్కరణలకు అద్దం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత పర్యావరణ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. భారతదేశంలో ఇటీవల కాలంలో సంభవించిన విపత్తులు, వాటి కారకాలు, పర్యవసానాలతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణకు చేపట్టిన చర్యలు, సంబంధిత చట్టాలకు చేసిన మార్పులపై అవగాహన కలిగి ఉండాలి.

విపత్తుల తాజా సవాళ్లు - నిర్వహణ

ప్రకృతి సమతౌల్యతను కాపాడుకోవడంలో భాగంగా భారత ప్రభుత్వం కొత్త టైగర్ రిజర్వ్‌ల ఏర్పాటుకు, వన్యప్రాణుల సంరక్షణకు పెద్దపీట వేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో కొత్తగా గుర్తించిన పులుల సంరక్షణ కేంద్రాలు జీవవైవిధ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మరోవైపు పెరుగుతున్న జనాభా రద్దీ, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల రూపంలో దేశం అనేక విపత్తులను ఎదుర్కొంటోంది. కుంభమేళా తొక్కిసలాట నుంచి విమాన ప్రమాదాల వరకు సంభవించిన ఘటనలు ప్రజాభద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడానికి ప్రభుత్వం విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు 2024 ద్వారా వ్యవస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది.

ఇటీవల సంభవించిన విపత్తులు

కుంభమేళా తొక్కిసలాట (జనవరి 29, 2025): ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాలో మౌని అమావాస్య రోజు విషాదం నెలకొంది. సంగం ఘాట్‌లో లక్షలాది మంది గుమికూడినప్పుడు, అకస్మాత్తుగా జనసమూహం పెరగడంతో తొక్కిసలాట జరిగింది. 37 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు.



దిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాట, ఎస్‌యూవీ–బస్సు ఢీకొన్న ప్రమాదం (2025, ఫిబ్రవరి 15): ఇదే రోజు, రెండు వేర్వేరు విషాదాలు సంభవించాయి. దిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కుంభమేళాకు వెళుతున్న 18 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. అందులో 14 మంది మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రద్దీగా ఉండే ప్లాట్‌ఫామ్‌పై అలారం మోగడంతో గందరగోళం ఏర్పడి భయాందోళనలకు కారణమైంది. అదే రోజు ప్రయాగ్‌రాజ్‌కు వస్తున్న ఎస్‌యూవీ వాహనం బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎస్‌యూవీలో ఉన్న 10 మంది మృతిచెందారు.

దిల్లీ భూకంపం 2025: ఫిబ్రవరిలో దిల్లీలో 4.0 తీవ్రతతో స్వల్ప భూకంపం సంభవించింది. ఆరావళి - దిల్లీ ఫోల్డ్‌బెల్ట్ కింద హైడ్రో ఫ్రాక్చరింగ్ కారణంగా వచ్చింది. దిల్లీ నగరంలోనే 5 కి.మీ. లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

గుజరాత్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలుడు (2025, ఏప్రిల్ 1): గుజరాత్‌లోని బనస్కంత జిల్లాలోని ఒక బాణాసంచా కర్మాగారంలో జరిగిన బాయిలర్ పేలుడుతో మంటల్లో చిక్కుకుని 17 మంది కార్మికులు మరణించారు.

కొత్తగా గుర్తించిన టైగర్ రిజర్వ్‌లు

మాధవ్ టైగర్ రిజర్వ్: మధ్యప్రదేశ్‌లోని మాధవ్ నేషనల్ పార్క్‌ను భారతదేశంలో 58వ టైగర్ రిజర్వు (మధ్యప్రదేశ్‌లో 9వది)గా గుర్తిస్తున్నట్లు 2025, మార్చిలో కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకటించారు. దీనిని 1958లో జాతీయ ఉద్యానవనంగా గుర్తించారు.

రతపానీ టైగర్ రిజర్వ్: ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది. దీనికి 57వ టైగర్ రిజర్వ్‌గా 2024 చివరిలో గుర్తింపు లభించింది.

వీరాంగన దుర్గావతి టైగర్ రిజర్వ్: ఇది కూడా మధ్యప్రదేశ్‌లోనే ఉంది. 2023లో 54వ టైగర్ రిజర్వ్‌గా గుర్తించారు.

ధోల్పూర్ – కరౌలి టైగర్ రిజర్వ్: ఇది రాజస్థాన్‌లో ఉంది. దీనిని 55వ టైగర్ రిజర్వ్‌గా 2023, ఆగస్టులో గుర్తించారు.

గురు ఘసిదాస్ – తామోర్ పింగ్లా: ఛత్తీస్‌గఢ్‌లో ఉంది. 56వ టైగర్ రిజర్వ్‌గా గుర్తించారు.

సిమిలిపాల్ నేషనల్ పార్క్: ఒడిశా ప్రభుత్వం ఇటీవల సిమిలిపాల్ టైగర్ రిజర్వ్‌ను రాష్ట్రంలోని రెండో జాతీయ ఉద్యానవనంగా ప్రకటించింది. ఇది భారతదేశంలో 107వ జాతీయ ఉద్యానవనంగా నిలిచింది.



ప్రాముఖ్యత: నోటిఫైడ్ ప్రాంతం (845.70 చ.కి.మీ.) 'హక్కులు లేనిది' అవుతుంది. ఇందులో ఎలాంటి మానవ కార్యకలాపాలను అనుమతించరు. ◆ 2,750 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మిగిలిన భాగాన్ని వన్యప్రాణుల అభయారణ్యంగా పరిగణిస్తారు. ఇక్కడ పెరిగే నీలకురింజి (స్ట్రోబిలాంథెస్ కుంథియానా) పొద మొక్కను అంతరించిపోతున్న జాతిగా ప్రకటించి, ఐయూసీఎన్ రెడ్ లిస్ట్‌లో చేర్చారు. నీలకురింజి 12 ఏళ్లకోసారి పుష్పించి కనువిందు చేస్తుంది.

పహల్గామ్‌లో ఉగ్ర దాడి (2025, ఏప్రిల్ 22): జమ్ము-కశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలోని బైసరన్ లోయలో హిందూ పర్యాటకులపై జరిగిన దాడిలో 26 మంది మరణించారు. 20 మంది గాయపడ్డారు. ఫలితంగా 2025, మే 7న 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభమైంది. సరిహద్దు వెంబడి తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసింది.



బెంగళూరులో ఐపీఎల్ వేడుకలో తొక్కిసలాట (2025, జూన్ 4): బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయోత్సవంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించారు, 47మందికి పైగా గాయపడ్డారు.

అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదం (2025, జూన్ 12): అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన కాసేపటికే ఎయిర్ ఇండియా విమానం (AI171) కూలిపోవడం ఇప్పటి వరకు జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదంగా నిలిచింది. 242 మంది ప్రయాణికుల్లో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. సమీపంలోని స్థానిక నివాసితులతో సహా మొత్తం మరణాల సంఖ్య 275కి పెరిగింది.

విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు 2024: లోక్‌సభలో విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు, 2024ను ప్రవేశపెట్టారు. ఇది ప్రస్తుత విపత్తు నిర్వహణ చట్టం, 2005ను సవరించడానికి ఉద్దేశించింది. ◆ ఎన్ఈసీ (నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ), ఎస్ఈసీ (స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ)లతో సంబంధం లేకుండా ఎన్‌డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ), ఎస్‌డీఎంఏ (స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ)లు నేరుగా సంబంధిత జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రణాళికలను సిద్ధం చేయాలని బిల్లు ప్రతిపాదించింది. విపత్తుల కాలానుగుణ అంచనాలను చేర్చడానికి ఎన్‌ఎండీఏ బాధ్యతలను విస్తరిస్తారు.



రచయిత: సక్కరి జయకర్

పదో తరగతి - తెలుగు
శతక మాధుర్యం

ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

8 మార్కులు

1. విద్యావంతులు ఎలాంటి గుణాలను కలిగి ఉంటారు?

జ: విద్యావంతులు పరాక్రమం, శక్తి, శాంతాన్ని కలిగి ఉంటారు. వీటి వల్ల వారికి ప్రయోజనం చేకూరినట్లే. తమలో తాము విచక్షణతో మంచి చెడులను విచారించుకుంటారు. తమపై తాము గౌరవాన్ని కలిగి ఉండటం జీవితంలో గొప్ప సంపద లాంటిది. లజ్జను కలిగి జీవించడం సంజీవనం లాంటిది. వినయంతో కూడిన వారి మాట అందరిని స్నేహితులను చేస్తుంది. విద్యావంతులు ఆచారాన్ని పాటించడం వల్ల గొప్ప బలాన్ని కలిగి ఉంటారు. త్యాగం చేయడం దాచుకున్న సంపదతో సమానమైనదని తెలుసు. మంచివారితో కలిసి మాట్లాడతారు. అదే నిజమైన సుఖం. విద్యావంతులు ఎట్టి పరిస్థితులలోనూ మంచి గుణాలను వదిలిపెట్టరు. ఎల్లప్పుడూ భగవంతుడిని భక్తితో సేవిస్తూ ఉంటారు.

2. వ్యక్తుల జీవితంలో నైతిక విలువల అవసరాన్ని తెలపండి.

జ: వ్యక్తుల జీవితంలో నైతిక విలువలు చాలా అవసరం. ఎందుకంటే నైతిక విలువలున్నవారు తప్పులుచేయరు. ఎవరిని మోసం చేయరు. అనవసర గొడవలు పెట్టుకోరు. అన్యాయంగా మాట్లాడరు. ధర్మం తప్పరు. ఎవరినీనొప్పించరు. ఒకవేళ తెలియక తప్పుచేసినా, వెంటనే సరిదిద్దుకుంటారు. అసత్యాలు మాట్లాడరు. అందరూ ఇలాగే ఉంటే సమాజంలో ప్రశాంతత ఉంటుంది. నైతిక విలువలున్నవారు సమాజ శ్రేయస్సును కోరతారు. వారివల్ల సమాజం అభివృద్ధి చెందుతుంది.

3. శతక మాధుర్యం ఆధారంగా 10 నీతి వాక్యాలు రాయండి.

జ: ✦ నీచుడు కఠినంగా మాట్లాడతాడు. గుణవంతుడు కఠినంగా మాట్లాడడు. ✦ అడవుల్లో కంద మూల ఫలాలున్నాయి. నివసించడానికి గుహలున్నాయి. తాగడానికి ఏటిలో నీరుంది. మెత్తటి చివుళ్ల పాన్పులుగా ఉపయోగపడతాయి. అయినా కొంతమంది ధనవంతులను సేవిస్తారు. ✦ సత్యశీల ధర్మ సంస్థాపన కోసం సహజశక్తి ఉన్న సంస్కారులు యుగ యుగాల్లోనూ పుడుతూ ఉంటారు. ✦ భూసారమంతా భూమిలోనే ఉంటుంది. మన శరీరంలోనే తత్వం ఉంటుంది. శ్రమపడితే దేనినైనా సాధించవచ్చు. ✦ ధీరోత్తముడు ఎవరు నిందించినా, తన సంపదలు పోయినా, నీతిమార్గాన్ని తప్పడు. తెలివిలేనప్పుడు ఏనుగులా గర్వంతో ప్రవర్తిస్తాడు. తెలివి కలిగినప్పుడు తనకు ఏమీ తెలియదని గర్వం లేకుండా ఉంటాడు. ✦ మనభావాన్ని బట్టి పలుకు ఉంటుంది. మాటను బట్టి పనులు, పనులను బట్టి ఫలితాలుంటాయి. ✦ మాతృభాష మీద గౌరవం ఉండాలి. మాతృదేశంపై ప్రేమ ఉండాలి. ✦ చంచల మనసును అదుపులో పెట్టుకోవాలి. మంచివారితో స్నేహంచేస్తే దుర్మార్గుడూ మంచివాడుగా మారతాడు. ✦ శౌర్యం ఉంటే జన్మ సఫలమవుతుంది. శాంతం ఉంటే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ✦ అభిమానమే సంపద. సిగ్గుతో బతకడమే సంజీవనం. ✦ వినయంగా మాట్లాడటం వల్ల అన్నీ వశమవుతాయి. ఆచారమే మనకు బలాన్ని ఇస్తుంది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

ధన్యవాద తీర్మానాన్ని లోక్‌సభ తిరస్కరిస్తే..!

ఇండియన్ పాలిటీ

ప్రజాస్వామ్య విలువలకు, ప్రజల శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే పాలనా వ్యవస్థగా పార్లమెంటరీ విధానం ప్రసిద్ధికెక్కింది. సమగ్ర చర్చలతో విధానాల రూపకల్పన, చట్టాల తయారీతో పాటు వాటి అమలును పర్యవేక్షించడం వరకు భారత పార్లమెంటుకు విస్తృత పరిధి ఉంటుంది. ప్రభుత్వ పనితీరును పర్యవేక్షిస్తూ, ప్రశ్నోత్తరాలతో కార్యనిర్వాహక వర్గాన్ని నియంత్రిస్తూ జవాబుదారీగా ఉంచుతుంది. ఈ అత్యున్నత చట్టసభ కార్యకలాపాలు ఎలాంటి గందరగోళం లేకుండా పద్ధతిగా, క్రమశిక్షణతో నడిచేందుకు పలు పార్లమెంటరీ పద్ధతులు రూపుదిద్దుకున్నాయి. అందులో కొన్నింటిని రాజ్యాంగపరంగా, మరికొన్నింటిని సంప్రదాయంగా పాటిస్తున్నారు. పార్లమెంటు సమావేశాల్లో వివిధ చర్చలు, ప్రశ్నోత్తరాలు, తీర్మానాలు, ఓటింగ్ తదితర ప్రక్రియల రూపంలో ఉన్న పద్ధతుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. పార్లమెంటులో వినియోగించే, ప్రయోగించే ప్రత్యేక పదాల అర్థాలను, వాటి ప్రాధాన్యాన్నీ తెలుసుకోవాలి.

పార్లమెంటరీ పద్ధతులు - పదజాలం

1. పార్లమెంటు సమావేశాలు జరగడానికి హాజరు కావాల్సిన కనీస సభ్యుల సంఖ్యను ఏమని పిలుస్తారు?



1\) ఎజెండా 2) కోరం 3) గిలటిన్ 4) హంగ్

2. సభలో చర్చించాల్సిన కార్యక్రమాల పట్టికను ఏమంటారు?
   1) తీర్మానం 2) ప్రతిపాదనలు
   3) ఫ్లోర్‌క్రాసింగ్ 4) అజెండా

3. లోక్‌సభను రద్దు చేయడాన్ని ఏమంటారు?
   1) ప్రోరోగ్ 2) డిసాల్వ్
   3) లేమ్‌డక్ 4) ఫిలిబస్టరింగ్

4. పార్లమెంటు సమావేశాలను దీర్ఘకాలం పాటు వాయిదా వేయడాన్ని ఏమంటారు?
   1) నిరవధిక వాయిదా 2) ప్రోరోగ్
   3) స్వల్పవ్యవధి సభ 4) వాయిదా

5. అభిశంసన తీర్మానానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కారణం తెలియజేయాలి.
   బి) మంత్రిమండలి విధాన కార్యక్రమాలను అభిశంసించేందుకు దీన్ని ప్రవేశపెడతారు.
   సి) ఈ తీర్మానం లోక్‌సభలో నెగ్గితే ప్రభుత్వం రాజీనామా చేయాలి.
   డి) ఈ తీర్మానాన్ని ఒక మంత్రికి వ్యతిరేకంగా లేదా కొంతమంది మంత్రులకు వ్యతిరేకంగా లేదా మొత్తం మంత్రిమండలికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టవచ్చు.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

6. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కారణం చెప్పాల్సిన అవసరం లేదు.
   బి) దీన్ని మంత్రిమండలికి వ్యతిరేకంగా లేదా కొందరు మంత్రులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టవచ్చు.
   సి) దీన్ని మొత్తం మంత్రిమండలికి వ్యతిరేకంగా ప్రవేశపెడతారు.
   డి) దీన్ని లోక్‌సభ ఆమోదిస్తే ప్రభుత్వం అధికారం కోల్పోతుంది.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

7. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు 'మొదటి గంట' సమయాన్ని ఏమంటారు?
   1) శూన్యకాలం
   2) ప్రశ్నోత్తరాల సమయం
   3) స్వల్ప వ్యవధి సమయం 4) ఈల్డింగ్

8. సభలో సభ్యులు అడిగే 'నక్షత్రపు గుర్తుల ప్రశ్నలకు' సంబంధిత మంత్రులు ఎలాంటి సమాధానం ఇవ్వాలి?
   1) మౌఖిక 2) లిఖిత
   3) మౌఖిక, లిఖిత
   4) సమాధానం ఇవ్వొచ్చు లేదా ఇవ్వకపోవచ్చు

9. సభలో సభ్యులు అడిగే 'నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలకు' సంబంధిత మంత్రులు ఎలాంటి సమాధానం ఇవ్వాలి?
   1) లిఖిత 2) లిఖిత, మౌఖిక
   3) మౌఖిక
   4) సమాధానం ఇవ్వొచ్చు లేదా ఇవ్వకపోవచ్చు

10. జీరో అవర్ (శూన్య కాలం)కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



   ఎ) ఇది మనదేశ పార్లమెంటరీ ప్రక్రియలో స్వతహాగా ఏర్పాటు చేసుకున్న పద్ధతి.
   బి) ప్రశ్నోత్తరాల సమయం తర్వాత సభా కార్యక్రమాలు ప్రారంభమవడానికి ముందున్న కొద్ది కాలాన్ని 'జీరో అవర్' అంటారు.
   సి) ఈ సమయంలో ముందస్తు నోటీసులు లేకుండా సభ్యులు ప్రశ్నలు అడగొచ్చు.
   డి) సభాధ్యక్షుడి విచక్షణ మేరకు ఇది అమలవుతుంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

11. వాయిదా తీర్మానానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) దీన్ని లోక్‌సభలో ప్రవేశపెడతారు. దీన్ని స్పీకర్ అనుమతించవచ్చు లేదా నిరాకరించవచ్చు.
   బి) దీన్ని ప్రవేశపెట్టడానికి 50 మంది లోక్‌సభ సభ్యుల సంతకాలు అవసరం.
   సి) ముఖ్యమైన, సమకాలీన ప్రజాసమస్యల వైపు సభ దృష్టి మరలించేందుకు దీన్ని ఉపయోగిస్తారు.
   డి) ఈ తీర్మానంపై చర్చ అనంతరం ఓటింగ్ జరుగుతుంది. ఓటింగ్‌లో తీర్మానం నెగ్గితే ప్రభుత్వం రాజీనామా చేయాలి.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

12. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) కార్పెట్ క్రాసింగ్ - అధికార పక్షానికి చెందిన సభ్యులు ప్రతిపక్ష పార్టీలోకి ఫిరాయించడం.
   బి) ఫ్లోర్‌క్రాసింగ్ - ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు అధికార పార్టీలోకి ఫిరాయించడం.
   సి) ఈల్డింగ్ ది ఫ్లోర్ - ఒక సభ్యుడు ప్రసంగిస్తున్నప్పుడు అతడిని నిరోధించి మరొక సభ్యుడికి మాట్లాడే అవకాశం కల్పించడం.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

13. ప్రభుత్వం మారినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులను కూడా మార్చుకునే పద్ధతిని ఏమంటారు?
   1) స్పాయిల్ సిస్టం 2) ఫ్లోర్ క్రాసింగ్
   3) ఈల్డింగ్ 4) కాంపోజిట్ ఫ్లోర్

14. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) సభా కార్యక్రమాలు నియమ నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.
   బి) సభాధ్యక్షుల అనుమతితో ఇది సభలో జరిగే ఒక అసాధారణ పద్ధతి.
   సి) దీన్ని అనుమతిస్తే అప్పటివరకు జరుగుతున్న కార్యక్రమాలను పక్కన పెట్టి ఈ అంశంపై చర్చిస్తారు.
   డి) దీనిపై చర్చ అనంతరం ఓటింగ్ జరుగుతుంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

15. ధన్యవాద తీర్మానానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

   ఎ) ఏటా పార్లమెంటు సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభమవుతాయి.
   బి) రాష్ట్రపతి ప్రసంగ విధానాలను కేబినెట్ తయారుచేసి, ఆమోదిస్తుంది.
   సి) ఈ ప్రసంగం తరవాత పార్లమెంటు ఉభయ సభలు రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించాలి.
   డి) ఈ తీర్మానాన్ని లోక్‌సభ తిరస్కరిస్తే ప్రభుత్వం అధికారం కోల్పోతుంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

16. సభలో బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు సభ్యులు ఉద్దేశపూర్వకంగా దీర్ఘకాలిక ఉపన్యాసం ఇస్తూ సభాసమయాన్ని హరిస్తూ సభ ముగిసేలా చేయడాన్ని ఏమంటారు?
   1) ఫిలిబస్టరింగ్ 2) ఈల్డింగ్
   3) ప్రత్యామ్నాయ తీర్మానం 4) లేమ్‌డక్

17. ఎన్నికల్లో విజయావకాశాలను మెరుగుపరచుకునేందుకు నియోజకవర్గాల సరిహద్దులు మార్చే ప్రక్రియను ఏమంటారు?
   1) గ్యాలప్ పోల్ 2) ఎగ్జిట్ పోల్
   3) గెర్రీమాండరింగ్ 4) డీలిమిటేషన్

18. సంకీర్ణ ప్రభుత్వానికి సంబంధించిన సరైన జవాబును గుర్తించండి.
   ఎ) రెండు లేదా అంతకంటే ఎక్కువ రాజకీయ పార్టీలు కలిసి ఏర్పాటు చేసే ప్రభుత్వం.
   బి) దీనిలో ప్రభుత్వాధినేత విధాన నిర్ణయాలను స్వేచ్ఛగా అమలు చేస్తారు.
   సి) ప్రభుత్వ మనుగడ భాగస్వామ్య పార్టీల అభీష్టం మేరకు కొనసాగుతుంది.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

19. విప్‌నకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) విప్ అంటే అధిపతి లేదా ఆదేశం.
   బి) దీన్ని రాజ్యాంగంలో ఆర్టికల్ 75 (5)లో పేర్కొన్నారు.
   సి) చట్టసభల సభ్యులను సభలో నియంత్రించేందుకు ప్రతి రాజకీయ పార్టీ సంబంధిత సభలో ఒకరిని 'విప్'గా నియమిస్తుంది.
   డి) పార్టీ జారీ చేసే 'విప్'ను ధిక్కరిస్తే సంబంధిత చట్టసభ సభ్యుడు సభ్యత్వం కోల్పోతాడు.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

20. లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన పూర్తిస్థాయి మెజార్టీ ఏ రాజకీయ పార్టీకి లభించని పరిస్థితిని ఏమంటారు?
   1) ఆపద్ధర్మ సభ 2) సంకీర్ణ సభ
   3) హంగ్ పార్లమెంటు 4) ముగింపు సభ

21. ఓట్ ఆన్ అకౌంట్‌కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) రెండు నెలల కాలపరిమితికి ప్రభుత్వం ప్రవేశపెట్టే తాత్కాలిక బడ్జెట్.
   బి) రాజ్యాంగంలోని ఆర్టికల్ 116 దీన్ని పేర్కొంటుంది.
   సి) సాధారణంగా బడ్జెట్ మొత్తం అంచనా వ్యయంలో 1/6వ వంతుకు సమానంగా ఉంటుంది.
   డి) దీన్ని లోక్‌సభలో చర్చించకుండా ఆమోదించడం ఒక ఆచారంగా వస్తుంది.



   1) ఎ, బి, సి
   2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి
   4) ఎ, బి, సి, డి

22. భారత సంఘటిత నిధికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) దీన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 266 వివరిస్తుంది.
   బి) కేంద్ర ప్రభుత్వం తన ఆదాయ వ్యయాలను జరపడానికి రిజర్వ్ బ్యాంకులో తెరిచిన ఖాతా.
   సి) పార్లమెంటు ఆమోదంతోనే ఈ నిధి నుంచి చెల్లింపులు జరుగుతాయి.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి


23. భారత ఆగంతక నిధికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) దీన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 267 వివరిస్తుంది.
   బి) ప్రభుత్వానికి ఊహించని ఖర్చులు ఎదురైనప్పుడు ఈ నిధిని ఆశ్రయిస్తుంది.
   సి) ఈ నిధి రాష్ట్రపతి నియంత్రణలో ఉంటుంది.
   డి) పార్లమెంటు ఈ నిధిని 1950 లో ఏర్పాటు చేసింది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1-2; 2-4; 3-2; 4-2; 5-2; 6-1; 7-2; 8-1; 9-1; 10-4; 11-1; 12-4; 13-1; 14-1; 15-4; 16-1; 17-3; 18-2; 19-1; 20-3; 21-4; 22-4; 23-4.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

ఎలక్ట్రానిక్స్ రంగంలో అర్ధవాహకాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. గ్రాఫైట్, సిలికాన్, జర్మేనియం లాంటి పదార్థాలను అర్ధవాహకాలుగా విరివిగా ఉపయోగిస్తారు. ఈ వాహకాల్లో ఎలక్ట్రాన్లతో పాటు హోల్స్ కూడా వాహకత్వాన్ని ప్రదర్శిస్తాయి. వాహకంలో ఎలక్ట్రాన్ల చలనం వల్ల విద్యుత్ ప్రవాహం జరుగుతుంది. అర్ధవాహకంలో ఎలక్ట్రాన్ల చలనమే కాకుండా హోల్స్ చలనం సైతం ఉంటుంది. వాహక పట్టీలోని ఎలక్ట్రాన్ల సంఖ్య, సంయోజక పట్టీలోని హోల్స్ సంఖ్యకు సమానమైతే దాన్ని స్వభావజ అర్ధవాహకం అంటారు.



తక్కువ మోతాదులో మాలిన్యం స్వచ్ఛ పదార్థాల మాదీకరణం

ఎలక్ట్రానిక్స్

అస్వభావజ అర్ధవాహకం

ఎలక్ట్రానిక్ పరికరాల్లో అనేక విడి భాగాలకు స్వభావజ అర్ధవాహకాలను ఉపయోగించలేం. ఇందుకు కారణం, ఈ అర్ధవాహకాల్లో ఎక్కువ పరిమాణాలు ఉన్న విద్యుత్ ప్రవాహాలను ఉత్పత్తి చేయడానికి తగినన్ని ఆవేశ వాహక కణాలు లేకపోవడమే.

✦ ఎక్కువ విద్యుత్ ప్రవాహానికి అనుమతి ఇవ్వాలంటే స్వభావజ అర్ధవాహకాలకు కొన్ని మలిన పదార్థాలను కలపాలి. ప్రత్యేకంగా ఎంపిక చేసిన మలిన పదార్థాలను చాలా తక్కువ మోతాదుల్లో స్వభావజ అర్ధవాహకాలకు కలిపి తయారుచేసిన వాటినే 'అస్వభావజ అర్ధవాహకాలు' అంటారు.

✦ చాలా తక్కువ మోతాదుల్లో మలిన పదార్థాలను స్వచ్ఛమైన పదార్థాల్లోకి ప్రవేశపెట్టడాన్ని మాదీకరణం (Doping) అంటారు.

✦ డోపింగ్ చేయడానికి ఉపయోగించిన పదార్థ రకం ఆధారంగా అస్వభావజ అర్ధవాహకాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.


p - రకం అర్ధవాహకాలు

స్వభావజ అర్ధవాహకానికి గ్రహీత మాలిన్యాలు చేర్చడం వల్ల p - రకం (p = Positive) అర్ధవాహకం ఏర్పడుతుంది.

☛ గ్రాఫైట్ (కార్బన్ రూపాంతరం), సిలికాన్ (Si), జర్మేనియం (Ge)లలో 4 సంయోజక ఎలక్ట్రాన్లు ఉంటాయి. కాబట్టి ఇవి నవీన ఆవర్తన పట్టికలో IV A గ్రూప్‌లో ఉండే మూలకాలు.

☛ వీటికి పక్కన ఉన్న III A గ్రూప్ నుంచి బోరాన్ (B), అల్యూమినియం (Al), గాలియం (Ga), ఇండియం (In)లను పరిశీలిస్తే వాటిలో 3 సంయోజక (Valence) ఎలక్ట్రాన్లు ఉంటాయి.

ఉదా: చిన్న మొత్తంలో జర్మేనియం మూలకాన్ని తీసుకుని, అతి తక్కువ మోతాదులో గాలియం మూలకాన్ని మలినంగా కలిపితే డోపింగ్ చెందించినట్లు అర్థం.




☛ పటంలో చూపినట్లు 4 సంయోజక ఎలక్ట్రాన్లు కలిగిన జర్మేనియం పరమాణువులు, 4 ఎలక్ట్రాన్లతో కలిసి 4 సంయోజనీయ బంధాలను ఏర్పరచడానికి ప్రయత్నిస్తాయి. అయితే 3 సంయోజక ఎలక్ట్రాన్లు కలిగిన గాలియంను కలిపిన తర్వాత అది మూడు ఎలక్ట్రాన్లను మాత్రమే ఇస్తుంది. ఇక్కడ ఒక ఎలక్ట్రాన్ కొరత ఏర్పడుతుంది. ఇది ఒక హోల్‌కి సమానం.

☛ ఈ విధంగా ప్రతి మలిన పరమాణువు p - రకం అర్ధవాహకంలో ఒక హోల్‌ని ఏర్పరుస్తుంది. మలినం కలిపిన తర్వాత అర్ధవాహకం ఒక ఎలక్ట్రాన్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటుంది. ఈ రకమైన మూడు సంయోజకతలు ఉన్న మలినాలను గ్రహీత మలిన్యాలు అంటారు.

☛ అల్ప మోతాదులో కలిపిన గాలియం మలినం కొన్ని మిలియన్ల హోల్స్‌ను ఇస్తుంది. ఈ హోల్స్‌ల సంఖ్య వాహకంలో అవసరమయ్యే ఎలక్ట్రాన్ల సంఖ్య కంటే ఎక్కువగా ఉంటుంది. ఇలా ఏర్పడిన అర్ధవాహకాన్ని p-రకం అర్ధవాహకం అంటారు.

☛ ఈ అర్ధవాహకాల్లో వహనం ప్రధానంగా సంయోజక పట్టీలోని హోల్స్ కారణంగా జరుగుతుంది. కాబట్టి p-రకం అర్ధవాహకాల్లో హోల్స్‌ను అధిక సంఖ్యాక వాహక కణాలు అని, ఎలక్ట్రాన్లను అల్ప సంఖ్యాక వాహక కణాలు అని అంటారు.




రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

n - రకం అర్ధవాహకం

స్వభావజ అర్ధవాహకానికి దాత మాలిన్యాలను చేర్చడం వల్ల n - రకం అర్ధవాహకం తయారవుతుంది.

☛ VA గ్రూప్‌నకు చెందిన ఫాస్ఫరస్ (P), ఆర్సెనిక్ (As), ఆంటిమొని (Sb) లాంటి మూలకాల్లో 5 సంయోజనీయ ఎలక్ట్రాన్లు ఉంటాయి. ఇలాంటి మాలిన్యాలను 4 సంయోజకత కలిగిన అర్ధవాహకాలకు కలిపి డోపింగ్ చేస్తే 4 ఎలక్ట్రాన్లు బంధాలను ఏర్పరుస్తాయి. కానీ పంచ సంయోజనీయ మాలిన్యం 5 ఎలక్ట్రాన్లను ఇవ్వగలదు కాబట్టి ఇక్కడ ఒక ఎలక్ట్రాన్ ఎక్కువగా ఉంటుంది. అందుకే అర్ధవాహకానికి ప్రతి పంచ సంయోజనీయ మాలిన్యం ఒక ఎలక్ట్రాన్ ఎక్కువగా అందిస్తుంది.



☛ పటంలో చూపిన విధంగా Ge అర్ధవాహకానికి ఫాస్ఫరస్ మాలిన్యం కలిపితే 4 సంయోజనీయ బంధాలు ఏర్పడి, ఒక ఎలక్ట్రాన్ స్వేచ్ఛగా మిగులుతుంది.

☛ ఫాస్ఫరస్ మాలిన్యం ఒక ఎలక్ట్రాన్‌ను ఇవ్వడానికి సిద్ధంగా ఉంటుంది. కాబట్టి VA గ్రూప్ మాలిన్యాలను దాత మాలిన్యాలు అంటారు.

☛ ఈ విధంగా చిన్న మొత్తంలో ఫాస్ఫరస్ లాంటి దాత మాలిన్యాన్ని అర్ధవాహకానికి కలపడం ద్వారా అది కొన్ని మిలియన్ల ఎలక్ట్రాన్లను అందిస్తుంది. అందుకే వీటిని n - రకం అర్ధవాహకం (n = negative) అంటారు.

☛ n - రకం అర్ధవాహకాల్లో వహనానికి ఎలక్ట్రాన్ల సంఖ్య, హోల్స్‌ల సంఖ్య కంటే ఎక్కువగా ఉంటుంది.

☛ ఈ రకమైన అర్ధవాహకాల్లో వహనం ప్రధానంగా వాహక పట్టీలోని ఎలక్ట్రాన్ల ద్వారా జరుగుతుంది.

☛ ఎలక్ట్రాన్లను అధిక సంఖ్యాక వాహక కణాలు (Majority Carriers) అని, హోల్స్‌ను అల్ప సంఖ్యాక వాహక కణాలు (Minority Carriers) అని అంటారు.

గమనిక: స్వభావజ అర్ధవాహకాలకు త్రిసంయోజనీయ (3) లేదా పంచ సంయోజనీయ (5) మాలిన్యాలను కలపడం ద్వారా దాని తటస్థ స్వభావంలో ఎలాంటి మార్పు ఉండదు. కాబట్టి p - రకం లేదా n - రకం అర్ధవాహకాలు విద్యుత్ పరంగా తటస్థం.

మాదిరి ప్రశ్నలు

1. అర్ధవాహకపు ఉష్ణోగ్రత పెంచితే దాని శక్తి అంతరం......
   1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
   3) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
   4) స్థిరంగా ఉంటుంది.
2. కింది వాటిలో అర్ధవాహకాల్లో విద్యుత్ ప్రవాహానికి కారణం?
   1) ఎలక్ట్రాన్లు 2) హోల్‌లు
   3) 1, 2 4) ఏదీకాదు
3. స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల సాంద్రత కింది వాటిలో దేనిలో ఎక్కువ?
   1) చెక్క 2) సిలికాన్
   3) గాజు 4) వెండి
4. p - రకం అర్ధవాహకంలో అధిక సంఖ్య వాహక కణాలు.....
   1) హోల్‌లు 2) ఎలక్ట్రాన్లు
   3) 1, 2 4) రుణాత్మక అయాన్లు

సమాధానాలు: 1-1, 2-3, 3-4, 4-1.

896 Word of the Day

Aspersion

Telugu meaning: ఆరోపణ, నింద

English meaning: Aspersion (ఆస్పర్షన్) is a noun that refers to harmful or false statements made to damage someone's reputation.

Synonyms: Allegation, Accusation

Antonyms: Praise, Commendation

Usage: 1. The journalist refused to cast aspersions on the officer without concrete evidence.

2. During the debate, unnecessary aspersions were thrown at the opponent to gain attention.

Current Affairs



Praveen Vashista took charge as Vigilance Commissioner in the Central Vigilance Commission on 16 January 2026. He is a 1991-batch IPS officer of Bihar cadre. According to the Central Vigilance Commission Act of 2003, the commission is comprised of a Central Vigilance Commissioner and two Vigilance Commissioners. The term for the Vigilance Commissioners is four years or until they attain the age of 65 years.

President of the European Council António Luís Santos da Costa and the President of the European Commission Ursula von der Leyen will be Chief Guests at the 77th Republic Day celebrations at Kartavyapath on 26th January. At the invitation of Prime Minister Narendra Modi, both leaders will be on a three-day State Visit to India from 25th January.

✦ During the visit, the leaders will also co-chair the 16th India-EU Summit on the 27th of this month.

Union Power Minister Manohar Lal has said that India has more than doubled its installed power generation capacity from 249 gigawatt in 2014 to over 510 gigawatt in 2025. Addressing the curtain raiser of the Bharat Electricity Summit 2026 in New Delhi, the Minister said that India has entered a new era of energy abundance defined by reliability, accessibility and resilience. He mentioned that India is now the world's third-largest producer and consumer of electricity.

India and Germany have signed a Joint Declaration of Intent (JDI) on Telecommunications Cooperation, marking a significant step towards deepening bilateral collaboration in the fields of telecom and information and communication technologies (ICTs). The declaration was signed during the official visit of German Chancellor Friedrich Merz to India from January 12 to 13.

For more Current Affairs: Scan QR code

భారతదేశంలోని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్

స్టడీ జోన్

భూమి అనేక రకాల వృక్ష, జంతు జాతులకు నిలయం. ఒక నిర్దిష్ట ఆవాసంలోని మొక్కలు, జంతు జాతుల మధ్య ఉండే భిన్నత్వాన్నే జీవవైవిధ్యం అంటారు. స్థిరమైన, ఆరోగ్యవంతమైన ఆవరణ వ్యవస్థను నిర్మించడానికి ఇది తోడ్పడుతుంది. బయోడైవర్సిటీ అనేది జాతీయ సంపదకు సూచిక. మానవ జీవనానికి, వికాసానికి ఆధారం. అయితే మానవ చర్యల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది. దీంతో వాతావరణ స్థిరత్వం లోపించడంతోపాటు కరవులు, వరదలు లాంటి విపత్తులు సంభవిస్తున్నాయి. ఆహార భద్రత, ప్రజల జీవనోపాధికి నష్టం కలుగుతోంది. అందుకే జీవవైవిధ్యాన్ని రక్షించుకునేందుకు బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేశారు. పోటీపరీక్షల నేపథ్యంలో దీని గురించి ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం..!

బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్ అంటే?

జీవవైవిధ్యం అధికంగా ఉండి, స్థానీయ జాతులు ఎక్కువ సంఖ్యలో నివసిస్తూ కాలక్రమేణా మానవ ప్రమేయం వల్ల వచ్చిన మార్పులతో సంఘర్షణకు గురై, కొన్ని జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉన్న ప్రాంతాలే జీవవైవిధ్య సున్నిత ప్రాంతాలు (బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్).

✦ స్థానీయ జాతి అంటే ఒక నిర్దిష్ట ప్రాంతంలో పెరిగేవి. అవి మొక్కలు - పుష్ప జాతులు, జంతు జాతులు కావొచ్చు. ఈ హాట్‌స్పాట్‌లు అనేక అంతరించే దశలో ఉన్న జాతులకు నిలయంగా ఉంటాయి. ✦ బయోడైవర్సిటీ హాట్‌స్పాట్ అనే పదాన్ని మొదటిసారి 1988లో నార్మన్ మేయర్స్ ఉపయోగించారు.

ఎవరు గుర్తిస్తారు?

అమెరికాలోని 'కన్జర్వేషన్ ఇంటర్నేషనల్' బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌లకు గుర్తింపు ఇస్తుంది. 1999లో ఇది మొదటిసారి 25 హాట్‌స్పాట్‌లను గుర్తించింది.




భారత్‌లోని హాట్‌స్పాట్స్, యూపీఎస్సీ సివిల్స్, యూజీసీ నెట్ తదితర పోటీ పరీక్షల్లో గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

పర్యావరణ వ్యవస్థ - క్రియాత్మక అంశాలు

ఆవరణ వ్యవస్థ అనేది జీవాన్ని నిలబెట్టేందుకు సంఘర్షణ చెందే జీవసంబంధమైన, నిర్జీవాత్మక కారకాలతో కూడిన ఒక గతిక వ్యవస్థ. పర్యావరణ వ్యవస్థ క్రియాత్మక అంశాలుగా శక్తి ప్రవాహం, భూ జీవరసాయన వలయాలు, పర్యావరణ ఉత్పాదకతను చెప్పవచ్చు. ఇది జీవ ప్రక్రియల స్థిరత్వం, ఉనికిని నిర్ధారిస్తుంది.



పర్యావరణ వ్యవస్థల్లో శక్తి ప్రవాహం

పర్యావరణ వ్యవస్థలో శక్తి ప్రవాహం అనేది ఆహార గొలుసులో జరిగే శక్తి బదిలీ, వినియోగాన్ని సూచిస్తుంది. పర్యావరణ వ్యవస్థలో పోషక చక్రాలు, శక్తి ప్రవాహం జీవ, నిర్జీవ భాగాలను ఒకదానితో ఒకటి బంధిస్తాయి.

శక్తి ప్రవాహం దశలు

☛ మొదటి దశ ☛ రెండో దశ
☛ మూడో దశ ☛ నాలుగో దశ

శక్తి ప్రవాహం ప్రాముఖ్యత

పర్యావరణ వ్యవస్థలో శక్తి ప్రవాహం అనేది మనుగడలో భాగంగా జరుగుతుంది. జీవులన్నీ పనిచేయడానికి శక్తిపైనే ఆధారపడతాయి. ఆ శక్తిని పొందడానికి పర్యావరణ వ్యవస్థలో తమ తోటి జీవులపై ఆధారపడతాయి.

బయోజియోకెమికల్ సైకిల్స్

బయోజియోకెమికల్ సైకిల్స్ ప్రధానంగా బయోటిక్, అబయోటిక్ కారకాల మధ్య పోషకాలు, ఇతర మూలకాల కదలికను సూచిస్తాయి.

☛ నీటి చక్రం ☛ కార్బన్ చక్రం
☛ నైట్రోజన్ చక్రం
☛ ఆక్సిజన్ చక్రం
☛ ఫాస్ఫరస్ చక్రం
☛ సల్ఫర్ చక్రం

ట్రోఫిక్ స్థాయుల సోపాన క్రమం, శక్తి ప్రవాహ నియంత్రణ నియమాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Project Officer Posts

Electronics Corporation of India Limited (ECIL), Hyderabad is conducting interviews to fill Project Officer and SAP Specialist posts on a contract basis. Total no.of posts is 15. The interview will be conducted on 28, 29 January 2026.

Branch Head Posts

Tamil Nadu Mercantile Bank (TMB) Limited is inviting applications from eligible candidates for Branch Head (Manager/ Senior Manager/Assistant Vice President) posts in TMB branches across the country. Total no.of posts is 20. The last date for applications is 31 January 2026.

Project Engineer Jobs

Society for Applied Microwave Electronics Engineering and Research (SAMEER) has released a notification for the recruitment of Project Engineer, Project Associate, Project Scientific Assistant, and Project Technical Assistant positions on a contract basis. Total number of posts is 147. Last date for online applications is 25 January 2026.

Did You Apply..?

Today (January 20) is the last date for the following Jobs

☛ 198 jobs in Telangana Road Transport Corporation.
Eligibility: Diploma or Degree.

☛ 67 Graduate Trainee Posts in MOIL, Nagpur.
Eligibility: BE, B.Tech, M.Tech.

For more information and other notifications - scan QR code

Geometric Progression

1. Find the 17th term of the geometric progression 7, 49, 343, ...
   A) 7^{18} B) 7^{17} C) 7^{16} D) 7^{19} E) 7^{20}
2. The ratio between the sum of first five terms of a GP to the sum of first ten terms is 32 : 275. Then find the common ratio of the G.P.
   A) $\frac{2}{3}$ B) $\frac{2}{5}$ C) $\frac{3}{2}$ D) $\frac{3}{5}$ E) $\frac{1}{7}$
3. Which term of the geometric sequence $\frac{1}{3}, \frac{2}{9}, \frac{4}{27}$ .... is $\frac{128}{6561}$
   A) 8 B) 7 C) 9 D) 10 E) 11
4. Find the sum the series to infinity
   $\frac{4}{5} - \frac{6}{5^2} + \frac{4}{5^3} - \frac{6}{5^4} + \frac{4}{5^5} - \frac{6}{5^6} + ...$
   A) $\frac{2}{5}$ B) ∞ C) $\frac{1}{5}$ D) $\frac{7}{12}$ E) $\frac{8}{11}$
5. The sum of series, 5 + 0.5 + 0.05 + 0.005 + 0.0005 + ... is
   A) $5\frac{5}{9}$ B) $5\frac{4}{9}$ C) $5\frac{7}{9}$ D) $5\frac{1}{9}$ E) $5\frac{3}{2}$
6. The sum of the first two terms of G.P. is 21 and the product of the first term and the third term is three times the second term, then find the sum of the first five term is:
   A) $\frac{1559}{36}$ B) $\frac{1555}{144}$ C) $\frac{1559}{72}$ D) $\frac{1555}{72}$ E) None of the above
7. The sum of an infinite geometric progression is 15 and the sum of squares of its term is 45. Find the common ratio of the G.P.
   A) $\frac{2}{3}$ B) $\frac{1}{3}$ C) $\frac{2}{5}$ D) $\frac{3}{5}$ E) $\frac{7}{9}$
8. The fifth term of a G.P. is 27 times second term of the G.P., then find the common ratio of the G.P.
   A) $\frac{27}{2}$ B) 4 C) 3 D) 2 E) 5
9. The sum of an infinite series of G.P. with alternating sign is 8 and the first term is 12, then find the common ratio of the G.P.
   A) $\frac{2}{3}$ B) $-\frac{1}{2}$ C) $\frac{3}{2}$ D) $\frac{1}{2}$ E) $\frac{2}{9}$

Bank Exams

Quantitative Aptitude

10. The sum of an infinite series of G.P. is 13. If the first term is increased by 3, the sum becomes 27. Find the common ratio of the G.P.
    A) $\frac{11}{14}$ B) $-\frac{13}{3}$ C) $\frac{14}{11}$ D) $-\frac{27}{13}$ E) $\frac{19}{11}$
11. The sum of an infinite series of G.P. with alternating signs is 12. The sum of absolute values of its terms is 18. Find the common ratio.
    A) $\frac{2}{3}$ B) $\frac{1}{5}$ C) $-\frac{1}{5}$ D) $\frac{3}{2}$ E) None of the above
12. The third term of a G.P. is the square of the first term. If the second term is 64, determine 7th term of the G.P.:
    A) 512 B) 4^7 C) 256 D) 4^8 E) 169
13. The product $(81)(81)^{\frac{1}{5}}(81)^{\frac{1}{25}}$........... is equal to:
    A) 243 B) 81 C) ∞ D) $(81)^5$ E) 112
14. The sum of the 3rd term and 7th term of a G.P. is 128 and their product is 4096, then find the common ratio of the G.P.
    A) ± 2 B) ± 3 C) ± 1 D) ± 4 E) ± 5
15. The sum of an infinite sequence of a G.P. is 50 and the sum of its first two term is 32. Then what is the common ratio of the G.P.
    A) $\pm\frac{3}{2}$ B) $\pm\frac{4}{5}$ C) $\pm\frac{2}{3}$ D) $\pm\frac{3}{5}$ E) $\pm\frac{8}{9}$
16. For what value of 'x', the numbers $-\frac{5}{8}, x, -\frac{8}{5}$ are in Geometric progression?
    A) ± 3 B) ± 1 C) ± 2 D) ± 5 E) ± 7
17. If the fifth, eleventh and seventeenth terms of a G.P. are p, q and r respectively, then what is the relation between p, q and r?
    A) $q^2 = pr$ B) pqr = 1
    C) q = pr
    D) $p^2 = qr$
    E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

ఆర్‌బీఐ ఆహ్వానిస్తోంది!

పదో తరగతి విద్యార్హతతోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో సేవలందించే అవకాశం వచ్చింది. ఈ సంస్థ ఆఫీస్ అటెండెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. పరీక్షలతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు మొదటి నెల నుంచే సుమారు రూ.50,000 వేతనం అందుకోవచ్చు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.

పదో తరగతి విద్యార్హతతోనే రిజర్వ్ బ్యాంకులో ఉద్యోగం పొందడాన్ని మేటి అవకాశంగా చెప్పుకోవచ్చు. ఆఫీస్ అటెండెంట్ కొలువుకు ఉన్నత విద్యావంతులకు అవకాశం లేదు. దీంతో పోటీ తీవ్రత కొంచెం తక్కువగానే ఉండొచ్చు. అలాగని సులువుగా అవకాశం దక్కదు. పరీక్షకు గరిష్ఠంగా 40 రోజులే ఉన్నాయి. అందువల్ల ఇప్పటికే పోటీ పరీక్షల సన్నద్ధతలో ఉన్నవారు రాణించగలరు. ఎంపికైనవారు మొదటి నెల నుంచే రూ.46,000 వేతనం అందుకోవచ్చు. దీనికి హెచ్‌ఆర్‌ఏ అదనం. తగు విద్యార్హతలు, అనుభవంతో ఆర్‌బీఐ అంతర్గతంగా నిర్వహించే పరీక్షల ద్వారా భవిష్యత్తులో పదోన్నతులూ పొందవచ్చు.



ఎంపిక

ఆన్‌లైన్ పరీక్ష, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టులతో నియామకాలుంటాయి. ఖాళీలు ప్రాంతాల వారీ ఉన్నాయి. అభ్యర్థులు ఏ ప్రాంతం/శాఖలోని ఖాళీలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఆ కార్యాలయం ఉన్న ప్రాంతానికి సంబంధించిన స్థానిక భాషలో చదవడం, రాయడం, మాట్లాడటం వచ్చుండాలి. ఇందుకోసం నిర్వహించే లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ పరీక్షలో అర్హత సాధించాలి.

పరీక్ష ఇలా

ఆన్‌లైన్‌లో 120 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 120 ప్రశ్నలు వస్తాయి. రీజనింగ్-30, జనరల్ ఇంగ్లిష్-30, జనరల్ అవేర్‌నెస్-30, న్యూమరికల్ ఎబిలిటీ-30 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. అర్హతకు ప్రతి సెక్షన్‌లోనూ నిర్ణీత కటాఫ్ మార్కులు పొందాలి. ఇలా కనీస మార్కులు సాధించినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ ప్రకారం తర్వాత దశ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్టుకు ఎంపిక చేస్తారు. ఇందులో అర్హులకు మెడికల్ పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. తుది నియామకాలు పరీక్ష మార్కుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఉంటాయి.

విజయానికి

● ఈ పరీక్ష ఐబీపీఎస్ క్లరికల్ ప్రిలిమినరీకి దగ్గరలో ఉండవచ్చు. ఆ స్థాయిలో సన్నద్ధమైనవారు ప్రశ్నలు ఎదుర్కోవడం తేలికవుతుంది. అలాగే ఎస్ఎస్‌సీ- మల్టీ టాస్కింగ్, సీహెచ్‌ఎస్ఎల్ పాత ప్రశ్నపత్రాలు బాగా సాధన చేయాలి.

● గతంలో నిర్వహించిన ఆఫీస్ అటెండెంట్ ప్రశ్నపత్రాలన్నీ బాగా అధ్యయనం చేయాలి. వాటి ద్వారా ఏ అంశాల నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తాయో గ్రహించాలి. సన్నద్ధత అందుకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి.

● ప్రతి విభాగంలోనూ అంశాల వారీ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే ఎక్కువ ప్రశ్నలకు తక్కువ వ్యవధిలోనే సమాధానాలు గుర్తించడం వీలవుతుంది.

● పరీక్షకు ముందు కనీసం పది మాక్ టెస్టులు రాయాలి. ఇలా రాస్తున్నప్పుడు సమయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. జవాబులు సరిచూసుకుని, తప్పులు పునరావృతం కాకుండా సిద్ధపడాలి.

● బాగా కష్టమైనవి, ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నలను పరీక్ష చివరిలోనే ప్రయత్నించాలి. ● రుణాత్మక మార్కులు ఉన్నందున అసలేమాత్రం తెలియని, అవగాహన లేని ప్రశ్నలను వదిలేయడమే మంచిది.

● 120 ప్రశ్నలకు 90 నిమిషాల్లో సమాధానాలు రాయాలి. అంటే ఒక్కో ప్రశ్నకు గరిష్ఠంగా 45 సెకన్లు మాత్రమే ఉంటుంది. అందువల్ల ముందుగా సులువైన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్ సెక్షన్లను వీలైనంత తక్కువ వ్యవధిలోనే పూర్తిచేసుకోవాలి. ఇలా చేస్తే రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీలకు కొంచెం అదనపు సమయం దక్కుతుంది.

వివరాలు

ఖాళీలు: 572. హైదరాబాద్ కార్యాలయంలో 36.
విద్యార్హత: పదోతరగతి ఉత్తీర్ణత.
వయసు: జనవరి 1, 2026 నాటికి 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే జనవరి 2, 2001 - జనవరి 1, 2008 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులైతే కేటగిరీ ప్రకారం 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 4.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50. మిగిలిన అందరికీ రూ.450. జీఎస్టీ అదనం.
ఆన్‌లైన్ పరీక్షలు: ఫిబ్రవరి 28, మార్చి 1న నిర్వహిస్తారు.
వెబ్‌సైట్: https://www.rbi.org.in/

ప్రశ్నాంశాలు

రీజనింగ్: పలు ప్రశ్నలకు తార్కిక పరిజ్ఞానంతో జవాబులు గుర్తించవచ్చు. గణితంలోని ప్రాథమికాంశాలపై పట్టు పెంచుకోవాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయడం ద్వారా తక్కువ సమయంలో జవాబు గుర్తించే నైపుణ్యం అలవడుతుంది.

జనరల్ ఇంగ్లిష్: ఆంగ్లాన్ని ఎలా అర్థం చేసుకుంటున్నారో గమనిస్తారు. ఖాళీలు పూరించడం, వాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, తప్పుగా ఉన్న పదాన్ని గుర్తించడం, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, కాంప్రహెన్షన్..తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి. ఎక్కువ మార్కులు పొందడానికి 8, 9, 10 తరగతుల ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకోవాలి. నమూనా ప్రశ్నలు సాధన చేయాలి.

న్యూమరికల్ ఎబిలిటీ: కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలతోపాటు శాతాలు, నిష్పత్తి, సరాసరి, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, వయసు నిర్ణయించడం, రైళ్లు, పడవ వేగాలు, క.సా.గు., గ.సా.భా., వైశాల్యాలు, ఘనపరిమాణాలు మొదలైన అంశాల్లో ప్రశ్నలు రావచ్చు. అంకెలపై పట్టు పెంచుకోవాలి. అలాగే ముఖ్యమైన సూత్రాలు, వాటిని ఉపయోగించే విధానం తెలుసుకోవాలి.

జనరల్ అవేర్‌నెస్: చుట్టూ జరుగుతోన్న సంఘటనలపై అవగాహన ఉన్నవారు సులువుగానే సమాధానాలు గుర్తించగలరు. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థల గురించి కొన్ని ప్రాథమిక స్థాయి ప్రశ్నలు అడగవచ్చు. వీటితోపాటు భారత్- పొరుగు దేశాలు, చరిత్ర, సంస్కృతి, భూగోళం, ఆర్థిక వ్యవహారాలు, పాలిటీ, సైన్స్ అంశాల నుంచీ ప్రశ్నలు ఉంటాయి. 8, 9, 10 తరగతుల సైన్స్, సోషల్ పుస్తకాలు బాగా చదివి ముఖ్యమైన విషయాలు నోట్సు రాసుకోవాలి. వర్తమాన వ్యవహారాల నుంచీ కొన్ని ప్రశ్నలు ఆశించవచ్చు. అందువల్ల జనవరి 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు మననం చేసుకోవాలి. నియామకాలు, అవార్డులు, విజేతలు, రచయితలు.. ఈ అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది.

ప్రాజెక్ట్ అసిస్టెంట్లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్ తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ ప్రాజెక్ట్ అసిస్టెంట్: 10
అర్హత: బీటెక్ (సివిల్ లేదా అగ్రికల్చరల్ ఇంజినీరింగ్)
వయసు: 32 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు రూ.25,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.02.2026
ఎంపిక: ఇంటర్వ్యూతో. **వెబ్‌సైట్:** https://nitw.ac.in/

మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఇండియన్ ఎగ్జిమ్ బ్యాంక్, ముంబయి.. మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
◗ మేనేజ్‌మెంట్ ట్రెయినీ: 40 పోస్టులు
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ, సీఏ, పీజీ (ఎంబీఏ/ పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ ఎంఎంఎస్). **వయసు:** 31.12.2025 నాటికి 21 - 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 33 ఏళ్లు; ఓబీసీలకు 31 ఏళ్లు; దివ్యాంగులకు 38 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు రూ.100. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.02.2026.
రాత పరీక్ష: ఫిబ్రవరి, 2026లో (తేదీ వివరాలు తర్వాత ప్రకటిస్తారు)
వెబ్‌సైట్: https://www.eximbankindia.in/careers

డిప్యూటీ మేనేజర్లు

ఇండియన్ ఎగ్జిమ్ బ్యాంక్, ముంబయి.. డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ డిప్యూటీ మేనేజర్లు: 20 పోస్టులు
అర్హత: 60 శాతం మార్కులతో డిగ్రీ, సీఏ, పీజీ (ఎంబీఏ/ పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ ఎంఎంఎస్). **వయసు:** 31.12.2025 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 33 ఏళ్లు; ఓబీసీలకు 31 ఏళ్లు; దివ్యాంగులకు 38 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు రూ.100.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో **దరఖాస్తు గడువు:** 26.01.2026 - 15.02.2026 మధ్య దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: https://www.eximbankindia.in/careers

మార్షల్ ఆర్ట్స్ ఎక్కడ నేర్చుకోవాలి?

బీఏ చదువుతున్నాను. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొందాలనుంది. ఎక్కడ నేర్చుకోవాలి? ఇందులో ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి? – భరత్

మార్షల్ ఆర్ట్స్ అనేవి క్రమబద్ధంగా రూపుదిద్దుకున్న యుద్ధ విద్యా పద్ధతులు. ఇందులో దాడులు చేయడం, దాడులను అడ్డుకోవడం లాంటి విభిన్న నైపుణ్యాలు ఉంటాయి. వీటిని ఖాళీ చేతులతో లేదా ఆయుధాలతో సాధన చేయవచ్చు. ఇవి కేవలం పోరాటానికే పరిమితం కాకుండా సంస్కృతి, తత్వశాస్త్రం, జీవన విలువలనూ ప్రతిబింబిస్తాయి. మార్షల్ ఆర్ట్స్ శారీరక బలం పెంచే విద్య మాత్రమే కాదు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, స్వీయరక్షణ, మానసిక స్థైర్యం లాంటి విలువలను పెంపొందించే జీవన విధానం. చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్‌నూ అభ్యసిస్తే వ్యక్తిత్వ వికాసంతో పాటు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలూ లభిస్తాయి.



◗ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడానికి ముందుగా సరైన శిక్షణ కేంద్రాన్ని ఎంచుకోవడం అవసరం. ప్రస్తుతం ప్రతి పెద్ద పట్టణంలోనూ కరాటే, తైక్వాండో, జూడో, కుంగ్‌ఫూ, కిక్‌బాక్సింగ్.. లాంటివి నేర్పడానికి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఎ) అకాడమీలు అందుబాటులో ఉన్నాయి. అనుభవజ్ఞులైన కోచ్‌లు, గుర్తింపు పొందిన ఫెడరేషన్లకు అనుబంధంగా ఉన్న అకాడమీలను ఎంచుకోవడం మంచిది. ప్రారంభ దశలో ట్రయల్ క్లాసులు తీసుకొని, శిక్షణ నాణ్యతను అర్థం చేసుకున్న తర్వాత వాటిలో చేరడం ఉత్తమం. కొన్ని ప్రభుత్వ క్రీడా సంస్థలు, రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ అకాడమీలూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన శిక్షణను అందిస్తున్నాయి.

◗ శిక్షణ ప్రారంభించిన తర్వాత క్రమబద్ధమైన అభ్యాసం ఎంతో ముఖ్యం. మొదట ప్రాథమికాంశాల నుంచి ప్రారంభమై, క్రమంగా అడ్వాన్స్‌డ్ స్థాయికి చేరుకోవాలి. బెల్ట్ సిస్టమ్ ద్వారా మీ నైపుణ్య స్థాయిని అంచనా వేస్తారు. శారీరక దృఢత్వం, వేగం పెంచుకునేందుకు రోజువారీ వ్యాయామాలు, స్ట్రెచింగ్, డైట్‌లపై శ్రద్ధ పెట్టాలి. పోటీల్లో పాల్గొనడం ద్వారా అనుభవం పెరిగి, మీ ప్రతిభను గుర్తింపుగా మార్చుకోవచ్చు.

◗ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం పొంది, కొంత అనుభవంతో మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా అకాడమీలు, పాఠశాలలు, కాలేజీల్లో శిక్షణ ఇవ్వవచ్చు. స్వీయరక్షణ శిక్షణకర్తగా మహిళలకు, పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించే అవకాశం కూడా ఉంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తే స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలూ పొందవచ్చు.

◗ భద్రతా రంగంలోనూ మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలకు మంచి డిమాండ్ ఉంది. ప్రైవేట్ సెక్యూరిటీ ట్రెయినర్, బాడీ గార్డ్, పోలీస్ లేదా ఇతర రక్షణ సేవలకు శిక్షణ ఇచ్చే రంగాల్లో అవకాశాలు ఉన్నాయి. ఫిట్‌నెస్ రంగంలో పర్సనల్ ట్రెయినర్‌గా మార్షల్ ఆర్ట్స్ ఆధారిత తరగతులు నిర్వహిస్తూ ఆదాయం పొందవచ్చు. ఆన్‌లైన్ క్లాసులు, సోషల్ మీడియా ద్వారా నైపుణ్యాన్ని ఉపయోగించి కెరియర్ నిర్మించుకోవచ్చు.

బీఏతో పాటు మార్షల్ ఆర్ట్స్ అభ్యసించడం వల్ల మీ విద్యకు అదనపు విలువ చేకూరుతుంది. భవిష్యత్తులో ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ సైకాలజీ లాంటి కోర్సులు చేయడం ద్వారా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. ముఖ్యంగా పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే మార్షల్ ఆర్ట్స్ రంగంలో రాణించడం సాధ్యమే!

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వర్క్ ఫ్రమ్ హోమ్

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: డిజైన్ టాక్ నైపుణ్యం: కేన్వా
స్టైపెండ్: రూ.9,000
☛ https://tinyurl.com/3azxfstn

ఈకామ్ వెబ్‌సైట్
సంస్థ: ఎంఎస్ హైజీన్ ఇండస్ట్రీస్
నైపుణ్యాలు: ఈకామర్స్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వెబ్ డిజైన్, వెబ్ డెవలప్‌మెంట్ స్టైపెండ్: రూ.7,000-12,000
☛ https://tinyurl.com/kx9nzjys

రిమోట్ సేల్స్
సంస్థ: బిట్‌లాన్స్ టెక్‌హబ్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్ స్కిల్స్
స్టైపెండ్: రూ.12,000-20,000
☛ https://shorturl.at/Vbxk6

కస్టమర్ అక్విజిషన్
సంస్థ: వేల్యూవిస్టా గ్లోబల్
నైపుణ్యాలు: ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ షీట్స్, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.10,000
☛ https://tinyurl.com/y3urzbk9

ఇంటర్న్‌షిప్స్

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: ఇవాన్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.5,000-8,000
☛ https://tinyurl.com/6wraxf7a

ఈ-కామర్స్ క్యాటలాగ్ మేనేజ్‌మెంట్
సంస్థ: ఏఎన్ అసోసియేట్స్
నైపుణ్యాలు: కేన్వా, షోపిఫై స్టైపెండ్: రూ.16,667
☛ https://tinyurl.com/4yf9xtvp

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: గ్రోటో నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.15,000-30,000
☛ https://tinyurl.com/384jx3ev

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: ద రెడ్‌హనీ గ్రూప్
నైపుణ్యం: ఫేస్‌బుక్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000
☛ https://tinyurl.com/p8zp4arz

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: అచీవర్స్ డెస్టినేషన్ అకాడమీ
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ స్టైపెండ్: రూ.4,000-5,000
☛ https://tinyurl.com/3ddyp28w

క్రియేటివ్ డిజైన్
సంస్థ: హాలిడిఫి నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, కేన్వా స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://tinyurl.com/8us9p3v6

విక్స్ ప్లాట్‌ఫామ్ డెవలపర్
సంస్థ: సెఖన్ హోమ్ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యం: విక్స్ స్టైపెండ్: రూ.1,500-2,000
☛ https://tinyurl.com/4j92ca4j

వీటికి దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 13

వర్డ్‌ప్రెస్ డెవలప్‌మెంట్
సంస్థ: ఈజీ ఇన్‌టీరియో
నైపుణ్యాలు: సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పీహెచ్‌పీ, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వర్డ్‌ప్రెస్
స్టైపెండ్: రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
☛ https://tinyurl.com/2fevsv3z

అప్రెంటిస్‌షిప్

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్), హైదరాబాద్.. 2026-27 సంవత్సరానికి ఏడాది కాలానికి అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.
◗ ఐటీఐ అప్రెంటిస్
ట్రేడులు: ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, మెషినిస్ట్ (గ్రైండర్), కార్పెంటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ కెమికల్ ప్లాంట్, పెయింటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫౌండ్రీ మ్యాన్.
అర్హతలు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను నేరుగా లేదా డైరెక్టర్, డీఆర్‌డీఎల్, కంచన్‌బాగ్, హైదరాబాద్ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టులో పంపాలి.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 29.01.2026.
వెబ్‌సైట్: https://drdo.gov.in/drdo/en/offerings/vacancies

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి.

అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు. మా చిరునామా: చదువు ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512 edc@eenadu.in

ప్రసార భారతిలో ఎగ్జిక్యూటివ్‌లు



ప్రసార భారతి ఒప్పంద ప్రాతిపదికన రెండేళ్లకు 14 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీచేయనుంది. ఎంబీఏతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

విద్యార్హతలతోపాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాంతీయ భాషా పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. బృందంతో కలిసి పనిచేస్తూ.. నిర్దేశిత లక్ష్యాలను సాధించే నైపుణ్యం ఉండాలి. ముందుగా రెండేళ్లకు నియమించినప్పటికీ సంస్థ అవసరాలు, వ్యక్తిగత పనితీరును బట్టి పొడిగించే అవకాశం ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను విద్యార్హతలు, అనుభవంతో షార్ట్‌లిస్ట్ చేసి రాత పరీక్ష, ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ సమాచారాన్ని ఈమెయిల్‌కు తెలియజేస్తారు.

ఎంపికైనవారు ముంబయి, కోల్‌కతా, భువనేశ్వర్, కటక్, పట్నా, హైదరాబాద్, భోపాల్, రాంచీ, రాయ్‌పుర్, చెన్నై, తిరువనంతపురం, విజయవాడల్లో ఎక్కడ నుంచైనా సేవలందించాలి. సంస్థ తరపున వివిధ ఎగ్జిబిషన్లు, సమావేశాల్లో పాల్గొనడం, సేల్స్, ఫైనాన్షియల్ డేటాతో రిపోర్టులు తయారుచేయడం, క్లయింట్లతో సమావేశాలు నిర్వహించడం, ఆదాయ లక్ష్య సాధనలో బృంద సభ్యులతో కలిసి పనిచేయడం.. లాంటి విధులను నిర్వర్తించాలి.

వివరాలు

అర్హతలు: ఎంబీఏ/ ఎంబీఏ (మార్కెటింగ్)/ మేనేజ్‌మెంట్/ మార్కెటింగ్ పీజీ డిప్లొమా. సంబంధిత రంగంలో ఏడాది ఉద్యోగానుభవం ఉన్నవారికి ప్రాధాన్యం **వయసు:** 07.01.2026 నాటికి 35 సంవత్సరాల్లోపు ఉండాలి. **వేతన శ్రేణి:** నెలకు రూ.35,000-50,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.01.2026 **వెబ్‌సైట్:** https://avedan.prasarbharati.org

నాబార్డ్‌లో సేవలందిస్తారా?

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్).. 162 డెవలప్‌మెంట్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయనుంది. డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమినరీ, మెయిన్ (ఆన్‌లైన్), ప్రొఫిషియన్సీ టెస్టులతో నియామకాలు ఉంటాయి.

ఈ పోస్టులకు ఎంపికైనవారు అన్నీ కలిపి నెలకు రూ.46,500 వేతనం పొందవచ్చు. అనుభవం, అంతర్గత పరీక్షలతో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.

పోస్టు: డెవలప్‌మెంట్ అసిస్టెంట్ **ఖాళీలు:** 159 **అర్హత:** 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ. **ఎంపిక:** ఆన్‌లైన్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలతో. ప్రిలిమినరీ పరీక్షకు 100 మార్కులు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మూడు సెక్షన్లతో ఉంటుంది. సెక్షన్‌కు 20 నిమిషాల చొప్పున వ్యవధి ఇస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్-40 ప్రశ్నలు, న్యూమరికల్ ఎబిలిటీ-30 ప్రశ్నలు, రీజనింగ్ 30 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు.

◆ మెయిన్ పరీక్షకు 200 మార్కులు. ఐదు సెక్షన్ల నుంచి ప్రశ్నలు ఇస్తారు. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌ల నుంచి 30 ప్రశ్నల చొప్పున ఇస్తారు. ఒక్కో సెక్షన్‌కు వ్యవధి 30 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్-50 ప్రశ్నలకు 25 నిమిషాల వ్యవధి. కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలకు 20 నిమిషాలు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (డిస్క్రిప్టివ్) 3 ప్రశ్నలకు 30 నిమిషాల వ్యవధి.

పోస్టు: డెవలప్‌మెంట్ అసిస్టెంట్(హిందీ) **ఖాళీలు:** 3 **అర్హత:** హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో డిగ్రీలో 50 శాతం మార్కులుండాలి. ఇంగ్లిష్ నుంచి హిందీకి, హిందీ నుంచి ఇంగ్లిష్‌కు అనువాదం చేయగలగాలి. కంప్యూటర్ పరిజ్ఞానం కావాలి.

◆ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులు డిగ్రీ పాసైతే సరిపోతుంది.

ఎంపిక: ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్షకు 100 మార్కులు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ (హిందీ/ఇంగ్లిష్) 30 ప్రశ్నలు, రీజనింగ్ 30 ప్రశ్నలు. ప్రతి సెక్షన్‌కూ 20 నిమిషాల చొప్పున వ్యవధి ఉంది.

◆ మెయిన్ పరీక్షకు 200 మార్కులు. రీజనింగ్ 20 ప్రశ్నలు- వ్యవధి 25 నిమిషాలు. ప్రొఫెషనల్ నాలెడ్జ్ 50 ప్రశ్నలు - వ్యవధి 35 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు - వ్యవధి 25 నిమిషాలు. కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు - 20 నిమిషాలు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (డిస్క్రిప్టివ్)-3 ప్రశ్నలు, వ్యవధి 30 నిమిషాలు.

◆ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు.

◆ ప్రిలిమినరీలో కనీసార్హత మార్కులు పొందిన వారిని పోస్టుకు 25 మంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు. మెయిన్‌లో అర్హత పొందినవారికి లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్‌లో పొందిన మార్కులతోనే తుది నియామకాలుంటాయి.



ముఖ్య సమాచారం

వయసు: 01.01.2026 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.550. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.150.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.02.2026
ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 21.02.2026 **మెయిన్ పరీక్ష తేదీ:** 12.04.2026
వెబ్‌సైట్: https://www.nabard.org/careers-notices1.aspx?cid=693&id=26


ఆటలతో రొమ్ము క్యాన్సర్ నివారణ!



దిల్లీ: ఆటల్లో చురుకుగా ఉండే యుక్తవయసు బాలికల రొమ్ముల్లో నీరు అధికంగా చేరదని, వారి రొమ్ము సాంద్రత తక్కువగా ఉండటమే కాక ఒత్తిడి కారణంగా తలెత్తే జీవక్రియ సంబంధ రుగ్మతల సూచికలు తక్కువ స్థాయిలో ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. బాలికల్లో రొమ్ము అభివృద్ధి చెందే యవ్వన దశలో శారీరక శ్రమతో కూడిన కార్యకలాపాల్లో పాల్గొంటే భవిష్యత్తులో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గించవచ్చని బ్రెస్ట్ క్యాన్సర్ రిసెర్చ్ అనే జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయన నివేదిక తెలిపింది. యువతుల్లో శారీరక శ్రమతో కూడిన ఆటపాటలు తగ్గిపోతుండటానికి క్యాన్సర్ అవకాశాలు పెరిగిపోతుండటానికి ఉన్న సంబంధాన్ని ఈ అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. అమెరికాలోనే కాక ప్రపంచం మొత్తంలో పరిస్థితి ఇదేవిధంగా ఉందని పేర్కొంది. "ఆటపాటల్లోని శారీరక శ్రమ రొమ్ము కణజాల నిర్మాణాన్ని నిర్దేశిస్తుందని మా అధ్యయనంలో తేలింది. శరీరంలో కొవ్వు ఏ మేరకు ఉందన్న విషయంతో ప్రమేయం లేకుండా యువతుల్లో జీవక్రియ సంబంధ క్యాన్సర్ కారకాల నియంత్రణకు ఆటపాటలు కారణమవుతాయి" అని యూనివర్సిటీ ఆఫ్ కొలంబియాలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన రెబెకా కెహ్మ్ పేర్కొన్నారు. బాలికలు తీరిక సమయాల్లో ఆటల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా హుషారుగా ఉండటం, జిమ్, డాన్స్ వంటి కార్యకలాపాల్లో పాల్గొనడం రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను తగ్గిస్తుందని అధ్యయనంలో స్పష్టమైంది. ఈ అధ్యయనం కోసం 200 మంది యవ్వన దశలో ఉన్న బాలికలను ఎంచుకొన్నారు. అధ్యయనం నిర్వహించడానికి వారం ముందు ఎన్ని గంటల పాటు వారు ఆటల్లో పాల్గొన్నారన్న సమాచారం సేకరించారు. వారి రక్త, మూత్ర నమూనాలు సేకరించడంతో పాటు రొమ్ము కణజాలాన్ని విశ్లేషించారు. శారీరక శ్రమ అవసరమైన ఆటల్లో వారానికి రెండు గంటలకన్నా ఎక్కువ సమయం పాల్గొన్న బాలికల రొమ్ముల్లో తక్కువ శాతం నీరు ఉన్నట్లు గుర్తించారు.

కశ్మీర్ అగ్గికి ఆజ్యం పోయొద్దు

పోలండ్‌కు స్పష్టం చేసిన భారత్



రాడోస్లావ్ సికోర్ స్కీతో మాట్లాడుతున్న జైశంకర్

దిల్లీ: ఉగ్రవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించాలని, భారత్ పొరుగున ఉన్న పాకిస్థాన్ రేపుతున్న కశ్మీర్ అగ్గికి ఆజ్యం పోయరాదని పోలండ్‌కు భారత్ స్పష్టం చేసింది. సోమవారం దిల్లీలో ఆ దేశ ఉప ప్రధాని, విదేశాంగశాఖ మంత్రి రాడోస్లావ్ సికోర్ స్కీ తనతో సమావేశమైన సందర్భంగా మన విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. గత అక్టోబరులో సికోర్ స్కీ పాకిస్థాన్‌ను సందర్శించి ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో చర్చలు జరిపారు. ఆ తర్వాత విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో కశ్మీర్ సమస్య గురించి ప్రస్తావించారు. దీనిపై అప్పట్లోనే భారత్ నిరసన వ్యక్తం చేసింది. సికోర్ స్కీ ప్రస్తుతం భారత్‌లో 3 రోజుల పర్యటన కోసం వచ్చారు. ఈ సందర్భంగా జైశంకర్ ఈ అంశాన్ని ఆయనతో ప్రస్తావించారు. కశ్మీర్ అగ్గికి పోలండ్ ఆజ్యం పోయకూడదని కోరారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని పురస్కరించుకుని భారత్‌ను పాశ్చాత్య దేశాలు లక్ష్యంగా చేసుకున్నాయని, రష్యా చమురును దిగుమతి చేసుకోరాదంటూ ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. భారత్‌పై ఇలా అన్యాయంగా గురి పెట్టడం సరి కాదని సికోర్ స్కీ అభిప్రాయపడ్డారు. భారత్, పోలండ్‌ల మధ్య వ్యాపార సంబంధాలు వృద్ధి చెందుతున్నాయని, ఆ దేశంలో భారత్ పెట్టిన 300 కోట్ల డాలర్ల పెట్టుబడులు ఉపాధి అవకాశాలను పెంచాయని జైశంకర్ గుర్తు చేశారు.



సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను సన్మానిస్తున్న దిల్లీ బార్ కౌన్సిల్ సభ్యులు

యువ న్యాయవాదులను ప్రోత్సహించాలి

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

దిల్లీ: జిల్లా కోర్టుల్లో పనిచేసే యువ న్యాయవాదులకు ప్రోత్సాహకాలు అందించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం పేర్కొన్నారు. జిల్లా కోర్టులను కింది కోర్టులుగా వ్యవహరించడం సరికాదని సీజేఐ పేర్కొన్నారు. మన స్వతంత్ర న్యాయ వ్యవస్థలో ప్రధానమైన భాగంగా ఈ కోర్టులు అప్పీలు కోర్టుల కన్నా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయని చెప్పారు. "న్యాయం ప్రాథమికంగా అపెల్లేటు కోర్టుల్లో మాత్రమే నివసించదని మనం గుర్తుపెట్టుకోవాలి. నిజమైన న్యాయం అట్టడుగు స్థాయి కోర్టుల్లో నివసిస్తోంది. ఎందుకంటే మన పౌరులు మొదటగా తమ హక్కుల సాధనకు జిల్లా కోర్టులకే వెళ్తారు" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'న్యాయ వినియోగదారుడైన కక్షిదారుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లాంటి జిల్లా కోర్టుల్లో సంతృప్తికరమైన న్యాయం పొందగలిగితే పెద్దాసుపత్రులు, ట్రామా సెంటర్ల వంటి పై కోర్టులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు" అని ఆయన స్పష్టంచేశారు. దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా దిల్లీ బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సీజేఐ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడైన భారత పారాట్రూపర్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్‌వాడ్ జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ సైనికుడు ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఛత్రో బెల్ట్‌లోని మాండ్రల్-సింగ్‌పొరాలో ఉన్న సోనార్ గ్రామంలో పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు నిఘావర్గాల ద్వారా సైన్యానికి సమాచారం అందింది. వెంటనే భద్రతా దళాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రముఠా.. వారి మీదకు గ్రెనేడ్‌ను విసరడంతో పాటు కాల్పులకు దిగింది. కాల్పుల్లో తీవ్రంగా గాయపడి భారత ప్రత్యేక దళం(ఎస్ఎఫ్)కు చెందిన పారాట్రూపర్ హవిల్దార్ గజేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయారు. ముష్కరుల దాడిలో మరో ఎనిమిది మంది సైనికులు గాయపడ్డారు. సోమవారం కూడా ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆ దాడులు మత ప్రేరేపితం కావు: బంగ్లాదేశ్

ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరిగిన దాడులు.. నేరపూరిత దాడులే తప్ప మత ప్రేరేపితం కాదని తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడులను తక్షణం ఆపాలని, వాటిని వ్యక్తిగత వైరాలు, రాజకీయ విభేదాలు, మరి ఇతర కారణాలవల్ల జరుగుతున్న దాడులుగా చిత్రించడం తగదని ఇటీవల భారత ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో సోమవారం బంగ్లాదేశ్ స్పందించింది. మైనారిటీలకు సంబంధించి గతేడాది 645 ఘటనలు చోటుచేసుకున్నట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ కార్యాలయం వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలున్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు వివరించింది. 71లో 50 ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారని, అంతే సంఖ్యలో నిందితులను అరెస్టు చేశారని వెల్లడించింది.

జాతరలో కూలిన భారీ ఊయల

14 మంది విద్యార్థులకు గాయాలు

ఝబువా: మధ్యప్రదేశ్‌లోని ఝబువా జిల్లా కేంద్రంలో జరుగుతున్న మహారాజ్ నో మేళా జాతరలో ఏర్పాటుచేసిన భారీ ఊయల(జెయింట్ స్వింగ్) ఒక్కసారిగా కూలింది. దీంతో అందులో ఉన్న 14 మంది విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో 13 మంది బాలికలు ఉన్నారు. ప్రమాదానికి గురైన పిల్లలను స్థానిక ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా కలెక్టర్ నేహా మీనా తెలిపారు. వారిలో ఇద్దరు బాలికలకు తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.

కేరళలో వృద్ధ దంపతుల హత్య

అల్లుడి అరెస్టు

పాలక్కాడ్: కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధ దంపతులను వారి అల్లుడే కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ దాడిలో వారి మనవడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒట్టపాలంలోని తొట్టక్కర ప్రాంతంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతులను నజీర్(78), అతని భార్య సుహరా(70)గా గుర్తించారు. గాయపడిన నిషాన్(3)ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. వృద్ధ దంపతుల కుమార్తె సుల్ఫి తన భర్త మహమ్మద్ రఫీ మధ్య విభేదాలు తలెత్తడంతో గత కొన్నాళ్లుగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. కుమారుడిని తీసుకెళ్లేందుకు రఫీ పలుమార్లు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతడు వారి ఇంట్లోకి ప్రవేశించి ఆమె తల్లిదండ్రులపై కత్తితో దాడి చేసి అంతమొందించాడు. కుమారుడిని సైతం గాయపరిచాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

'వ్యత్యాసాల జాబితా'లోని ఓటరు పేర్లను

పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించండి

- పశ్చిమ బెంగాల్ వ్యవహారంపై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: ఓటరు జాబితాల సమగ్ర సవరణ (సర్) కసరత్తును పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బంది కలగనివ్వరాదని ఎన్నికల సంఘాని(ఈసీ)కి సుప్రీంకోర్టు సూచించింది. 2002 ఓటరు జాబితాలోని వ్యక్తులతో వారి సంతానం వివరాలను అనుసంధానించే క్రమంలో తల్లిదండ్రుల పేర్లు, వయసులో వ్యత్యాసాల కారణంతో రూపొందించిన జాబితాలోని వారి పేర్లను పంచాయతీ, బ్లాకు కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించింది. నోటీసులు అందుకున్న వారు ఈ కార్యాలయాల్లో సంబంధిత పత్రాలను అందజేయటంతో పాటు అభ్యంతరాలు తెలియజేయడానికి అక్కడ అధికారులను నియమించాలని స్పష్టం చేసింది. ఇందుకు అవసరమైన మానవ వనరులను ఈసీకి అందుబాటులో ఉంచాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి సూచించింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని డీజీపీని కోరింది. రాష్ట్రంలో 1.25 కోట్ల మంది ఓటర్ల పేర్లను 'తార్కిక వ్యత్యాసాల' జాబితాలో చేర్చిన నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సోమవారం ఈ ఆదేశాలిచ్చింది. తల్లికి బిడ్డకు 15ఏళ్లలోపు వయసు వ్యత్యాసం ఉండడంపైనా ఈసీ అభ్యంతరం తెలపడాన్ని విచారణ సందర్భంగా ప్రశ్నించింది. దేశంలో బాల్యవివాహాలు జరగడంలేదని ఈసీ భావిస్తున్నట్లుగా ఉందని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి పేర్కొన్నారు. నోబెల్ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ అమర్త్యసేన్‌కు, ప్రస్తుత ఎంపీలకు ఈసీ నోటీసులు పంపించిన విషయం కూడా విచారణ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది.

దేశాన్ని మార్చాలనుకుంటున్నారా?

న్యాయ సంస్కరణల పిటిషనర్‌పై సీజేఐ ఆగ్రహం

ప్రతి కోర్టులోనూ ఏడాదిలోగా కేసులు పరిష్కరించేలా ఆదేశాలివ్వాలని, దేశంలో సమూలమైన న్యాయ సంస్కరణలనూ తీసుకురావాలని కోరుతూ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'న్యాయసంస్కరణల అంశమైతే.. దానికోసం మేం ఎవరినీ కోర్టు వరకు రానివ్వం. మీరు ఈ దేశాన్ని మార్చాలని అనుకుంటున్నారా? అందుకోసం పిటిషన్ వేయాల్సిన అవసరం లేదు. ఒక లేఖ రాసి పంపండి. మీ సలహాలు ఏవైనా సరే రాసివ్వండి. అవి సాధ్యమో, కాదో మేం పరిశీలిస్తాం. బయట నిలబడి కెమెరా ముందు మాట్లాడటానికి పిటిషన్లు వేయొద్దు' అని మండిపడ్డారు. 'న్యాయస్థానాల్లో దాఖలయ్యే వాజ్యాలపై 12 నెలల్లోగా తీర్పులు వెలువడాలని మీరు కోరుతున్నారు. మీకు అలాంటి కోర్టులు ఎన్ని కావాలి? అవి ఎక్కడి నుంచి వస్తాయి' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చితో కూడిన ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది.

హైవేల సమీపంలో మద్యం దుకాణాలు..

రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే

దిల్లీ: రోడ్డు ప్రమాదాల తీవ్రత దృష్ట్యా.. రాజస్థాన్‌లో జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్లలోపు దూరంలోని మద్యం దుకాణాలను తొలగించాలని ఆ రాష్ట్ర హైకోర్టు గత నవంబరులో వెలువరించిన తీర్పుపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. మద్యం విక్రేతలు, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అభ్యర్థనకు స్పందిస్తూ ఈ ఉత్తర్వులు వెలువరించింది. హైకోర్టు వ్యక్తీకరించిన ఆందోళన న్యాయమైనదని, మద్యం విధానాన్ని రూపొందించే సమయంలో ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. రాజస్థాన్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. మద్యం దుకాణాలు హైవేలకు 500 మీటర్ల లోపు ఉండరాదని గతంలో సుప్రీంకోర్టు కూడా ఆదేశించిందని, ఆ హైవేలు నగరాల మధ్యనుంచి వెళ్లిన సందర్భాల్లో ఆదేశాల అమలు కష్టసాధ్యంగా మారిందని ఆయన చెప్పారు. ఆదేశాన్ని తదనంతరం సవరించి మున్సిపల్ పరిధిలో ఈ నిషేధం వర్తించదని స్పష్టంచేసినట్లు గుర్తుచేశారు. కక్షిదారుల వాదనలు వినకుండా ఆదేశాలు జారీ చేయడం ద్వారా హైకోర్టు పొరబడిందని మద్యం విక్రేతల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అన్నారు. సుజన్‌గఢ్ అనే ఒక గ్రామానికి సంబంధించిన కేసును విచారిస్తూ హైకోర్టు- రాష్ట్రం మొత్తానికి వర్తించే ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు.

ఇల్లులేని మానసిక రోగులు నిర్భాగ్యులు

- వారి పునరావాసానికి పద్ధతులేమిటో చెప్పండి
- కేంద్రానికి సుప్రీం ఆదేశం

దిల్లీ: మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఇల్లులేని నిరుపేదలను సుప్రీంకోర్టు సోమవారం అత్యంత నిర్భాగ్యులుగా, అతి దుర్బలులుగా అభివర్ణించింది. అలాంటి వారి పునరావాసానికి అనుసరించే ప్రామాణిక పద్ధతులను వివరించేందుకు ఇదే చివరి అవకాశమని కేంద్ర ప్రభుత్వానికి కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణను వచ్చే నెల 9కి వాయిదా వేసింది. దీనిపై సమాధానం చెప్పేందుకు కొంత సమయం కావాలని కేంద్రం తరఫు న్యాయవాది పేర్కొనడంతో కోర్టు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.



ఉత్తరాదిన ఏకైక రాహు మందిరం

ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ జిల్లా అత్యంత ప్రముఖులను ప్రసిద్ధి చెందింది. ఇక్కడి నుంచి అత్యున్నత స్థాయి అధికారులు, ప్రముఖ నేతలు వచ్చారు. అంతేకాదు.. ఆలయాలకూ ఇది ప్రసిద్ధి చెందింది. ఈ జిల్లాలో తారకేశ్వర్ మహాదేవ్, శ్రీ కోటేశ్వర మహాదేవ్, మా ధారి దేవి, నీలకంఠ మహాదేవ్, బిన్సర్ మహాదేవ్, మా జ్వాల్పా దేవి, నాగ్‌దేవ్, క్యూంకాళేశ్వర్, కండోలియా బాబా, సిద్ధబాలి బాబా ఆలయాలున్నాయి. అయితే థాలిసేన్ ప్రాంతంలో ఉన్న రాహు ఆలయం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ఇది ఉత్తర భారత దేశంలో ఉన్న ఏకైక రాహు ఆలయమని చెబుతున్నారు. ఇక్కడ రాహు దోష పూజలు నిర్వహిస్తున్నారు. ఇటీవలే ఈ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఈ ఆలయాన్ని ఆది శంకరాచార్య నిర్మించినట్లు తెలుస్తోంది.

స్వచ్ఛ జోధ్‌పూర్‌లో ఐర్లాండ్ వాసి



రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ మహామందిర్‌లో ఉన్న మెట్ల బావి శుద్ధీకరణకు స్థానిక యువతతో కలిసి ఐర్లాండ్ వాసి కరోన్ రాన్‌స్లే నడుం కట్టారు. 77 ఏళ్ల వయసులో ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వారు తొలుత మెట్ల బావిని శుద్ధి చేసి.. ఆ తర్వాత నగరంలోని పురాతన ప్రాంతాల్లో శుద్ధీకరణ చేపట్టనున్నారు. గత 8 ఏళ్లుగా కరోన్.. మెట్ల బావులను శుద్ధి చేసే పనుల్లో భాగస్వామి అవుతున్నారు. ఇప్పటిదాకా ఆయన 8 బావులను శుద్ధి చేశారు. ఆయన కుటుంబం లండన్‌లో నివసిస్తోంది.



అరుదైన ఆధ్యాత్మిక వివాహం

ఛత్తీస్‌గఢ్‌లో ఓ జంట శ్రీకృష్ణుడి సాక్షిగా ఒక్కటైంది. ధంతరీలో ఈ అరుదైన వివాహం జరిగింది. పట్టణంలోని జాలంపుర్ వార్డులో స్థానికుల ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞ సప్తాహం ఇటీవల నిర్వహించారు. ఆ కథను ఆ ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ కథకురాలు దేవి భూమిక వినిపించారు. కథ ఆరో రోజున రుక్మిణీ కల్యాణ ప్రసంగం జరుగుతున్న సమయంలో.. ఆ ఘట్టాన్ని మరింత విశిష్టంగా మార్చేందుకు కథా వేదికనే వివాహ మండపంలా అలంకరించారు. ఆ వేదిక మీదే వరుడు ప్రతీక్ దేవాంగన్, వధువు మాధురి దేవాంగన్ వివాహం చేసుకున్నారు. మండపంలో వధూవరులు ఏడడుగులు వేసి, సిందూర దానం పూర్తి చేశారు.

రాష్ట్ర మంత్రి విచారణకు అనుమతిపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోండి

కర్నల్ సోఫియా ఖురేషిపై వ్యాఖ్యల కేసులో మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత సైన్యాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యల కేసులో మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షాను విచారించేందుకు అనుమతివ్వడంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక సమర్పించినందున తదుపరి చర్యల నిమిత్తం మంత్రిపై విచారణకు అనుమతించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చితో కూడిన ధర్మాసనం సోమవారం పేర్కొంది. సైనికాధికారిపై అనుచిత వ్యాఖ్యలకుగాను మంత్రి క్షమాపణలు చెప్పడానికి సమయం మించిపోయిందని తెలిపింది.

బాధ్యతాయుత దేశాల సూచీలో భారత్‌కు 16వ స్థానం

ప్రథమ స్థానంలో సింగపూర్

దిల్లీ: బాధ్యతాయుత దేశాల అంతర్జాతీయ సూచీలో భారత్‌కు 16వ స్థానం లభించింది. సింగపూర్, స్విట్జర్లాండ్, డెన్మార్క్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దిల్లీకి చెందిన వరల్డ్ ఇంటెలెక్చువల్ ఫౌండేషన్ (డబ్ల్యూఐఎఫ్) రూపొందించిన ఈ సూచీని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సోమవారం ఆవిష్కరించారు. జాబితాలో పాకిస్థాన్ 99వ స్థానంలో నిలిచింది. అమెరికా, చైనాలకు వరుసగా 66, 68 స్థానాలు లభించాయి.

దావోస్‌లో యువ భారతీయుల విజయ గాథలు

దావోస్: ప్రపంచమంతటి నుంచి వచ్చిన హేమాహేమీ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలతో కళకళలాడుతున్న దావోస్‌లో ఇద్దరు భారతీయులు తమ సొంత ప్రయోగాలతో సత్తా చాటుతున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) దావోస్ సదస్సుకు ఆహ్వానించిన 40 మంది యువ ప్రతినిధుల్లో వీరిద్దరూ భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారిలో ఒకరైన ఇషాన్ ప్రతాప్ సింగ్ (22) దిల్లీలో నెలకొల్పిన తన అంతర్జాతీయ సామాజిక అంకుర సంస్థ కోపరేషన్ 17 ద్వారా పౌరులు, అధికారులను ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగస్వాములను చేస్తున్నారు. సామాజిక సమస్యల పరిష్కారానికి పౌర సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ సంస్థలతో కలిసి సింగ్ కృషి చేస్తున్నారు. రెండో ప్రతినిధి దృష్టి మేథీ అస్సాంకు చెందినవారు. శారీరక శ్రమచేసే కూలీలు, కార్మికులకు ఉన్నత నైపుణ్య శిక్షణనిచ్చి.. ఈశాన్య భారత తెగల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యాన్ని విస్తరించడానికి ఆమె సహ వ్యవస్థాపకురాలిగా క్విక్‌షీ అనే క్విక్ కామర్స్ సంస్థను ప్రారంభించారు.

జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా మాటల యుద్ధం

దిల్లీ: విచారణ వేగంగా పూర్తి చేయలేని సందర్భాల్లో నిందితుడికి తప్పనిసరిగా బెయిలు ఇవ్వాలని, బెయిలు అనేది మినహాయింపు కాదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆదివారం జైపుర్ సాహిత్య ఉత్సవంలో వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ విమర్శించింది. 'అలాగైతే మీరు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు దిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖాలిద్ బెయిలు దరఖాస్తుపై విచారణను పది సార్లు ఎందుకు వాయిదా వేసినట్లు' అని కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ సోమవారం ఎక్స్‌లో నిలదీశారు. అప్పట్లో ఆయన ఖాలిద్ దరఖాస్తుపై ఎటూ తేల్చకుండా జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనానికి బదిలీ చేశారని, అక్కడ దానికి ఏ గతి పడుతోందో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. దీనిపై భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విరుచుకుపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం షర్జీల్-ఉమర్ బచావ్ గ్యాంగ్ పని మొదలు పెట్టిందని విమర్శించారు. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ బేలా త్రివేదిల మీద కాంగ్రెస్ నోరు పారేసుకుంటోందని, వారి నిజాయతీని శంకిస్తోందని ఎక్స్‌లో విరుచుకుపడ్డారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ద్వేషిస్తోందని, ఉగ్రవాదులను ప్రేమిస్తోందని, నక్సలైట్ల కోసం, అఫ్జల్ యాకూబ్ కోసం కన్నీరు పెడుతోందని విమర్శించారు.

ప్రజా విశ్వాసాన్ని బలోపేతం చేయాలి

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపు

లఖ్‌నవూ: శాసన నిర్మాణ వేదికలపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం నొక్కిచెప్పారు. ఈ వేదికల్ని మరింత విశ్వసనీయమైనవిగా, జవాబుదారీతనం కలిగినవిగా తీర్చిదిద్దే బాధ్యత సభాపతులపైన, ప్రజా ప్రతినిధులపైన ఉందని ఆయన అన్నారు. ప్రత్యక్ష ప్రసారాలు, డిజిటీకరణల సాయంతో సభా కార్యకలాపాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే అవకాశం వచ్చినా ఇంకా అనేక సవాళ్లను పరిష్కరించాల్సి ఉందని ఆయన 86వ అఖిల భారత సభాపతుల సమ్మేళనంలో ప్రసంగిస్తూ అన్నారు. "మనందరం భిన్న రాజకీయ పార్టీలకు చెందినవాళ్లం. మన భావజాలాలు కూడా విభిన్నమైనవే. అయితే మనల్ని ఎన్నుకున్న ప్రజలు మాత్రం వారి సమస్యలపై మనం సభలో మాట్లాడతామని ఆశిస్తారు" అని ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంలో జరిగే చర్చల సాయంతో సభాపతులు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని మరింత జవాబుదారీతనం కలిగిన వేదికలుగా తీర్చిదిద్దుతారని, ఫలప్రదమైనవిగా మారుస్తారని ఆశిస్తున్నా అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి తన శుభాకాంక్షలు తెలియజేశారు.



వివిధ రాష్ట్రాల సభాపతులు, ఉపసభాపతులు, మండలి ఛైర్మన్లతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా



రష్యాలోని కమ్‌చట్కా రీజియన్‌లో తీవ్రమైన హిమపాతం కారణంగా ఓ అపార్ట్‌మెంట్ ముందు దిబ్బలా పేరుకుపోయిన మంచు

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

బొకారో: ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో ఏనుగు దాడి చేయడంతో రవీంద్ర దానీ అనే ఓ కూరగాయల వ్యాపారి ప్రాణాలు కోల్పోయాడు. మహువాదాండ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిమ్రబెడా మహతో తోలా సమీపంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రామ్‌గఢ్‌లోని మురుమ్మాలాకు చెందిన రవీంద్ర చీకటి పడుతున్న సమయంలో అటవీ మార్గం మీదుగా కారులో ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతను ప్రయాణిస్తున్న కారు హెడ్‌లైట్లు పనిచేయక బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుంచి రవీంద్ర బయటపడ్డాడు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ ఏనుగు అతడిపై దాడి చేసింది. స్థానికులు హెచ్చరించినప్పటికీ అతను వినకుండా ఆ మార్గంలో ప్రయాణించినట్లు డివిజనల్ అటవీ అధికారి సందీప్ తెలిపారు. ఇదిలా ఉంటే.. రవీంద్ర కుటుంబానికి ఝార్ఖండ్ ప్రభుత్వం 4 లక్షల పరిహారం ప్రకటించింది.

ఆమె వల్ల కుటుంబ బంధాలు ధ్వంసం

- భార్య అపర్ణా యాదవ్‌పై ములాయం చిన్నకుమారుడు ప్రతీక్ విమర్శలు
- విడాకులు తీసుకుంటానని వెల్లడి



లఖ్‌నవూ: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, ఆయన రెండో భార్య సాధన కుమారుడు ప్రతీక్, కోడలు అపర్ణా యాదవ్ మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. అపర్ణ వల్ల తమ కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు దెబ్బతిన్నాయంటూ ప్రతీక్ తీవ్ర ఆరోపణలు సంధించారు. కీర్తి, పరపతి సాధించాలనే వ్యక్తిగత స్వార్థంతో తమ కుటుంబాన్ని ఆమె ధ్వంసం చేశారంటూ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. 2017లో లఖ్‌నవూ కంటోన్మెంట్ స్థానం నుంచి సమాజ్‌వాదీ తరఫున ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన ఆమె ఓడిపోయారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున ప్రచారం చేసిన అపర్ణా యాదవ్ ప్రస్తుతం ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. స్వార్థపరురాలైన అపర్ణా యాదవ్‌తో విడాకులు తీసుకోనున్నట్లు ప్రతీక్ యాదవ్ మరో పోస్టులో పేర్కొన్నారు. ఈ బంధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. అపర్ణా యాదవ్ వ్యక్తిగత సహాయకుడు హిమాన్షు వ్యాఖ్యలతో ఈ వివాదం కీలక మలుపు తిరిగింది. ఆయన 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ... 'ప్రతీక్ యాదవ్ అకౌంట్ హ్యాక్ అయ్యింది. ఎవరో దుండగులు కావాలనే తప్పుడు పోస్టులు పెట్టారు. భార్యాభర్తల మధ్య అలాంటి గొడవలేమీ లేవు' అని ఆయన వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై అపర్ణా యాదవ్ స్పందన కోసం ప్రయత్నించగా ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తోంది. ఆమె సన్నిహితులు, సహచరులు కూడా ఈ విషయంపై మాట్లాడేందుకు నిరాకరించారు.

కాబుల్‌లో పేలుడు.. ఏడుగురి మృతి

కాబుల్: అఫ్గానిస్థాన్ రాజధాని కాబుల్‌లో సోమవారం జరిగిన పేలుడులో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. 13 మందికి గాయాలయ్యాయి. విదేశీయులు అధికంగా ఉండే షహర్-ఎ-నా ప్రాంతంలోని ఓ రెస్టారెంట్ దగ్గర ఈ పేలుడు సంభవించింది. దాడికి ఏ ఉగ్రవాద సంస్థ కూడా బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటన చేయలేదు.



జ్యూరిక్‌లో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మతో సమావేశమైన సీఎం చంద్రబాబు

అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మకు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు అస్సాం నుంచి హాజరవుతున్న తొలి ముఖ్యమంత్రిగా నిలిచారంటూ హిమంత బిశ్వశర్మను చంద్రబాబు 'ఎక్స్' వేదికగా అభినందించారు. ప్రపంచ వేదికపై అస్సాంకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా శర్మ చరిత్ర సృష్టించారని కొనియాడారు. పెట్టుబడుల సాధనలో ఆయన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

యోగివేమన నీతిసూత్రాలు అనుసరణీయం: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కులమత భేదాలు, మూఢ నమ్మకాల్ని పారదోలేందుకు యోగివేమన తన పద్యాల ద్వారా చేసిన కృషి నేటి సమాజానికి ఎంతో ఉపయుక్తమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజాకవి, సామాజిక సంస్కర్త యోగి వేమన జయంతిని పురస్కరించుకుని 'ఎక్స్' వేదికగా చంద్రబాబు నివాళులు అర్పించారు.

వేమన పద్యాలు జీవిత సత్యాలు

మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: 'యోగి వేమన పద్యాలు కేవలం పద్యాలు మాత్రమే కాదు.. అవి జీవిత సత్యాలు.. మనిషి ఆత్మ పరిశీలనకు, జీవన ప్రయాణానికి ఆ పద్యాలు వెలుగు రేఖలు' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. మనిషి మారితేనే సమాజం మారుతుందని శతాబ్దాల క్రితమే చెప్పిన మహనీయుడు వేమన.. ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నట్లు' సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

చేనేతలకు రూ.1.67 కోట్ల త్రిఫ్ట్ నిధులు విడుదల


ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 133 చేనేత సహకార సంఘాలకు 2025-26 సంవత్సరానికి సంబంధించి రూ.1.67 కోట్ల త్రిఫ్ట్ నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర బీసీ, చేనేత, జౌళిశాఖల మంత్రి సవిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిద్వారా 5,726 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. సంక్రాంతి ముందు, ఆ తర్వాత రూ.7.42 కోట్ల ఆప్కో బకాయిలు చెల్లించామని మంత్రి వివరించారు. రెండు నెలల వ్యవధిలో నేతన్నలకు రూ.9 కోట్లకు పైగా నిధులు అందజేశామని తెలిపారు.

హాస్టళ్లలో వసతులు మెరుగవ్వాలి: సీఎస్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితులు ఇంకా మెరుగుపడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచించారు. సచివాలయంలో సోమవారం ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎస్ మాట్లాడారు. "వసతి గృహాల్లో మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారం అందించాలి. అందులో రాజీపడే ప్రసక్తే లేదు. పారిశుద్ధ్యం, తాగునీటి వసతులు మెరుగవ్వాలి. ప్రజల సంతృప్తి స్థాయి తగ్గకుండా ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలును అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలి" అని పేర్కొన్నారు.

తల్లి బెదిరింపు.. బాలుడి ఊపిరి తీసింది!

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం కడుపుకోత మిగుల్చుతుందని ఆ తల్లి ఊహించలేదు. భర్తను బెదిరిద్దామనుకుని ఆమె శీతలపానీయంలో ఎలుకల మందు కలిపి పెట్టగా, అభం శుభం తెలియని ఐదేళ్ల బాలుడు అది తాగి మృతి చెందిన హృదయవిదారక ఘటన ఇది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం రెండో పట్టణ ఎస్సై కె.రామారావు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లా పల్లెపల్లికి చెందిన మస్తాన్ వెంకట సుబ్బారావు భీమవరంలోని ఓ కర్మాగారంలో పనిచేస్తూ బలుసుమూడిలో నివాసం ఉంటున్నారు. అతడికి భార్య లక్ష్మి, ఐదేళ్ల, ఏడాదిన్నర వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 16న సాయంత్రం ఇంటికి త్వరగా రావాలని లక్ష్మి భర్తను కోరింది. పని ఉండటంతో అతడు ఆలస్యంగా రాగా.. కోపంతో లక్ష్మి శీతల పానీయంలో ఎలుకల మందు కలిపి కొద్దిగా తాగి మిగిలినది పక్కన పెట్టింది. దీనిలో ఉన్నది ఎలుకలమందని తెలియని ఐదేళ్ల కొడుకు రుద్రకాంత్ దానిని తాగేశాడు. అతడు వాంతులు చేసుకోవటం చూసి సుబ్బారావు ప్రశ్నించడంతో లక్ష్మి జరిగిన విషయాన్ని చెప్పింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ 18న చనిపోయాడు.



ఈ సంకేతాలు మీలో కనిపిస్తున్నాయంటే..

వృద్ధాప్యంలోనూ మీరు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయని కొన్ని సంకేతాల ద్వారా ఇప్పుడే చెప్పొచ్చు. అవేంటంటే..

- మీరు ధూమపానం చేయకపోవడం
- పౌష్టికాహారం తీసుకోవడం
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం
- మద్యం అసలే తాగకపోవడం లేదా చాలా పరిమితంగా తీసుకోవడం
- నిరంతరం కొత్తవి నేర్చుకుంటూ ఉండటం, జిజ్ఞాస కలిగి ఉండటం
- బాధను అధిగమించేలాగో నేర్చుకుంటూ ఉండటం
- ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు చూపడం

– ఆర్థర్ బ్రూక్స్, రచయిత

అక్కడ అన్నింటికీ ఆధారం ఈఐడీ

- స్మార్ట్ దేశంగా అవతరించే దిశగా లిక్టన్‌స్టైన్ అడుగులు
- ఆరోగ్య దస్త్రాలు, డ్రైవింగ్ లైసెన్సులూ డిజిటల్ రూపంలోనే



ఈనాడు, అమరావతి: లిక్టన్‌స్టైన్.. యూరోప్‌లోని చిన్న దేశాల్లో ఒకటి.. అక్కడంతా డిజిటల్ పాలనే సాగుతోంది. కృత్రిమ మేధను సమర్థంగా వినియోగించుకుంటోంది. 2030 నాటికి ఎస్టోనియా దేశాన్ని వెనక్కి నెట్టి.. స్మార్ట్ కంట్రీగా అవతరించాలనేది లక్ష్యం. ఈ దేశ జనాభా 40 వేల లోపే. విస్తీర్ణం 160 చదరపు కిలోమీటర్లు. కానీ, తలసరి జీడీపీలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది. స్విట్జర్లాండ్, ఆస్ట్రియా సరిహద్దులుగా ఉండే ఈ దేశంలో అధికార భాష జర్మన్ కాగా, కరెన్సీ స్విస్ ఫ్రాంక్ (సీహెచ్‌ఎఫ్).. చిన్నదేశం కావడంతో మార్పుల్ని త్వరితగతిన అందిపుచ్చుకుంటోంది. కొత్త సాంకేతికతల్ని ప్రయోగాత్మకంగా పరీక్షించి, వేగంగా అమలు చేయగలుగుతోంది. ఏఐలో ఈ దేశ పురోగతి ఆసక్తికరంగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొనడంతో అందరి దృష్టిని ఆకర్షించింది.

ఎలక్ట్రానిక్ ఐడీ ద్వారా..

◆ లిక్టన్‌స్టైన్‌లో ప్రతి ప్రభుత్వ సేవలోనూ కృత్రిమ మేధ ఉపయోగించడం ద్వారా పనిని వేగవంతం చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. దీనికి 2011 నాటి ఈ-గవర్నమెంట్ చట్టం పునాది వేసింది.

◆ 2020 నుంచి ఈఐడీ (ఎలక్ట్రానిక్ గుర్తింపు) విధానం తెచ్చారు. ఇది ఒక నంబరు మాత్రమే కాదు. స్మార్ట్‌కార్డ్‌గా, యాప్ రూపంలోనూ ఉంటుంది. మీరు ఏదైనా వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయితే ఈఐడీ ద్వారా మాత్రమే గుర్తింపబడతారు. కలంతో పత్రాలపై సంతకాలు చేయాల్సిన పనిలేదు. డిజిటల్ సంతకం చేయొచ్చు. దీనికి రహస్య పిన్, పేస్‌లాక్, వేలిముద్ర తదితరాలు ఉపయోగించాలి. పలు రకాల ఫిజికల్ కార్డుల అవసరం లేదు.

◆ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. పన్నుల చెల్లింపు నుంచి లైసెన్స్‌లకు దరఖాస్తు వరకు ఇంటి నుంచే చేసేయొచ్చు. మీరు వాటిని పంపిన సమయంలో ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది. అంటే ఇతరులు ఎవరైనా చూసినా.. అందులోని సమాచారం అర్థం కాని కోడ్ భాషలోకి మారుతుంది. ప్రభుత్వం మాత్రమే డీకోడ్ చేస్తుంది. దీని ద్వారా జరిగే లావాదేవీల్ని హ్యాక్ చేయడం కష్టమే.

◆ 2023 నుంచి ఎలక్ట్రానిక్ హెల్త్ డోసియర్ (ఆరోగ్య రికార్డులు) ప్రారంభమయ్యాయి. 2021 నుంచి ప్రభుత్వ సేవల పోర్టల్, 2022లో ఎలక్ట్రానిక్ డ్రైవింగ్ లైసెన్సులు ప్రారంభించారు. డిజిటల్‌గా భవన నిర్మాణ అనుమతులూ పొందవచ్చు. ఆరోగ్య రికార్డులు కూడా సురక్షితంగా యాక్సెస్ చేసుకోవచ్చు.

◆ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు. వాణిజ్య రిజిస్టర్లు కూడా డిజిటలైజ్ చేశారు. హ్యాకింగ్, సైబర్ రక్షణలో భాగంగా 24 గంటలూ పనిచేసే సైబర్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సర్వీసు ఉపయోగిస్తున్నారు.

◆ డిజిటల్ రోడ్ మ్యాప్‌లో భాగంగా విద్య, సైబర్ సెక్యూరిటీ, పరిశోధన, డిజిటల్ పాలన, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టారు. నైపుణ్యం కలిగిన వారి కొరతను అధిగమించేందుకు డిజిటల్ శిక్షణ ఇస్తున్నారు. ఏఐ, సుస్థిరతను అన్ని రంగాల్లో కీలకం అంశంగా పరిగణిస్తున్నారు.

2030 నాటికి తొలి స్థానం లక్ష్యంగా..

డిజిటల్ పాలనలో రెండు దశాబ్దాలుగా.. ఎస్టోనియా దేశం ప్రపంచానికే మార్గదర్శిగా ఉంది. అక్కడ 99% సేవలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. పెళ్లి, విడాకులు, భూమి కొనుగోలు మినహాయిస్తే మిగిలిన కార్యకలాపాలన్నీ డిజిటల్‌లోనే అందుతున్నాయి. అంతర్జాతీయ డిజిటల్ సూచీల్లోనూ ఇస్టోనియా మొదటి స్థానంలో ఉంటుంది. అలాంటి దేశాన్ని 2030 నాటికి వెనక్కి నెట్టి, తొలి స్థానానికి చేరాలనేది లిక్టన్‌స్టైన్ లక్ష్యం. 2030 నాటికి దీన్ని సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకే పొత్తులు

- 'ఉపాధి' పథకం రద్దుకు కేంద్రం కుట్ర
- సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శి డి.రాజా



ఖమ్మంలో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఈనాడు, ఖమ్మం: మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు కలిసొచ్చే పార్టీలతో పొత్తు కుదుర్చుకుంటామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వామపక్షాల పోరాటాలతో సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాలు 40 శాతం వ్యయం భరించాలని కేంద్రం మెలిక పెట్టిందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఈ పథకం పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని కోరారు. దిల్లీలో వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో బిహార్ ఎన్నికలు- ఫలితాలు, ప్రణాళికాలోపంపై చర్చించారు. త్వరలో పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అస్సాం రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో ఆయా రాష్ట్రాల ప్రతినిధులతో సమాలోచనలు జరిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా జాతీయ కౌన్సిల్‌లో తీర్మానం చేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో జాతీయ కార్యదర్శులు అమర్‌జీత్ కౌర్, గిరీశ్‌శర్మ, అనీరాజా, రామకృష్ణ పాండ, పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, కూనంనేని సాంబశివరావు, జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె.నారాయణ పాల్గొన్నారు.

నేటి సదస్సుకు సీపీఎం సహా పలు పార్టీల నేతలు

'భారతదేశంలో నేటి పరిస్థితులు- వామపక్ష పార్టీల ముందున్న సవాళ్లు' అనే అంశంపై సీపీఐ ఆధ్వర్యంలో ఖమ్మంలో మంగళవారం సదస్సు జరగనుంది. దీనికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్పీ జాతీయ కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవరాజన్, తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నారు.

కేంద్ర కమిటీ సమావేశానికి వెళ్లేందుకే మొగ్గు!

- తెలంగాణ నీటిపారుదలశాఖ నిర్ణయం
- రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఏపీతో చర్చించాలని ప్రభుత్వ సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య జలవనరులకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కేంద్రం ఏర్పాటుచేసిన కమిటీ సమావేశానికి తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు హాజరై చర్చల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిసింది. తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా చర్చలుండాలని రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల శాఖకు సూచించినట్లు సమాచారం. మొదటి సమావేశంలో ఎజెండాలో ఉండాల్సిన అంశాలపై చర్చించాలని, తర్వాతే తదుపరి కార్యాచరణ గురించి ఆలోచిద్దామనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. కమిటీ సమావేశంలో పోలవరం-బనకచర్ల చేర్చడానికి వీల్లేదని ఇప్పటికే కేంద్ర జలశక్తికి లేఖ రాశామని, న్యాయపరంగా వెళ్లే హక్కును కోల్పోమని కూడా ఇప్పటికే స్పష్టం చేసినందున, కమిటీ సమావేశానికి హాజరై మిగిలిన అంశాల గురించి చర్చల్లో పాల్గొనాలనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు ముందు చేపట్టిన ప్రాజెక్టులు, చేసిన కేటాయింపుల గురించి తొలుత చర్చించాలని వీటికి అంగీకరించాకనే పునర్విభజన అనంతరం ప్రతిపాదిత అంశాల గురించి ఆలోచించాలని, దీనివల్ల పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అడ్డంకులు లేకుండా చూసుకోవచ్చని భావిస్తున్నట్లు సంబంధితవర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం రాత్రి మేడారంలో మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత, ఈ అంశంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

స్పష్టమైన వైఖరితో ముందుకు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య జలవనరులకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసిన కమిటీలో ఒక్కో రాష్ట్రం నుంచి నలుగురేసి సభ్యులతో పాటు కృష్ణా, గోదావరి బోర్డు ఛైర్మన్లు, సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజినీర్లు సభ్యులుగా ఉన్నారు. కమిటీ తొలి సమావేశం ఈనెల 30న జరపాలని నిర్ణయించి రాష్ట్రాలకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో కమిటీ సమావేశానికి హాజరై ఎజెండా, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రయోజనాలు లక్ష్యంగా స్పష్టమైన వైఖరితో ముందుకు వెళ్లాలని సీఎం సూచించినట్లు తెలిసింది. చర్చలు జరపడంలో తప్పులేదని ఇటీవల ముఖ్యమంత్రి పేర్కొన్న విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు ముందు గోదావరిలో ఏ రాష్ట్రానికి ఎంత కేటాయింపు అన్నదానిపై అప్పటి ప్రభుత్వం ఓ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1430 టీఎంసీలు ఉండగా, ఇందులో 958 టీఎంసీలు తెలంగాణకు ఉన్నాయని పేర్కొంది. అయితే పునర్విభజన తర్వాత ఏపీ దీనికి అంగీకరించకపోగా, సుమారు 700 టీఎంసీలలోపు తెలంగాణకు ఉన్నట్లు పేర్కొంది. గోదావరి జలాలపై ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని కూడా కోరింది. ప్రస్తుత చర్చల్లో తొలుత 958 టీఎంసీలకు అంగీకరించాలన్నది తెలంగాణ వ్యూహం. కాళేశ్వరం, సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్, కంతనపల్లి ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం ఆమోదం లభించింది. మొదట 958 టీఎంసీలకు ఆమోదిస్తే, తర్వాత గోదావరిలో మిగిలిన నీటి గురించి చర్చల్లోకి వెళ్లాలనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది. నికర, మిగులు జలాలు కలిపి గోదావరిలో సుమారు 1400 టీఎంసీలు తమ అవసరంగా తెలంగాణ పేర్కొంటోంది. మొదటి సమావేశం ఎజెండా ఖరారుకు పరిమితమయ్యే అవకాశం ఉన్నందున గోదావరి-నల్లమల సాగర్ అంశం చర్చకు వచ్చే అవకాశంలేదు. కృష్ణా బేసిన్‌లో పునర్విభజనకు ముందు చేపట్టిన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ సానుకూలంగా వ్యవహరిస్తే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు సమస్య ఉండదని ప్రభుత్వం భావిస్తోందని నీటిపారుదలశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కమిటీ చర్చల వల్ల ట్రైబ్యునల్ ఎదుట వాదనలకు, రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటాకు ఇబ్బంది ఉండదని, మనకు సానుకూలంగా ఉంటేనే ముందుకు వెళ్దామని, ఈ స్పష్టతతోనే కమిటీ సమావేశానికి హాజరుకావాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. మరోవైపు గోదావరి-నల్లమలసాగర్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో సివిల్ సూట్ దాఖలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

క్రెడిట్ కొట్టేయడమే.. జగన్‌కున్న ఏకైక క్రెడిట్

- రెవెన్యూలో సమస్యలు వైకాపా ప్రభుత్వ పాపమే
- మంత్రి ఫరూక్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ధ్వజం

ఈనాడు, అమరావతి: దిగజారుడు రాజకీయాలకు, తప్పుడు ప్రచారాలకు చిరునామాగా వైకాపా మారిందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ ఆరోపించారు. ఇతరుల క్రెడిట్‌ను దొంగిలించడమే.. జగన్‌కు ఉన్న ఏకైక క్రెడిట్ అని ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ దుశ్చర్యలు, అక్రమాల ఫలితంగానే రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు తలెత్తాయి. ప్రతి రెవెన్యూ వివాదమూ గత ప్రభుత్వం చేసిన పాపమే. ఎకరాలో 80 సెంట్లు ఉంచి, 20 సెంట్లు కబ్జా చేశారు. 22ఏ సాకుతో ఆ భూమిని కాజేశారు. దాదాపు 90 శాతం పిటిషన్లు ఇలాంటివే. పాసు పుస్తకాలపై జగన్ ఫొటోలు ముద్రించారు. ప్రజల భూమి ఏమైనా ఆయన జాగీరా?' అని ఫరూక్ నిలదీశారు. వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి లేకపోగా, గనులు, ఇసుక పేరుతో రూ.వేల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. క్రెడిట్ చోరీ అంటున్న జగన్.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ తెచ్చారా? హంద్రీ-నీవాకు నీరిచ్చారా? గుండ్రేవులకు నిధులిచ్చారా? అని ప్రశ్నించారు.

ఈ దారుణాలన్నింటికీ క్రెడిట్ తీసుకుంటారా?

ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం ఏ అభివృద్ధి చేసినా.. వైకాపా నాయకులు తామే చేశామని, క్రెడిట్ చోరీ అంటూ విషప్రచారం చేస్తున్నారు. ఐదేళ్లు అరాచక, విధ్వంస పాలన చేసిన జగన్‌కు ఏం క్రెడిట్ ఇవ్వాలి? ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చినందుకా? జె బ్రాండ్‌తో లక్షల మంది ఆరోగ్యం నాశనం చేసినందుకా? పాసు పుస్తకాలపై సొంత ఫొటోలు వేసుకున్నందుకా? రాయలసీమను కష్టాల్లోకి నెట్టేసినందుకా? 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసినందుకా? అరాచకాలతో ఏపీ బ్రాండ్ చెడగొట్టినందుకా? సొంత బాబాయ్‌ను చంపిన హంతకులను రక్షిస్తున్నందుకా? ఆస్తి కోసం తల్లిని, చెల్లిని తరిమేసినందుకా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. వైకాపా పాలనలో ఏపీ నుంచి పలు కంపెనీలు వెళ్లిపోయాయని, సొంత జిల్లాలో స్టీల్ ప్లాంటు నిర్మించుకోలేని అసమర్థుడు జగన్ అని రవిచంద్ర మండిపడ్డారు.

డైట్ లెక్చరర్ల సీనియారిటీ జాబితా విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని డైట్ కళాశాలల్లో పనిచేస్తున్న సీనియర్ లెక్చరర్ల తుది సీనియారిటీ జాబితాను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. తాత్కాలిక సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలించిన అనంతరం 20 మంది సీనియారిటీ జాబితాను ప్రకటించింది. వీరికి డైట్ ప్రిన్సిపల్, జిల్లా విద్యాధికారుల పోస్టుల భర్తీకి అవకాశం కల్పిస్తారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఓ పోస్టులను అసిస్టెంట్ సీనియారిటీ జాబితాతో అనుసంధానం చేసి, పదోన్నతులు కల్పిస్తారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న డీఈఓ పోస్టులను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

30 ఏళ్లలో 15 సార్లు దావోస్‌కు చంద్రబాబు

- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్‌కుమార్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ది ఒరిజినల్ దావోస్ మేన్ అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1997లో తొలిసారిగా దావోస్ వెళ్లి రాష్ట్రానికి పెట్టుబడులు కోరిన తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు అని గుర్తుచేశారు. గత 30 ఏళ్లలో 15 సార్లు దావోస్‌కు వెళ్లడం ఆయన అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన చొరవ వల్లనే ఐటీ, టెక్నాలజీ రంగంలో రాష్ట్రం గుర్తింపు పొందిందని, ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఏపీపై పడిందన్నారు. దావోస్ అంటే కేవలం ఒప్పందాలు, సంతకాలు మాత్రమే కాదని.. పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచడమని పేర్కొన్నారు. ప్రతి సంక్రాంతి పండగ తర్వాత దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంకు హాజరై రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు తీసుకురావడానికి చంద్రబాబు అలుపెరుగని కృషిచేస్తున్నారని విజయ్‌కుమార్ తెలిపారు. హెచ్‌సీఎల్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఏఎన్ఎస్ఆర్, జోహో, గ్రూప్-ఓ, స్టేట్ స్ట్రీట్ లాంటి ప్రముఖ సంస్థలు చంద్రబాబు ప్రయత్నాల వల్లనే రాష్ట్రానికి వచ్చాయని విజయ్‌కుమార్ గుర్తుచేశారు. 2025 జనవరి తర్వాత దావోస్ పర్యటనలో 20 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారని.. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, ఏఐ, బయోటెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి భవిష్యత్తు పరిశ్రమలపై చంద్రబాబు దృష్టి పెట్టారని తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఖనిజాన్వేషణ విస్తృతంగా చేపట్టాలి

- రాష్ట్రస్థాయిలో ఏజెన్సీలను ఎంపిక చేయండి
- మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఖనిజ నిల్వలు గుర్తించేలా విస్తృతంగా ఖనిజాన్వేషణ చేపట్టాలని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. కొత్త బ్లాక్‌లు అందుబాటులోకి తెచ్చి, లీజులు కేటాయించి, మైనింగ్ ప్రారంభిస్తే.. ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గనులశాఖ పరిధిలో ఉండే ఖనిజాన్వేషణ ట్రస్ట్ (మెరిట్) గవర్నింగ్ బాడీ సమావేశం సోమవారం సచివాలయంలో మంత్రి రవీంద్ర అధ్యక్షతన జరిగింది. కేవలం ఖనిజాన్వేషణకే పరిమితం కాకుండా, క్రిటికల్ మినరల్స్‌కు వాల్యూ యాడ్ (విలువ జోడింపు)పై కూడా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. క్రిటికల్ మినరల్స్‌కు దేశ, విదేశాల్లో బాగా డిమాండ్ ఉందని తెలిపారు. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, సంచాలకుడు చంద్రశేఖర్, జేడీ శ్రీనివాసరావు, డీడీ రవిచంద్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

◆ మెరిట్‌కు సీఈవో నియామకంతో పాటు నాలుగు జియాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాలి.

◆ ఖనిజాన్వేషణ కోసం కేంద్ర గనులశాఖ అర్హత గల నేషనల్ ప్రొఫెషనల్ ఎక్స్‌ప్లొరేషన్ ఏజెన్సీ (ఎన్‌పీఈఏ)లను ఎంపిక చేసినట్లే.. రాష్ట్ర గనుల శాఖ కూడా ఏజెన్సీలను ఎంపిక చేయాలి.

◆ ఏదైనా ఖనిజ బ్లాక్‌లో లీజు ప్రతిపాదన వచ్చినప్పుడు.. అక్కడ ఖనిజాన్వేషణకు టెండర్లు పిలవాల్సిన అవసరం లేకుండా, ముందే ఎంపిక చేసిన ఏజెన్సీలతో ఖనిజాన్వేషణ చేయించి సిద్ధంగా ఉంచాలి.

త్వరలో సాగునీటి సంఘాలతో సీఎం సమావేశం

మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలోని 60 వేల మంది సాగునీటి సంఘాల ప్రతినిధులతో ఈ నెలాఖరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో సమావేశం కానున్నారు. జల భద్రత, నీటి క్యాలెండర్, భూగర్భ జలాల పెంపు వంటి అంశాలపై సీఎం వారికి దిశానిర్దేశం చేస్తారు' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. దీనికి చేపట్టాల్సిన చర్యలు, ఇతర అంశాలపై ఆయన సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'అయిదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి సంఘాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ, సాగునీటి రంగాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు తమ వంతు పాత్ర పోషించాలి. సాగునీటి సంఘాలకు పూర్వ వైభవం కల్పించి, రైతులను వాటిలో భాగస్వాములను చేస్తున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, కడా కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఛార్జీల వసూలు..548 బస్సులపై కేసులు

పది రోజులపాటు కొనసాగిన రవాణాశాఖ తనిఖీలు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి సెలవుల్లో సొంతూళ్లకు వచ్చి, తిరిగి వెళ్లే సమయంలో ప్రైవేటు బస్సుల్లో అధిక ఛార్జీల వసూళ్లపై రవాణాశాఖ మొత్తం 548 కేసులు నమోదు చేసింది. ఈ నెల 9 నుంచి 18 వరకు వరుసగా పది రోజులపాటు అన్ని జిల్లాల్లో రవాణాశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ప్రైవేటు బస్సుల్లో తనిఖీలు జరిపింది. ఇందులో ఆర్టీసీ ఛార్జీ కంటే అదనంగా 50 శాతానికి మించి టికెట్ ధర వసూలు చేసినట్లు తేలడంతో 548 బస్సులపై కేసులు నమోదుచేసి, రూ.55.87 లక్షల జరిమానా విధించింది. అత్యధికంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 87 కేసులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 78, పశ్చిమ గోదావరిలో 65, విశాఖపట్నం జిల్లాలో 54 కేసులు నమోదయ్యాయి.

ఉల్లంఘనలకు పాల్పడిన 1,348 బస్సులపైనా..

ఆయా బస్సులకు సంబంధించిన వివిధ పత్రాలను పరిశీలించినప్పుడు పన్నులు చెల్లించకపోవడం సహా పలు ఉల్లంఘనలను గుర్తించింది. దీంతో 1,348 బస్సులపై కేసులు నమోదు చేసింది. రూ.71.29 లక్షల జరిమానా వేసింది. వీటిలో ఎక్కువగా ఎన్టీఆర్ జిల్లాలో 129 కేసులు, గుంటూరు జిల్లాలో 122, పల్నాడు జిల్లాలో 104, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 94, విశాఖపట్నం జిల్లాలో 85, అనకాపల్లి జిల్లాలో 82, విజయనగరం జిల్లాలో 80 కేసులు నమోదయ్యాయి. వివిధ యాప్‌లు, వెబ్‌సైట్లలో ప్రైవేటు బస్సుల సంస్థలు పేర్కొన్న టికెట్ ఛార్జీలను నిరంతరం పరిశీలించామని, అధిక ఛార్జీలు ఉన్న వాటిపై కేసులు నమోదుచేశామని రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తెలిపారు.

తారుమారైన రికార్డుల ఆధారంగా కొత్త పాస్‌పుస్తకాల జారీపై జోక్యం చేసుకోండి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ డిమాండ్

ఈనాడు, అమరావతి: ప్రస్తుతం కొత్తగా మంజూరు చేస్తున్న పాసుపుస్తకాలు..గతంలో తారుమారైన రికార్డుల ఆధారంగా ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నందున పరిస్థితిని చక్కదిద్దాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. భూ యజమానులు, రైతుల భూమి హక్కులకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వైకాపా ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వే, రెవెన్యూ అవకతవకలపై విచారణ జరపాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే జనతా వారధి కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో రెవెన్యూ సమస్యలే ఎక్కువ వస్తున్నందున.. రాష్ట్రవ్యాప్తంగా భాజపా నేతలు జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వినతిపత్రాలు అందించారని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా శ్రమిస్తోందని మాధవ్ గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్తగా పట్టదారు పాస్‌పుస్తకాల మంజూరు చేయడాన్ని స్వాగతించారు. వైకాపా ప్రభుత్వంలో భూ సర్వే పేరుతో తప్పుడు కొలతలు, సర్వే నంబర్లలో మార్పులు, విస్తీర్ణంలో తేడాలు, ఎల్‌పీఎంలో పొరపాట్లు, టైటిల్ డీడ్, ఆధార్ లింకులో తప్పిదాలతో భూ రికార్డులు తారుమారయ్యాయని ఆరోపించారు. వ్యవసాయ భూములు రీసర్వే చేసి ఏడాది పూర్తయినా ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల భూ క్రయ విక్రయాలు నిలిచిపోయాయని ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని మాధవ్ కోరారు.

పుట్టిన తేదీ తెలిపే రికార్డు లేకపోతే మెడికల్ బోర్డు నుంచి పొందొచ్చు

రాష్ట్ర పింఛనుదారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల కుటుంబ పెన్షనర్లు పుట్టిన తేదీ తెలిపే రికార్డు లేకపోతే మెడికల్ బోర్డు నుంచి ధ్రువపత్రం పొందొచ్చని రాష్ట్ర పింఛనుదారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. గతంలో కుటుంబ పెన్షనర్లకు పుట్టిన తేదీ లేకపోయినా పట్టించుకునే వారు కాదని, ఇప్పుడు వయసు రీత్యా వచ్చే అదనపు పెన్షన్ మంజూరుకు కచ్చితంగా పుట్టిన తేదీ నమోదు చేయాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. నిరక్షరాస్యులైన వారికి తమ పుట్టిన తేదీ తెలియక సర్వీసు పెన్షనర్ కంటే కుటుంబ పెన్షనర్‌కు ఎక్కువ వయసు నమోదు చేసేందుకు అనుమానిస్తున్నారని తెలిపారు.



ఇదో స్వయంవర పోరాటం!

ఇవి బురద కోళ్లు. సంక్రాంతి కోడి పందేలు ముగిసినా ఇవి ఇంకా పోటీ పడుతున్నాయి ఏంటి అనుకుంటున్నారా? వీటి పోరాటం తోడు కోసమట. సోమవారం ఉదయం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ చెరువులో కనిపించిన ఈ బురద కోళ్ల ఫైటింగ్‌ను 'ఈనాడు' కెమెరాలో బంధించింది. వీటి విశేషాలపై మహబూబ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర సహాయ ఆచార్యుడు డా.బి.రవీందర్‌రావును సంప్రదించగా.. బురద ప్రాంతాలు, చెరువులు, సరస్సులు, నదీ ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయని తెలిపారు. కాళ్లు పెద్దవిగా ఉండటంతో వీటి కొట్లాట కిక్ బాక్సింగ్‌ను తలపిస్తుందన్నారు. జత కోసం రెండు మగ కోళ్లు కొట్లాడుకుంటాయని.. పోరాటంలో గెలిచిన కోడి ఆడ కోడితో జతకట్టి సంతానాన్ని వృద్ధి చేస్తుందని వివరించారు.

– ఈనాడు, హైదరాబాద్

మోదీ మెచ్చిన పండు ఇది!





ప్రధాని మోదీ సూచించిన ఓ పండు గురించి నెట్‌లో తెగ వెతికేస్తున్నారు. ఆ పండు పేరు సీబక్‌థార్న్ కాగా.. హిమాలయ సానువుల్లో ముఖ్యంగా లద్దాఖ్ ప్రాంతంలో ఎక్కువగా పండుతుందంటూ దీన్ని లేహ్‌బెర్రీ అని కూడా పిలుస్తారు. ప్రధాని మోదీ ఓ సోషల్ మీడియా వేదికగా ప్రస్తావిస్తూ.. యువత రోజువారీ ఆహారంలో సీబక్‌థార్న్‌ను భాగం చేసుకోవాలని సూచించడంతో దీని ప్రత్యేకతలపై అందరిలో ఆసక్తి నెలకొంది.

సీబక్‌థార్న్... ఇదో రకం నారింజ రంగు బెర్రీ. మిరాకిల్ ఫ్రూట్ లేదా లేహ్ బెర్రీగా పిలిచే దీని శాస్త్రీయనామం హిప్పోఫే రామ్నాయిడ్స్‌ఎల్. ఇందులో ఫ్లేవనాయిడ్లు, విటమిన్లు, కెరోటినాయిడ్లు, పాలీశాకరైడ్లు, అమైనో ఆమ్లాలు... వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ బెర్రీల్లో 3, 6, 7, 9- ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువ. అందుకే దీన్ని సూపర్ ఫ్రూట్ అంటున్నారు. కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ లద్దాఖ్ ప్రాంతంలో ఈ పంట సాగుని, వాటి ఉత్పత్తుల తయారీని ప్రోత్సహిస్తోంది.

చిన్నపాటి ముళ్ల పొదలా పెరిగే ఈ మొక్క -40 నుంచి +40 డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రతని తట్టుకుని పెరుగుతుంది. క్రీ.పూ. నుంచీ దీన్ని చైనా సంప్రదాయ వైద్యంలో వాడినట్లు తెలుస్తోంది. ప్రాచీన టిబెటన్ సాహిత్యంలోనూ దీని ప్రస్తావన ఉంది. పండు రూపంలోనే కాదు, ఈ మొక్క ఆకుల్నీ జ్యూస్‌గా వాడుతుంటారు. బీపీని నియంత్రించడంతో పాటు జలుబు, జ్వరాల్ని తగ్గిస్తుంది. ట్యూమర్లనీ మూత్రపిండాల్లో రాళ్లనీ అదుపు చేస్తుంది. 200కి పైగా బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉండటంతో అనేక రకాల హృదయ సంబంధిత వ్యాధుల నివారణకీ సాయపడుతుంది పండు. ఇందులోని శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి, రోగనిరోధకశక్తిని పెంచుతాయి. అల్సర్లను నివారించి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఒమేగా ఆమ్లాలు నాడీ సమస్యల్ని తగ్గించి జ్ఞాపకశక్తిని పెంచుతాయి. నారింజతో పోల్చితే సీబక్‌థార్న్‌లో సి-విటమిన్ 12 రెట్లు ఎక్కువ. ఎ, ఇ, కె, బి-కాంప్లెక్స్ విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. చర్మం పొడిబారకుండా చేసే ఒమేగా 7 ఫ్యాటీ ఆమ్లం ఉండే అతి కొద్ది పండ్లలో ఈ పండొకటి. అందుకే ఈ బెర్రీని చర్మ సంరక్షణ క్రీములు, సబ్బుల్లో వాడుతున్నారు. దీని ప్రయోజనాలు తెలిసి పాశ్చాత్యులు దీన్ని హెర్బల్ టీ, జామ్, జ్యూస్, సలాడ్, స్మూతీ... ఇలా నచ్చిన పద్ధతిలో తింటున్నారు. కాబట్టి ఎండు, తాజా, పొడి ఇలా ఏ రూపంలో దొరికినా తప్పక తీసుకోండి మరి!

– వసుంధర డెస్క్






మల్లన్న.. మల్లన్న.. మల్లన్నా..

సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం పట్నం, అగ్నిగుండాల కార్యక్రమం వైభవంగా ముగిసింది. జాతరలో మొదటి ఆదివారం నుంచి మూడు రోజుల పాటు గ్రేటర్ హైదరాబాద్ భక్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తోటబావి సమీపంలోని కల్యాణవేదిక వద్ద 28 గజాలతో పట్నం (ముగ్గు) వేసి, పక్కనే అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు, శివసత్తులు, జోగినులు మల్లన్న నామస్మరణలతో ఉత్సాహంగా అగ్నిగుండం దాటడం చేశారు. దాదాపు 40 వేల మంది పాల్గొన్నట్లు ఈవో వెంకటేశ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, చేర్యాల





శ్రీవారి సముద్రంలో హైలెస్సో...

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటం పరిధిలోని సింగోటం మినీ జలాశయం ఇది. 500 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిని శ్రీవారి సముద్రం అని కూడా పిలుస్తారు. గతేడాది దీన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించి బోటింగ్‌ను ప్రారంభించినా.. గిట్టుబాటుకావడం లేదని గుత్తేదారు నిలిపేశారు. పక్కనే చారిత్రక లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, కనువిందు చేసే పరిసరాలు ఉన్నా... ప్రచారం లేక పర్యాటకులు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా పర్యాటకులకు బోటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.

– ఈనాడు, మహబూబ్ నగర్; న్యూస్‌టుడే, కొల్లాపూర్ న్యూటౌన్





పెళ్లై ఏళ్లయినా.. కొత్త కోడళ్లే!

మెస్రం వంశంలో ప్రత్యేకం.. 'భేటింగ్' సంప్రదాయం

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైంది. మహా పూజల అనంతరం రాత్రి ఒంటి గంట నుంచి ఉదయం వరకు మెస్రం వంశంలోని కొత్త కోడళ్ల భేటింగ్ నిర్వహించారు. ఈసారి 250 మంది పాల్గొన్నారు. ఈ వంశంలో వారిని వివాహాలు చేసుకున్న మహిళలు ఎప్పటికైనా... ఆలయంలో పెద్దల సమక్షంలో పరిచయం చేసుకున్న (భేటింగ్) తర్వాతే మెస్రం వంశంలో చేరినట్లు భావిస్తారు. అప్పుడే వారికి నాగోబా ఆలయంలోకి ప్రవేశ అర్హత లభిస్తుంది. అనేక మందికి వివిధ ఆటంకాల కారణంగా వివాహమైన ఏళ్ల వరకూ ఈ భేటింగ్‌లో పాల్గొనే అవకాశం రాదు. అలాంటివారు మధ్యవయస్కులైనా.. వారిని కొత్త కోడళ్లుగానే భావిస్తారు.


– న్యూస్‌టుడే, ఉట్నూరు గ్రామీణం

271 ఏళ్ల తర్వాత కేరళ కుంభమేళా

22, 23, 25, 26, ఫిబ్రవరి 1, 3 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు

కేరళలోని తిరునవాయలో ఉన్న నీలానది మహా మాఘ మహోత్సవానికి సిద్ధమవుతోంది. 271 ఏళ్ల తర్వాత ఇక్కడ కేరళ కుంభమేళాగా పిలుచుకునే ఈ ఉత్సవం జరుగుతోంది. వేద పారాయణం, ఆలయ గంటల శబ్దాలు, పూజలు, యజ్ఞాలు, పవిత్ర నీలానది హారతితో ఈ ప్రాంతం మారుమోగుతోంది. ఇక్కడ చివరిసారిగా 1755లో మాఘ మహోత్సవం జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2016లో ఇక్కడ పుణ్య స్నానాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కుంభమేళా జరుగుతోంది. స్వామి ఆనందవరం భారతి, స్వామి అభినవ బాలానంద భైరవ్ ఆధ్వర్యంలో ఈ మహోత్సవం జరుగుతోంది. ఈ ఉత్సవానికి దేశం నలుమూలల నుంచి ఆధ్యాత్మిక గురువులు, భక్తులు హాజరవుతున్నారు. నీలా హారతిని నిర్వహించడానికి కాశీ నుంచి నిపుణులు వస్తున్నారు. పుణ్య స్నానం, యతిపూజలను ఇక్కడ నిర్వహించనున్నారు. ఈ నెల 22 (గణేశ్ జయంతి), 23 (వసంత పంచమి), 25 (రథ సప్తమి), 26 (భాష్మ అష్టమి), ఫిబ్రవరి 1 (మాఘ పౌర్ణమి, థైపుసం), 3 (మాఘ మాకం) తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కుంభమేళాను సోమవారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ లాంఛనంగా ప్రారంభించారు.

– ఈటీవీ భారత్



సొరే గదా!

గద ఆకారంలో ఆకట్టుకుంటున్న ఈ సొరకాయలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఉయ్యాలమడుగులో ఓ ఆదివాసీ ఇంటి పెరటిలో పెరుగుతున్నాయి. వీటిని కూరగా వండుకోవడంతోపాటు, ఎండబెట్టి లోపలి గుజ్జు తీసి నీరు, కల్లు వంటివి పోసుకోవడానికి ఉపయోగిస్తామని అక్కడి ఆదివాసీలు తెలిపారు.

– న్యూస్‌టుడే, చర్ల

'పీఎం దక్ష్'.. 70 శాతం హాజరు తప్పనిసరి

● మార్గదర్శకాల్లో కేంద్రం సవరణలు

ఈనాడు, హైదరాబాద్: యువతకు జాతీయ సంక్షేమ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో అందించే 'పీఎం-దక్ష్' పథకం ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో కేంద్రం కీలక మార్పులు చేసింది. శిక్షణ కార్యక్రమంలో చేరిన తొలి నెలలో అభ్యర్థుల హాజరు 70 శాతం నమోదైతేనే తొలి విడత నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. శిక్షణకు హాజరయ్యే వారికి స్టైపెండ్ ఇవ్వనుంది. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీ జాతీయ సంక్షేమ కార్పొరేషన్ల కింద 18-45 ఏళ్ల యువతకు స్వల్పకాలిక శిక్షణ కోర్సులు, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పీఎం దక్ష్ పథకం తీసుకొచ్చింది. ఎస్సీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, డీఎన్‌టీ, సఫాయి కర్మచారీ, వేస్ట్ పికర్స్ ఈ కోర్సులకు అర్హులు. శిక్షణ పొందిన వారిలో 70 శాతం మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



● ఆయా సంక్షేమవర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ (ఎస్ఐడీహెచ్)లో వివరాలు నమోదు చేసుకోవాలి. అభ్యర్థుల ఆసక్తి, అర్హతల ఆధారంగా కోర్సు ఎంపిక చేసుకునేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఇప్పటికే 2,641 మంది కోర్సు పూర్తి చేయగా.. వీరిలో 1,129 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

ఇవీ మార్పులు...

● గతంలో ఈ కార్యక్రమం మొదలైన వెంటనే శిక్షణ ఇచ్చే సంస్థలకు 30 శాతం నిధులు మంజూరయ్యేవి. ఇక నుంచి తొలి 30 రోజుల్లో అభ్యర్థుల హాజరు 70 శాతం నమోదు కావాలి. హాజరు వివరాలు, ఇతర పత్రాలు సమర్పించిన తర్వాతే నిధులు అందుతాయి.

● రెండో విడతలో 50 శాతం శిక్షణ కార్యక్రమం పూర్తికావాలన్న నిబంధనను మార్చారు. కనీసం 70 శాతం శిక్షణ కార్యక్రమం పూర్తికావడంతోపాటు 70 శాతం హాజరు తప్పనిసరి. తనిఖీ నివేదిక ఆధారంగా నిధులు విడుదలవుతాయి. మిగతా 40 శాతం నిధులు మదింపు పూర్తయ్యాక మంజూరవుతాయని తాజా ఆదేశాల్లో స్పష్టం చేశారు.

అజ్ఞాతం వీడిన మావోయిస్టులకు ఆధార్

● నివాస ధ్రువపత్రాలు... బ్యాంకు ఖాతాలు
● పునరావాస చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐబీ

ఈనాడు, హైదరాబాద్: అజ్ఞాతం వీడుతున్న మావోయిస్టులకు ఓ చిరునామా ఏర్పడుతోంది. గుర్తింపు కార్డుల్లో కీలకమైన 'ఆధార్', డబ్బు దాచుకునేందుకు బ్యాంకు ఖాతా అందుతున్నాయి. దండకారణ్యంలో తిండీతిప్పలు లేక నీరసించిన శరీరాలకు వైద్యచికిత్స లభిస్తోంది. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ నిఘా విభాగంలోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) ఈ వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షిస్తోంది.

గతేడాది 576 మంది లొంగుబాటు



1980లో పీపుల్స్‌వార్(ప్రస్తుత మావోయిస్టు పార్టీ) ఆవిర్భవించిన అనంతరం ఎన్నడూ లేనిరీతిలో గతేడాది ఏకంగా 576 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరికి పునరావాస కార్యక్రమాల్లో భాగంగా ఎస్ఐబీ ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయితే వీరెవరికీ సరైన చిరునామాతోపాటు గుర్తింపు లేకపోవడంతో వాటి కోసం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. అందులో భాగంగా తొలుత వారి స్వగ్రామాల్లో తహసీల్దార్ కార్యాలయాల ద్వారా నివాస ధ్రువపత్రం ఇప్పిస్తోంది. దానితో ఆధార్‌కు దరఖాస్తు చేయిస్తోంది. అనంతరం పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా తెరిపిస్తోంది. అదే ఖాతాలో వారి రివార్డు సొమ్ము జమ చేయిస్తోంది. కేంద్ర కమిటీ సభ్యులకు రూ.25 లక్షల చొప్పున, రాష్ట్ర కమిటీ సభ్యులకు రూ.20 లక్షలు, డివిజనల్ కమిటీ కార్యదర్శులకు రూ.8 లక్షలు, డివిజన్ కమిటీ సభ్యులకు/ఏరియా కమిటీ కార్యదర్శులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున అందజేస్తోంది. కోరుకున్నవారికి ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకూ ప్రయత్నిస్తోంది. అనారోగ్య కారణాలతో జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులకు వైద్యచికిత్సలు అందేలా ఎస్ఐబీ అధికారులు ఏర్పాట్లు చేశారు. పలువురికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించారు. ఓ రాష్ట్ర కమిటీ సభ్యుడికి కిడ్నీలు దెబ్బతినగా రూ.లక్ష వరకు వెచ్చించి చికిత్స అందించారు. మరో సభ్యుడి ఊపిరితిత్తులకు రూ.50 వేలకుపైగా వ్యయంతో చికిత్స చేయించారు.

కృష్ణా జలాల్లో ఫీకల్ కొలిఫాం బ్యాక్టీరియా

● కాలుష్య నియంత్రణ మండలి నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: కృష్ణానది జలాల్లో నీటి స్వచ్ఛతకు సంబంధించిన కీలక విషయం వెలుగులోకి వచ్చింది. నిర్దేశిత ప్రమాణాల కంటే ఫీకల్ కొలిఫాం బ్యాక్టీరియా అధిక రెట్లు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ బ్యాక్టీరియా సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింత్రియాల రేవు వద్ద 34 ఎంపీఎన్ (అనుమతించని స్థాయి)గా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) గుర్తించింది. ఇక మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద సేకరించిన నమూనాలో 42 ఎంపీఎన్ ఉన్నట్లుగా తేలింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) ప్రమాణాల ప్రకారం.. తాగడానికి సురక్షితమైన 100 మిల్లీలీటర్ల నీటి నమూనాలో ఫీకల్ కొలిఫాం బ్యాక్టీరియా 'సున్నా' ఉండాలి. పీసీబీ తాజాగా సేకరించిన నీటి నమూనాల్లో ఇది పదుల రెట్లు ఎక్కువగా ఉంది.



● పీసీబీ జాతీయ జల నాణ్యత పర్యవేక్షణ కార్యక్రమం (ఎన్‌డబ్ల్యూఎంపీ) కింద ప్రతినెల నీటి నమూనాల్ని సేకరించి విశ్లేషిస్తోంది. చింతలపాలెం మండలం చింత్రియాల వద్ద గత ఏడాది ఆగస్టు నెలలో ఈ బ్యాక్టీరియా 4.5 ఎంపీఎన్ ఉండగా.. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరులో 43, 38, 34 ఎంపీఎన్‌కు పెరిగినట్లుగా నల్గొండ ప్రాంతీయ కార్యాలయం అధికారి పీసీబీ ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశారు.

మట్టపల్లి-చింత్రియాల నీలి-ఆకుపచ్చ ఆల్గే..

మట్టపల్లి నుంచి చింత్రియాల వరకు కృష్ణా నదిలో నీలి-ఆకుపచ్చ ఆల్గే (నాచు)ను గుర్తించినట్లు పీసీబీ నివేదికలో పేర్కొంది. 'పులిచింతల రిజర్వాయర్‌లో నీరు నిలిచి ఉండటం ఆల్గే బ్లూమింగ్‌కు కారణమై ఉండవచ్చు. చింత్రియాల వద్ద కృష్ణా జలాలు దుర్వాసనతో పాటు నీళ్ల రంగు లేత ఆకుపచ్చగా ఉంది. ప్రతి సంవత్సరం నీటి ప్రవాహం నిలిచిపోయే సమయంలో ఈ ఆల్గే కనిపిస్తుందని మత్స్యకారులు చెప్పారు' అని అధికారులు నివేదికలో వివరించారు. 'కాలుష్య కాసారంగా కృష్ణమ్మ' శీర్షికన గతేడాది డిసెంబరు 15న 'ఈనాడు' పత్రికలో ప్రచురితమైన కథనంపై పీసీబీ స్పందించి క్షేత్రస్థాయిలో నీటి నమూనాల్ని సేకరించి విశ్లేషించింది.

కొత్త పార్టీ ఏర్పాటుపై వేగం పెంచిన కవిత



ఈనాడు, హైదరాబాద్: కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా చేస్తున్న ప్రయత్నాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వేగం పెంచారు. తెలంగాణ రాష్ట్ర స్థితిగతులు, సమగ్రాభివృద్ధి, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలు, వనరుల వినియోగంపై అధ్యయనం కోసం గతంలోనే కమిటీలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం ఆయా కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేస్తున్న అధ్యయనం గురించి వివరించి, ప్రాథమిక నివేదికను కమిటీ సభ్యులు సమర్పించారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి అవసరమైన బ్లూప్రింట్ రూపొందించే పనిలో తెలంగాణ జాగృతి నాయకులు నిమగ్నమయ్యారు. రెండు, మూడు నెలల్లో నూతన రాజకీయ ఏర్పాటుపై మరింత స్పష్టత వస్తుందని జాగృతివర్గాలు తెలిపాయి.

ప్రశాంత్ కిశోర్‌తో భేటీ?

కొత్త పార్టీ ఏర్పాటు దిశగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సన్నద్ధమవుతున్న నేపథ్యంలో.. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో ఆమె భేటీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ ఏర్పాటు, ప్రజా సమస్యలపై పోరాటం, జనం కోణంలో పనిచేసే విధానం తదితర అంశాలపై ఆయనతో కవిత సుదీర్ఘంగా చర్చించినట్లు ప్రచారంలో ఉంది. ఈ విషయాన్ని జాగృతి వర్గాలు అధికారికంగా ధ్రువీకరించలేదు.

పెంపుడు జంతువుల్లో పెరిగిన కంటి జబ్బులు..

● చికిత్సపై పశువైద్యులకు ప్రత్యేక శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా పెంపుడు జంతువులతోపాటు గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులకు కంటిజబ్బులు బాగా పెరిగాయని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం అధ్యయనంలో తేలింది. 'కుక్కలు, పిల్లుల వంటి వాటికి సరైన ఆహారం అందించడం లేదు. పశువులు, మేకలు, గొర్రెలకు దాణా లోపంతోపాటు వాతావరణ మార్పుల ప్రభావం వల్ల కంటి జబ్బులు వస్తున్నాయి' అని వైద్యులు పేర్కొన్నారు. కంటి వ్యాధుల తీవ్రత పెరగడంతో పశువైద్య విశ్వవిద్యాలయం.. వెటర్నరీ కౌన్సిల్ సహకారంతో పశువైద్యుల కోసం శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలలో ప్రారంభించింది. 450 మంది పశువైద్యులకు ఈ శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే పెంపుడు జంతువుల్లో పది శాతం కంటి సంబంధిత సమస్యలే ఉంటున్నాయని గుర్తించారు. ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే పశువులు, గొర్రెలు, మేకల్లో 5-8% ఈ వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. పెంపుడు జంతువులకు కంటి సంబంధిత రోగాల నిర్ధారణ, శస్త్ర చికిత్సలపై క్షేత్రస్థాయి పశువైద్యుల నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వర్సిటీ వీసీ జ్ఞానప్రకాశ్, రిజిస్ట్రార్ శరత్‌చంద్ర తెలిపారు.

ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణలో ఆడిటర్లదే కీలకపాత్ర

ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని అన్ని రాష్ట్రాల ఆడిట్ విభాగాలు, స్థానిక నిధుల ఆడిట్ డైరెక్టరేట్లకు మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్ సోమవారం హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్డీ)లో ప్రారంభమైంది. ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర, స్థానిక నిధుల ఆడిట్ విభాగాలను బలోపేతం చేయడం, దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లోని ఆడిట్ విభాగాలను మెరుగుపరచడానికి దీనిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా స్థానిక సంస్థలకు నిధుల ప్రవాహం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో స్థానిక ప్రభుత్వాల్లో జవాబుదారీతనం, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో ఆడిటర్లు కీలకపాత్ర పోషించాలని సూచించారు.



సప్లిమెంట్లు వాటికి ప్రత్యామ్నాయం కాదు

మీకు ఆరోగ్యకర అలవాట్లు ఉన్నట్లయితే.. మీ ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సప్లిమెంట్లు దోహదపడతాయి. అంతేతప్ప- అనారోగ్యకర జీవనశైలిని అనుసరిస్తూ సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల లాభముండదు! రోజూ తగినంత సమయం నిద్రించండి. శారీరకంగా క్రియాశీలకంగా ఉండండి. ఉదయపు సూర్యకాంతి శరీరంపై పడేలా చూసుకోండి. భావోద్వేగాలను నియంత్రించుకోండి. వీటిలో దేనికీ సప్లిమెంట్లు ప్రత్యామ్నాయాలు కావన్నది గుర్తించండి.

– డేవిడ్ పెర్ల్‌మటర్, వైద్యుడు

అనుమానంతో భార్యను అంతమొందించాడు

● గొంతు కోసి.. రోకలిబండతో మోది.. కూతుర్నీ చంపాలనుకున్నాడు
● తప్పించుకున్న కుమారుడు.. నిందితుడూ ఆత్మహత్యాయత్నం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కడదాకా కలిసి ఉంటానని ప్రమాణం చేసినవాడే అనుమానంతో ఆలిని కడతేర్చాడు. కడుపున పుట్టిన పిల్లల్నీ కర్కశంగా అంతమొందించాలని ప్రయత్నించాడు. ఈ దాడిలో కుమార్తె చావుబతుకుల్లో ఉండగా, కుమారుడు అప్రమత్తమై తప్పించుకున్నాడు. దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి కూడా ఆత్మహత్యకు యత్నించాడు. బాధిత కుటుంబ సభ్యులు, సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సోమవారం ఘటన వివరాలు తెలిపారు. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండలం బెక్కల్‌కు చెందిన దున్నపోతుల ఎల్లయ్యకు 18 ఏళ్ల క్రితం మేనమరదలు శ్రీలత(40)తో వివాహమైంది.



ఎల్లయ్య



శ్రీలత

వారికి పదహారేళ్ల లోపు వయసున్న కుమార్తె హర్షిత, కుమారుడు అజయ్ ఉన్నారు. పదేళ్ల నుంచి భార్య ప్రవర్తనపై ఎల్లయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయమై దంపతుల మధ్య గతంలో తగాదాలు జరిగితే పెద్దలు సర్దిచెప్పారు. అయినా అనుమానం పెనుభూతంగా మారగా ఎల్లయ్య కోపంతో మొత్తం కుటుంబాన్ని అంతమొందించాలనుకున్నాడు.

కూతుర్నీ కర్కశంగా..

వేర్వేరుచోట్ల చదువుకునే పిల్లలిద్దరూ సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఇంటికొచ్చారు. ఇదే అదనుగా భావించిన ఎల్లయ్య ఆదివారం అర్ధరాత్రి దాటాక నిద్రలో ఉన్న భార్య శ్రీలత గొంతును కత్తితో కోసి హత్య చేశాడు. పక్కగదిలో నిద్రిస్తున్న కుమార్తెపైనా దాడి చేశాడు. చనిపోలేదని తెలుసుకొని రోకలిబండతో తలపై మోదాడు. అంతటితో ఆగకుండా పురుగులమందు తాగించాడు. ఇది గమనించిన కుమారుడు కేకలు వేస్తూ బయటకు పరుగెత్తాడు. బంధువు సురేశ్‌కు సమాచారం అందించాడు. ఆయన పరుగెత్తుకొచ్చేసరికి ఎల్లయ్య పురుగుమందు తాగుతుండగా అడ్డుకున్నారు. తర్వాత నిందితుడు కత్తితో గొంతు కోసుకోవడానికి యత్నించగా పోలీసులు ఆపారు. ప్రస్తుతం హర్షిత పరిస్థితి విషమంగా ఉంది. తాను బాగా చదువుతున్నానని.. మంచి మార్కులతో పదో తరగతి పాసవుతానని చెప్పేదని గుర్తు చేసుకుని బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీలత తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.